
మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.5.2025
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



ముసుగే సొగసు

# మిసిమి

చింతనాత్మక సారస్వతం



ముసుగులో సొగసు

మాసపత్రిక, జూన్, 2025 ₹ 50/-

ISSN 2454–4329



రాయలు.. రాయన



వెన్నెల మల్లెలు

# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 36** **సంచిక 6**

**జూన్ - 2025**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI
Since 1946

Printed & Published by
**BAPANNA ALAPATI**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
Plot No. CFC-1&2, Survey No. 18, E-City,
SEZ, General Industrial Park, Raviryal and Srinagar,
Maheswaram, Ranga Reddy District,
**Telangana - 501 359.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: **V. ASWINI KUMAR**
**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : **జి. ఉమాసుందరి**
**040-27645536**

Scan QR to Pay
**Misimi A Unit of Kalajyothi**

LIBRARY OF CONGRESS
**LCCN 91-903060**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
**ISSN 2454-4329**

**misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com**
www.misimimonthly.com
YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## జూన్ నెల సూచికలు...


మనిషి – మనుగడ : అర్కస్మృతి ... 3

జీవన మకరందం : అశ్వినికుమార్ ... 4

ఐతరేయ ఉపనిషత్తు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 5

లలితసంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 8

భర్తృహరి : ఆచార్య పి. హరినాథ్ ... 11

ఫ్రాన్స్– ఆక్సిటనీ : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 13

నాటక రంగంలో తుఫాను–పడమటి గాలి : **మిసిమి** ... 21

చీకటి : ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి ... 28

సాంఘికనాటకం – స్త్రీ : జంధ్యాల కనకదుర్గ ... 30

తెలుగు వైభవం: లక్ష్మీరెడ్డి లక్ష్యం : **మిసిమి** ... 33

నిరసన కళ : టి.వి. ప్రసాద్... 38

విపశ్యన : వి. నాగరత్న ... 44

తిరుక్కురళ్ : ఆచార్య యన్. లక్ష్మీ అయ్యర్ ... 48

ప్రతిజీవి సృష్టిలో – వలస జీవే : మద్దిలేటి సోమశేఖర్ ... 52

పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య లేఖలు : ఘట్టమరాజు అశ్వద్ధనారాయణ ... 56

తెగిపోతున్న తల్లి వేరు : జూకంటి జగన్నాథం ... 60

బోడినాయకనూరు సంస్థానం : డా. సగిలి సుధారాణి ... 62

జాతీయకవి పాల్కురికి సోమనాథుడు : డా. రావి ప్రేమలత ... 67

కథాహృదయం–శబ్ద సందేశం : రాజా రామమోహనరావు ...72

స్వర్గపులిహెూరా – కాళిదాసు : డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల ... 73

కమ్మతెమ్మెరలు : ... 75


పరిపక్వ జీవన రవళి – జీవాళి : సుమనస్పతి రెడ్డి ... 76

మధుర మహారాణి మంగమ్మ : సాహితీసుధ ... 78

చదవండి : **మిసిమి** ... 79





సోమనాథుడు




### అట్టమీది బొమ్మలు





ముసుగులో సొగసు



రాయలు.. రాయన



వెన్నెల మల్లెలు



ముసుగే సొగసు

వివరాలు – పుట : 29

# మనిషి - మనుగడ

దూరంగా ఏదో తంత్రీనాదం – అంత మధురంగా కాకపోయినా వినవస్తూనే వుంది. పెద్దవాళ్ల అరుపులు – పిల్లల ఏడ్పులూ ప్రక్క బజారులో మార్కెట్టు గోల – ఆటోలు, కారుల మోతలు, పాదచారుల భారమైన అడుగుల సవ్వడి – వినపడుతూనే వున్నాయి. తల్లీ పిల్లల చికాకులు – వ్యాపారస్తుల బేరాలు – అన్నీ నడుస్తూనే వున్నాయి. ఇదంతా చూస్తుంటే మనిషి గందరగోళాల మధ్య అసూయాద్వేషాల నడుమ, యుద్ధ భీభత్సాల లోతుల్లో గౌరవం కోసం – ప్రాణం కోసం ప్రాకులాటలు – డబ్బు కోసం వెంపర్లాటలతో – అధికారంతో సంక్షోభాల మధ్య జీవిస్తున్నాడు – సందేహం లేదు. అలాంటి జీవిని పట్టుకుని అయ్యా నీవు నీతిగా బతుకు – ఉత్సాహంగా జీవించు – కళాస్వాదన చేయి – అని చెప్పటం అర్థరహితమే కాదు – హాస్యాస్పదం కూడా – మనిషి జీవితాన్ని ఉన్నతీకరించకోవటానికి అన్నివిధాలా ప్రయత్నం చేస్తుంటాడు. శ్రమ, ఆర్థికవనరులు, దౌర్జన్యాలు – వస్తు సంచయం, దాసికత్వం – రచనల ద్వారా ప్రయత్నం చేస్తుంటాడు – మతము రాజకీయాలు ఇలా అనేక మార్గాలలో. కాని జీవితం ఏ ఇతర విషయాల ద్వారా ఉన్నతీకరించబడదు. కేవలం జీవించటం ద్వారానే ఉన్నతీకరించుకోవచ్చు – కొందరు కళాసృజన ద్వారానో – రచనలతోనో తమను తాము ఉన్నతీకరించుకున్నట్లు భావిస్తుంటారు – అయితే రచించటం జీవించడమా? ఉదాత్త ప్రవృత్తి ద్వారా – సమాజంలో సుగంధ పరిమళాలు వెదజల్లాలి!

నిశ్శబ్దం – మౌనం అనేవి మానవ జీవితానికి ప్రాకృతిక వరాలు – అంతర్దృష్టికి – అన్వేషణకు మార్గాలు – భావ సాంద్రతను పెంచే ఫలాలు. అవగాహనకు – స్వీయ విశ్లేషణకు సోపానాలు.

నిశ్శబ్దం – మౌనం అనేవి పలాయనాన్ని సాగించే మార్గాలు గాక జీవన మాధుర్యాన్ని పెంచే పరిమళాలు– ఏకాంతం మనిషికి వరం – నగర సంస్కృతి పల్లెల్లోకి వ్యాపించిన తర్వాత ఈ ఏకాంతత దాదాపు అదృశ్యమై పోయింది. రణగొణ ధ్వనులకు, భీభత్స దృశ్యాలకు – దుర్వార్తలకు అలవాటు పడిన మనిషి ఏకాంతతత్వాన్ని అనుభవించలేకపోతున్నాడు. కవులు – కళాకారులు ఏకాంతతను ప్రేమిస్తారు. ఏకాంతం – నిశ్శబ్దం, మౌనం అనేవి మానవుని అంతర్వీక్షణను పెంపొందిస్తాయి – మానసిక శక్తుల్ని నిద్రలేపుతాయి. సామూహిక బృందగానాలు – మతాచారాలు – గుంపు ఆరాధనలు – మనిషిలోని భయాన్ని కప్పిపుచ్చుకునే మార్గాలు – ఏకాంతం జ్ఞానాన్వేషణకు పూలదారి. ఆధునిక జీవితం మేళతాళాలతో, డప్పుడమారాలతో భజన ప్రేలాపనలతో నిశ్శబ్దానికి దూరంగా జరిగిపోయింది. శబ్దం లేని నిశ్శబ్దాన్ని ఊహించలేకపోతోంది. ఒకవేళ నిశ్శబ్దం తన చుట్టూ ఆవరించినా వెంటనే శబ్ద ప్రపంచంలోకి వెళ్లిపోతోంది. శబ్దాన్ని ఛేదించవచ్చు – నిశ్శబ్దాన్ని ఛేదించటం సులభం కాదు. నిశ్శబ్దాన్ని – మౌనాన్ని అవగతం చేసుకోవటం అంతర్దృష్టిలోకి పయనించటం – జ్ఞానానికి ద్వారాలు తెరవటం లాంటిదే! రణగొణ ధ్వనుల మధ్య మనం ఏమి వింటున్నాం – ఏమి చూడగలుగుతున్నాం అనే స్పృహ మనల్ని వీడి క్రమేణా మనస్సు మొద్దుబారిపోతోంది – ధ్వని కాలుష్యం – అసలు కాలుష్యమే మన జీవితాలలో విడదీయరాని భాగం అయిపోయింది. అందుకని ఆధునిక మానవుడు చిత్తశాంతికోసం గుడులు, గోపురాలు తిరుగుతున్నాడు – బాబాలకు, ప్రవాచకులకు మొక్కుతున్నాడు – ఎన్నో భౌతిక మార్గాలను అన్వేషిస్తున్నాడు – ఈ అన్వేషణ వృథా – అది మనిషి మౌలిక సమస్యలను తీర్చలేదు – దానికి పరోపదేశ పాండిత్యం పనిచేయదు – వ్యక్తి, తనకు తానుగా ఒక శక్తిగా రూపొందే మార్గంలో పయనించాలి– అదేమీ ఇరుకైనది కాదు – చాలా విస్తృతమైనది. అది ఒక మార్గమే కాదు, తన భావసంచయాన్ని విశ్లేషించే పని మాత్రమే – అదేమి అసంభవమూ కాదు. కీర్తి కండూతి – గుర్తింపుకోసం వెంపర్లాడే తత్త్వం, సామాన్యులకు, కళాకారులకూ ఒక తేలికతనాన్ని – అల్పత్వాన్ని ఆపాదిస్తున్నాయి. కవులు, కళాకారులు – భట్రాజులైపోతున్నారు – దేహీ అని పేరుకోసం యాచించటం – యాచకవృత్తి కన్నా హీనం. మానవ మేధస్సు పెరిగిన కొలదీ తనను ఆవహించుకుని వున్న కశ్మలాలను కడిగివేయవలసి వుంది. కీర్తికోసం వెంపర్లాట కూడా ఒక కశ్మలమే! తన వారందరికీ దూరంగా దేశంకోసం పోరాడేవారు – తమ సంపదను దరిద్రుల కన్నీళ్లు తుడవటానికి ఉపయోగించేవారు–శాంతి కోసం దేశదేశాలు తిరిగే యాత్రికుల త్యాగమయ జీవితాల ముందు – కవిత రాసి – కుంచెపట్టి – గజ్జెకట్టి కీర్తికోసం తాపత్రయపడటం అర్థరహితం – కవులకన్నా – కళాకారులకన్నా – ఎన్నో తేజోమయ జీవితాలు నిత్యం మనకళ్లముందు కదలాడి మనల్ని ఆలోచింపజేస్తాయి. పేరు ప్రఖ్యాతులు వారివెంటే నడుస్తాయి!!

*(అర్కస్మృతిలోని భాగాలు - ముంగర జాషువా)*

# జీవన మకరందం

- ఆదర్శాలు వేరు, ఆచరణలు వేరు.
- ఆలోచనలలో–ఆదర్శవాదులు, ఆచరణలో–సంప్రదాయవాదులు. దీనికి ఎటువంటి మినహాయింపు లేదు.
- ఎప్పుడూ అవసరం లేని పనులు చేస్తూ ఒత్తిడిలో ఉన్నామంటున్నాం.
  మనకు సంబంధం లేని ప్రపంచం పరుగులు పెడుతుందని కంగారుపడతాం.
- హింసను ప్రధానంగా చూపిస్తున్న సినిమాలు ఎందుకు చూస్తున్నాం? మనలో అణగారి ఉన్న హింసాప్రవృత్తిని నిద్రలేపటం ఎందుకు?
- సెక్స్ స్టార్వ్‌డ్, సమాజానికి దాహం తీరెదెట్లా?
- అమ్మాయిలు రెచ్చగొట్టే విధంగా, ఆకర్షించే విధంగా తయారవుతారు ఎందుకు? అందరికి, అందరిలో అందంగా కనపడాలని ఎందుకు తాపత్రయపడతారు?
- అబ్బాయిలు గెడ్డాలు పెంచుకుని అదే అలంకారం అనుకుంటారేమిటి? అది ఆటవికం కదా! ఇది నాగరికం ఎట్లా అవుతుంది? పెళ్లి పీటల మీద కూడా గెడ్డాలతో కూర్చుంటున్నారేమిటి?
- డబ్బు అవసరం ఎంత ఉన్నా అది పాపిష్టిదే. ఎదుట వాడికి అసూయ పెంచుతుంది. నీకు అశాంతిని కలిగిస్తుంది.



- చైతన్యమే దైవం. చైతన్య ప్రభావమే జీవితం.
- సంస్కారం ఆలోచనలో, మాటలలో, ఆచరణలో వ్యక్తీకరించ బడుతుంది.
- సత్యం ఎక్కడో దాగి ఉండదు. వెదకటం ఎందుకు? నీలో ఉన్న శక్తిని గుర్తించు. అదే సత్యం.
- స్నేహితులు దొరకటం కష్టమే. పోగొట్టుకోవటం చాలా తేలిక.
- అందరం వెళ్లిపోయిన తరువాత నీతో ఉన్నవాడే నీ స్నేహితుడు.
- తృష్ణను జయించటమే నిర్వాణం.
- వల్లెవేయటంలో సిద్ధాంతాలు గొప్పవి కావు. ఆచరణలోనే వాటి గొప్పతనం నిగ్గు తేలుతుంది.
- అద్వైతం ఆలోచనలోనే సాధ్యం. ఆచరణలో కాదు.
- నిత్య పరిణామమే సత్యానికి రాజమార్గం.
- అదృష్టం తలుపుతట్టినప్పుడు మనం తరచూ నిద్రపోతుంటాము లేదా ఇంట్లో ఉండం.
- అన్నింటినీ నవ్వుతూ అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలి. అప్పుడు ఏ ఘర్షణా ఉండదు.
- ప్రేమ పల్చనయితే – తప్పులు ముదిరిపోతాయి.
- వెలుతురు వున్నచోట చీకటి వుండదు.
- నీ జీవితాన్ని చక్కగా శృతిచేసుకో – నీ వ్యక్తిత్వం మృదువుగా మారిపోతుంది.
- ప్రపంచం నిన్ను శిక్షించితే – అది నీకు అనుభవాన్నిస్తుంది.
- నీ హృదయాన్ని ప్రేమతో నింపుకో – నీకు శత్రువులే వుండరు.
- మనిషి అంటే అతని ఆలోచనలే సుమా!

# ఐతరేయ ఉపనిషత్తు

**– ఆచార్య కోదాటి వియ్యన్నరావు**

ఐతరేయ ఉపనిషత్తు ఋగ్వేదానికి చెందినది. ఐతరేయ అరణ్యకంలోని రెండవ పుస్తకంలోని నాలుగు, ఐదు, ఆరవ అధ్యాయాలలో దీని ప్రస్తావన ఉన్నది. ఈ ఉపనిషత్తు మొత్తం గద్యరూపంలో ఉంటుంది. మొత్తంగా మూడు భాగాలు, ఆరు అధ్యాయాలుగా ఉన్నది. ఈ ఉపనిషత్తును ఐతరేయ అనే ఋషి కూర్చినట్లుగా చెప్పబడుతున్నది. ఇది అతని తల్లి నుండి స్వీకరించబడిన నామము. అతని అసలు పేరు 'మహిదాసుడు'. 'మహి' అంటే భూమి లేదా పృధ్వి. భూమికి దాసునిగా ఉండి జ్ఞానాన్ని పొందినాడు కావున 'మహిదాసుడు' అయ్యాడని అర్థం. ఈ ఉపనిషత్తులో ప్రస్తావించబడిన ముఖ్యాంశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

- సృష్టి సిద్ధాంతం
- దేవతల నివాసం
- ఆహార సృష్టి
- ఆత్మ యొక్క పుట్టుక
- చైతన్యమే బ్రహ్మం

**సృష్టి సిద్ధాంతం :** సృష్టికి సంబంధించి ఉపనిషత్తులలో అనేక సిద్ధాంతాలు, ఆలోచనలు, దృక్పథాలు, దృక్కోణాలు, వాదాలు ఉన్నాయి. ఇంతకుముందు నెల (మే, 2025 సంచిక)లో తైత్తిరీయ ఉపనిషత్తుపై వ్యాఖ్యానంలో సృష్టి ఏ విధంగా జరిగింది అన్న విషయంగా సుదీర్ఘ వివరణ ఇవ్వబడింది. దాని ప్రకారం ఆత్మ లేదా బ్రహ్మం నుండి ఈథర్ వెదజల్లబడింది. వీటి నుండి ప్రకృతిలోని అన్ని అంగాలు ఉద్భవించాయి. ఇవి మానవుని మనుగడను సానుకూలం చేసాయి. గౌడపాదుని ఉద్దేశ్యంలో సృష్టి భగవంతుని ఇష్టం లేదా ఆజ్ఞవలన జరిగింది. అదే విధంగా సృష్టి అన్నది యాదృచ్ఛికంగా జరిగిన ఒక పరిణామం అన్న అభిప్రాయం కూడా వ్యక్తపరచబడింది. అయితే ఐతరేయ ఉపనిషత్తు ప్రకారం విశ్వం యొక్క సృష్టి ఏ విధంగా జరిగిందనేది తెలుసుకొందాం. విశ్వసృష్టికి ముందు ఆత్మ ఒక్కటే ఉన్నది. "ఆత్మ వా ఇదమేక ఏవాగ్ర" అన్నది ఈ ఉపనిషత్తులోని మొదటి శ్లోకంలోని మొదటి పంక్తి. ఆ పైన ఆత్మ లేదా విశ్వాత్మ విశ్వాన్ని సృష్టించ నిర్ణయించాడు. తదనుగుణంగా విశ్వాత్మ విశ్వాన్ని దశల వారీగా సృష్టించాడు. నాలుగు దశలలో విశ్వం సృష్టించ బడింది. మొదటిదశలో ఐదు ఊర్ధ్వలోకాలు (స్వాహ్, మహహ్, జనహ్, తపహ్ మరియు సత్య); భూమికి, స్వర్గానికి మధ్యన ఉండే మరీచీహ్ (కాంతి లేదా అణువు); భూమి (దీనినే మరణలోకంగా చెప్తారు) ఏడు దిగువ లోకాలు సృష్టించబడ్డాయి. ఇక్కడ సత్యలోకమంటే బ్రహ్మలోకమే. ఏడు దిగువ లోకాలు ఏవనగా : అతళ, వితళ, సుతళ, రసాతళ, తలాళ, మహాతళ మరియు పాతాళ లోకాలు. రెండవ దశలో ఎనిమిది అంశాలు లేదా అంగాలు ఉనికిలోకి వచ్చాయి. అవి : వాక్కు, నాసికం, దృష్టి, వినికిడి, చర్మం లేదా జుట్టు, విసర్జన, మనస్సు, పునరుత్పత్తి. వీటిని కాపాడడం కోసం ఎనిమిది మంది దేవతల సృష్టి జరిగింది. వారు : అగ్ని, వాయు, సూర్యుడు, దిశ, భూమి, చంద్రుడు, మృత్యువు, నీరు. ఈ దేవతలందరికి హిరణ్యగర్భ లేదా బ్రహ్మం అధి దేవత. మూడవ దశలో ఆకలి, దాహం సృష్టించబడ్డాయి. నాల్గవ దశలో మానవుడు లేదా మనిషి సృష్టించబడ్డాడు. ఈ ఎనిమిది దేవతల ఆవాసాలను గూర్చిన వివరణ దిగువ పట్టికలో చూడవచ్చు.

**ఎనిమిది మంది దేవతలు–వారి ఆవాసాలు :**

| దేవత | ఆవాసం | లక్ష్యం లేదా ఫలితం |
|---|---|---|
| అగ్ని | నోరు | వాక్కు |
| వాయు | నాసిక | శ్వాస (ప్రాణం) |
| సూర్యుడు | కళ్ళు | చూపు |
| దిశ | చెవులు | వినికిడి |
| భూమి | చర్మం | జుట్టు |
| చంద్రుడు | హృదయం | మనస్సు |
| మృత్యువు | నాభి | విసర్జన |
| నీరు | జననేంద్రియాలు | వీర్యం (రేతస్సు) లేదా విత్తనం |

మరింత విపులంగా చెప్పవలెనన్న, బ్రహ్మం లేదా విరాట్ పురుషుడు పై విధంగా బ్రహ్మాండాన్ని సృష్టించాడు. మానవుడు దాని నుండి వేరుపడి పిండాండంగా ఉనికిలోనికి వచ్చాడు. విరాట్ పురుషుని నోటి నుండి వాక్కువచ్చి అగ్నిని సృజించింది. అదే అగ్ని, వాక్కుగా మారి మానవుని నోటిలో ప్రవేశించింది. వాయువు శ్వాసగా ముక్కులో ప్రవేశించింది. సూర్యుడు దృష్టిగా కళ్ళలో ప్రవేశించెను. దిక్కులే వినేశక్తిగా చెవులలో ప్రవేశించాయి. వృక్షజాతి రోమాలుగా చర్మంలో

ప్రవేశించింది. చంద్రుడు మనస్సుగా హృదయంలోను, మృత్యువు అపానంగా నాభిలోను, జలం రేతస్సుగా జననేంద్రియంలోను ప్రవేశించాయి.

**దేవతల నివాసం :** దీనినే దేవతల నివాసం లేదా ఆవాసంగా చెప్పవచ్చు. సృష్టికార్యం నిర్వహించిన బ్రహ్మం లేదా విరాట్ పురుషుని యొక్క ఆవాసం 'హిరణ్యగర్భ'గా చెప్పబడింది. ఆ పైన దేవతలందరు తమకు ఒక నివాసాన్ని ఏర్పాటు చేయమని కోరారు. ఆ సందర్భంలో సృష్టికర్త వారికి ఒక 'ఆవు'ను అనుగ్రహించాడు. వారు అది తమకు సరిపోదని విన్నవించారు. ఆపైన సృష్టికర్త ఒక 'అశ్వాన్ని' సృష్టించాడు. అది కూడా తమకు సరిపోదని విన్నవించారు. ఆపైన బ్రహ్మం ఒక మానవుని సృష్టించి వారికి అందజేసాడు. ఇది మీకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని చెప్పి సంతృప్తి పరిచాడు. ఆ విధంగా పైన పేర్కొన్న ఎనిమిది మంది దేవతలు మానవుని యొక్క ఎనిమిది అంగాలలో ఆవాసమై ఉన్నారు. ఈ విధంగా దేవతలందరు ఒకరి కొకరు మిళితమై మానవుని ద్వారా సంతృప్తి చెందుతున్నారని ఐతరేయ ఉపనిషత్తు చెప్తుంది. ఉదాహరణకు, కన్ను ఒక అందమైన దృశ్యాన్ని చూచినప్పుడు, దేహంలోని ఇతర భాగాలు లేదా అంగాలు కూడా ఆ అనుభూతిని పొందుతాయి. ఇదే మానవుని యొక్క ప్రాముఖ్యత, సృష్టి రహస్యం.

**ఆహార సృష్టి :** ఇంతకుముందు సృష్టి యొక్క మూడవ దశలో ఆకలి, దాహం (ఆకలి దప్పులు) సృష్టించబడ్డాయని చెప్పుకొన్నాం. వాటిని సంతృప్తి పరచడం కోసం గాను ఆహారాన్ని సృష్టించవలసిన అవసరం 'సృష్టికర్త'కు ఏర్పడింది. అందుకోసంగాను, ఆలోచించిన మీదట సృష్టికర్త 'జలం' లేదా నీటి నుండి 'ఆహారాన్ని' సృష్టించవచ్చని భావించాడు. జలాన్ని పొదగడం ద్వారా ఆహారం కాబడింది. మానవుని ఎంపిక కోసం అన్ని రకాలైన ఆహారం అంటే శాఖాహారం, మాంసాహారం వంటివి సృష్టించబడ్డాయి. ప్రకృతిలో ఉన్నటువంటి ఆహార గొలుసును సృష్టికర్తయే అందించాడు. ఇందులో నాలుగు భాగాలు ఉన్నాయి. ఒకటి. సూర్యుడు-భూమి మీద ఉన్నటువంటి జీవరాశులన్నింటికి తన వెలుగుద్వారా శక్తిని ప్రసాదిస్తాడు. ఆ విధంగా జీవం ఏర్పడి అది ఆహారంగా మారుతుంది. అన్ని రకాల జీవులు, ఆహారాలు ఇందులో కలిసి ఉంటాయి. అటు తరువాత జీవుల ఉత్పత్తి మొదలౌతుంది. అదే మానవునికి ఆహారంగా లభిస్తుంది. మూడవదిగా, మానవులు ఆహారాన్ని భుజిస్తారు. వారిని 'వినియోగదారులు' అని కూడా పిలుస్తారు. చివరిగా, జీవులు నశించి, విసర్జించబడి, భూమిలో మిళితం చెంది, మరల ఉత్పత్తి ప్రక్రియకు ఊతం ఇస్తాయి. ఈ విధంగా సృష్టికర్త ఆహార సరఫరా ఏర్పాటు చేసినాడని చెప్పవచ్చు.

ఈ భాగంలో ఆసక్తికరమైన అంశం ఏమంటే ఈ విధంగా సృష్టించబడిన ఆహారాన్ని మానవునికి ఏ విధంగా అందించాలి అన్న సందేహం కలిగింది. అందుకుగాను సృష్టికర్త కొన్ని ప్రయత్నాలు చేసినట్లు ఈ ఉపనిషత్తులో చెప్పబడింది. మొదటగా ఆహారాన్ని వాక్కు ద్వారాఅందించే ప్రయత్నం జరిగినట్లు తెలుస్తుంది. ఈ పద్ధతిలో ఆహారం గురించి మాట్లాడిన వెంటనే ఆకలి తీరే అవకాశం ఉండాలి. ఇది సాధ్యం కాలేదు. అటు తరువాత, శ్వాస ద్వారా ప్రయత్నం జరిగింది. ఆ విధంగా 'వాసన' చూసిన వెంటనే ఆకలి సమసి పోవాలి. ఇది కూడా సాధ్యం కాలేదు. చెవి ద్వారా ప్రయత్నం చేయబడినది. దీని వలన ఆహారం గురించి వినిన వెంటనే ఆకలి ఉపశమించవలెను. ఈ ప్రయత్నము ఫలితాన్ని ఇవ్వలేదు. ఆపైన చర్మం ద్వారా ప్రయత్నం చేయబడింది. అంటే ఆహారాన్ని స్పృశించిన వెంటనే ఆకలి తీరవలెను. ఇది కూడా విఫలం చెందింది. తరువాత జననాంగం ద్వారా ప్రయత్నం జరిగింది. అంటే విసర్జించిన వెంటనే తృప్తి కలుగవలెను. ఇది కూడా సాధ్యం కాలేదు. అంతిమంగా మనస్సుతో ప్రయత్నం చేయబడింది. అంటే మనస్సులో ఆహారం యొక్క ఆలోచన వచ్చిన వెంటనే ఆకలి తీరిపోవాలి. కాని ఇది కూడా సాధ్యం కాలేదు. ఈ విధంగా అన్ని ప్రయత్నాలు విఫలం చెందిన తరువాత సృష్టికర్త నాభి (అపానం) స్థానాన్ని ఎంచుకొని, ఆకలి తీరే ఏర్పాటును అక్కడ స్థిరపరిచినాడు.

పైన వివరించిన మార్గాలకు, ఆలోచనకు ప్రస్తుత కాలంలో కొన్ని శాస్త్రీయ అధ్యయనాలు తోడవుతున్నాయి. ముఖ్యంగా 'ఆహారం-ఆకలి తీరే మార్గం' సంబంధంగా రెండు భిన్న దృక్పథాలు ఉన్నాయి. ఒకటి, ఆహారం యొక్క రూపం ఆకలిని జనింప చేస్తుంది. లేదా పెంచుతుంది. 2012లో మాక్స్-ప్లాంక్ జెసెక్ షాఫ్ట్ అనే పరిశోధనా సంస్థ (ఇది జర్మనీకి చెందినది. 1948లో స్థాపించబడింది. జీవశాస్త్రాలు, మానవ శాస్త్రాలపై అధ్యయనం చేస్తుంటుంది) నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఆహారం యొక్క రూపం తత్సంబంధిత హార్మోన్లను ఉత్తేజపరచడం ద్వారా ఆకలిని ఎక్కువ చేస్తుంది. ఆయా ఆహార పదార్థాలను ఆరగించాలనే కోరిక జనిస్తుందని వెల్లడించింది. అందుచేతనే చాలా భోజనాలయాలు, ఆహార పదార్థాలు విక్రయించే ప్రదేశాలలో ఆహార పదార్థాలచిత్రాలు లేదా బొమ్మలను

ప్రదర్శిస్తూ ఉంటారు. ఆకలిగొన్న వ్యక్తి ఆ ప్రదేశంలో ఏమి భుజిస్తాడు, భుజించాలని కోరుకొంటాడు అనేది, దీనివలన ప్రభావితమవుతుందని చెప్పవచ్చు. ఆధునిక సమాజంలో ఇది చాలా మంది వ్యక్తుల అనుభవం కూడా అయి ఉండవచ్చు.

దీనికి ప్రతిగా, 2023లో ఆరస్ విశ్వవిద్యాలయ (ఇది యూరప్‌లోని డెన్‌మార్కులో ఉంది) బృందం జరిపిన అధ్యయనం ప్రకారం ఆహారం యొక్క రూపం ఆకలిని సంతృప్తి పరుస్తుంది. అంటే వాస్తవంగా వ్యక్తి ఆ ఆహార పదార్థాలను భుజించనవసరం లేదు. ఈ అధ్యయనం ప్రకారం ఒక వ్యక్తి ఒకే ఆహార పదార్థాన్ని 30 సార్లు దర్శించినట్లయితే అతని ఆకలి కొంతమేర ఉపశమిస్తుంది. ఈ భావన ఆధారంగానే నేడు ఊబకాయం కలిగిన వ్యక్తులకు చికిత్స అందిస్తున్నారని తెలుస్తుంది. బరువును తగ్గించేవి కూడా ఈ విధానాన్ని పాటిస్తున్నాయని చెప్పవచ్చు.

ఈ అధ్యయనాలను బట్టి, తేలినదేమంటేఇంద్రియాల ద్వారాను, ముఖ్యంగా మనస్సు ద్వారా కూడా ఆకలిని సంతృప్తి పరచడం సాధ్యమయ్యే పనిగా తోస్తుంది. రాబోయే కాలంలో ఏర్పడే మెరుగైన శాస్త్రీయ అధ్యయనాలు ఈ భావనలను మరింత గట్టి పరచవచ్చు.

**ఆత్మ యొక్క పుట్టుక :** ఐతరేయ ఉపనిషత్తులో మరొక ముఖ్యమైన అంశం ఆత్మ యొక్క పుట్టుక లేదా ఉనికికి సంబంధించింది. ఉపనిషత్తులోని రెండవ భాగం, నాలుగవ అధ్యాయంలో దీనిని గురించిన ప్రత్యేక వివరణ ఉంది. దీని ప్రకారం 'ఆత్మ' మూడుసార్లు జన్మించింది . మొదటగా తండ్రి తన యొక్క శక్తిని, వీర్యం ద్వార గర్భంలోనికి అందించినప్పుడు. దానినే గర్భధారణ ప్రక్రియగా చెప్తారు. ఇక్కడ తల్లి యొక్క పాత్ర గర్భాన్ని సంరక్షించడం. రెండవది, తల్లిదండ్రులు ఇద్దరు కలిసి బిడ్డను పెంచి, పోషించడం. ఇక్కడ కుటుంబం యొక్క పాత్ర వ్యక్తమవుతుంది. మూడవది, తల్లిదండ్రులు మరణించినప్పుడు. జీవితకాలం ముగిసిన తరువాత వ్యక్తి మరణిస్తాడు. అయితే అతను చేసిన పునరుత్పత్తి ద్వారా అమరుడౌతాడు. ఆ విధంగా ఈ ఉపనిషత్తు 'పునర్జన్మ' భావనను బలపరుస్తుంది. నిరంతరం కొనసాగే పునరుత్పత్తి ప్రక్రియ ద్వారా సృష్టి కొనసాగుతుంది.

**చైతన్యమే బ్రహ్మం :** ఈ ఉపనిషత్తు యొక్క మూడవ భాగంలో బ్రహ్మతత్వాన్ని గురించి మరింత విపులీకరణ ఉంది. ఈ ఉపనిషత్తుకు భాష్యం వ్రాసిన ఆదిశంకరుని ఉద్దేశ్యంలో ప్రాణమే బ్రహ్మం. అదే జీవశక్తి. దేవతలందరూ ప్రాణం యొక్క వివిధ వ్యక్తీకరణలు మాత్రమే. ఈ విషయాన్ని మనం దేవతల ఆవాసాలు గమనించినప్పుడు చూసాము. ప్రాణంతో ఏకత్వాన్ని పొందినవాడు దేవతలను పొందుతాడు. ప్రపంచము, మనిషి ఆత్మ యొక్క సృష్టి. ఆత్మ ఉన్నది (ఆత్మవా ఇదం). అదే చైతన్యం. ఆత్మ యొక్క స్వీయ సాక్షాత్కారమే, స్వేచ్ఛకు లేదా 'ముక్తి' లేదా 'విముక్తి'కి మార్గము. ఆదిశంకరునితోపాటు, మధ్వాచార్యులు, మాక్స్‌ముల్లర్ వంటి ప్రాచీన పండితులు కూడా ఈ ఉపనిషత్తుపై తమ వ్యాఖ్యాలను వ్రాసినారు. వారి ఉద్దేశ్యంలో ఆత్మ జ్యోతి స్వరూపమైనది. జ్ఞానానికి పరమావధి 'ఆత్మ'. ఈ ఉపనిషత్తు చైతన్యమే ఆత్మ యొక్క మౌలిక స్వరూపమని చెప్తుంది. చైతన్యమే మానవుని నిర్వచిస్తుంది. అదియే అన్ని సిద్ధాంతాలకు మూలము.

**నేను ఎవరు? లేదా నీవు ఎవరు :** ఆధ్యాత్మిక చర్చలలో ఎక్కువగా ఆసక్తి కలిగించే ప్రశ్న ఇది. వేదాలు మరియు ఉపనిషత్తులు ఈ ప్రశ్నలకు సమాధానాలుగా అనేక భావాలను, ఆలోచనలను వ్యక్తపరచడం జరిగింది. ఐతరేయ ఉపనిషత్తులో కూడా ఇది ప్రధాన చర్చగా సాగింది. ఈ ఉపనిషత్తు ప్రకారం కూడా ఆత్మయే బ్రహ్మం. అంటే బ్రహ్మమే నీవు, నీవే బ్రహ్మము. 'అహం బ్రహ్మస్మి' అని బృహదారణ్యక ఉపనిషత్తులో చెప్పబడింది. 'తత్వం అశి' అది నువ్వే అని చాందోగ్య ఉపనిషత్తు పేర్కొంది.

'అయమాత్మా బ్రహ్మం'. ఈ ఆత్మయే బ్రహ్మం అని మాండూక్యోపనిషత్తులో ఉన్నది. ఐతరేయ ఉపనిషత్తులో 'ప్రజ్ఞానం బ్రహ్మ', అంటే చైతన్యమే బ్రహ్మం అని చెప్పబడింది. ఉపనిషత్తుల పరిభాషలో వీటిని నాలుగు మహా వాక్యాలుగా గుర్తించారు. కావున నీవు ఎవరు అంటే నీవు బ్రహ్మమే. అయినప్పటికీ మానవుడు అజ్ఞానంతో తాను బ్రహ్మం కంటే వేరుగా భావిస్తాడు. తాను ఇంద్రియాల కంటేను, మనస్సు కంటేను, పునరుత్పత్తి సామర్థ్యం కంటేను ఎక్కువ అని భావిస్తాడు. ఇది అతనిలో అహంకారానికి దారి తీస్తుంది. దీనిని తొలగించుకొని జీవన్ముక్తి పొందడం ఎలాగో ఈ ఉపనిషతు బోధిస్తుంది. అదే ప్రజ్ఞానం బ్రహ్మగా ఉపనిషత్తులో చెప్పబడింది. ఈ ఉపనిషత్తు యొక్క సారం కూడా ఇదే.

ఆచార్య కోదాటి వియ్యన్నరావు
పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
చరవాణి : 7093260655

# లలితసంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

**– డా. ఎమ్. పురుషోత్తమాచార్య**

### 11. హాయమ్మ హాయి మా పాపాయి

రచన : ఆరుద్ర
సంగీతం : ఎస్.హనుమంతరావు
గానం : ఆర్.బాలసరస్వతి

ఖరహరప్రియ–దాద్రా

**హాయమ్మ హాయి మా పాపాయి**
**మాయింటి దీపానివే** ॥హా॥

1. ఓ ముద్దు చిలుక ముత్యాల మొలక
నా పుణ్యఫలమీవె ఓ వెల్గు రేఖ
మా తల్లి జాబిల్లి ఓ కల్పవల్లి ॥హా॥

2. కలలోన ఇలలోన నా వేల్పువమ్మా
మదిలోని వెతలన్ని మరపింతువమ్మ
మధురాశలేవేవో మసలింతువమ్మ
బంగారు బొమ్మ బంగారు బొమ్మ ॥హా॥

**భావం :** అంత్యప్రాసను అలవోకగా, యుక్తియుక్తంగా ప్రయోగించడంలో ఆరుద్ర మంచి నైపుణ్యం కలవారు. "హాయి, పాపాయి, చిలుక, మొలక, జాబిల్లి, కల్పవల్లి" లాంటి లయాత్మకపదాలను వింటున్నప్పుడు ఒక రకమైన హాయి మనసుకు కలుగకమానదు. పాపాయితో ముచ్చట సాగించేందుకు పాట మాత్రమే మంచి సాధన అవుతుందని ఈ పాట నిరూపిస్తున్నది. దానికి చక్కని బాణీ తోడుగా సమకూరడం వల్ల పాపాయిని నిదురపుచ్చే జోలపాటగా దీన్ని భావించుకోవచ్చు. దీన్ని వింటున్నప్పుడు పాపాయే కాదు, పెద్దలు కూడా ప్రశాంతంగా ట్రాన్స్‌లోకి జారుకుంటారు. అదీ పాటకుండే సమ్మోహనశక్తి.

సాలూరు హనుమంతరావుగారు లలిత, చిత్ర గీతరంగంలో ఎన్నో సేవలు అందించారు. కాని ఎక్కువగా గుర్తింపు పొందలేకపోయారు. అయితే, చేసిన సేవ చాలా అమోఘమైనది. వీరు సాలూరు రాజేశ్వరరావుగారికి పెద్దన్నగారు. అందుకే ఈ పాటను రాజేశ్వరరావుగారు స్వరపరిచారని చాలామంది అనుకున్నారు. ఆకాశవాణివారు కూడా ఇలాగే పొరబడినారు. చంద్రహాస, దక్షయజ్ఞం, ఉషాపరిణయం మొదలైన చాలా సినిమాలకు ఆయన మధురగీతాలను అందించారు.

ఈ పాట ఖరహరప్రియరాగం ఆధారంగా బాణీ చేయబడినప్పటికీ భీంప్లాస్ రాగలక్షణాలతో ఎక్కువగా సాగింది. ప్రారంభంలో వయొలిన్, వేణువులతో ఇచ్చిన బిట్‌వర్క్‌లో 'సగమపనిస' అనే ఎత్తుగడ భీంప్లాస్ (అభేరి) లక్షణాలతో చక్కగా కనిపిస్తున్నది. నాలుగు ఆవర్తాలలో బిట్టు సాగాక పల్లవి ప్రారంభమయింది. మొదటి పంక్తిని రెండు మార్లు మార్పు లేకుండా పాడారు. తరువాతి పంక్తిని కలుపుకుని పల్లవిని రెండు సార్లు మళ్ళీ ఆలపించారు. "దీపానివే" అన్న దగ్గర చూపిన సంగతి మృదుమధుర గాత్రశైలిని సొంతం చేసుకున్న బాలసరస్వతిగారి గొంతులో ఎంతో సుకుమారంగా వినిపిస్తుంది.

తరువాత అవే వాద్యాలతో మూడు ఆవర్తాల బిట్టు వినిపిస్తూ 'సగమ' అంటూ మధ్యమం తగ్గర వదిలేశాక; ఆ స్వరం మీదుగా ఓవర్లాప్ చేస్తూ 'ఓ ముద్దుచిలుకా' అనే మొదటి చరణాన్ని అందుకున్నారు. 'మొలక' తరువాత వాద్యాలు 'ముత్యాల మొలక' బాణీని రిపీట్ చేయగా అదే పాదాన్ని మళ్ళీ పాడారు. తరువాత రెండో పాదాన్ని రెండుసార్లు పాడారు. 'చిలుక' దగ్గర చిన్న 'స్లూర్' లాంటి సంగతిని అందంగా వినిపించారు. 'ఫలమీవె, వెల్గురేఖ' పదాల దగ్గరి సంగతి మరీ సొగసుగా వినిపిస్తుంది. 'ఓ కల్పవల్లి' ని రెండుసార్లు పాడాక, వాద్యాలతో 'మా,గనిసా' అని లింకు బిట్టు ఇచ్చాక పల్లవిని అందుకుని పాడారు.

రెండో చరణానికి ముందు బిట్టును కొద్దిగా మార్పు చేసి మూడు ఆవర్తాలలో సంచరింపజేసి 'సా,నిసపమాపసనీ' అంటూ నిషాదం దగ్గర విచిత్రంగా నిలిపారు. అప్పుడు అదే నిషాదం మీదుగా 'కలలోన ఇలలోన' అంటూ రెండో చరణాన్ని ప్రారంభించారు. మొదటి పంక్తిని పాడాక బిట్టు ఇచ్చారు. మళ్ళీ అదే పంక్తిని ఏ మార్పూ లేకుండా పాడారు. తరువాత రెండో పంక్తిని తీసుకుని 'మదిలోన, వెతలన్ని, మరపించు' పదాల దగ్గర సున్నితమైన గమకాన్ని

వినిపించారు. 'మరపింతువమ్మ' ను 'మదనిరిసనిదపపా' అంటూ ఖరహరప్రియరాగలాలిత్యాన్ని అందంగా పాదిగారు. ఇక్కడ మరోసారి బిట్టు ఇచ్చాక మొదటి రెండు పంక్తులను మళ్ళీ ఆలపించారు. తరువాతి పంక్తిలోని 'మధురాశలేవేవొ' దగ్గర ముగ్ధమనోహరమైన సంగతులను పలికారు. చివరి పంక్తిని రెండు మార్లు పాడాక ఇచ్చిన బిట్టు తరువాత పల్లవినెత్తుకుని ఒకసారి పాడి పాటను ముగించారు.

శ్రీమతి ఆర్. బాలసరస్వతీదేవి నటిగా, గాయనిగా ప్రసిద్ధి పొందారు. అటు లలితసంగీతరంగంలోనూ,ఇటు సినిమా రంగంలోనూ గొప్పగా రాణించారు. ఆకాశవాణిలో ఆమె పాడిన పాటలు శ్రోతల మన్ననలను, ప్రశంసలను విరివిగా పొందాయి. ఆమె 1928లో ఆంధ్రప్రదేశ్‌లోని వెంకటగిరిలో జన్మించారు. రామినేని ఫౌండేషన్ మొదలైన ఎన్నో అవార్డులు స్వీకరించారు. అల్లత్తూరు సుబ్బయ్యగారి వద్ద సంగీతాన్ని అభ్యసించారు. ఆరేళ్ళ వయస్సులోనే హెచ్.ఎం.వి. రికార్డుల కోసం పాడారు. 1936లో సి.పుల్లయ్యగారి దర్శకత్వంలో తీసిన 'సతీ అనసూయ' చిత్రంలో 'గంగాదేవి' ప్రాత్రతో సినిమారంగంలోకి నటీమణిగా ప్రవేశించారు. తరువాత భక్తకుచేల, బాలయోగిని, ఇల్లాలు మొదలైన చిత్రాలలో నటించారు. భాగ్యలక్ష్మి, మహానంద, చంద్రహాస, చెంచులక్ష్మి, రాధిక, లైలామజ్ను, షావుకారు, జయసింహ, దేవదాసు, తెనాలి రామకృష్ణ మొదలైన సినిమాలలో ఎన్నో పాటలు పాడి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆమె ప్రస్తుతం మనవడి దగ్గర సికింద్రాబాదులో నివసిస్తున్నారు.

### 12. రాకోయి నా రాజా

**రచన** : **కొనకళ్ల వెంకటరత్నం**
**సంగీతం** : **పాలగుమ్మి విశ్వనాథం**
**గానం** : **ఇందిరారంగారావు**

**<u>గౌరీమనోహరి-ఏక</u>**

**రాకోయి నా రాజా నీ**
**రాణిగారు కబురంపేదాక** ॥రాకో॥
**వస్తావని పదినాళ్ళై ఉన్నా**
**ముస్తాబింక ముగియనె లేదు** ॥రాకో॥

1. రానన్నాళ్ళు రాతిరి పగలు
రాలేదని గుండెలలో దిగులు
వస్తావని విన్నపుడే మొదలు
వచ్చి గడియ నిలవోయని గుబులు ॥రాకో॥

2. మల్లెలు మనసో,మంకెన సొగసో
మది నీకెది ఇంపగునో తగునో
అడవికోన గాలించి వెతికినా
అందమైన పువ్వమరదు సిగలో ॥రాకో॥

**భావం :** రాజు కోసం ఎదురుచూసే విరహిణి రాణి మనోగతాన్ని ఈ పాట వివరిస్తున్నది. ప్రియుడు వస్తాడని తెలిసిన ప్రేయసి పది రోజులుగా ప్రతిరోజూ ముస్తాబవుతూనే ఉందిట. అయినా ఆ ముస్తాబు పూర్తి కాలేదు, ప్రియుడు రానేలేదు. రాత్రింబవళ్ళు విభుడు రాలేదని గుండెల్లో ఒకటే దిగులు. వస్తాడని తెలిసినప్పుడు, వచ్చి కాసేపైనా ఉంటాడో, లేదో అనే గుబులు ఆమె మనసంతా పరుచుకుంది. తాను ఏ రకమైన పూలు పెట్టుకుంటే ప్రియునికి ఇష్టమో ఆమెకు తెలియడం లేదు. అడవింతా వెతికినా తన సిగలో అందంగా ఒదిగిపోయే పూవే దొరకడంలేదట. ఎంత గడుసు యువతిని సృష్టించారు రచయిత! అంతేకాదు, కబురు పంపేదాక రావద్దని అంటూనే రాత్రీపగలూ రాలేదని దిగులుపడుతున్నదట. ఎంత చమత్కారం!

'పగలు, దిగులు, మొదలు, గుబులు, మనసో, సొగసో, ఇంపగునో, తగునో' వంటి ఒద్దిక కలిగిన అంత్యప్రాసలను రచయిత సుకుమారంగా ప్రయోగించారు. పల్లవి, చరణాలలో యతిమైత్రిని చక్కగా పాటించారు. అనుపల్లవి పాదాలలో ప్రాసయతిని అనుసరించారు. 'కబురు (ఖబర్).ముస్తాబు' అనే రెండు పదాలు తప్ప మిగిలిన భాషాప్రయోగం అంతా కమ్మని తెలుగులోనే సాగింది. గడియ అనేది కాలప్రమాణానికి సంబంధించినది. రోమన్,ఇంగ్లీషు లెక్కలు రాకమునుపు మన దేశంలో గడియలను సూచించే యంత్రం వినియోగంలో ఉండేది. దీనినే ఘటికాయంత్రం అని పిలిచారు. 'ఘడియ' కు వికృతిపదమే 'గడియ'. దీనిని హిందీలో ఘడీ అంటారు. దీనిని సూచించేది కనుక ఆ యంత్రాన్ని గడియారం అన్నారు. గడియ అంటే 24 నిమిషాల కాలం. అయితే ఈ పదాన్ని 'క్షణం' అనే అర్థం వచ్చేట్టుగా వ్యవహారంలోకి మార్చారు.

'అడగిందానికి చెప్పి' (ఇల్లరికం) అనే పాటలోని రెండవ చరణంలో

***'వాయువేగమున మించి,లోకాలన్నీ గాలించి***
***గడియలోననే ఉన్నచోటికే వడిగా చేరేదేది?'***

అని హీరోగారు అడిగితే నాయిక దానికి 'మనస్సు' అని సమాధానం ఇస్తుంది. అయితే, మనస్సు సంచరించేందుకు 24 నిమిషాలు పడుతుందా? అని సందేహం రావచ్చు కనుక దాన్ని 'క్షణం' అనే అర్థంలో చెప్పుకుంటే సరిపోతుంది. పాటలో 'గడియ' బదులు 'క్షణము' అనవచ్చు. అది వేరే చర్చ. ఈ పాటలో కూడా 'గడియ'ను 'క్షణం' అనే అర్థంలోనే అన్వయించు కోవచ్చు. సహజార్థం ప్రకారం తీసుకున్నా ప్రియుడు 24 నిముషాలపాటు తన వద్ద ఉన్నా ఆవిడకు సంతోషమేకదా! అయినా అది విరహ ప్రేమికులకు 24 క్షణాలతో సమానమే.

కొనకళ్ళ వెంకటరత్నంగారు సాహితీలోకంలో చాలా ప్రసిద్ధులు. వీరు "ప్రతోళీ, ప్రొద్దుతిరుగుడు పూలు, బంగారిమామ పాటలు" మొదలైన రచనలు చేశారు. ''బంగారిమామ పాటలు'' పుస్తకాన్ని తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తిగారికి అంకితమిచ్చారు. ఈ పుస్తకంలోని పాటలను 'బాలబంధు' బి.వి. నరసింహారావు గారు అభినయపూర్వకంగా ఆలపించి వీటికి బహుళ ప్రచారాన్ని తీసుకువచ్చారు. ఈ పుస్తకంలోని 'మొక్కజొన్న తోటలో' పాటను 'అదృష్టవంతులు' సినిమా కోసం కె.వి.మహదేవన్ స్వరకల్పనలో పి.సుశీల ఆలపించారు.

'రాకోయి నా రాజా' పాటను మధురగాయని ఇందిరారంగారావుగారు కొనకళ్ళ వెంకట రత్నంగారి 'బంగారిమామ పాటలు' పుస్తకం నుండి ఎంచుకున్నారు. ఈ పాట ఆ పుస్తకంలోని 11 వ పాట. పుస్తకంలోని ఈ పాట మొదటి చరణంలోని మొదటి రెండు పంక్తులను గాయని అనుపల్లవిగా మార్చుకున్నారు. పుస్తకంలో 5 చరణాలుండగా 3వ, 4వ చరణాలను మాత్రమే స్వీకరించారు.

ఈ పాటను స్వరకర్త గౌరీమనోహరి రాగంలో అందంగా స్వరపరిచారు. ప్రారంభంలో వయొలిన్, వీణ, వేణువు, క్లారియోనెట్లపై అయిదు ఆవర్తాల బిట్టును ఇచ్చారు. గాయని పాటను సాభిప్రాయంగా 'రాకోయి' ని రిషభం నుంచి ఒక మాత్ర జాగా వదిలేసి ఎత్తుకున్నారు. పల్లవి తరువాత రెండు ఆవర్తాల బిట్టు నివ్వగా 'వస్తావని' అనే అనుపల్లవిని కూడా ఒక మాత్ర జాగా వదిలేసి రిషభం నుంచే ప్రారంభించారు. రెండు మార్లు పల్లవిని పాడారు. దీని తరువాత 7వ అక్షరం నుండి బిట్‌వర్క్ ను ప్రారంభించి రెండు ఆవర్తాలుగా వినిపించగా గాంధారం నుండి మొదటి చరణం 'రానన్నాళ్ళు' ను ఒక మాత్ర జాగా వదిలి అందుకున్నారు. మొదటి రెండు పంక్తులను రెండు సార్లు పాడారు. వెంటనే తరువాతి రెండు పాదాలను కూడా రెండు సార్లు పాడి పల్లవిని అందుకున్నారు.

రెండవ చరణం ముందు కూడా మొదటి చరణం మాదిరిగానే బిట్ ఇచ్చారు. 'మల్లెలు మనసు' చరణాన్ని ఒక మాత్ర జాగా వదలి 'రిగరిగ' అంటూ కొంత వైవిధ్యమైన బాణీలో పాడారు. చరణం రెండో భాగాన్ని మొదటి చరణం లాగానే పాడినా 'కోన' పదాన్ని చక్కని సంగతితో మలుచుకున్నారు. తరువాతి పాటంతా సామాన్యంగానే సాగిపోయింది. అయితే అక్కడక్కడ మార్గహిందోళం రాగచ్ఛాయలు తొంగిచూశాయి.

లాలిత్యం ప్రధానం కనుక ఎక్కువ సంగతుల జోలికి పోకుండా నిరా డంబరంగా పాటను ఆలపించిన విధానం బాగుంది. అలాగే పాట మొత్తంమీద నిషాదం నుండి పైస్థాయిలో స్వరసంచారం లేకుండా ఉదాత్తంగా పాడడం ఈ పాటలోని ప్రత్యేకవిశేషం అనే చెప్పాలి.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
*(జాతీయ పురస్కార గ్రహీత)*
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.



# మేలు చేసే మేటి కవి

**– ఆచార్య పి హరినాథ్**

**చ**క్కనమ్మ చిక్కినా అందమే అని తెలుగులో ఒక సామెత ఉంది. సౌందర్యవతి సన్నబడినా వన్నెలీనుతుంది అని లోకోక్తి. అలాగా కొన్ని విషయాలు కరిగిపోతున్న కూడా సొగసుగా ఉంటాయి. వృద్ధి అనేది గొప్పదే. అయితే అన్ని వేళల్లోనూ ఆ సూత్రం అంగీకార్యం కాకపోవచ్చు. కొన్నిసార్లు తరిగిపోవడం కూడా బాగుంటుంది లోక రహస్యాలను దర్శించిన కవిభర్తృహరి, దీన్ని నిరూపిస్తూ అంటాడు :

**మణిశ్శాణోల్లీఢః సమర విజయీ హేతి దళితో**
**మదక్షీణో నాగః శరది సరిదాశ్యాన పులినా**
**కలాశేషశ్చంద్రః సురత మృదితా బాల వనితా**
**తనిమ్నా శోభంతే గళితవిభవాశ్చార్థిషు నరాః**

ఒక మణి మెరిసిపోవాలంటే ఒరిపిడి రాయి మీద సాన పెడతారు. అది ఎంతగానో తరిగిపోతుంది. దానివల్ల దాని తళుకు పెరిగింది తప్ప నష్టం లేదు. ఒక గెలిచిన వీరుడు యుద్ధంలో గాయపడితే ఆ గాయం శోభనిస్తుంది తప్ప అన్యం కాదు. ఒక మత్తేభం గండస్థలం నుంచి మదజలాన్ని స్రవించి చిక్కిపోతే ఆ మద స్రావం దానికి మనోజ్ఞతను ఇస్తుంది తప్ప, మరోటి కాదు. ఒక నది వెన్నెల కాలంలో కృశించిపోయి ఇసుక తిన్నెలు బయటపడితే అది నదికి అందమే తప్ప ఇంకేమీ కాదు. అలాగే చంద్రుడు 16 కళలలో ఒక్కొక్కటి కరిగిపోయి ఒకే కళ మిగిలి ఉంటే ఆ శశిరేఖ మనోహరంగా ఉంటుందే కానీ దానికి ఏమీ లోటు కాదు. ఒక బాలిక మదన యుద్ధంలో నలిగినవసిపోయి పరవశిస్తే ఆ నలిగిపోవడం నయనానందకరమే తప్ప నష్టం కాదు. ఈ అన్ని ఉదాహరణల లాగానే మరోటి ఉంది. తమకున్న సంపద యాచకులకు సమర్పించి దాతలు పేదవారై పోయినప్పటికీ వారికి శోభనిస్తుంది. ఈ విధంగా దాతకు కృశించడం కూడా అందమే అంటున్నాడు కవి. మృచ్ఛకటిక నాటకంలో చారుదత్తుడు తనకున్న ఐశ్వర్యాన్ని దానాలకు వినియోగించి దరిద్రుడైపోయాడు. దరిద్ర చారుదత్తం అని కూడా నాటకం ఉంది.అది కూడా ఆయనకు శోభనిచ్చింది. ఇంతటి విశాలార్థం ఉన్న ఈ పద్యం ముచ్చటైన తెలుగు లో ఎలా ఉందో అవధరించండి

**శాణవిఘృష్టరత్నమును శస్త్రహతుండగు శూరుడున్ మద**
**క్షీణ గజంబు సైకత విశిష్ట శరన్నదియున్ నవక్షపా**
**ప్రాణివిభుండు చండసురతాలస బాలికయున్ ధనైక వి**
**శ్రాణనశూరులున్ గదు గృశత్వమునన్ బ్రభ గాంతురిద్ధరన్**

అయితే ధనమూ సంపదా మాత్రం ఉంటే సరిపోతుందా. ఊహు. కాస్త మనసు ఉండాలి. మంచితనం కూడా ఉండాలి. సౌజన్యం లేనప్పుడు ఎంత వైభవం ఉన్నా కూడా ప్రయోజనం ఉండదు. ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ కవి అంటాడు.

**అకరుణత్వమకారణ విగ్రహఃపరధనే పరయోషితి చ స్పృహాః**
**సుజన బంధుజనే ష్వసహిష్ణుతాప్రకృతిసిద్ధం మిదం హి దురాత్మనాం**

కొంతమందికి మనుషుల పట్ల దయ ఉండదు. కారణాలేవీ లేకుండానే కయ్యానికి కాలుదువ్వుతూఉంటారు. వేరే వాళ్ళ ధనాన్ని దోచుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఇవన్నీ దుర్మార్గుల లక్షణాలు. ఇవన్నీ దుర్యోధనునిలో కనిపిస్తాయి. పాండవుల అడవులపడి కందమూలాలు తింటున్నారని తెలిసినా, ఆయనకు దయ లేదు. పైగా చుట్టుపక్కల ఎవరైనా రాక్షసులు ఉంటే వారిని రెచ్చగొట్టి పంపించాడు. దూర్వాస మహర్షిని పురిగొల్పి పాండవుల అతిథిగా పంపాడు. ఆ మహర్షి తన శిష్య గణంతో వెళ్ళి వారి మహిమను గుర్తించాడు. రాజసూయ యాగ వైభవాన్ని చూసి తట్టుకోలేక పోయాడు. వారితో నిజానికి వైరం లేక పోయినా అనవసరంగా వారిని ద్వేషించి కయ్యానికి కాలు దువ్వాడు. వారి సతీమణి ద్రౌపదిని పరాభవించాడు. మంచి చెప్పబోయిన విదురుడిని దూరం చేసాడు. నీతి చెప్పిన భీష్ముడిని నిందించాడు. మంచి చెప్పదలచుకున్న ప్రతి బంధువునూ దూరంగా పెట్టాడు. ఇంత పెద్దగా పరచుకున్న మహాభారతంలోని అంశాలు ఈ చిన్న శ్లోకంతో మనకుసూక్ష్మంగా, స్పష్టంగా కనిపిస్తాయి. ఈ విషయాల గురించి మాట్లాడుతూ కవి హఠాత్తుగా రాజ్యం గురించి, నిర్వహణ గురించి ప్రస్తావన చేస్తాడు. ధనం లేకుంటే శోభ అనే విషయం అలా ఉంచండి. మరి రాజుకు పరిపాలనలో ధనం కావొద్దా? పరిపాలన

సాగడానికి దేశానికి ఆదాయం ఉండాలి. దీని సంగతి ఏమిటి ? అని ప్రశ్న వస్తుంది .

రాజుతో కవి చెబుతున్నాడు

**రాజన్ దుధుక్షసి యది క్షితి ధేను మేనాంతే నాద్య వత్స మివలోక మముం పుషాణ**
**తస్మింశ్చ సమ్యగనిశం పరిపుష్యమాణేనానాఫలం ఫలతి కల్పలతేవ భూమి**

“రాజా పరిపాలన సాగడానికి ప్రజల నుండి రకరకాల మార్గాలలో ధన ధాన్యాలు రావలసి ఉంటుంది. ఈ నేల ఆవు లాంటిది. ప్రజలు దూడలు. ఆవు నుంచి పాలు పితకాలని ఆశించావనుకో దూడను లాలనగా జాగ్రత్తగా చూసుకోవాలి. ఎందుకంటే దూడను మురిపంగా చూస్తేనే కదా ఆవు పితకనిస్తుంది, పాలనిస్తుంది. అలాగే ప్రజలను కూడా చల్లగా హాయిగా పరిపాలించవనుకో, కల్పవృక్షం లాగా ఈ భూమి ధనాన్ని ధాన్యాన్ని నానారకాల ఫలాలను కూడా ఇస్తుంది.”

**ధరణిధేనువు బిదుకంగ దలచితేని**
**జనుల బోషింపు మధిప వత్సముల మాడ్కి**
**జనులు పోషింపబడుచుండ జగతి కల్ప**
**లత తెరంగున సకల ఫలంబులొసగు**

ఇది నాటికి నేటికి ఏనాటికి కూడా పరిపాలకులకు వర్తించే సూత్రం. ప్రజా సౌఖ్యం పరిగణనలోకి తీసుకుని పాలకులు పాలన సాగించినప్పుడు ధనధాన్యాలు సమృద్ధిగా ఉంటాయి అని కవి సూచిస్తూ ఉన్నాడు.మరి సంపాదనలో అన్ని చోట్ల విజయం లభిస్తుందా? చేసిన ప్రతి ప్రయత్నం ఫలిస్తుందా? ఆశించినవి అందకపోతే మన స్థితి ఏమిటి? మనఃస్థితి ఏమిటి? పూర్వం ఒక మహారాజు ఉండేవాడట. ఆ రాజు ప్రజలను తన కనుపాపలుగా కాపాడాడు. ధన ధాన్యాలతో వారి జీవితాలను కళకళలాడించాడు. అలాంటి రాజు శత్రువు చేసిన మోసానికి గురై రాజ్యాన్ని కోల్పోయాడు. నమ్మినవారు కుట్ర చేశారు. నీతి తప్పి యుద్ధంలో మోసాలు చేశారు. ఎంతో పదిలంగా నిర్మించిన సామ్రాజ్యం పరులకు చిక్కింది. అలాంటి వ్యక్తి అడవులపాలై ఒంటరిగా చెట్టు కింద కూర్చుని దూరంగా కనిపిస్తున్న కోట వైపు చూస్తూ ఉన్నాడు. ఆ సమయంలో ఒక యువతి ఆయన ముందు నిలిచి నమస్కరించింది.” ఎవరమ్మా నీవు” అన్నాడు. “నేను మీ రాజ్యలక్ష్మిని. మీ శౌర్యప్రతాపాలతో ఇన్నాళ్ళూ నన్ను కాపాడారు. సెలవు మహారాజా, వెళుతున్నాను” అని వెళ్ళిపోయింది. మరో యువతీ వచ్చింది. “నేను నీ ధనలక్ష్మిని సెలవు” అని వెళ్ళిపోయింది. మరో యువతి” నేను నీ జయలక్ష్మిని సెలవు” అని వెళ్ళిపోయింది. రాజు నిరుత్తరుడై చూస్తున్నాడు. ఇలా ఒక్కొక్కరు సెలవు తీసుకుని వెళుతున్నారు. చివరగా ఒక యువతి వచ్చింది “నీవు ఎవరు తల్లీ” అన్నాడు. ఆమె అంది “మహారాజా, నేను ధైర్యలక్ష్మిని. ఇన్నాళ్ళూ మీ రాజ్యంలో నాకు చోటిచ్చారు. ఇక సెలవు అంది. రాజు లేచి నిలబడి చేతులు మోడ్చి అన్నాడు” అమ్మా, నీవు ఒక్కతివి నాతో ఉండు. వెళ్ళిపోయిన వారినందరినీ వెనక్కి తీసుకు రాగలను తల్లీ. ఆమె అతన్ని వీడలేదు. మొక్కవోని శౌర్యంతో చెక్కుచెదరని ధైర్యంతో రాజు యుద్ధం ప్రకటించి విజయుడయ్యాడు. కోల్పోయిన వారినందరినీ తిరిగి పొందాడు. ధైర్యం అనేది మనిషికి అపురూపమైన శక్తినిస్తుంది. ధైర్యం అంటే ధీర లక్షణం. ధీ అంటే బుద్ధి. బుద్ధిని జారిపోనీక నిలకడగా ఉంచుకుని ఆలోచిస్తే దేన్నైనా సాధించవచ్చు–అని చెప్పే మాటలు ఇవి. ఎంత కృంగిపోయిన వారికైనా బలమిచ్చి లేపి నిలబెడతాయి. “నీవు చేయగలవు నిలకడగా ఉండు నిబ్బరం కోల్పోకు” అనే మాటలతో ధైర్యం ఒక ఆంజనేయ శక్తి లాగా అవంతిస్తుంది. ఒక ఆంగ్ల రచయిత అన్నాడు “పక్షులు గాలిలో ఎలా ఎగురుతాయి అంటే అవి ఎగరగలము అని అనుకుంటున్నాయి కాబట్టి “–అని. అవి ఎగరలేము అని భావిస్తే గూట్లో కూర్చోవాల్సిందే తప్ప ఒక్క అడుగున ముందుకు సాగదు.

పురాణమైనా, ఇతిహాసమైనా, కావ్యమైనా, నాటకమైనా, మరే సాహిత్య ప్రక్రియ అయినా చేసే సహాయం ఒకటి ఉంది. అది మనకు ధైర్యాన్ని ఇవ్వడం. ప్రతి జీవితంలోనూ ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకసారి మనసుకు మసకలు కమ్మి ఆలోచనలు సాగని ఒక చీకటి దశ ఉంటుంది. మాట పెగలదు. కాళ్ళు చేతులాడవు. నోరు తడి ఆరిపోతుంది. చేతిలో ఉన్న ఆయుధం అలాగే జారిపోతూంటుంది. జీవితం పట్ల ఆశ సన్నగిల్లుతూంటుంది. అపుడు మనకు కటిక దీపంలో కాంతి కిరణంలాగా కవి మాటలు కనిపిస్తాయి. గుండె తలుపు తట్టి మనకు బాసటగా నిలిచి భయాన్ని పొగొడతాడు కవి, రచయిత. అందుకే హితాన్ని చెప్పేది సాహిత్యం అన్నారు పెద్దలు. సాహిత్యం చేసే గొప్ప మేలు అదే.

ఆచార్య పి. హరినాథ్,
మైసూర్, ఫోన్ : 9480443108

# ఫ్రాన్స్- ఆక్సిటనీ

ఆంగ్లం – డా. నిమ్మగడ్డ శేషగిరి రావు

తెలుగు – శ్రీమతి అట్లూరి జయశ్రీ



టలూస్ నగరం

ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల మధ్య, పిరానీస్ పర్వతాలలో ఒదిగి ఉన్న అండొరా, స్పెయిన్లోని బార్సిలోనా నుండి మూడు గంటల ప్రయాణం. అండొరా చూసిన తరువాత, ఇంగ్లండ్ తిరిగిరావటానికి అక్కడి నుండి విమానాలైతే లేవు. మళ్ళీ బస్సులో బార్సిలోనా తిరిగి వచ్చి నా సమయం వృధా చేసుకోవాలని లేదు. మరెలా? ఆరా తీస్తే, ఫ్రాన్స్‌లోని టలూస్ నగరం నుండి విమాన సౌకర్యం ఉందని తెలిసింది. అండొరా నుండి టలూస్ 190 కి. మీ. మరి ఇంకేం, మరొక క్రొత్త ప్రదేశం చూసే అవకాశం వచ్చిందని సంతోషపడ్డాను. ఇంకా చూస్తే, 170 కి. మీ. దూరంలో మరొక చారిత్రాత్మక నగరం ఉందని తెలిసింది. దాని పేరు కార్కాసన్. ఈ మూడు ప్రదేశాలను కలుపుతూ నేల మీద గీతలు గీస్తే, ఒక లంబకోణ త్రిభుజం తయారౌతుంది. ఈ రెండు నగరాల మధ్య దూరం 100 కి. మీ. ఈ రెండు నగరాలు చూడటం కేవలం యాదృచ్ఛికం. కాని ఏ నగరం ఏ అనుభవాల గుట్టో ఎవరికి తెలుసు!!

టలూస్, కర్కాసన్ నగరాలు రెండూ దక్షిణ ఫ్రాన్స్‌లో ఆక్సిటనీ అనే ప్రాంతంలో ఉన్నాయి. ఇదొక భాషా ప్రాతిపదిక ప్రాంతం. ఆక్సిటాన్ భాష ప్రాతిపదికగా ఏర్పడిన ప్రాంతం. ఈ భాష స్పెయిన్‌లోని కటలోనియా, మొనాకో, ఇటలీలో కొన్ని ప్రాంతాలలో కూడ వాడుక భాష. విమానంలో దూర ప్రయాణం అనగానే మనకు బోయింగ్, లేదా ఎయిర్ బస్ గుర్తుకొస్తాయి. సియాటల్ కేంద్రంగా తయారయ్యే బోయింగ్ విమానాలు అమెరికాకు గర్వకారణమైతే, వాటికి దీటుగా నిలిచిన ఎయిర్ బస్, యూరోప్‌కు తలమానికం. టలూస్ అనగానే గుర్తుకు రావలసింది ఎయిర్ బస్. ఇక్కడ ఎయిర్ బస్‌లు తయారు చేయ బడతాయి. వివిధ ప్రాంతాలలో తయారైన ఎయిర్ బస్ విడిభాగాలను అనుసంధించే ఫ్యాక్టరీ ఇక్కడ ఉంది. తయారైన ఎయిర్ బస్‌లను తనిఖీ చేసి, ప్రయాణీకులను ఎక్కించుకోవటానికి అవసరమైన సర్టిఫికేషన్ కూడా ఇక్కడే ఇవ్వబడుతుంది. లండన్ నుండి న్యూయార్క్‌కు మూడున్నర గంటలలో ప్రయాణం చేయగలిగిన కోన్కార్డ్ విమానాలు, ఒకేసారి 800 మంది ప్రయాణీకులను కూర్చోబెట్టుకుని రెక్కలమీద ఎగరగలిగే అతి శక్తివంతమైన మెగా ఎయిర్ బస్‌లు కూడా ఇక్కడే తయారౌతాయి. వీటికి కావలసిన విడి భాగాలు మాత్రం వేరే వేరే చోట్ల నుండి వస్తాయి. ముఖ్యంగా వీటికి కావలసిన ఇంజిన్‌లు ఇంగ్లండ్‌లోని డార్బీ అనే పట్టణంలో ఉన్న రోల్స్ రాయ్స్ ఫ్యాక్టరీ నుండి సరఫరా చేయబడతాయి.

ఎయిర్ బస్‌ల సంగతి అటుంచితే, టలూస్ చూడవలసిన నగరాలలో ఒకటి. ఫ్రాన్స్‌లో పారిస్, మార్సే, లియోన్ నగరాల తరువాత నాలుగవ స్థానంలో ఉన్న ప్రముఖ నగరం ఇది. ఆండోరా నుండి ఫ్రాన్స్‌లో ప్రవేశించినప్పుడు, అక్కడ పాస్ పోర్ట్ వగైరా తనిఖీ లేమీ లేవు. సరిహద్దు పోలీసులు బస్‌లో ఉన్న ప్రయాణీకులందరిని ఒకసారి పైపైన పరిశీలించి, ఫ్రాన్స్ ప్రవేశానికి అనుమతించారు. ఈ సరిహద్దు పిరనీస్ పర్వతాలమీద

ఉన్నది. అక్కడ నుండి మెలికలు తిరిగే పర్వత మార్గం మీద, అందమైన లోయలు దాటుకుంటూ, ప్రధాన రహదారి ఎక్కేసింది మా బస్. దోవ పొడుగునా ఎక్కడ చూసినా ద్రాక్ష తోటలు, సూర్య కాంత పుష్పాలతో నిండిన పసుప్పచ్చ పొలాలు. బస్ స్టేషన్, గొప్పగా కనపడుతున్న టలూస్ మతాబియొ రైల్వే స్టేషన్ ప్రక్కనే ఉంది. బస్ దిగి వాకబు చేస్తే నేను బుక్ చేసుకున్న హొటల్, 'రెసిడెన్స్ కోన్కార్డే' రైల్వే స్టేషన్ ఎదురుగానే ఉందని తెలిసింది. అండోరాలో ఆఖరి నిముషంలో, హడావుడిగా బుక్ చేసుకున్న హొటల్ ఇది. ఎలా ఉంటుందో? అని సంశయిస్తూనే అక్కడికి చేరుకున్నాను. అప్పటికి మిట్ట మధ్యాహ్నం అయింది. వాతావరణం మంటెత్తి పోతోంది. భారత దేశంలో, నా చిన్నతనపు వేసవి సెలవుల్లో, నెత్తి మాడిపోయే మధ్యాహ్నాల మంట మనసులోకి వచ్చింది. హొటల్ రిసెప్షన్‌లో చూస్తే ఉష్ణోగ్రత 30-40 సెంటిగ్రేడ్‌ల మధ్య ఉంది. యూరోపియన్ దేశాలకు ఇది చాలా ఎక్కువ. ఇలాంటి ప్రయాణాలలో ఒక్క నిముషం కూడా వృధా చేయకూడదనుకునే నాకు కూడా, బయటికి వెళ్ళటానికి కనీసం నాలుగింటి వరకైనా ఆగాలనిపించింది. ఈలోగా నగరాన్ని మరో విధంగా నన్నా పరిచయం చేసుకుందామని, హొటల్ రిసెప్షన్‌లో కనిపించిన సిటీ మ్యాప్ తీసుకున్నాను. రిసెప్షనిస్టు అక్కడ చూడవలసినవన్నీ దగ్గర దగ్గరలోనే ఉన్నాయని చెప్పింది.

వాతావరణం కొంచెం శాంతించిన తరువాత, నెమ్మదిగా బయలుదేరి సిటీ సెంటర్‌లో ఉన్న విక్టర్ హ్యూగో మార్కెట్ చేరుకున్నాను. ముందుగా దీని పేరే నన్ను ఆకర్షించింది. 19 వ శతాబ్దపు కవిగా, నవలాకారునిగా విక్టర్ హ్యూగో ప్రతిభకు అద్దం పట్టేవి ముఖ్యంగా, 'లే మిసరబుల్స్', 'ది హంచ్ బాక్ ఆఫ్ నోటర్ డామ్'. మొదటిది ఇంగ్లీష్‌లో విశ్వ విఖ్యాత నాటకంగా, లండన్ 'వెస్ట్ ఎండ్' (లండన్‌లో నాటక ప్రదర్శనాలయాలు ఎక్కువగా ఉండే చోటు)లో 1985 నుండి నడుస్తూనే ఉంది. సుదీర్ఘ కాలం పాటు ప్రదర్శించ బడిన నాటకంగా ఇది గుర్తించ బడింది కూడా. మార్కెట్ అంతా షాపులు, రెస్టారెంట్లతో కోలాహలంగా ఉంది. స్థానికంగా తయారయిన వస్తువులు, ఆహార పదార్థాలు ఎక్కువగా కనపడుతున్నాయి. ఫ్రెంచ్ వారి వంటకాలలో పదార్థాల తాజాదనానికి ప్రాధాన్యత ఎక్కువ.

టలూస్ గులాబీ నగరంగా పిలువబడుతుంది. (లా విల్లే రోజ్). (మన జైపూర్ లాగా). చాలా వరకు కొత్తా పాతా భవనాలన్నీ గులాబి రంగు ఇటుకలతో నిర్మించబడి ఉన్నాయి. ముఖ్యమైన భవనం, కాపిటోలియమ్ కూడా గులాబీ రంగు పాలరాయితో కట్టబడింది.

కాపిటోలియమ్ హుందాగా కనపడే నగర సభామందిరం. దాని ముందు భాగం, స్తంభాలు అన్నీ కూడా గులాబీరంగు పాలరాతివే. చూస్తే దాని చుట్టూ నగరం వెలసినట్టు అనిపించింది. దానికి ఒక వైపు, ఆ నగర జీవనాన్ని ప్రతిబింబిస్తున్న కూడలి, 'ప్లేస్ దు కాపిటోల్' ఉన్నది. వందలాది మంది పురజనులు అక్కడి రెస్టారెంట్లలో తీరుబడిగా, తింటూ, వైన్ తాగుతూ ఆ చల్లబడిన సాయంత్రం నాకు కనిపించారు. మంటెత్తిన మధ్యాహ్నం తరువాత ఆ మాత్రం సేద తీర్పు సాయం కాలాలు కావాలిలే అనుకున్నాను. కాసేపు అటూ ఇటూ తిరిగిన తరువాత నేను కూడ కాపిటోలియం భవనానికి ఎదురుగా ఉన్న ఒక రెస్టారెంట్ ఎంచుకుని కూర్చున్నాను. అక్కడి నుండి నగర జీవనాన్ని తీరుబడిగా ఆకళింపు చేసుకోవచ్చనిపించింది. వాతావరణం అప్పటికి కొంత చల్లబడింది. ఒక గంట సేపు అక్కడ కూర్చుని చల్లని బీరుతో నన్ను కూడా చల్లబరచుకున్నాను.

తినటానికి అక్కడ ఏమి తీసుకోవాలో నిర్ణయించుకోలేక, అక్కడున్న వెయిటర్‌ను పిలిచి, తేలికగా ఉండే, ఫ్రెంచ్ ఆహారం కావాలని అడిగాను. అతను 'ఫ్రికాస్సే డి చిపిరాన్స్' తీసుకోమన్నాడు. దీనిని ఆల్చిప్పల జాతికి చెందిన స్క్విడ్ లను నిప్పులమీద కాల్చి తయారు చేశారు. చాలా బాగుంది. ఇక పోతే, బీరు గురించి... నిజానికి ఫ్రెంచ్ వారికి బీరు అంటే చిన్నచూపు అని నేననుకునేవాడిని. అదేదో ఇంగ్లీషు, బెల్జియమ్, జర్మన్ లాంటి తక్కువ జాతి పొరుగువారు తాగే చవకబారు పానీయం అని వారనుకుంటారని ఎప్పుడో విన్నాను. ఐనా ఎవరేమనుకున్నా సరే, ఆ సాయంకాలం నాకు మాత్రం బీర్ మాత్రమే కావాలనిపించింది. అక్కడ ఆ సమయంలో, వైన్, బీర్లు రెండూ సరి సమానంగానే నడుస్తున్నాయి. ముందుగా



బాసిలికా చర్చ్

బెల్జియన్ బీర్, 'లెఫే' తీసుకున్న తరువాత, అక్కడొక ఫ్రెంచ్ బీర్ 'బ్లోన్డే దె లిల్లే" కనిపించింది. అది కూడా బాగుంది. ఐనా, వైన్‌లాగా బీర్ రుచి, ప్రాంతాల మధ్య అంతగా మారదు. ఎక్కడైనా కుడి ఎడమ గా ఒకటి గానే ఉంటుందని నా అభిప్రాయం.

ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్ మొదలయిన దక్షిణ ఐరోపా దేశాలన్నిటిలో ప్రతి నగరంలోనూ ఒక మత గురువు ఆరాధించబడుతుంటాడు. అక్కడి ప్రధాన క్రైస్తవ మందిరాలు ఆ గురువు పేరిట ఉంటాయి. చాలా సార్లు, ఆ గురువు, సువిశాల రోమన్ సామ్రాజ్య కాలం నాడు, అంటే క్రైస్తవం ఇంకా ఒక ప్రధాన మతంగా ఏర్పడని కాలంలో ప్రాణాలర్పించిన వాడై ఉంటాడు. అట్లా టలూస్ నగరానికి ఆరాధ్యుడు సెయింట్ సెర్నిన్. ఇక్కడున్న ప్రత్యేకమైన, బాసిలికా (వాటికన్ పోప్ గుర్తింపు పొందిన చర్చి) సెయింట్ సెర్నిన్ పేరిట ఉన్నది. క్రీ.శ. 250 సం.లో, ప్రస్తుతం 'రూ దు టార్', అని పిలువబడే వీధిలో, బలి ఇవ్వబోయే మహిషం, సెయింట్ సెర్నిన్‌ను ఈడ్చు కెళ్ళటంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. అప్పట్లో తారోబోలియం, అనబడే ఎద్దు బలి ఆచారం ఉండేది. సెయింట్ సెర్నిన్ ప్రాణాలు కోల్పోయిన ప్రదేశంలోనే ఈ బాసిలికా నిర్మించబడింది.

అద్భుతంగా నిర్మించబడిన ఈ ప్రాచీన బాసిలికా చూడటానికి వెళ్ళినప్పుడు, అదృష్టవశాత్తు నాకొక మంచి గైడ్ దొరికింది. ఆమె ఈ బాసిలికాను, ప్రపంచంలోనే పేరెన్నిక గన్న 'రోమనెస్క్ చర్చి' గా అభివర్ణించింది. ఈ పదం నాకు కొత్త. అదొక రకమైన వాస్తు కళ అని మాత్రం అర్థమయింది. ఇంగ్లండ్‌లో చర్చ్‌లు చాలా వరకు గోథిక్ శైలిలో ఉంటాయని విని ఉన్నాను. టూర్ అయిపోయాక, ఆమె 'మీరేమైనా అడగదలచారా?' అని అడిగినప్పుడు, నేను, ఈ మాటను ప్రస్తావించి, దాని అర్థం తెలుపమని, గోథిక్ శైలికి, రోమనెస్క్ శైలికి తేడా ఏమిటని అడిగాను. ప్రశ్న అడిగానే కాని, దానికి సమాధానం ఇవ్వటం అంత తేలికేమీ కాదని నాకే అనిపించింది. ఆది చోళుల కాలం నాటి దక్షిణ భారత ఆలయాలకు, మొఘల్ వాస్తు రీతులకు ఉన్న తేడాలేమిటి అని అడిగినట్లుంది.

నిజానికి, రోమనెస్క్, గోథిక్, రినైజాన్స్, బారోక్స్, నియో–గోథిక్ లాంటి పదాల మీద నాకున్నది శ్రుత పాండిత్యమే కాని, లోతైన అవగాహన లేదు. ఇంత కష్టమైన ప్రశ్న అడిగానేమిటా? అనుకుంటున్నప్పుడే, మా గైడ్, అతి కొద్ది మాటలలో సునాయాసంగా వివరణ ఇచ్చింది. ఆమె చెప్పిన దాని ప్రకారం, గ్రీకు, రోమన్ వాస్తు రీతులు, ఐరోపాలో రోమన్ సామ్రాజ్య కాలం నాటివి. అతి పురాతనమైనవి. 6వ శతాబ్దంలో ఈ సాంప్రదాయిక రీతులను, ఇస్తాంబుల్ ప్రాంతపు బైజాంటైన్ రీతులతో కలపటం వలన, రోమనెస్క్ వాస్తు రీతి ప్రభవించింది. తరువాత 12/13 శతాబ్దాలలో ఇది మరింత మెరుగులు దిద్దుకుని, గోథిక్ వాస్తు రీతిగా ప్రత్యేకతను సంతరించుకుంది. పారిస్‌లోని నోటర్ డామ్, ఇంగ్లండ్‌లో లండన్ వెస్ట్ మినిస్టర్ అబీ, కాంటర్బరీ కతీడ్రల్, సాలిస్ బరీ కతీడ్రల్, జర్మనీలోని కొలోన్ కతీడ్రల్.. ఇవన్నీ గోథిక్ శైలిలో నిర్మించబడినవే. నాకు ఈ సమాధానం సరిపోయింది. అప్పుడు ఆమె ఇంకా ఏ మాత్రం ఎక్కువ చెప్పినా, నా బుర్రకెక్కేది కాదు. వీటన్నిటి గురించి ఇంకా విస్తారంగా చదివి తెలుసుకోవాలని మాత్రం నిర్ణయించుకున్నాను.

టలూస్ నగరం, గరోన్నెనది పరివాహకంగా ఏర్పడింది. సెయింట్ సెర్నిన్ బాసిలికా నుండి, ఈ నది ఒడ్డుకు నడచి వెళ్ళాను. అక్కడ వీచే చల్లగాలిలో చాలా మంది కుటుంబంతో సేద తీరుతున్నారు. పగలు కాసిన ఎండ చూస్తే, ఇటువంటి సదుపాయమేదో లేకపోతే, ఇక్కడి



'ది కెనాల్ దు మిడి' జల మార్గం.

ప్రజలు అల్లాడి పోతారేమోనని అనిపించింది. పగలంతా ఇళ్ల లోపల బందీలయిన పిల్లలు, కట్లు తెంచుకున్నట్లు, కట్టలు తెగిన ఉత్సాహంతో ఆడేసుకుంటున్నారు. గరోన్నె నది ఒడ్డున అంతటా ఉత్సవ వాతావరణం వుంది.

ఇంకాస్సేపట్లోనే చీకటి పడిపోయింది. నగరమంతా లైట్ల వెలుతుర్లో వెలిగిపోవటం మొదలయింది. నది మీద కట్టిన అర్ధ చంద్రాకారపు వంతెనలు, లైట్ల వెలుతుర్లో, నది నీళ్ళలో వాటి ప్రతిబింబాలు చూసుకుంటూ, పరిపూర్ణ వలయాకారాన్ని సంతరించుకున్నాయి. ఆ దృశ్యం హృద్యంగా కనిపించింది.

అక్కడ నేను ఇంకో విశేషాన్ని చూశాను. 'ది కెనాల్ దు మిడి' పూర్తిగా మానవ నిర్మిత జల మార్గం. 281 కి. మీ. పాటు సాగిన ఈ జల మార్గానికి 65 లాకులు ఉన్నాయి. ఒకప్పుడు వీటి సంఖ్య 85. దీని నిర్మాణం ఒక సాంకేతిక అద్భుతం. ఫ్రాన్స్ మధ్యధరా తీరాన్ని, అట్లాంటిక్ సముద్ర తీరంతో కలపటం కోసం దీని నిర్మాణం చేపట్టారట. ఈ రెండు తీరాలకు మధ్య మరో రెండు దేశాలు ఉన్నాయి. అవి స్పెయిన్, పోర్చుగల్. రైలు మార్గాలు లేని రోజుల్లో, జల మార్గాలకు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. అప్పట్లో దేశ వాణిజ్య, వ్యాపారాలన్నీ.. ఇంకా చెప్పాలంటే దేశాభివృద్ధి అంతా కూడా, జల మార్గం మీదే ఆధార పడి ఉండేది. ఈ కాలంలో రైలు మార్గాలు ఏర్పడిన తరువాత, జలమార్గాల అవసరం అంతగా లేదు. ప్రస్తుతం ఈ మార్గం, పర్యాటక ఆకర్షణగా మిగిలిపోయింది. ఇది, సెయింట్ సెర్నిన్ బాసిలికాతో పాటు, యునెస్కో వారి ప్రపంచ వారసత్వ సంపదలో భాగంగా కూడా గుర్తించ బడింది. టలూస్ నగరాన్ని పంచేంద్రియాలకు పట్టించుకునే ప్రయత్నంలో, డిన్నర్‌కు మంచి ఫ్రెంచ్ భోజనం చేయాలనుకున్నాను. ప్రపంచంలోనే, ఫ్రెంచ్ ఆహారం అతి నాజూకైనది, అధునాతనమైనది కూడా. ఇక్కడ ఏ ప్రాంతానికా ప్రాంతం, 'తమకే సొంతమనే' పదార్థాలను గొప్పగా ప్రచారం చేసుకుంటుంటారు. ఇక్కడ కాస్సోలెట్ అనే వంటకం ప్రాచుర్యంలో ఉంది. బాతు మాంసాన్ని, నూనెలో నెమ్మదిగా వేయించి నిలవబెట్టిన, 'డక్ కన్ ఫిట్'ను, సాసేజ్‌లతో కలిపి, వెడల్పాటి మట్టి పాత్రలో వండిన బీన్ స్ట్యూ ఇది. చాలా ప్రాంతాలు కాస్సోలెట్ 'తమ సొంతం' అని చెప్పుకుంటారు కానీ, నిజానికి ఇది మొట్ట మొదటగా, టలూస్, కార్కోసన్న్ మధ్య ఉన్న కాజెల్ నాదరి అనే చిన్న పట్నంలో తయారయిందట. ఈ మూడు ప్రాంతాలు, కాస్సోలెట్‌కు పెట్టింది పేరు. కాస్సోలెట్ రుచి నిజంగానే అమోఘంగా ఉంది.

భోజన కార్యక్రమం పూర్తయ్యే సరికి 11.30 దాటింది. ఇంకా చూడవలసినది చాలా ఉందనిపించింది. మళ్ళీ నది ఒడ్డు వెంబడి నడుద్దామా అనిపించింది. కానీ, నేను నడుస్తున్న ఇరుకు వీధి నిర్మానుష్యంగా ఉండటంతో, కొంచెం ఇబ్బందిగా అనిపించి, ఆ ప్రయత్నం మానుకుందామా అనుకుంటూ చుట్టూ చూశాను. కొంచెం దూరంలో ఓ మానవాకారం. హమ్మయ్య అనుకుని, కొంచెం నడక వేగం పెంచి, దగ్గరయ్యే సరికి, ఆ వ్యక్తి స్త్రీ అని తెలిసింది. నా కంటే కొంచెం ముందు, చాలా తాపీగా నడుస్తూ వెళుతోంది. నేను ఆమెను చేరుకునేటప్పటికి, దాదాపు సెంటర్ చేరిపోయాము.

చేతిలో మ్యాప్‌తో నడుస్తున్న నన్ను చూసి, ఒక దోవ తప్పిన భారతీయ యాత్రికుడనుకుని, స్నేహంగా నవ్వింది. 'దోవ వెతుక్కుంటున్నారా?' అంటూ పలకరించింది. నా హొటల్, దగ్గరలోనే రైల్వే స్టేషన్ సమీపంలో ఉందని చెప్పగానే, తాను కూడా అటే వెళుతున్నానని చెప్పి, 'కలిసే వెళదాం పదండి' అంటూ ముందుకు దారి తీసింది. ఆమె పేరు రాధ. పూనే నుండి వచ్చిన ఐ. టి. ఉద్యోగిని. ప్రస్తుతం జర్మనీలో ఉంటోందట. దోవలో ఉన్న ఒక మంచి షాపు నుండి జెలాటో (ఇటాలియన్ ఐస్ క్రీమ్) కొనుక్కోవాలను కుంటున్నానని చెప్పింది. అదే తక్షణ కర్తవ్యం అనుకుని

నేను కూడా వంత పాడాను. క్యూలో నిలబడి, ఒక చిన్న కప్పు కొనుక్కోవటం చూసి, కనీసం మూడు రకాలైనా రుచి చూడాలని హితబోధ చేసిందామె. కొత్త లేకుండా కలివిడిగా ఆమె మాట్లాడటం చూస్తే ముచ్చటనిపించింది. ఆమె సలహా ప్రకారం ఆ చిన్న కప్పులోనే కాఫీ, పిస్తా, కొబ్బరి రుచులు ఎంచుకుని పెట్టించుకున్నాను. ఎండ చల్లబడిన వేళ, చల్లని ఐస్ క్రీములు చాలా రుచిగా అనిపించాయి. మా పిల్లలు గుర్తుకొచ్చారు. ఇది సాధారణంగా వాళ్ళతో కలసి పంచుకునే చిన్న ఆనందం. ఆ రోజు సంపూర్ణం చేసుకోవటానికి ఇంతకు మించిన మార్గమేమి ఉంటుంది? ఎంత వారైనా ఐస్ క్రీమ్ దాసులే కదా, వయసుతో సంబంధం లేకుండా!!

అక్కడి నుండి మళ్ళీ నడక మొదలు పెట్టాము. మాటలలో రాధగారు, కార్కోసన్న్ తప్పకుండా వెళ్ళమని సూచించారు. అక్కడకు వెళ్ళి రావటానికి ఒక రోజు సరిపోతుంది. నా విమాన ప్రయాణం మరుసటి రోజు రాత్రికి. ఇంకేం? మరునాటి కార్యక్రమం రెడీ అయిపోయింది. అప్పటి వరకు నేను కార్కోసన్న్ చూడాలని అనుకోనే లేదు. టలూస్ నుండి కార్కోసన్న్, 100 కి. మీ. దూరం. టలూస్‌తో పాటు, కార్కోసన్న్ కూడా ఆక్సిటనీ ప్రాంతం లోదే, కానీ ఇది లాంగ్ డోక్ ప్రావిన్స్‌లో ఉంది. టలూస్ మధ్య పిరనీస్ ప్రావిన్స్.

మరునాడు ఉదయమే లేచి, కార్కోసన్న్‌కు వెళ్ళే ట్రైన్ అందుకోవాలని టలూస్ రైల్వే స్టేషన్‌కు వెళ్ళాను. ఆ స్టేషన్ చాలా పెద్దది. టికెట్ ఆఫీసులో, నాలుగు కౌంటర్లు తెరిచే ఉన్నాయి. ఆరుగురు సిబ్బంది అటూ ఇటూ తిరుగుతున్నారు. ముగ్గురు మాత్రం టిక్కెట్లు ఇస్తున్నారు. అక్కడి క్యూలో ఉన్నది మొత్తం 12 మంది పాసెంజర్లు. నాతో సహా. నా ట్రైన్‌కు ఇంకా 25 నిముషాలు టైము ఉంది, ఫరవాలేదు అనుకున్నాను. అక్కడి నుండి 15 నిముషాలలో ఒక్క టికెట్ మాత్రమే ఇవ్వటం జరిగింది. ఇంతసేపు ఎందుకు పడుతోంది అని ఆశ్చర్య పోయాను. ఫ్యామిలీ చరిత్ర తీసుకోవటమో, ప్రొద్దున్నే తిన్న బ్రేక్ ఫాస్ట్ గురించి బాతాఖానీ వేయటమో కాకపోతే ఇంత సమయం పట్టకూడదు. నిజానికి, అక్కడున్న 12 మందికి టిక్కెట్లు ఇవ్వటానికి ఆ ముగ్గురు ఉద్యోగులకు నాలుగు



కార్కోసన్న్ నగరం

నిముషాలకు మించి అవసరం లేదు. ఇట్లా అయితే నేను నా ట్రైన్ మాత్రమే కాకుండా, తరువాత రెండు ట్రైన్లు కూడా ఎక్కలేనని అర్థమై పోయింది. నిస్పృహ చుట్టు ముట్టుతుంటే, చుట్టూ దిక్కులు చూడటం మొదలెట్టాను. స్థానికులనిపించే ప్రయాణీకులెవరూ, మాలా క్యూలోకి రావటం లేదు. అక్కడున్న మెషిన్లలో టికెట్ కొనేసుకుని వెళ్లిపోతున్నారు. 'నేను కూడా అక్కడ టికెట్ కొనుక్కోవచ్చా?' అని అక్కడ క్యూని నియంత్రిస్తున్న సిబ్బంది ఒకరిని అడిగాను. క్రెడిట్ కార్డ్ ఉంటే కొనుక్కోవచ్చని చెప్పారు. 'బ్రతుకు జీవుడా' అనుకుని, వారి సహాయంతో టికెట్ కొనుక్కుని, ట్రైన్ ఎక్కేశాను.

ట్రైన్ ఎక్కి కుదుట పడ్డాక ప్రపంచంలోనే గొప్పగా చెప్పుకునే ఫ్రెంచ్ రైల్వేలో ప్రయాణం చేయటానికి నాకింత అసౌకర్యంగా అనిపించిందేమిటా అని ఆలోచిస్తుంటే, ఈ మధ్య ఫ్రాన్స్‌లో జన జీవనాన్ని స్తంభింప చేసిన ఫ్రెంచ్ రైల్వే స్ట్రైకు గురించి సమాచార మధ్యమాలలో వినిపించిన విషయం గుర్తొచ్చింది. టిక్కెట్లు ఇవ్వటం లాంటి, యాంత్రికమైన పని, అతి తేలికగా యంత్రాలకు అప్పచెప్పవచ్చు కానీ, తత్ఫలితంగా వాటిల్లే నిరుద్యోగ సమస్యకు వ్యతిరేకంగా ఫ్రెంచ్ ట్రేడ్ యూనియన్లు పోరాడుతున్నాయి. దాని ఫలితమే నేను చూసిన 'లెక్కకు మించిన సిబ్బంది' అని నాకు తోచింది. అవసరానికి మించిన ఉద్యోగులూ, సామర్థ్య రాహిత్యమూ..రెండూ చాలా వరకు కలసే ఉంటాయి.

కార్కోసన్న్ చరిత్రాత్మకమైన పట్టణం. దీని చుట్టూ గోడ ఉంది. టలూస్ నుండి ఇక్కడకు వెళ్ళి రావటానికి రైలు టిక్కెట్టు ఖరీదు 20 యూరోలు. ఒక గంట



కార్కోసన్న్ కోట

ప్రయాణం. ఇంగ్లండ్‌తో పోల్చితే టికెట్ ఖరీదు చాలా తక్కువ. ఇది నాకెప్పటికీ అర్థం కాని విషయం. పొరుగు దేశమైన ఫ్రాన్స్‌లో రైలు ప్రయాణం ఇంత చవకైతే, మరి ఇంగ్లండ్‌లో ఎందుకీ పరిస్థితి? చాలా సార్లు రైలుప్రయాణం కంటే కారు ప్రయాణం చవక అవుతుంది. పైగా ప్రభుత్వాలు కాలుష్యం గురించి, ఇంధన వాడకం గురించి మధన పడుతున్నట్లే ఉంటాయి. కానీ ఎక్కడో సామాన్యులకు అర్థం కానివేవో జరిగిపోతూనే ఉంటాయనుకుంటాను. కార్కోసన్న్ కోట మధ్యయుగపు సాంకేతికతతో, ఫ్రాన్స్ దేశానికి గర్వకారణమన్నట్లు కనిపించింది. యుద్ధ వ్యూహ దురంధరులకే, పాఠాలు నేర్పే విధంగా దీనిని రూపొందించారని చెప్పుకుంటారట. రెండు వరుసలుగా కట్టిన గోడల వలన, దీనిని ఛేదించటం దుస్సాధ్యం. రోమన్ల కాలం నుండి మధ్యయుగం వరకు దీనిని తీర్చి దిద్దుకు రావటం వలన నేటికి ఈ విధంగా రూపుదిద్దుకుని ఉందట. కథలలో చూపించే విధంగా కనిపించే ఈ కోట, కనువిందుగా కూడా ఉంది.

పట్టణం చుట్టూ ఉన్న గోడ మూడు కి. మీ. పొడవున విస్తరించిన ప్రాకారంతో, తలకొట్టిన శంఖు ఆకారంలో కనిపించే 52 గోపురాలతో, ఒక బల్లపరపు పర్వతాగ్రాన నిర్మించబడిన ఈ కోట, అటువైపుగా బస్‌లు, రైళ్లలో ప్రయాణం చేసే వారందరికీ దూరం నుండి కనపడుతూనే ఉంటుంది. 2010లో ఐస్‌లాండ్‌లో అగ్ని పర్వతం బద్దలై, చాలా దేశాలలో కురిసిన లావా బూడిద వలన, విమాన ప్రయాణాలు సాగక, నేను జోర్డాన్‌లోని అమ్మన్‌లో చిక్కుకు పోయాను. ఎట్లా గొట్లా ఇల్లు చేరే ప్రహసనంలో భాగంగా, మోంటెపెల్లియర్ నుండి పారిస్ వెళుతున్నప్పుడు, నేను ఈ కోటను చూడటం జరిగింది. చాలా ఘనంగా ఉంది అనుకోకుండా ఉండలేక పోయాను.

ఈసారి చూసినప్పుడు కూడా అదే భావం కలిగింది. కోట గోడల మధ్య సురక్షితంగా కనపడుతున్న ఈ చిన్న పట్టణం, జనావాసానికి అనుకూలంగా, చక్కగా తీర్చి దిద్దబడిన వీధులతో, అందమైన దుకాణాలతో, విశిష్టమైన హొటల్లతో, ప్రత్యేకంగా కనపడుతున్న గృహాలతో అలరారు తోంది. కోట ఈ పట్టణంలో ఒక చిన్న భాగం మాత్రమే. నేను విన్నదాని బట్టి, క్రిస్టియన్ల మత యుద్ధాలన్నీ, ఇస్రాయేల్, పాలస్తీనాలలో వారి పుణ్య క్షేత్రాలను (జెరూసలేంతో సహా) ముస్లిముల నుండి తిరిగి సాధించు కోవటానికి పోప్ ఆధ్వర్యంలో జరిగాయని. కార్కోసన్న్‌లో నాకు మరొక కొత్త సంగతి తెలిసింది. 13వ శతాబ్దంలో పోప్ ఇన్నోసెంట్ 3, ఆధ్వర్యాన జరిగిన పవిత్ర యుద్ధం (అల్బిజెన్సియన్ యుద్ధం), ఆక్సిటానీ ప్రాంతంలో కాథార్శిశం అనబడే మత విశ్వాసకులతో (కాథార్స్), కార్కోసన్న్‌లో జరిగిందట. దీనికి రోజర్ రేమెండ్ ట్రాన్కావల్ వంటి స్థానిక మహామహుల వత్తాసు కూడా ఉందట. కార్కోసన్న్ కాలక్రమేణా ఫ్రాన్స్‌లో భాగమై పోయింది. అప్పట్లో అది స్పెయిన్ సరిహద్దు భూభాగంగా ఉండేది. క్రమంగా ఫ్రాన్స్ పశ్చిమ దిశగా, పిరానీస్ పర్వతాల వరకు వ్యాప్తి చెందటంతో, కార్కోసన్న్ వ్యూహాత్మక ప్రాధాన్యత తగ్గింది. ఈ మధ్య కాలంలో, వయొలెట్ లె డూక్ అనే ఫ్రెంచ్ ఆర్కిటెక్ట్, కార్కోసన్న్ కోటను పునరుద్ధరించే ప్రయత్నం చేశాడు. దీని ఫలితంగా నేనేమో, కార్కోసన్న్ ఈ నాటికీ యూరోప్‌లో పటిష్టంగా నిలచి ఉన్న కోటగా గుర్తించబడింది. నేను ఇంతకు ముందు ప్రస్తావించిన 'ది కెనాల్ డి మిడి', కార్కోసన్న్ రైల్వేస్టేషన్ ముందు నుండే పోతోంది. నాకు రెండు లాకులు కనిపించాయి. చాలా టూరిస్ట్ బోట్లు వాటి మధ్య తిరుగుతూ కనిపించాయి. అక్కడక్కడా యాత్రికుల కోసం, కెనాల్ బోటు ప్రయాణాల గురించిన ప్రకటనలు ఉన్నాయి.

తీర్చిదిద్దినట్లున్న మోడర్న్ స్క్వేర్ దాటి, నెప్ట్యూన్ స్క్వేర్ లోకి వెళ్ళాను. అక్కడ స్థానిక రైతు బజారు జరిగే రోజు



లేడి కార్కాస్ విగ్రహం

అది. జీవం ఉట్టిపడే స్థానిక బజార్లు చూడటం నాలాంటి ఔత్సాహిక యాత్రికులకు ఉత్సాహం కలిగిస్తుంది. అక్కడ చూస్తే చాలు, ఆ దేశ ప్రజల జీవన విధానం ఎలా ఉంటుందో తెలుసుకోవటానికి. ప్రపంచంలో ఏమి జరుగుతున్నా, పట్టించుకోకుండా రోజువారీగా సాగిపోయే కొన్ని కార్యకలాపాలను ఇక్కడ చూడవచ్చు. పండించిన కూరగాయల నుండి, ఇంట్లో తయారు చేసిన చీజ్, సాసేజ్‌లు, మాంసం వరుగు, మాకరూన్ అనబడే తీపి పదార్థాలు, జాములు, పచ్చళ్లు లాంటివి ఎన్నో అక్కడ చేతులు మారుతున్నాయి. మార్కెట్టు దాటుకుని, కోట వైపు నడుస్తున్నప్పుడు, నాకొక వర్ణ వైచిత్ర్యం నిండిన వీధి కనిపించింది. ఈ రంగులన్నీ పై నుండి క్రిందకు ప్రసరిస్తున్నాయి. ఆదేమిటా అని చూస్తే, వందలాది రంగురంగుల ఛత్రాలు ఆ వీధి అంతటా పరచి ఉంచటంతో, ఎండ తీక్షణత తగ్గటమే కాకుండా, వీధంతా వివిధ వర్ణాల కాంతిలో వెలిగి పోతోంది. ఈ వీధి చాలా పొడుగు ఉన్నా, నడవటానికి శ్రమ అనిపించలేదు.

కార్కోసన్న్ కోట చేరుకోవటానికి లా ఔడీ నది మీద ఉన్న పాత రాతి వంతెన దాటాలి. ఈ వంతెన మీద నుండి చూస్తే ఈ ప్రాసాదం అంతా కనపడుతోంది. ఎత్తైన గోడలతో ఉన్న ఈ మహా దుర్గపు దృశ్యం, నేను ఇంతకు ముందు ఫోటోలలో చూసినట్లే రాజసం ఉట్టిపడుతూ ఉంది.

కోట చుట్టూ, నీరు నిండిన కందకం ఉంది. అది దాటి లోపలకు ప్రవేశించటానికి, అక్కడక్కడా వాల్చే వంతెనలున్నాయి. దాని మీదుగా లోపలకు వెళ్ళగానే, లేడి కార్కాస్ విగ్రహమొకటి నవ్వుతూ స్వాగతం చెపుతున్నట్లు ఉన్నది. స్థానికుల కథనం ప్రకారం, ఈమె తన చాతుర్యంతో ఛార్లమేన్ సైన్యం దాడి నుండి ఈ పట్టణాన్ని కాపాడిన రాకుమారి అట. కృతజ్ఞతతో ఆమె పేరుతోనే ఈ పట్టణాన్ని పిలుచుకుంటారు. ఛార్లమేన్ (చార్లెస్ ది గ్రేట్), 8వ శతాబ్దంలో రోమన్ సామ్రాజ్యం కూలిపోయినప్పుడు పశ్చిమ ఐరోపా దేశాలను కూడదీసి సామ్రాజ్య స్థాపన చేసిన మొదటి మహారాజు. పశ్చిమ ఐరోపాకు పితామహుడు. ఈరోజు మనం చూస్తున్న ఐరోపా కూటమి (యూరోపియన్ యూనియన్) కి పునాది వేసినది ఇతడే. ఇంతటి ప్రతిభావంతుడైన నాయకుడు, నెపోలియన్ బొనపర్తే కోసం ఫ్రాన్స్ మరో 1000 సంవత్సరాలు వేచి చూడవలసి వచ్చింది. అతడే మళ్ళీ పశ్చిమ యూరోప్ మొత్తాన్ని జయించిన వీర నియంత.

లేడి కార్కాస్, ఛార్లమేన్ సైన్యాన్ని త్రిప్పికొట్టడానికి తన బుద్ధి బలాన్ని ఉపయోగించిందని చెప్పే కథ ఒకటుంది. ఈ సైన్యం కోటను చుట్టుముట్టి, 5 సం. ల పాటు లోపలికి ఆహార పదార్థాలను పోనీయకుండా అడ్డుకున్నాయట. కొంత పంది మాంసం, కొంత గోధుమ తప్పితే మిగిలిన ఆహార పదార్థాలన్నీ అయిపోయాయట. అప్పుడు, కార్కాస్ యువరాణి, కొన్ని రోజుల పాటు, రోజూ కొంత మాంసాన్ని, గోధుమలను కోట గోడ మీద నుండి బయటికి విసిరి వేయమని ఆదేశమిచ్చిందట. ఇలా కొన్ని రోజులు చేసే సరికి, ఛార్లమేన్ సైనికులు, కోటలో ఇంకా చాలా ఆహారపు నిల్వలు ఉన్నాయని భ్రమపడి విసుగు చెంది తమ ప్రయత్నం విరమించుకుని వెళ్ళిపోయారట.

కోటకు ప్రవేశ రుసుము లేదు. కానీ రాజ భవన ప్రవేశానికి, రెండు వరుసలుగా కట్టిన ప్రాకారం వెంబడి నడవటానికి మాత్రం టికెట్ కొనుక్కోవాలి. కానీ ఈ ప్రాకారం మీద నడుస్తున్నప్పుడు, చుట్టూ మైళ్ళ తరబడి ఉన్న ప్రదేశమంతా కనిపించే దృశ్యం చూస్తే టికెట్ వృధా అనిపించదు. ఆ చుట్టూ పక్కల ఎన్నో ద్రాక్ష తోటలు, వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయి.

సెయింట్ నజారీ బాసిలికా, ఇక్కడ చూడవలసిన మరొక విశేషం. ఇక్కడున్న ఆరుబయలు ప్రదర్శనశాల చాలా అధునాతనంగా ఉంది. ఏటా కార్కోసన్న్ సంబరాలు ఇక్కడే జరుగుతాయట. అక్కడి వీధులలో ఉన్న షాపులు చూస్తున్నప్పుడు అక్కడ నాకు తెల్ల ట్రఫుల్స్ అనబడే పుట్టగొడుగులు కనిపించాయి. ఇవి చాలా ఖరీదు. భూమి లోపల పెరిగే వీటిని కనుక్కోవటానికి, వాటి వాసన పట్టుకునేందుకు శిక్షణ ఇవ్వబడిన కుక్కలను, పందులను ఉపయోగిస్తారు. ఇంత వరకు నేను ఇవి కేవలం ఇటలీలోనూ, క్రోయేషియాలో కొన్ని చోట్ల మాత్రమే దొరుకుతాయని విన్నాను. ఇక్కడ ఫ్రాన్స్‌లో లాంగ్ డోక్ ప్రావిన్స్లో కూడా దొరుకుతాయని విని/చూసి ఆశ్చర్య పోయాను. ట్రఫుల్స్ బంగారంతో సమానం. అవి దొరకటం అరుదు. వీటిని ఎన్నో వస్తువుల తయారీలో కూడా వాడతారు. ఇదంతా పూర్తయే సరికి మధ్యాహ్నం అయింది. నిజ జీవితంలోకి తిరిగి రావలసిన సమయం. ఈ తిరుగుడులో, కాల జ్ఞానం పోయింది. నా మూడు గంటల ట్రైన్ తప్పిపోయింది. తరువాత ట్రైన్ ఇంకో గంటకు గాని లేదు. అంటే నాకు ఇక్కడ ఇంకో గంట ఉండే అవకాశం దొరికింది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ తరువాత ఏమీ తినలేదని, కడుపులో మ్రోగుతున్న ఆకలి గంటలు చెపుతున్నాయి. మధ్యలో ఉబుసుపోక కొనుక్కున్న చాక్లెట్ క్రోస్సాంట్, కొంచెం మార్జిపాన్ తింటూ ఇప్పటివరకు గడిపాను. ఇక లాభం లేదు. చూస్తే రైల్వే స్టేషన్‌కు కొద్ది దూరంలో, కొన్ని రెస్టారెంట్లు కనిపించాయి. తెరచి ఉంచిన ఛత్రాల క్రింద ఐస్ క్రీములు తింటూ చాలా మంది కనిపించారు. అటువైపుకు వెళ్ళి చూస్తే అక్కడ అంత లేటుగా కూడా లంచ్ అమ్ముతున్నారు. 'లా రోటోంన్డే' అనే రెస్టారెంట్ పేరు నన్ను ఆకర్షించింది. లోపలికి వెళ్ళగానే నన్ను అలరించినవి రెండు విషయాలు. మొదటిది నా ముఖాన్ని తాకిన ఎయిర్ కండిషనర్ చల్లగాలి, రెండవది అక్కడి ఆహార పదార్థాల జాబితా. మళ్ళీ 'కాస్సోలెట్' అనే పేరు కనపడగానే ముందు రోజు అనుభవం గుర్తొచ్చి, నోరూరింది. దానిని ఆర్డరు చేయగానే అక్కడున్న వైటర్, చాలా మంచి పదార్థాన్ని ఎంచుకున్నానని ప్రశంసించాడు. కానీ దానిని అందించాలంటే 20 ని. లు పడుతుందట. అయినా ఫరవాలేదు అని చెప్పి ఎయిర్ కండిషనర్ సుఖాన్ని అనుభవిస్తూ అక్కడే కూర్చున్నాను. నా ట్రైన్ ఇంకా 40 నిముషాల వరకు లేదు.

ఇక్కడి కాస్సోలెట్ రుచి ఇంకా అమోఘంగా ఉంది. ఆకలి మీద ఉన్నానేమో, తీరుబడిగా కూర్చుని జిహ్వకు విందు చేశాను. చేతిలో ఫోన్ ఉంది. దీనికింత రుచి ఎట్లా వచ్చిందా అని ఇంటర్నెట్లో చూస్తుంటే, ఒక కొటేషన్ కనపడింది. టలూస్ వెళ్ళి కాస్సోలెట్ తినకుండా వస్తే పెద్ద త్యాగం చేసినట్లంట. కానీ దీనిని నేను,'లా రోటోండె వెళ్ళి కాస్సోలెట్ తినకుండా వస్తే అది పెద్ద త్యాగం' అని మార్చాలనుకున్నాను.

టలూస్ తిరిగి వచ్చాక, నాకు ఇంకొంచెం సమయం మిగిలి ఉంది. టలూస్‌లో ఏమి చేయాలో తెలియక పోతే, చేయవలసిందల్లా ప్లేస్ దు కాపిటోల్‌కి వెళ్ళటమే. నేను అదే చేశాను. టలూస్ చుట్టూ పక్కల మంచి ఏరో స్పేస్/ ఎయిర్ బస్ మ్యూజియంలు ఉన్నాయి. కాని వాటిని చూడటం, ఇంకోసారి ఇక్కడకు రావటానికి సాకుగా ఉంచేసుకున్నాను. బహుశా ఈసారి పిల్లలతో రావచ్చేమో వాటిని చూడడానికి.

టలూస్ రావటం కేవలం యాదృచ్ఛికం అయితే కూడా, అక్కడ ఏమి ఉంటుందో కూడా తెలియకుండా వెళ్లినందుకు నాకు ఎంతో సంతృప్తి కలిగింది. కార్కోసన్న్ వెళ్ళటం మరీ బాగుంది. కేవలం ఒక సహ యాత్రికురాలు సలహా మీద అప్పటికప్పుడు అనుకుని అక్కడకు వెళ్ళడం మంచిదియింది. కొన్నిసార్లు అంతే. జీవితంలో కూడా అనుకోకుండా జరిగేవి కొన్నిసార్లు అద్భుతమైన అనుభవాలుగా మిగిలిపోతాయి.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: జయశ్రీ అట్లూరి (స్టోక్ ఆన్ ట్రెంట్)
e-mail: jayasreeatluri@hotmail.com

# నాటక రంగంలో తుఫాను పడమటి గాలి

**- మిసిమి**



పాటిబండ్ల ఆనందరావు

*తెలుగు నాటక రంగంలో తుఫాను రేపింది, "పడమటి గాలి". నిజానికి పాతికేళ్ల క్రితం ఆ నాటకం ఒక సంచలనం.. నాశనమైపోతున్న పల్లెలను, ఆ పల్లెల్లోని అనుబంధాలను ముందే హెచ్చరించి మేలుకొలుపు పాడిన నాటకంగా "పడమటి గాలి" నాటకం గుర్తుండిపోతుంది.. ఆ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు బెంగుళూరులో ఇడమకంటి లక్ష్మీ రెడ్డి గారిని కలవడానికి వచ్చినప్పుడు "**మిసిమి**" వారిరువురినీ పలకరించింది. పన్నీటి జల్లులాంటి సంభాషణ వారితో చేసింది **మిసిమి** పత్రిక సంపాదకులు అశ్వినీ కుమార్, పాటిబండ్ల ఆనందరావుతో జరిపిన సంభాషణ తప్పకుండా **మిసిమి** పాఠకులకు నచ్చుతుంది. పడమటిగాలి ప్రత్యేకతతో పాటు నాటక రంగానికి సంబంధించిన అనేక అంశాలు వారిరువురి మధ్య చర్చకొచ్చాయి. ఆ సంభాషణలోని కొన్ని భాగాలు **మిసిమి** పాఠకుల కోసం.*

**మిసిమి :** **పాటి బండ్ల ఆనందరావు గారు నమస్కారం. మీరు రాసిన "పడమటి గాలి" ఈనాటికీ ప్రాసంగికత కలిగి ఉంది. మీరే ఉద్దేశంతో రాశారో కానీ ఒక కొత్త గాలిని మాత్రం ప్రవేశపెట్టారు తెలుగు నాటకరంగంపై. ఆ నాటకం మీరెందుకు రాశారసలు?**

**పాటిబండ్ల :** "పడమటిగాలి" నాటకం కన్నా ముందు పదిహేను సంవత్సరాల పాటు పరిషత్తు నాటకాలు రాశాను. ఇప్పటికీ కొంతమంది మీరు రాసిన "నిషిద్ధాక్షరి" బావుందండీ అని గుర్తు చేస్తుంటారు. దానికి చాలా పేరొచ్చింది. ప్రైజులొచ్చాయి కానీ, నాకెందుకో సంతృప్తి లేదు. ఏదో న్యాయనిర్ణేతల కోసం రాసినట్లు ఉంది కానీ, ప్రజలకు దగ్గరగా ప్రజల భాషలో లేదని నాకనిపించేది. ఇంకో కారణం, పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకలతో పోలిస్తే తెలుగు నాటక రంగం పరిషత్తు అనే మూసలో ఇరుక్కుపోయిందని.

**మిసిమి :** **ఆ మూసేమిటో చెప్పమంటారా ప్రజానాట్యమండలి!**

**పాటిబండ్ల :** (నవ్వుతూ) వాళ్ళనొదిలేద్దాం ప్రస్తుతానికి. ఏనాడో చెప్పారు మనకు, కావ్యాలు, కవిత్వం చదువు వచ్చినవారికోసమైతే, నాటకం పామరుల కోసమని.

**మిసిమి :** **రామాయణ, భారతాలు ఆవిధంగానే ప్రజల్లోకి వెళ్ళాయి.**

**పాటిబండ్ల :** అవునండీ. మీరన్నది నిజం. ప్రజల భాషలో, ప్రజలు కనెక్ట్ అయ్యే విధంగా నాటకం రాయాలని ఒక ఏడు సంవత్సరాలు వేరే నాటకాలేమీ రాయకుండా అన్వేషించాను.. తిరిగాను. బెంగాల్ వెళ్ళాను. మహారాష్ట్ర వెళ్ళాను. ఇలా అనేక ప్రాంతాల్లో నా అన్వేషణ సాగించాను. వాళ్ళకెందుకు జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తోంది. మనకెందుకు రావటం లేదు. ఈ అంశం మీద పరిశోధన చేశాను. నాకోసారి ప్రముఖ కథారచయిత డా.వి.చంద్రశేఖర రావు ఓ మాట చెప్పారు. ఆయన గిరీష్ కర్నాడ్‌ను కలిసి, మా తెలుగు నాటకంపై మీ అభిప్రాయం ఏమిటి అని అడిగారుట. ఏముంది మీ తెలుగు నాటకంలో అంటూ గిరీష్ కర్నాడ్ చాలా చులకనగా మాట్లాడారుట.. అదేమిటి సార్ అంటే మీ వాళ్ళే చెప్పారు, మా నాటక రంగం హీనస్థితిలో ఉందని అన్నారుట. అంటే మన నాటక రంగంలోని

పీఠాధిపతులు ఏం చేస్తారంటే.. తాము తప్ప తెలుగు నాటక రంగంలో లేరని ప్రచారం చేస్తారు.. తెలుగు నాటకం గురించి చెప్పరని అర్థమయింది.సెల్ఫ్ ప్రమోషన్ తప్ప, ఇక్కడి నాటకం గురించి చెప్పరు. నేను ఇతర భాషా నాటకాలను అధ్యయనం చేసిన తర్వాత నాకర్థమయింది ఏమిటంటే, అక్కడ గొప్ప నాటకాలు లేవు. గొప్ప ప్రయోక్తలు వున్నారు.. గొప్ప నాటక సంస్థలున్నాయి. ఇక్కడ నేను నాటకం రాస్తే, నేనే డైరెక్ట్ చేయాలి.. నేనే నటించాలి. కర్నాటకలో అలా కాదు. సినిమాకు ప్రొడ్యూసర్‌లా ఒక నాటక సంస్థ ఉంటుంది. దానికో రచయితను ఆ సంస్థ నియమిస్తుంది. అలాగే డైరెక్టర్‌ను, నటీనటులను కూడా. మనదగ్గర ఎలా ఉంటుందంటే రచయితలుంటారు కానీ, దర్శకులు లేరు. రచయితే దర్శకుడై, దర్శకుడిని మింగేసి, డైలాగులే నాటకం అన్నట్టు చేశారు. ఇతర రాష్ట్రాల్లో దర్శకుడే ప్రధానం. రచయిత కాదు. గిరీష్ కర్నాడ్ నాటకం అంటారు. ఇక్కడ రచయితే అష్టకష్టాలు పడుతుంటాడు. ఇలాంటి తేడాలను నేను గమనించాను.

*మిసిమి* : **నేను చెప్పింది కరెక్టండీ. ప్రజా నాట్యమండలి అలా అన్యాయం చేసింది. ఇతర నాటకాలను ఎదగనివ్వకుండా.. వాళ్ళే సినిమాల్లోకి వెళ్ళారు..**

**పాటిబండ్ల :** సినిమాను కూడా నాటకం చేసేశారు. రచయితలే దర్శకులవటం మనకు ప్రధాన లోపం. తర్వాత మనకు ప్రొడ్యూసర్లు లేరు. ప్రదర్శించేందుకు థియేటర్లు లేవు. మనకున్న రవీంద్రభారతిలో మైకులు సరిగా ఉండవు. అదే బెంగుళూరులో ఇరవై థియేటర్లు ఉన్నాయి. దాదాపు అన్నీ తిరిగి చూశాను. చక్కగా ఉన్నాయి. మన దగ్గర ఆ పరిస్థితికి కారణం, ప్రభుత్వానికి తగిన శ్రద్ధ లేకపోవడం..నాటక పెద్దలకు దాని గురించి పట్టకపోవడం. ఇక్కడ రంగాయన అనే ప్రదర్శనశాలలో నేను నాటకమాడాను. ప్రభుత్వం పదెకరాల స్థలం కేటాయిస్తే, చిన్న చిన్న థియేటర్లు కట్టారు. ఇది మూడవ పాయింట్. సరే మనమేం చేశాం అన్న ప్రశ్న వేసుకున్నాను. షోకేస్‌లో బొమ్మలా తెలుగు నాటకం గిడసబారిపోయింది. దానికి తోడు ఇతర రాష్ట్రాల నాటక పెద్దలు తెలుగు నాటకాన్ని చిన్న చూపు చూడటంతో నాకు రోషమొచ్చింది. బాధ కలిగింది.కన్యాశుల్కం కంటే గొప్ప నాటకం ఏ భాషలో ఉంది చెప్పండి.. తెలుగు నాటకానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రాకుండా పోవడం అనేది నన్ను బాధించింది.

రచయితలు పరిషత్తు పోటీల కోసం రాయటం, ముగ్గురు ఆర్టిస్ట్‌లు, ఒక లేడీ ఆర్టిస్ట్.. బహుమతే లక్ష్యంగా, జడ్జీలను మెప్పించే వలయంలో తెలుగు నాటకం మిగిలిపోయింది. ఈ దుస్థితికి కారణం పరిషత్తులు కూడా అని అనిపించింది.

*మిసిమి* : **ఒకవిధంగా చెప్పాలంటే ప్రజా నాట్యమండలిని పరిషత్తు రీప్లేస్ చేసింది.**

**పాటిబండ్ల :** ఈ పరిస్థితిని వివరిస్తూ "పోటీ నాటకం" అనే వ్యాసం రాశాను.మూడు అకాడమీల వారు దాన్ని ప్రచురించారు. ఇవన్నీ చెప్పడం కాదు. ఈ లోపాన్ని సరిదిద్దటం ఎలా అని ఆలోచించాను. మనకు కనిపించే జీవితం ఉంది. మానవత ఎలా శిథిలమైపోతోందో నేను ప్రత్యక్షంగా చూశాను. పల్లె ఎలా పరాయీకరణ చెందుతుంది, ఈజీ మనీ యావలో యువత ఎలా పక్కదారులు పడుతోంది. ఈ యావలో మానవ సంబంధాలు ఎలా ఛిద్రం అవుతున్నాయి, అన్నదమ్ముల మధ్య విభేదాలు ఎలా పెరుగుతున్నాయి, ప్రాణ స్నేహితులు ఎలా విరోధులవుతున్నారు, తల్లీ బిడ్డల మధ్య పొరపొచ్చాలు ఎలా వస్తున్నాయి..ఇవన్నీ చెప్పాలనిపించింది. నేను పల్లె నుంచి వచ్చిన వాడినే. వ్యవసాయ కూలీగా మొదలుపెట్టి తరువాతి కాలంలో వ్యవసాయం చేసినవాడినే. ఒకప్పుడు పాలు, పెరుగు, కూరగాయలు, కోడిగుడ్లు పల్లె నుంచి పట్నానికి మోసుకుపోవడం చూసినవాడిని. ఇవాళ అవన్నీ పట్నం నుంచి పల్లెకు వస్తున్నాయవి అమ్మకం కోసం. ఇవాళ కోడిగుడ్డు దొరకని పరిస్థితి పల్లెది. ఇరవై ఏడేళ్ల క్రితం నాటకం రాసినప్పుడు కరెంట్ సరిగ్గా ఉండేది కాదు.

*మిసిమి* : **ఆ విషయానికి మళ్ళీ వద్దాం. ఇప్పుడు నాటక రంగంలో మూడు సమస్యలు లేదా మూడు కొరతలు గుర్తించాం. తర్వాత ఏ అంశాన్ని నాటకంగా మలచాలో కూడా గుర్తించాం. థియేటర్లు లేవన్నారు. అది తర్వాత డిస్కస్ చేద్దాం. మీ సబ్జెక్టు ఏం తీసుకున్నారో అది చెప్పండిపుడు.**

**పాటిబండ్ల :** నా కళ్ళెదుట కనిపించే గ్రామంలో మంచినీళ్ళు దొరక్కపోయినా మందు దొరుకుతుంది. మంచినీళ్ళు కూడా సీసాల్లో అమ్ముతారు. కరెంట్ లేకపోయినా ఎలక్ట్రానిక్ గూడ్స్ ఉధృతంగా అమ్మేవారప్పుడు. అలా అవి పల్లె ప్రజానీకాన్ని ముంచెత్తాయి. రైతు తనకిష్టమైన పంట వేసుకోలేకపోతున్నాడు. అవసరం లేకపోయినా వస్తువులను కొనిపిస్తున్నారు. ఆహారధాన్యాల పంటలు పోయి, వాణిజ్య పంటలొచ్చేశాయి.వ్యవసాయం జుదంగా మారింది. ఇవన్నీ చూసిన తర్వాత, శతాబ్ది ముగింపు దశలో ఉన్న ఒక గ్రామాన్ని ఎంచుకున్నాను. నేను చూసిన మనుషులు, నేను తిరిగిన గ్రామాలు, రైతులు, రైతుకూలీలు, మానవ సంబంధాలు వీటి వెనకున్న రాజకీయాలు, కనపడని అదృశ్య హస్తం.. ఇలా ఇవన్నీ పరిశీలించి, ప్రజల జీవితాలను, ప్రజల భాషలో చెప్పే ప్రయత్నం చేశాను.

**మిసిమి :** **దీంట్లో ఓ సెటైర్ ఉంటుంది కదా..**

**పాటిబండ్ల :** మీరు చెప్పింది రచ్చబండ గురించి కదా.

**మిసిమి :** **ఆ సెటైర్ లేకపోతే నాటకం పండదు.**

**పాటిబండ్ల :** నేను గ్రామానికి ఓ కేన్వాసు వేసుకున్నాను. ప్రతి గ్రామానికీ రచ్చబండ ఉంటుంది. ఇవాళ ట్రెండ్ ఏమిటంటే గ్రామంలో అక్కడో పదిమంది ఉంటారు. ఎవరి గ్రూప్ వాడిదే. ఎవడి స్వలాభం వాడిదే. అన్నీ పంచుకోవటమే. మీరు ఫలానా దానికి మీ కులపోడిని తెచ్చుకోండి. మేము ఫలానా దానికి మా కులపోడిని తెచ్చుకుంటాం. ఇదెవరో కాదు అక్కడున్న యువతే వీరంతా. దీనికి మౌలికంగా మూలాలెక్కడున్నాయని ఆలోచించినప్పుడు ఎవడో ఎక్కడో సప్త సముద్రాల అవతల, వాడి బుర్రలో ఒక వ్యాపార ఆలోచన మెదిలితే, దానికి ఒక పల్లె తల్లి గుండె చప్పుడు మారింది, చేను చెంప చెమ్మగిల్లింది.. వాడి ఉత్పత్తుల కోసం, ఒక కన్స్యూమర్‌గా మనిషెట్లా మారిపోతున్నాడో కదా అనిపించింది. వాడే లోన్లు ఇస్తాడు, వాడే కొనిపిస్తాడు, వాడే తాకట్టుపెట్టుకుని లాగేసుకుంటాడు! ఎవడో వచ్చి మన పొలమెందుకు కొంటున్నాడు! సరే ఈ వ్యూహం తెలియనివాడై ఉంటాడు అనుకుందాం.. ఈ ఈజీ మనీ ప్రవాహంలో దీనికి భిన్నమైన వ్యక్తులు కూడా ఉండాలి కదా..అలాంటి ఒక సన్నకారు రైతుని కేంద్రంగా తీసుకుని, నేనీ నాటకం చెప్పాలనుకున్నాను. ఈరకమైన నేపథ్యం ఉన్న గ్రామంలో, రాజకీయాలతో మనుషులెలా పొల్యూట్ అయిపోయారో చెప్పాలనుకున్నాను. మళ్ళీ కథకొస్తే ఈ దశలో ఆ ఊరికో పొలిటికల్ ఏజెంట్ వస్తాడు. వెంట ఒక ఇష్యూని తెస్తాడు. అదేంటంటే , ఆ ఊళ్ళో ఉన్న భూస్వామిని కలిసి, ఒక యాభై ఎకరాల భూమిని అమ్మకానికి అడుగుతాడు. ఇక్కడో పెద్ద పెస్టిసైడ్ పెట్టాలనుకుంటున్నారు కొంతమంది పెద్దవాళ్ళు. వారిలో ఎమ్.పి.లు, ఇతర పెద్దలు ఉన్నారు. మొత్తం సౌతిండియాలోనే పెద్ద కంపెనీ అవుతుందది. ఓ రెండొందల కోట్ల పెట్టుబడితో నిర్మిస్తారని ఊరిస్తాడు. ఆ భూమి చూపిస్తే మీ కమీషన్ మీది, నా కమీషన్ నాదని నమ్మబలుకుతాడు. వాడికి హైవే ఎదురుగా ఒక యాభై ఎకరాల భూమి కావాలి. కన్యాశుల్కంలోని గిరీశం లాంటి ఓ దళారీ ఉంటాడు. దళారీ వ్యవస్థ ఎలా బలపడిందో కూడా ఈ నాటకంలో చూపటం జరుగుతుంది. దానిలో నాలుగు ఎకరాలు.. ఇంతకు ముందు చెప్పిన బక్క రైతువి. అతని పేరు రాంకోటి. ఆ రాంకోటికి చెట్టూ, నేల అంటే ప్రాణం. ఆ పొలంలో రెండు వేపచెట్లుంటాయి. ఒకటి మా అమ్మ, ఇంకోటి మా అయ్యా అని మురిసిపోతూ, ఆ చెట్ల కిందే కూసుంటాడు. మట్టికీ, చెట్టుకు రక్తసంబంధాన్ని పెంచుకున్నవాడు. ప్రకృతికి, మనిషికీ వచ్చిన గ్యాప్‌ని నేను సోల్‌గా తీసుకున్నాను. ఆ రాంకోటి తన భూమిని అమ్మడు. ఇది కాన్ఫ్లిక్ట్ పాయింట్..

**మిసిమి :** **మీరు సబ్జెక్టు రాసుకున్నారు. ఎంతమంది ఆర్టిస్ట్‌లు ఈ నాటకంలో పాల్గొన్నారు?**

**పాటిబండ్ల :** మొత్తం ముప్పై రెండు మంది నటీనటులు ఉన్నారు. పధ్నాలుగు జిల్లాల నుంచి వాళ్ళని తీసుకొచ్చాను. ఇంకో ముప్పై రెండు మంది టెక్నీషియన్స్ ఉన్నారు.

**మిసిమి :** **వీరందరితో రిహార్సల్స్ చేయించటం అదీ, ఖర్చుతో కూడుకున్న పనికదా..**

**పాటిబండ్ల :** తొంభై తొమ్మిదివ సంవత్సరంలో, వీరితో ఆర్నెల్లు రిహార్సల్స్ చేయించాను.

**మిసిమి :** **మీకెవరూ ప్రొడ్యూసర్ లేరుకదా.. వీరినెవరు పోషించారు..**

**పాటిబండ్ల :** మీరన్నది నిజమే. ఎవరూ లేరు. ఒక ఉన్మాదం అనండి, పిచ్చి అనండి.. అలా చేసుకుంటూ వెళ్ళిపోయాను. ఇది ఐదుగంటల పాటు సాగే నాటకం. ఇద్దరికీ వినిపించాను. వారిలో ఒకరు కె.ఎస్.టి.సాయి. బాపట్లలో ఉండేవారు. వారు నాటకానికి ముందు మాట కూడా రాశారు. ఈ నాటకాన్ని ఐదు గంటలూ చూస్తారు. దీన్ని ఎడిట్ చేయకుండా ప్రదర్శించండి అని చెప్పారాయన. మరొకాయన జి.కల్యాణరావు. అంటరాని వసంతం నవల రాశాడాయన. ఆయన ఏమన్నారంటే, ఆనందరావు.. నువు మొత్తం నాటకం ఒకరోజు ఆడే శక్తి లేకపోతే రెండో రోజు ఆడు.. మాకు చూడడానికి ఇబ్బంది లేదు.. అంతేకాని నాటకాన్ని పాడు చేయకు అన్నాడు..నా నమ్మకం ఏమిటంటే ఐదు గంటల నాటకం చూస్తారనే.. నేనిలా అంటే..అలా నువ్వెలా నమ్మావు అని ప్రశ్నించినవారున్నారు.

నా అదృష్టం ఏమిటంటే, నా ఆర్టిస్ట్ లెవరూ మమ్మల్ని మీరే పోషించాలి అనలేదు. బుచ్చయ్య చౌదరి అనే ఆర్టిస్ట్, వీరన్న పాలెం నుంచి వచ్చేవాడు. ఆయన తన ఖర్చులు పెట్టుకుని వచ్చేవాడు. అలాగే కందుకూరు దగ్గరున్న ఉంగుటూరు పాలెం నుంచి మరొకతను వచ్చేవాడు. అతను నా దగ్గర ఎప్పుడూ డబ్బులు తీసుకునేవాడు కాదు. ఇలా అందరూ కోపరేట్ చేశారు. ఈ నాటకం మనం చేయాలన్న కమిట్మెంట్ ఈ నాటకం వారిలో కలిగించింది. రిహార్సల్స్ సాయంత్రం స్కూల్ అయ్యాక చేసేవారం. ఎవరొస్తే వారితో చేసేవారం, మిగిలిన కేరక్టర్స్ డమ్మీలు చదివేవారు నాటకం రిహార్సల్స్ పూర్తిగా అయ్యాక నాకు తెలిసింది, ఈ రిహార్సల్స్ సమయంలో ఎంత ఖర్చు అయింది, ఎంత అప్పు చేశామో. ఒకరోజున నా భార్యను, పిల్లలను దగ్గర కూర్చోబెట్టుకుని చెప్పాను (పిల్లల్లో ఒకడు కాలేజీ చదువుకు వచ్చాడు, ఇంకోడు హైస్కూల్‌లో ఉన్నాడు).. అప్పుడు నాకు ఆస్తి అని చెప్పాలంటే కడుతున్న ఇల్లొకటే ఉంది. అది అమ్మేస్తానని చెప్పాను. ఎందుకంటే నాటకం ఆపడానికి వీల్లేదని చెప్పాను. వాళ్ళు కూడా నీ ఇష్టం అన్నారు. ఆ కడుతున్న ఇల్లు అమ్మేసి, అప్పులు తీర్చి, మిగిలిన డబ్బులు నాటకానికి ఖర్చు పెట్టాను. దీంట్లో ఒక మంచి విషయమేమిటంటే, వ్యక్తిగా.. ఉపాధ్యాయుడిగా నాకు మంచి పేరుంది. నాకు ఒంగోలులో ట్యుటోరియల్స్ నడిపే కొంత మంది మిత్రులు ఉన్నారు. వాళ్ళకీ నాటకం గొడవ లేదు. నాటకం గురించి తెలీదు.. ఇట్లా కొంత డబ్బు అవసరం అనగానే, ఐదుగురు మిత్రులు, ఆ మిగిలిన డబ్బు సర్దుబాటు చేశారు. రిహార్సల్స్ చేస్తున్నప్పుడు రచ్చబండ సీన్ కోసం మా ఊరు కందులూరులో అచ్చంగా రచ్చబండ దగ్గరకు వచ్చే పది, పదిహేను మందిని పోగేసి రిహార్సల్స్ చేయించా తర్వాత మెయిన్ రిహార్సల్స్ అప్పుడు వీరిని కలిపితే మావాళ్ళకు నచ్చలా. వీళ్ళకు డిక్షన్ లేదు.. ట్రైనింగ్ లేదు. మెయిన్ నాటకంలో వీళ్ళెలా ఉంటారో అన్న అనుమానం వ్యక్తం చేశారు. రచ్చబండ సీన్‌లో చేసేవారందరిలోని గందరగోళం, పద్ధతిగా లేకపోవటం వలనే సీన్ పండుతోంది. వాళ్ళు నాటకంలో డైలాగ్ చెప్పినట్లు చెప్పరు.. వాళ్ళ "రా" గా మాట్లాడే విధానమే పండుతుంది అని చెప్పినప్పుడు వాళ్ళు కన్విన్స్ అయ్యారు. నాటకం వ్యవధి నాలుగు గంటల ముప్పై నిమిషాలని తేలింది. మూడు రోజుల పాటు వరుసగా నాటకం ఆడాలని నిర్ణయించుకున్నాం. టికెట్ లేకుండా ప్రదర్శించకూడదు. మేము చేసిన ఒక ఎక్స్పెరిమెంట్ ఏమిటంటే ఒక హాలులో మేధావులను, ప్రెస్ వారిని కూర్చోబెట్టి నాటకంలోని కొన్ని దృశ్యాలను ప్రదర్శించాం. దీనిని లైవ్ ట్రెయిలర్ అని చెప్పుకోవచ్చు. ఆ లైవ్ ట్రెయిలర్ చూసినవారంతా మెచ్చుకోవటం మాకు ధైర్యాన్నిచ్చింది

**మిసిమి :** **నాటకానికి ఎంత ఖర్చయింది?**

**పాటిబండ్ల :** రిహార్సల్స్ నుండి మొదటి ప్రదర్శన వరకు ఐదు లక్షలు ఖర్చయింది.ఇక నాలుగు రోజులుంది ప్రదర్శన అనగా కామెడీ రోల్ వేసే అతను జబ్బు బారిన పడ్డాడు.. స్పృహ తప్పున్నాడు. నాకు తెలిసిన డాక్టర్‌కు చూపిస్తే ఆయన షాక్ ఇచ్చాడు. ఆనందరావు, ఈ కుర్రాడు ఇప్పుడు నాటకంలో వేస్తే పోతాడయ్యా అన్నాడు. ఏదైతే అయిందని, నేను ఆ పాత్ర వేయటానికి సిద్ధపడ్డాను. ఈలోగా నాకు షుగర్ డౌనై నేను అవస్థపడ్డాను. ఇంట్లోవాళ్ళు, నాటకంలో వేసే నటులు అన్నమనేని ప్రసాద్ తదితరులు ఇప్పుడు నాటకం

వద్దని నాకు మా బావమరిది చేత చెప్పించారు. నేను చెప్పానపుడు.. ఇప్పుడు నాటకం ఆపితే నేను పోతానని.. ఇలా ఇన్ని టెన్షన్ల మధ్య సురభి నాటక సంస్థ చేత బొమ్మలు గీయించి సెట్స్ రూపొందించాను. చక్కటి డయాస్ తయారుచేయించాను. కామెడీ వేషానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకున్నాను. ఇంకో విషయమేమిటంటే, రిహార్సల్స్ చేశాం కానీ ఏ వేషం ఎప్పుడొస్తుందో ఎవరికి తెలియదు. కారణ మేమిటంటే మొత్తం నాటకం ఒకేసారి రిహార్సల్స్ చేయలేదు.

**మిసిమి :** **మొదటి ప్రదర్శన ఎప్పుడు, ఎక్కడ జరిగింది?**

**పాటిబండ్ల :** ఒంగోలులో మొదటిసారి 1999 డిసెంబర్ 27, నీ మొదటి షో, 28న రెండో షో, 29న మూడో షో వేశాం. ఒకే నాటకం మూడు రోజుల పాటు చూస్తారా అని మా వాళ్ళకనుమానం.. స్పాన్సర్స్ ఉన్నారు కదా..వారి కాలేజీలో పిల్లలను తీసుకొందామని ప్రపోజల్ పెట్టారు. అలాంటి అవసరముండదని నేను గట్టిగా వాదించాను. అలాగే నాటకం చూడటం కోసం టికెట్ కంపల్సరీ చేశాను. షో సాయంత్రం అనగా మధ్యాహ్నం వర్షం కురిసింది. కర్టెన్లు అవీ విప్పేసి ఓ మూల షెడ్‌లో దాచేశాం. అవి తడిస్తే మళ్ళీ పనికి రావు. జనం అలాగే కూచొని ఉన్నారు. రాత్రి పదిగంటలకు మొదలు పెట్టి నాటకమాడాం.. మొదటి రోజు టెన్షన్‌గా ముగిసినా తెల్లారాక చూస్తే మా నాటకం ఓ సంచలనం.. మా నాటకం గురించి ఊరంతా చెప్పుకున్నారు. వెయ్యి కుర్చీలేస్తే ఏడొందల యాభై టికెట్లను అమ్మగలిగాం.. రెండో రోజు ఫుల్ అయింది. ఆర్టిస్టులంతా మేకప్ వేసుకుంటుంటే అందరిలోనూ ఉత్సాహం, ఆనందం. వాళ్ళకున్న అనుమానాలన్నీ పోయాయి. డైలాగులు రావు, డిక్షన్ రాదనుకున్న రచ్చబండ నటులను చూసి జనాలు కేరింతలు కొట్టారు. ఈనాటకంలో బుచ్చయ్య తాత అని ఓ కేరక్టర్ ఉంటుంది. చివరి దాకా ఒకే డైలాగ్ చెబుతుంది.. నేనో మాట చెబుతాను వినండ్రా అంటుంది. యెహె పోవోయ్ అని ఎవరూ వినరు. చివర్లో ఏందే తాతా నీ గోల. అంటారు..నా మాట విన్నప్పుడు నేనెందుకురా ఇక్కడ..మీ చావు మీరు చావండి అంటాడు .. అని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుని వెళ్ళిపోతాడు. ఇది స్క్రిప్ట్‌లో చదివి వినిపించినప్పుడు నాగభైరవ కోటేశ్వరరావు గారు ఏడ్చాడు.. ఒక్కసారి ఆ బుచ్చయ్య తాత వేషంలో నన్ను కూచోబెట్టు అని రిక్వెస్ట్ చేశాడు. రెండోరోజు ప్రదర్శన విజయవంతం కావడంతో మా ఆర్టిస్ట్‌లందరూ ఆనందంతో స్వీట్స్ పంచుకున్నారు.. మూడోరోజు ముచ్చటేంటంటే టంగుటూరు టొబాకో డీలర్లందరూ కార్లేసుకొచ్చారు. మన గుట్టంతా బయటపెట్టేస్తున్నాడంట ఆనందరావు, చూద్దాం పదండని..నాటకం వేసిన స్ట్రీట్ అంతా ట్రాఫిక్ జామ్ అయింది. ఊళ్ళో పెద్దలందరూ వచ్చారు. వాళ్ళకి సీట్లు చూపించడానికి మా టీం ఉండేది. ఛైర్మన్, కమీషనర్లను కూచోబెట్టడానికి అరగంట పట్టింది. ఆ తర్వాత చీమకుర్తి, కనిగిరి, అద్దంకిలలో ఆడాం. హైదరబాద్‌లో వారం రోజుల పాటు నాటకం ఆడాలని రవీంద్రభారతి హాల్ కోసం వచ్చాను. అప్పుడు సినీనటుడు నూతన్ ప్రసాద్ ఇన్చార్జిగా, హాల్ అలాట్మెంట్ చూస్తుండేవారు. నన్ను, నా అవతారాన్ని చూసి అనుమానపడ్డాడాయన. తప్పేమీలేదు. భుజానికో సంచి, మామూలు పేటెంట్, షర్ట్.. ఇదీ నా అవతారం.. నువ్వు ఐదురోజులు నాటకం టికెట్ పెట్టి ఆడతావా? ఐదింటికే మొదలు పెడతావా అని ఎగాదిగా చూశాడు. చివరికి మినిస్టర్ శివప్రసాద్ గారితో చెప్పించాల్సి వచ్చింది.అప్పుడు కానీ ఇవ్వలేదు ఫైనల్‌గా దిగ్విజయంగా నాటక ప్రదర్శన చేశాం.. అది వేరే విషయం..

**మిసిమి :** **మొత్తం ఎన్ని ప్రదర్శనలు ఇచ్చారు.. ఎపుడైనా ఒక ఆర్టిస్టు మిస్సయ్యితే మీ పరిస్థితి ఏమిటి?**

**పాటిబండ్ల :** నూటయాభై ప్రదర్శనలు ఇచ్చాం.. ఒక్కసారి కూడా ఫలానా ఆర్టిస్ట్ లేదు అనే మాట లేకుండా. ఒకవేళ ఒక ఆర్టిస్టు లేకపోతే ఆ ప్రదర్శన ఉండదు. అప్పటికప్పుడు స్టాండ్ బై ఆర్టిస్టలతో నడిచే నాటకం కాదు "పడమటి గాలి". ఒకసారి ఖమ్మంలో ఆ సమస్య తలెత్తితే నాటక ప్రదర్శన కేన్సిల్ చేసి, మరో డేట్ అనౌన్స్ చేసి నాటకం ఆడాం. మీరింతకు మునుపు ఖర్చు గురించి అడిగారు. మూడురోజులు నాటకమాడితే మూడు లక్షలు ఖర్చయ్యేది ఆరోజుల్లో. అదే ఒక్క రోజాడితే రెండు లక్షలు. ఈ నాటకం గురించి అసెంబ్లీలో చర్చ జరిగింది.. అదో సంచలనం అప్పుడు.

***మిసిమి :*** **ఢిల్లీలో ఈ నాటకం ఆడారా?**

**పాటిబండ్ల :** ఢిల్లీలో మూడు రోజుల పాటు నాటకమాడాం. మహారాష్ట్ర వారి థియేటర్‌లో. హాల్ పూర్తిగా లభించక ఒకేరోజు రెండు సార్లు ఆడాం.. పొద్దున పదింటికి, మళ్ళీ సాయంత్రం.. అలా పాతిక సంవత్సరాల్లో నూటా ఏభై ప్రదర్శనలు ఇచ్చాం..

***మిసిమి :*** **పాతికేళ్ళు..నూట యాభై ప్రదర్శనలు.. ఇల్లు కట్టుకున్నారా లేదా?**

**పాటిబండ్ల :** మొదటి పది ప్రదర్శనలు నష్టంతో నడిపాం నాటకాన్ని కానీ, ఆ తర్వాత కొంచెం కొంచెం పుంజుకున్నాం.. ఆర్టిస్ట్‌లకు డబ్బులివ్వగలిగాను. ఎప్పుడయితే పాపులారిటీ వచ్చిందో, ఐయ్యేఎస్ ఆఫీసర్లు బలరామయ్య గారు, కె.వి.రమణాచారి గారు, విద్యాసాగర్ గారు, సాంస్కృతిక శాఖ సంచాలకులుగా చేసిన విజయ్ భాస్కర్ గారు .. వీరంతా ప్రోత్సహించారు. మా నాటకాన్ని పాతికమంది ఐయ్యేఎస్ అధికారులు తిలకించారని చెప్పటానికి సంతోషపడతాను. ఈ పెద్దలంతా ఆయా జిల్లాల కలెక్టర్లకు చెప్పటంతో, ఆ కలెక్టర్లందరూ మా నాటకాన్ని స్పాన్సర్ చేశారు. అంటే ఖర్చంతా ప్రభుత్వం భరించింది. రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు, రైతుల సమస్యలు తెలియచెప్పే నాటకంగా ప్రభుత్వం గుర్తించింది. ఈ సపోర్ట్ రావటానికి అరవై ప్రదర్శనలు వేయాల్సి వచ్చింది.. విజయనగరం కలెక్టర్ బి.వెంకటేశ్వరరావు నాటకం చూసి నాకు ఫోన్ చేశారు. ఎక్కడికి అనుకున్నారు! మేమున్న లాడ్జికి. లాడ్జ్ ఓనర్ పరిగెత్తుకుంటూ వచ్చాడు. కలెక్టర్ గారు ఫోన్ అంటూ.. కలెక్టర్ గారు అరగంట మాట్లాడాడు. ఆయన అన్న మాట మర్చిపోలేను.. నేనిక్కడ ఉన్న ఒక సంవత్సరంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఒకటేమిటంటే మీ నాటక ప్రదర్శన ఏర్పాటు చేయటం అని ఆనందంగా చెప్పాడు.. ఇది చాలు కదా.. మళ్ళీ మేం వెళ్ళేరోజు ఇంకోసారి మా నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు వారు.

***మిసిమి :*** **ఈ నూట ఏభై ప్రదర్శనలు మొత్తం నాలుగు గంటలపాటు ఆడారా ?**

**పాటిబండ్ల :** ఆడాం సార్.. ఒక్క రోజు కూడా నాటకం తగ్గించి ఆడలేదు.

***మిసిమి :*** **ఇంతకీ ఇల్లు కట్టుకున్నారా లేదా?**

**పాటిబండ్ల :** హైదరాబాద్‌లో ఇస్తామన్నారు కానీ, వద్దని ఒంగోలులో కట్టుకున్నాను. నా నాటకం నాకు ఇల్లు ఇచ్చిందని నిరూపించాను. గవర్నమెంట్ నాటకాన్ని స్పాన్సర్ చేయడం మొదలు పెట్టాక నాకు డబ్బులు మిగిలాయి. నాటకం మనల్ని నష్టపెట్టదు. మన వ్యక్తిగత బలహీనతలు మనలను నష్టపరుస్తాయి.

***మిసిమి :*** **చివరి సారిగా ఎక్కడాడారు?**

**పాటిబండ్ల :** నూట ఏభయ్యవ ప్రదర్శన ఒంగోలులోనే ఆడాం. రెండు స్టేజీల మీద నాటకాన్ని ఆడాం. ఎన్టీఆర్ కళా పరిషత్తులో మూడు, నాలుగు స్టేజీలు వరుసగా వేస్తారు. ఒక సీన్ ఈ స్టేజి మీద ఆడితే, ఇంకో సీన్ పక్క స్టేజ్ మీద ఆడతారు. దానివలన నాటకంలో స్పీడొస్తుంది. మేం ఒక స్టేజీ మీద నాటకం వేసినప్పుడు కూడా సెకండ్లలో సీన్ సెట్ మారిపోయేది.

***మిసిమి :*** **ఈ నాటకాన్ని వీడియో చేశారా! ఇంత విజయవంతమైన నాటకాన్ని సినిమా తీస్తామని ఎవరూ రాలేదా?**

**పాటిబండ్ల :** బలరామయ్య గారు, ఈ మొత్తం నాటకాన్ని వీడియో తీయించారు.. రవీంద్రభారతిలో నాటకం ఆడినప్పుడు, ఐదో రోజున సినిమా వాళ్ళందరూ వచ్చారు. దాసరి నారాయణరావు, పరుచూరి బ్రదర్స్, డివి నరసరాజు, నూతన్ ప్రసాద్ అందరూ ఉన్నారు.. పూర్తిగా చూశారు. నాటకం అయ్యాక నూతన్ ప్రసాద్ స్టేజ్ మీద అనౌన్స్ చేశాడు. రెండు నెలల తర్వాత, వరుసగా నెల రోజుల పాటు ఈ నాటకాన్ని ప్రదర్శించటానికి రవీంద్రభారతినిస్తామని చెప్పాడు. దాసరి నారాయణరావు గారు మొత్తం ఐదుగంటల పాటు కదలకుండా, ఇంటర్వెల్‌లో కూడా లేవకుండా కూర్చుని చూశారు. అసలు నాలుగున్నర గంటల తర్వాత కూడా జనం లేవకుండా కూర్చుంటారు.. అది గొప్ప విశేషమండీ. నాటకం తర్వాత దాసరి నారాయణరావు అందరికీ, ముఖ్యంగా ఒక లేడీ ఆర్టిస్ట్‌కు పాదాభివందనం చేశారు. ఆవిడ నాటకంలో కీలక పాత్ర.. ఆ తర్వాత ఆయన ఇరవై మూడు నిముషాలు మాట్లాడారు. అప్పుడు చంద్రబాబు

నాయుడు గారు ముఖ్య మంత్రిగా ఉన్నారు.. ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ నాటకాన్ని ఊరూరా ప్రదర్శింప చేయండి అని.. అలాగే ఆనందరావు పర్మిషన్ ఇస్తే, ఈ నాటకం సినీమాగా తీసి జాతీయ స్థాయిలో ఉత్తమ సినిమా అవార్డు తీసుకొస్తానని ప్రకటన చేశారు. దివాకర బాబు, భరణి, పరుచూరి వెంకటేశ్వరరావు.. ఇది మా నాటకమని గర్వంగా నిలబడ్డారు. సినిమావాళ్ళంతా డబ్బులిచ్చారు. తెల్లవారి చెప్పాడు పరుచూరి వెంకటేశ్వరరావు, నేను మిమ్మల్ని రామానాయుడు దగ్గరకు తీసుకెళదామనుకున్నాను.. కానీ దాసరి నారాయణరావు ప్రకటించేశాడు.. నేనేమీ చేయలేను అన్నాడు. నిజానికి నా దృష్టి పడమటి గాలి నాటకం వంద ప్రదర్శనలివ్వటం మీదే ఉంది. సినిమా మీద నాకు మోజు లేదు. సినిమాగా తీయటం నాకు ముఖ్యం కాదు.. సినిమా వారిని పరిచయం చేయటంలో నాకు నాటక రచయిత పూసల నాకు చాలా సహాయం చేశాడు. నన్ను అందరి దగ్గరకూ తీసుకెళ్ళి పరిచయం చేశాడు. ఒకసారి దాసరి నారాయణరావు గారు రమ్మంటున్నారని ఒంగోలు వచ్చి నన్ను తీసుకు వెళ్ళాడు హైదరాబాద్. కానీ ఆరోజు ఆయన వేరే పనిలో ఉండటం వలన కలవటం కుదరలేదు.. ఆయనకు తీయటం కుదరక మోహన్ బాబు గారికి చెప్పాడు. ఆ ప్రయత్నం కూడా అవలేదు. ఈలోగా నటుడు రాజేంద్రప్రసాద్ నేను ఈ నాటకం సినిమా తీస్తే వేషం వేస్తాను అని అడిగాడు. మళ్ళీ దాసరి నారాయణరావు గారిని నాలుగేళ్ల తర్వాత ఇదే నాటకానికి ఆహ్వానిస్తే ఆయన కోప్పడ్డాడు. నేను చెప్పాను ఆయనకు. నాకు పడమటి గాలి నాటకం వంద ప్రదర్శనలు ఆడటం నాకు ముఖ్యం సార్, సినిమా తీయటం కాదు అని చెప్పాను.. వంద ప్రదర్శనల తర్వాత సినిమాగా తీయటం ఆయనకు కుదర్లేదు. మధ్యలో రాంగోపాల్ వర్మ మేనమామ మధు మంతెన ఆయన ముందుకొచ్చాడు తీస్తానని.. కానీ ఇవేవీ కార్యరూపం దాల్చలేదు..అందుకు నాకు బాధా లేదు..

***మిసిమి :*** **పడమటి గాలి తర్వాత ఏమైనా రాశారా!**

**పాటిబండ్ల :** హంస గీతం అనే నాటకం రాశాను. అది బుద్ధుడి మీద రాసిన నాటకం. నేను బుద్ధిస్టు అవటం కారణం..అది కూడా నాలుగు గంటల నాటకం.కానీ ఫెయిల్ అయింది ఆ నాటకం.

***మిసిమి :*** **మీకు నచ్చిన ఇతర నాటకాలు చెప్పండి?**

**పాటిబండ్ల :** "రాయి" అని ఒక నాటకం చూశాను.. బావుంది. వైజాగ్ వాళ్ళది. ఆ రచయిత పేరు సత్యనారాయణ అనుకుంటాను. బెంగాలీ నాటకం ఇన్స్పిరేషన్ అనిపించింది. మరొకటి వై.ఎస్.కృష్ణేశ్వరరావు రాసిన "పక్కింట్లో పుట్టండి" నాటకం.

***మిసిమి :*** **రాజకీయ వాసనలు లేకుండా కుటుంబ నేపథ్యంతో ఉన్న నాటకం చూశారా?**

**పాటిబండ్ల :** ప్రస్తుతం వస్తున్న నాటకాలన్నీ ఆ కోవకు చెందినవే. గ్లోబలైజేషన్ తరువాత నాటకాలన్నీ కుటుంబ బంధాలను ఆధారం చేసుకుని వస్తున్నవే.మళ్ళీ ఇవికూడా మూసలోకి వెళ్ళిపోయాయి..

***మిసిమి :*** **మీ నాటకానికి పడమటి గాలి అని ఎందుకు పెట్టారు?**

**పాటిబండ్ల :** అమెరికాలో ఒక వ్యాపారవేత్త, సౌతిండియాలో ఒక పెస్టిసైడ్ ప్లాంట్ పెడదామనుకున్నాడు ..అందుకు ఎవరి అవసరం ఉందో, వారందరినీ పట్టుకున్నాడు అలా "పడమటి గాలి" వీచి మన వ్యవసాయాన్ని, కుటుంబాలను నాశనం చేసిందని చెప్పటానికే ఆ టైటిల్ ఎంచుకున్నది.

***మిసిమి :*** **మీరు మిసిమి చదువుతారా?**

**పాటిబండ్ల :** తప్పకుండా చదువుతాను..***మిసిమి*** నాకిష్టమైన పత్రిక. నేను బుద్ధిస్ట్ అవటం వలన కూడా నాకు ***మిసిమి*** అంటే ఎంతో ఇష్టం.దాని మూలాలు కూడా అవే అని నమ్ముతాను.

***మిసిమి*** ధన్యవాదాలు పాటిబండ్ల ఆనందరావు గారు.

**పాటిబండ్ల :** ధన్యవాదాలు అశ్విని కుమార్ గారూ.

***- చెన్నూరి సీతా రాంబాబు (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***



# చీకటి



– ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి

వివిధభాషల్లో రచనలు నదుల్లా మహాసముద్రంలో కలిసిపోతున్నాయి. సవిశాలంగా ఏర్పడిన ఆ సాహిత్య సాగరానికి అంతు కానరావడంలేదు. రోజురోజుకి సాహిత్యవరద పోటెత్తుతూనే ఉంది. ఆ మహాసాగరం తుఫానులనేమి లెక్కచేయడంలేదు. ఆ మహాసముద్రంలో నా నావ ఎక్కడుందో తెలియడంలేదు. ప్రయాణం మాత్రం కొనసాగుతుంది. పగలైతే కనుచూపు మేరలో కనిపిస్తుంది జలం మాత్రమే. భూమి తప్ప అక్కడ పంచభూతాలు అగుపడుతూనే ఉన్నాయి. తెరచాపను తాకిన గాలి నా నావను ఎటో తీసుకెళ్ళిపోతుంది. కాని నాకు భయంలేదు. ఎందుకంటే తీరం చేరాలన్న కోరిక ఉంటే కదా! కారణం నేనున్నది సాహిత్య సాగరతీరంలో.

మహాసముద్రం నడిఒడ్డున సాగుతున్న నా ప్రయాణానికి గమ్యం ఉందేమో? సాగరమంత సిరా ఉంది. చేతిలో కలం ఉంది. ఇక నేను భయపడేదెవరికి. పైగా పంచభూతాల అండ ఉంది. ఆరోజు సాయంత్రమయింది. రోజంతా వెలుగునిచ్చి అలసిపోయిన సూర్యుడు విశ్రాంతి కోరి పశ్చిమాన కుంకెస్తానంటున్నాడు. ఇకనాకు చీకటే. పొద్దస్తమానం మా పలకరింపులు కబుర్లు అయిపోయినాయి. నేనైతే రాత్రికి మేను వాలుస్తాను. కాని అతడో. అతని కాలికి ఆగని బలపాలు ఉన్నాయి. పాపం ఎప్పుడూ విశ్రాంతి తీసుకోడు.

చూస్తుండగానే సూర్యమిత్రుడు సింధూరపు వర్ణంతో తీరం దాటేసాడు. నాకు ఇక్కడ ఏమీ కనిపించడంలేదు. గాలికి తెరచాప కదులుతున్న స్పృహ ఉంది. కాని దాని దిక్కు ఎటో తెలియదు. ప్రయాణం కొనసాగుతుంది. బహుశా అర్ధరాత్రి అయింది. ఎటు చూసినా చిమ్మచీకటే. అప్పుడే నా సోదరకవుల మాటలు గుర్తుకొచ్చాయి. "ఇంకా తెలవారదేమీ ఈ చీకటి విడిపోదేమీ," "కారుచీకటిలో వెలుగురేఖలు." నెమరు వేసుకున్నాను. నీటిశబ్దం కూడా లేదు. నిశ్చలంగా ఉంది. అక్కడ సృష్టికి తొలిరోజులా కనిపిస్తుంది. ఆ క్షణాన నాతో ఎవరైనా ఒక మిత్రుడు ఉంటే ఎంత బాగున్ను అనుకున్న. ఐనా మిత్రుడులేని మనిషి ఎవడుంటాడు. అందరికీ ఆ కామన్‌మిత్రుడు ఆ భగవంతుడే కదా!

మనసు అటు ఇటు పరుగెడుతోంది. నా నావ అర్ధరాత్రి నడిసముద్రంలో ఉందన్న స్పృహ నాలో ఉంది. ఆశ్చర్యం. అక్కడ ఏదో ఒక శబ్దం వినిపిస్తుంది. అనుమానంలేదు అది పిలుపే. పైగా మిత్రమా అని. నా కాలికింద కదిలిపోవడానికి అక్కడ భూమిలేదు. నీరుంది. భూమిలా నీరు కదలలేదు. కావలసిందంతా గుండెనిండా ధైర్యం తెచ్చుకుని ఆ పిలుపు ఎవరు పిలుస్తున్నారో ఆలకించడమే. ఇంతకుముందు నాకు భయం లేదనుకున్నా. కాని ఇప్పుడు నిజంగా భయమేస్తుంది.

వణికిన ఖంఠంతోనే "ఎవరది," అన్నాను.

"భయపడకు మిత్రమా నేను" అంది అవతల గొంతు

"నిజం చెప్పండి. నాకెవరు కనిపించడంలేదు" భయంతోనే అన్నాను. "మిత్రమా. నేను నీకు స్పష్టంగా కనిపిస్తున్నాను," అందాగొంతు. నాభయం నశాలానికి పాకింది. అక్కడసలు ఎవరూ కనిపించడంలేదు. పంచభూతాలు కూడా. కళ్ళు చిట్లించి చూసాను. అసలేమైనా కనిపిస్తే కదా! ఐనా నిండా మునిగినవాడికి చలి ఏమిటి అని ధైర్యం తెచ్చుకుని, "స్వామి తమరు ఎవరో కనిపించడంలేదు. వినిపిస్తున్నారు తప్ప" అన్నాను. "మిత్రమా ఒకసారి జ్ఞాననేత్రంతో చూడు నీకునేను కనిపిస్తున్నాను" అంది అవతల గొంతు. "చీకటితప్ప నాకేమి

కనిపించడం లేదుస్వామి," అన్నాను. "ఔను మిత్రమా. నేను చీకటినే," అందాగొంతు. "స్వామి. తమరు చీకటిదేవతలా ఉన్నారు. ఓనా?" అడిగాను.

"నన్ను కూడా దేవత అని నీవు అనుకుంటున్నావా మిత్రమా?" అడిగింది చీకటి. "ఈ వెలుగుల మహారణ్యంలో జీవకోటికి విశ్రాంతినిచ్చేది తమరేకదా స్వామి," అని అన్నాను. "ఏ మానవుడు మునుపెన్నడు నన్ను అలా అనుకోలేదు కదా మిత్రమా," అంది చీకటి "ఎంతోదూరం ప్రయాణిస్తేగాని నాకూ తెలియలేదు స్వామి," అన్నాను. ధైర్యం తెచ్చుకుని మాట్లాడుతున్న నేను నా సంభాషణ అలా కొనసాగించాను. చీకటిస్వామి వాపోవడం స్పష్టంగా గమనించాను. అతనికి మానవులు చూపించిన నిరాదారణ అర్థమౌతుంది. ఒక్క మానవులు తప్ప మిగతాజీవులన్నీ అతనిని గౌరవిస్తాయట. చెట్టు, చేమా ఆరాధిస్తాయట. జంతువులు, పక్షులు గౌరవిస్తాయట. మానవుడు తప్ప సమస్త జీవకోటి షష్టమభూతంగా భావించి కొలుస్తాయట. మానవుడు తూలనాడాడని వాపోయింది. నాకర్థమయింది. కళ్ళెదుట కనిపిస్తున్న అతని చూడలేని గుడ్డివాడు మానవుడని. పైగా ఇంకో విషయం తెలుసుకున్న. మనిషితో సహా జీవకోటికి కనిపించేది చీకటి మాత్రమే. వెలుగు గాలిలా ఎవరికీ కనిపించదు. వెలుగు ఉంటే కళ్ళకు ప్రకృతి, వస్తువులు కనిపిస్తాయి. వెలుగు కళ్ళకు వస్తువులను చూపిస్తుంది. కాని అది ఎవరికీ కనిపించదు. అదిపోతే చీకటే కనిపిస్తుంది. మనిషికి చీకటి మాత్రమే కనిపిస్తుంది. వెలుగు ఎవ్వరికీ కనిపించదు. రోజులో సగం చీకటి లేకపోతే ఈ సృష్టేలేదట. సమస్త జీవకోటికి వెలుగెంత అవసరమో చీకటి అంతే అవసరమట.

"స్వామి క్షమించావా?" అంటూ రెండుచేతులు జోడించి వినయంతో నమస్కరించా "మిత్రమా ఈ వందలకోట్ల జనంలో నన్ను నీవైనా గుర్తించావు. ఆనందంగా ఉంది," అంది చీకటి "తమరి ఉనికి కనిపెట్టలేకపోవడం మా దురదృష్టం స్వామి," అన్నాను. "నన్ను గుర్తించి పూజలు అందుకోవాలని నాకులేదు మిత్రమా," అంది చీకటి. "క్షమించండి స్వామి. మీరు షష్టమభూతం. ఈవిషయం మేము గుర్తించలేకపోయాం," వినయంతో అన్నాను. "పంచభూతాల్లా పూజలందుకోవాలని నాకులేదు మిత్రమా. కాని నామీద ఉన్న వ్యతిరేకభావం మీలో తొలగిపోతే చాలు," అంది చీకటి. "సమస్త జీవకోటికి తమరు విశ్రాంతి ఇవ్వకపోతే నెలరోజుల్లోనే జీవులన్నింటికి హిస్టీరియా రోగం వచ్చి చనిపోతాయి స్వామి. తమరు షష్టమభూతం కాక ఏమౌతారు." అన్నాను. "మిత్రమా అదిగో నా మిత్రుడు పిలుస్తున్నాడు. ఇకనేను భూమికి అటువైపు పయణమౌతాను," అంది చీకటి.

"అతనెవరు స్వామి?" అడిగాను.

"అతడే మీ సూర్యుడు. మా ఇద్దరికి జీవకోటికి రక్షించమని భగవంతుడు ఆదేశించాడు," వేకువన వెలుగుజాడను చూసిన చీకటి అంది. "ధన్యోస్మి ప్రభు. మానవ మట్టిబుర్రలకు తమరి వెలుగును తెలియజేస్తాను. క్షమించండి ఇకమీదట పదాల అర్థాలు మారుస్తాము." అన్నాను. చీకటిమోమున చిరునవ్వు కనిపించింది. అలా ఆ దేవత కనుమరుగౌతుంటే కంటినిండా నీరు చేరింది. కళ్ళెదుట నీరు కనిపించింది. రెండవ మిత్రుడు అఖండమైన వెలుగుతో ఉదయించాడు. ఇక్కడ తెరచాప గాలికి రెపరెపలాడింది. గాలి కనిపించలేదు. తెరచాప కనిపించింది. కాని వెలుగు కనిపించలేదు. ప్రకృతి కనిపిస్తోంది. షష్టమభూతాలు నావను ఒడ్డుకు నడిపించినట్లున్నారు. అల్లంతదూరాన చెట్టు, చేమ, పుట్ట కనిపిస్తున్నాయి. ఇంకా మానవుడు కనిపించలేదు. షష్టమభూతం సందేశం వారికి అందిస్తాను. అది నా కర్తవ్యం.

ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఫోన్: 9849254826

**ముసుగులో సొగసు – (1వ అట్ట) :** ఇది అరేబియన్ అందగత్తె చిత్రం. దాయటంలోనే స్త్రీ సౌందర్యం ఇనుమడిస్తుంది. ఈమె ముఖంలో ఎక్కడో కించిత్ విషాదం కూడా ఉంది. అదే మర్మం.

**రాయన గిరిధర్ గౌడ్ – చిత్రకారుడు (2వ అట్ట) :** శ్రీకృష్ణదేవరాయలు – బంగారు సింహాసనంపై ఆసీనులై ఉన్నారు. చిత్రకారుడు రాయల తీరుతెన్నులను ఎంతో పరిశోధన చేసి చిత్రించారు.
గిరిధర్‌గౌడ్ గురించి మరిన్ని వివరాలు ఏప్రిల్ 2025 **మిసిమి** పత్రికలో చదువగలరు.

**ఇటాలియన్ శిల్పి–Giovanni Stranzza : (4వ అట్ట) :** 1850లో పూర్తి చేసిన "ముసుగులో మేరి" శిల్పం. ముసుగు కూడా పాలరాతిలో చెక్కినదే. పారదర్శకంగా కనపడడం దీని ప్రత్యేకత.

**వెన్నెల మల్లెలు – (3వ అట్ట) :** కొత్త పెళ్లికూతురు. ఆనవాయితీ ప్రకారం ఆరు నెలల వరకే కొత్త పెళ్లికూతురు. ధవళ వస్త్రాలు, మల్లెపూలు, వెన్నెల, సిగ్గు, ఒకరకమైన ఉద్వేగం ఇవన్నీ కొత్తపెళ్లికూతురికి అలంకారాలే. చిత్రకారుడు తెలియదు.

# సాంఘికనాటకం - స్త్రీ

**– జంధ్యాల కనకదుర్గ**

**భా**రతదేశ రాజ్యాంగం స్త్రీపురుషులకు సమాన న్యాయం, భావస్వేచ్ఛ, భావప్రకటన, క్రియాస్వేచ్ఛ వంటి ప్రాథమిక హక్కులను ఇచ్చింది. కాని అవి పురుషులకువలె స్త్రీలకు ఆచరణలో ఉండలేకపోవటానికి కారణమైన లింగవివక్ష స్త్రీలకు సమస్యలను సృష్టించింది. లింగవివక్ష కారణంగా స్త్రీలు ప్రధానంగా వైవాహిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. కాలానుగుణంగా సామాజికవ్యవస్థల పరిణామాలక్రమంలో తెలుగు సాంఘిక నాటకాలలో ప్రతిఫలించిన స్త్రీల వైవాహిక సమస్యలను స్త్రీవాద చైతన్యాన్ని పరికరంగా చేసుకొని పరిశీలించినప్పుడే స్త్రీల సమస్యలకు పరిష్కారమార్గం లభిస్తుంది. స్త్రీల జీవితాలలో వివాహం సమస్యలను సృష్టించినప్పటినుంటి స్త్రీవాద చైతన్యం యొక్క అవసరం ఏర్పడింది. స్త్రీవాద చైతన్యంలో స్త్రీల లైంగికత, మాతృత్వం, స్త్రీలకు శారీరక, మానసిక స్వేచ్ఛను అరికట్టిన పితృస్వామ్య కుటుంబ సంస్కృతి అనేవి ముఖ్యవిషయాలు.



ఒక దృశ్యం

స్త్రీల లైంగికతపై అదుపు ప్రధాన విషయంగా ఏర్పడిన కుటుంబ సంస్కృతి, స్త్రీని నిరంతరం అనుమానిస్తూ ఆమె లైంగికతను అదుపుచేయటం పరిపాటి అయింది. చారిత్రక క్రమంలో ఈ అదుపు అనేక రూపాలను సంతరించుకుంటుంది. స్త్రీకి స్వేచ్ఛలేకుండా చేసిన వివాహ సంస్కృతి వల్ల కుటుంబ స్త్రీలకు సమస్యలు ఏర్పడటం సహజ పరిణామం. భూస్వామ్యవ్యవస్థలో. అసమాననైతిక కుటుంబసంస్కృతి, స్త్రీల లైంగికతపై ఉండే అదుపు కలిసి వెరసి బాల్యవివాహ సంస్కృతికి బీజం వేసింది. స్త్రీల సమస్యలను సహానుభూతితో అర్థం చేసుకొనే ప్రయత్నంలో నాటక రచన సాగినప్పుడు ఈ స్త్రీవాద చైతన్యానికి ఉనికి ఉంటుంది. ప్రజాస్వామ్యపు ఆలోచనల ప్రేరణతో మొదలైన స్వాతంత్ర్యోద్యమ సమయంలో స్త్రీలు, పురుషులు కలిసి పాల్గొనాల్సిన సమయంలో, స్త్రీల సామజిక సంస్కృతి ఆటంకమైన విషయంగా గుర్తించారు. ఆ క్రమంలోనే ఆడపిల్లల బాల్యవివాహ సంస్కృతి, స్త్రీల వితంతు సంస్కృతి సమాజంలో స్త్రీలను ఎదగనీయకుండా చేస్తోందనే స్పృహకలగటమే స్త్రీవాద చైతన్యానికి మూలాలు ఏర్పడ్డాయి. పురుషులలోగాని, స్త్రీలలో గాని స్త్రీల సమస్యపట్ల స్పృహకలగటం స్త్రీవాద చైతన్యం. అందుకే నాటక రచనలో ఈ స్త్రీవాదచైతన్యమే స్త్రీల సమస్యల పరిష్కారానికి దారులను వేయగలిగింది. బాల్యవివాహ సంస్కృతిని చిత్రీకరించిన కందుకూరి వీరేశలింగం గారి– బ్రాహ్మ వివాహం–అనే నాటక రచన క్రీ.శ. 1878లో వచ్చింది. ఆర్థిక–రాజకీయంగా స్త్రీల లైంగికతపై అదుపుగా ఏర్పడిన కుటుంబ సంస్కృతిలో వివాహపుతంతుకు ఎంతటి ప్రాముఖ్యత ఉందో, ఆర్థిక లావాదేవీలకు కూడా అంతటి ప్రాముఖ్యతను ఇచ్చిన విషయం ఈ బ్రాహ్మ వివాహమనే నాటకంలో స్పష్టం చేసింది. బాల్యవివాహ సంస్కృతి ఫలితంగా ఏర్పడిన

అసమ వయోవివాహాల ప్రాబల్యం వల్ల వితంతు స్త్రీల సంఖ్య పెరిగింది. స్త్రీల లైంగికతను అదుపుచేసే క్రమంలో, ఆమెకు భర్తతో ఆ మరణాంతర సంబంధం ఉంటుందనే నమ్మకాన్ని సృష్టించి, ఆమెకు వికృత రూపాన్ని పితృస్వామ్య కుటుంబ సంస్కృతి నిర్దేశించింది. సమాజంలోని వితంతు స్త్రీల దుర్భర స్థితిని చిత్రీకరించి ఆ సమస్యల పట స్పందించాల్సిన తీరును గురజాడ అప్పారావు 1882లో-కన్యాశుల్కం-అనే నాటకాన్ని రచించాడు. ఈ నాటకం పితృస్వామ్యం సంస్కృతిలోని లింగవివక్షను ఆలోచింప చేసి, లింగసమానత్వం ఉండాలనే స్త్రీవాద స్పృహను కలిగించే నాటకం.

స్త్రీల వైవాహిక సమస్యల పట్ల స్త్రీలు తెచ్చుకోవాల్సిన చైతన్యాన్ని ప్రతిఫలింప చేస్తూ ఒక స్త్రీ రచయిత్రి 1906లో రాసిన-విమల-అనే నాటకంలో ముసలివాడు కట్టిన తాళి వాడిమొహాన కొట్టి, చదువుకొని యుక్తవయసు వచ్చిన తరువాత నచ్చిన వ్యక్తిని వివాహమాడవచ్చని ప్రత్యామ్నాయపు ఆలోచనలను పెంచి వివాహ సంస్కృతిని అధిగమించాలనే చైతన్యాన్ని కలిగించిన నాటకం.

కవికొండల సుబ్బలక్ష్మి 1911లో రచించిన-స్త్రీ పునర్వివాహ ప్రహసనం-అనే నాటకంలో కామం అనేది స్త్రీ పురుషులకు సమానమే అని, స్త్రీకి పునర్వివాహం చేయటంవల్ల ఆత్మహత్యలు, రాజదండనలు, భ్రూణహత్యలు లేకుండా ఉంటాయని తెలియజేసింది. లైంగిక అణచివేత నుండి స్త్రీ విముక్తి మార్గానికి పునాదులు ఏర్పడ్డాయని ఈ నాటకంద్వారా అర్థం అవుతుంది.

1921లో కాళ్ళకూరి నారాయణరావు రచించిన-వరవిక్రయం-అనే నాటకం వరకట్నం యివ్వటానికి కారణమైన లింగవివక్షా సంస్కృతిని విమర్శకు పెట్టింది. కన్యాశుల్కంలో గాని, వరకట్న విషయంలో గాని క్రయ విక్రయాదులలో అధికార వ్యవస్థ కనపడుతుంది. అందుకే చదువుకొన్న స్త్రీ కట్నమిచ్చి కొనుక్కోవటం చేత భర్తమీద తనకే అధికారముందని వాదిస్తుంది. కమలకున్న తెలివిడి అధికార వ్యవస్థగా ఉన్న పితృస్వామ్యపు లింగవివక్షా సంస్కృతి యొక్క పుట్టకీళ్ళను కదిలించే స్త్రీవాదచైతన్య విషయం.

1927లో వచ్చిన పానుగంటి లక్ష్మీనరసింహం రచించిన-వృద్ధవివాహం-అనే నాటకంలో ముసలివాడైన భర్త నిరంతరం భార్యను అనుమానించటంతో స్త్రీ లైంగికతపైన అదుపు పరాకాష్టను చేరుకొంది.. జీవితంలో ఎటువంటి శారీరక, మానసిక స్వేచ్ఛను తాను అనుభవించ లేకపోవటానికి బాల్యవివాహ సంస్కృతి కారణమనే స్పృహతో ఆమె ఊరూర తిరుగుతూ బాల్యవివాహాల నిర్మూలనా చైతన్యం కలిగించటానికి ప్రచారం చేయటం స్త్రీవాద ఉద్యమ చైతన్యపు స్వభావమే. అంతేకాదు, ఆమె నేర్పించిన చదువువల్ల ఆమె సవతికొడుకు కూడా బాల్యవివాహాల వల్ల వితంతువులుగా మారిన స్త్రీలు పునర్వివాహం చేసుకోవాలంటూ ప్రచారం చేసాడు. ఆ రకంగా స్త్రీల లైంగికతపై వివాహసంస్కృతి రూపంలో ఉన్న అదుపునుండి స్త్రీలు విముక్తలు అయ్యేందుకు స్త్రీలు, పురుషులు తెచ్చుకోవాల్సిన సామూహిక స్త్రీవాద చైతన్య ప్రచారాన్ని కలిగించిన నాటకం ఇది .

1929లో మున్నా కోటేశ్వరమ్మ రాసిన-సరి సమానులుకారా!-అనే నాటకంలో కట్నంకోసం కూడా స్త్రీల లైంగికతను అనుమానించటాన్ని ఆయుధంగా చేసుకోవటంలోనే ఉన్న అధికారానికి, పితృస్వామ్య సంస్కృతిలోని రాజకీయ-ఆర్థికకోణం గల స్త్రీల లైంగికతపై ఉన్న అదుపుకు ఉన్న సంబంధం స్త్రీలకు వైవాహిక సమస్యలను సృష్టించిందని అర్థం అవుతుంది.

1929లో ఒద్దిరాజు సోదరులు రచించిన-మగసంసారం-అనే నాటకంలో తాముచేసే ఇంటిచాకిరీకి, శిశుపోషణకు విలువలేకుండా పోవటానికి కారణం లింగవివక్ష అనీ, అదే స్త్రీపురుషులకు సమానహోదా లేకుండా చేసిందనే స్పృహతో కుటుంబ స్త్రీలు బయటకు వచ్చి లింగ సమానత్వం ఉండాలని సామూహికంగా స్త్రీవాద చైతన్యాన్ని ప్రదర్శించారు.

1930లో పి.వి. రాజమన్నారు రచించిన-తప్పెవరిది?-అనే నాటకంలో వృద్ధుడైన భర్త తన రెండవ భార్య జావళీలు (శృంగారపదకవితలు) పాడుకుంటుంటే సహించలేక పితృస్వామ్యం ఇచ్చిన అధికారంతో వాటిని పాడవద్దని, పాడేటట్లయితే ఇంట్లోనుండి వెళ్ళిపొమ్మంటాడు. ఆమె తన మనసుకు నచ్చినట్లుగా ఉండే స్వేచ్ఛ తనకు లేనప్పుడు వెళ్ళిపోవటానికి సిద్ధపడుతుంది. స్త్రీలకు మానసిక స్వేచ్ఛలేనప్పుడు కుటుంబాన్ని వదిలివెళ్ళాలనే స్త్రీవాద చైతన్యమే నేడు బలంగా పుంజుకుంటున్న కుటుంబ వ్యతిరేక చైతన్యం. 1933లో బళ్ళారి రాఘవ రాసిన-సరిపడని సంగతులు-అనే నాటకంలో వితంతు బాలికపై

జరిగిన లైంగిక అణచివేత ఫలితంగా వచ్చిన గర్భానికి కారకుడే ఆ స్త్రీపైన లైంగిక అదుపుకై ఆ గర్భాన్ని తీయించుకో మంటాడు. ఆ బాలిక మాతృత్వం స్త్రీల అనుభూతికి సంబంధించిన విషయమని చెప్పి గర్భ స్రావాన్ని వ్యతిరేకించి, ఆమె ఇంటినుండి వెళ్ళిపోతుంది. పెళ్ళితో సంబంధం లేకుండా గర్భాన్ని ఉంచుకోవాలా లేదా అనే మాతృత్వపు హక్కు స్త్రీలకు ఉండాలని సూచించటం పునరుత్పత్తి రాజకీయాల స్త్రీవాదచైతన్యానికి మచ్చుతునక. 1945లో మల్లాది వెంకటశర్మ రచించిన-స్త్రీ-అనే నాటకంలో స్త్రీల హక్కులకోసం పోరాడే మహిళకు పురుషులతో స్నేహసంబంధాలు ఉన్నంత మాత్రాన ఆమెను అనుమానిస్తే, మునుపటివలె స్త్రీ పాతివ్రత్యమే జీవితాశయంగా చేసుకుంటూ తన స్వేచ్ఛను పణంగా పెట్టదనీ, ఆర్థికస్వావలంబనతో స్త్రీ తన వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను కాపాడుకోగలదనే చైతన్యాన్ని ఇవ్వగలిగిన నాటకం ఇది. 1948లో శ్రీపాదసుబ్రమణ్య శాస్త్రి రాసిన- కొనుక్కొన్న మొగుడు-అనే నాటకంలో పెళ్ళి అనేది క్రయవిక్రయ వ్యాపారం అని భావించి కొనుక్కున్నవాళ్ళకి అధికారాలను ఇస్తోందనే గ్రహింపు భార్యకు కలిగి కన్యాశుల్కం యిచ్చినందుకు యిన్నాళ్ళు తనమీద అధికారం చూపించిన భర్తతో వరకట్నమిట్టి కొనుక్కున్నాము కాబట్టి తాను చెప్పినట్లుగా ఆతడు వినాలని, ఆతడిమీద తనకే అధికారం ఉందని చెప్పింది. కుటుంబఅధికారం తిరగబడితే ఎలా ఉంటుందో చూపించే క్రియాశీలచైతన్యం కూడా ఆమెది.

1950లో చలం రాసిన విడాకులు అనే స్త్రీలు విడాకులు తీసుకొని తమ వైవాహిక సమ్యలనుండి విముక్తులు అయ్యేవిధంగా స్వేచ్ఛను పొందాలనుకోవటం, పితృస్వామ్యకుటుంబ సంస్కృతికి చెంపపెట్టువంటిది. స్త్రీలకు లైంగికస్వేచ్ఛ లేకుండా చేసిన కుటుంబ సంస్కృతికి కారణమైన ఆర్థిక-రాజకీయవ్యవస్థను స్త్రీలు ఎదుర్కోవాలంటే, స్త్రీలు రాజ్యసభలలో ప్రవేశించి చట్టాలు చేయించాలనే భావనయే ఆర్థిక-రాజకీయ స్త్రీవాదచైతన్యం. 1958లో అవసరాల రామకృష్ణారావు రాసిన- పంజరం-అనే నాటకంలో భార్య లైంగికతపై సమాజం చేసిన దుష్ప్రచారానికి భయపడ్డ భర్త ఆమెను అనుమానించటం తన పితృస్వామ్య కర్తవ్యంగా భావించి ఆమెను యింటి నుండి వెళ్ళగొడతాడు. కుటుంబం స్త్రీ తనయొక్క లైంగికతపై అనుమానించే సాంస్కృతిక పంజరాన్ని సృష్టించినందుకు ఆ కుటుంబ సంస్కృతియే ఆతని పాలిటి అశనిపాతమవు తుందనే ఆలోచనను రేకెత్తించిన నాటకం.

1994లో మార్గశీర్ష అనే పేరుతో బి.వి. రమణ మూర్తి రాసిన-శ్వేతపత్రం-అనే నాటకంలో వివాహ విషయంలో కూతురిగా, ఆర్థికస్వేచ్ఛలేని భార్యగా, తల్లిగా స్త్రీ నిర్ణయాలను చేసుకొనే స్థితిలేకుండా చేస్తూ, పురుషుడు మాత్రం ఒక తండ్రిగా, భర్తగా, కొడుకుగా తన అధికారాన్ని చెలాయింపజేసుకోవాలని అనుకోవటమే కుటుంబంలో స్త్రీలకు వైవాహికసమస్యలను సృష్టించిందనే దానికి స్త్రీలు సమర్పించిన శ్వేతపత్రం ఈ నాటకం. 1995లో ఓల్గా రచించిన-వాళ్ళు ఆరుగురు-అనే నాటకంలో అధికార వ్యవస్థగా వచ్చిన పితృస్వామ్య కుటుంబంలో స్త్రీ శారీరక, మానసిక స్వేచ్ఛలను అనుభవింప లేకుండా చేసిన వివాహాన్ని చర్చకు పెడతారు. స్త్రీల మనస్సుకు నచ్చిన ప్రేమసంబంధాలలోని లైంగిక స్వేచ్ఛకు, మాతృత్వపు హక్కుకు అవకాశంలేని వివాహం అవసరమా అనే ప్రశ్నను సంధించి మహిళాలోకాన్ని తమ హృదయాలలోకి తొంగిచూసుకొని ఆలోచింపచేసే చైతన్యాన్ని కలిగించిన స్త్రీవాద చైతన్యనాటకం. ఈ నాటకం 21శతాబ్దపు వివాహాలకు సవాళ్ళను విసిరింది.

భారతరాజ్యాంగంలో స్త్రీపురుషులకు సమాన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ఉన్నప్పటికీ, ఆచరణలో సమాన న్యాయం లేకుండా చేస్తున్న లైంగిక అదుపు రూపంలో ఉన్న లింగవివక్ష, స్త్రీల సమస్యలకు కారణమవటంతో స్త్రీలు స్వేచ్ఛను అనుభవించలేకపోతున్నారనేది సామాజిక సత్యం. అందుకే ఆధునిక యుగంలో కుటుంబ సంస్కృతికి వ్యతిరేక ధోరణి ప్రబలటం, దాని పరిణామాల పరం పరలోనే సహజీవనం అనే నూతన దృక్పథానికి దారులు ఏర్పడం గమనించిన విషయమే. కాబట్టి సమాజ పటిష్ఠతకై కుటుంబ పునర్నిర్మాణ దిశగా సాగుతున్న మేధావుల ఆలోచనలు మహిళల మానసిక, శారీరకస్వేచ్ఛలకు పెద్దపీట వేయగల నూతన సంస్కృతికై స్త్రీపురుషులు ఆలోచించాల్సిన చారిత్రక అవసరమిది.

జంధ్యాల కనకదుర్గ,
గుంటూరు, ఫోన్ : 9491140299

# తెలుగు వైభవం లక్ష్మీరెడ్డి లక్ష్యం

– మిసిమి



ఇడమకంటి లక్ష్మీరెడ్డి

సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. దశాబ్దం క్రితం జి.డి. నాయుడు గారు తిరుపతిలో 'శంకరంబాడి సుందరాచారి' పేరుతో ఒక సాహితీ సంస్థ స్థాపించి, ప్రారంభోత్సవానికి నన్ను, పార్వతీశం గారిని రప్పించారు. ఆరోజు బెంగుళూరు నుంచి బెంజి కారులో దిగారు లక్ష్మీరెడ్డి. అదే మా మొదటి కలయిక. తరువాత బెంగుళూరు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఆశాజ్యోతి నిర్వహించిన పత్రికా మాధ్యమాల సదస్సులో పాల్గొనడానికి వెళితే నాతోపాటు వేదిక పంచుకున్నారు లక్ష్మీరెడ్డి. ముచ్చటిగా మూడోసారి మొన్న పెద్ది సత్యనారాయణ గారితో ఉన్నప్పుడు వారు, ఆనందరావు వచ్చి గంటసేపు వేచి ఉన్నారు. అప్పుడే వారితో తీరుబడిగా మాట్లాడి వారి బడికి వెళ్లాం. వారితో రెండుగంటలు పైగా సంభాషించాం. మృదు స్వభావి, మితభాషి.

ఇడమకంటి బ్రహ్మారెడ్డి వీరికి పితామహులు. వారు స్వాతంత్ర్య సమరయోధులు, గాంధేయవాది, సామాజిక సేవకులు. ఇడమకంటి లక్ష్మీరెడ్డి కర్ణాటకలో 'తెలుగు విజ్ఞాన సమితి'కి కార్యదర్శిగా, కర్ణాటక 'తెలుగు అకాడమీ'కి ఉపాధ్యక్షులుగా, 'తిరుపతి తిరుమల దేవస్థానం సలహా మండలి' కర్ణాటక సభ్యులుగా కొనసాగుతున్నారు. 'సి.పి. బ్రౌన్ సేవాసమితి' రాష్ట్రేతర తెలుగు సేవా సంస్థలలో ఒకటిగా పరిగణిస్తున్నారు.

భగవద్గీతలో చెప్పినట్లు మంచితనం కూడా మాయజనితమే – అలాంటి మాయలో పడనివారెవరు? అయితే లక్ష్మీరెడ్డి చేసే మంచిపనులు కీర్తినాశించి కాదు.

–ఎ.కె.

"తెలుగు వారికి ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశపరీక్షల్లో ర్యాంకులు సాధించే సుళువేదో తెలుసంటారు, బెంగుళూరులో కాలేజీతో పాటు కోచింగ్ సెంటర్ నిర్వహించే ఇడమకంటి లక్ష్మీరెడ్డి. ఇప్పటివరకు వారి సంస్థ ద్వారా నాలుగు వేలకు పైగా విద్యార్థులు మెడిసిన్‌లో ర్యాంకులు సంపాదించారు. ఇది వారి జీవితంలోని ఒక పార్శ్వం అయితే మరొకటి తెలుగు సాహిత్యం పట్ల ఆయనకున్న శ్రద్ధ, ఆసక్తి.. వీటికి కారణం ఆయనేమంటారంటే ఒంగోలు శర్మ కాలేజీలో చదువుతున్నప్పుడు అక్కడ చదువుకున్న పూర్వవిద్యార్థులు, తరువాతి కాలంలో సినీ దర్శకుడిగా రాణించిన టి.కృష్ణ, ముత్యాల సుబ్బయ్య, పోకూరి బాబురావుతో పాటు, విప్లవ సినిమాలు తీసిన ఆర్.నారాయణమూర్తి, కమ్యూనిస్టు నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు అంటారు. ఆ స్ఫూర్తితో కళల పట్ల మొగ్గు చూపారు.. ఆవిధంగా ఎంచుకున్న వృత్తి విద్యారంగాన్ని అలాగే ప్రవృత్తిగా సాహిత్య రంగాన్ని జాగ్రత్తగా సమన్వయపరుచుకుంటూ వస్తున్న లక్ష్మీ రెడ్డి అంతరంగాన్ని తమకున్న పరిచయంతో ***మిసిమి*** పాఠకులకు పరిచయం చేస్తున్నారు ***మిసిమి*** సంపాదకులు అశ్వినీ కుమార్.

***మిసిమి*** : **నమస్కారం లక్ష్మీ రెడ్డి గారు. మనకు పదేళ్ళ పరిచయం ఉంది. మొదటిసారి తిరుపతిలో కలిశాం. తర్వాత బెంగుళూరు యూనివర్సిటీలో కలిశాం. ఇలా కలుస్తూనే ఉన్నా కానీ, మీ గురించి తెలుసుకోలేపోయాను. నిన్న పెద్ది సత్యనారాయణ గారి దగ్గర మేము ఉన్నప్పుడు మీరూ వచ్చారు. ఆసక్తి కలిగి మీ గురించి తెలుసుకున్నాను.. మీరో కాలేజీ పెట్టారని, మీ కోచింగ్ వలన నాలుగు వేలమంది విద్యార్థులకు ఎమ్.బి.బి.ఎస్. సీట్లొచ్చాయని తెలిసి ఆశ్చర్యపోయాను. మనమెప్పుడు సాహిత్య సభలో కలుసుకున్నా పది నిమిషాలు మాట్లాడి వెళ్ళిపోతుండేవారం. ఈ కాలేజీ గురించి ఎప్పుడూ చెప్పలేదు. ఇప్పుడు చెప్పండి.. బెంగుళూరులో కాలేజీ ఎందుకు పెట్టారు. ఎప్పుడు పెట్టారు..?**

**లక్ష్మీరెడ్డి :** ఈ కాలేజీ 2006లో పెట్టాము. దానికి కారణం మా పార్టనర్ వాళ్ళబ్బాయిని ఐఐటీ కోచింగ్ కోసం హైదరాబాద్ పంపించాడు. అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో తిరిగి వచ్చేశాడు. ఇదేకాదు, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు ప్రతి సంవత్సరం వందల్లో కోచింగ్ నిమిత్తం వెళుతూ ఉంటారు. అక్కడ సౌకర్యాలు సరిగ్గా లేక కొంతమంది తిరిగి వచ్చేస్తుండేవారు. అప్పుడు మా పార్టనర్ రామ్మనోహర రెడ్డికి వచ్చిన ఆలోచన, మనమెందుకు ఇలాంటి కోచింగ్ ఇనిస్టిట్యూట్ .. అలాగే కాలేజీ పెట్టకూడదు అని. దాంట్లో భాగంగా మొదట 2006లో ఇంటర్మీడియట్ కాలేజీని, 2011లో కోచింగ్ సెంటర్ ప్రారంభించటం జరిగింది. ఆ క్రమంలో మా సంస్థ నుంచి సుమారు నాలుగు వేల ఐదొందల నుంచి ఐదువేల వరకు ఫ్రీ మెడిసిన్ సీట్లు ఎంట్రన్స్ పరీక్షల్లో సాధించారు. అది మాకు చాలా తృప్తిగా ఉంటుంది. KCET, CCET, ఇప్పుడు NEET ద్వారా అన్నమాట.

**మిసిమి :** **ఇక్కడో మాట.. కాలేజీ అంటే నా దృష్టిలో భవనాలు, కుర్చీలు, టేబిల్స్, కాదు.. ఫాకల్టీ ముఖ్యం కదా..?**

**లక్ష్మీరెడ్డి :** మీరన్నది అక్షరాల నిజం. మొదటినుంచి ఇటువంటి ఎంట్రన్స్ పరీక్షలకు బోధించే కిటుకు తెలుగు వారొక్కరికే తెలుసు. మనవారు కష్టజీవులు.. పాడిపరిశ్రమ నిర్వహణలో ఒక ఆడ కూతురు ఎంత కష్టపడుతుందో, అదే విధంగా మన లెక్చరర్లు, పిల్లలను తమ బిడ్డల్లాగా చూసుకుంటారు. పిల్లలు ఎలా చదివితే ఎంట్రన్స్ టెస్ట్ క్రాక్ చేయగలుగుతారు, తల్లిదండ్రుల ఆకాంక్షలెలా ఉంటాయి .. వారి కలలను సాకారం చేయటం ఎలా అన్న తపన వీరిలో ఉంది. ఇందుకోసం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల నుంచి బోధనా సిబ్బందిని తీసుకోవటం జరిగింది. వచ్చిన వారందరూ కూడా ఎంతో న్యాయంగా పనిచేయటం జరిగింది. మన్నం బ్రహ్మయ్య గారని పది సంవత్సరాల నుంచి ఉపాధ్యాయునిగా మా దగ్గర ఉన్నారు. ఇంకొకరు ఆళ్ళ చలం గారని విజయవాడ నుంచి వచ్చారు. ఈ రంగంలో నలభై ఐదు, యాభై సంవత్సరాల పైబడి ఉన్నవారు అద్భుతాలు సృష్టిస్తున్నారు. నలభై ఐదు సంవత్సరాలు లోపున్న వారు తెలివైనవారే కానీ అంతగా రాణించలేకపోతున్నారు. అది గమనించి అందుకు తగ్గట్టుగానే అధ్యాపకులను తీసుకుంటున్నాం.

**మిసిమి :** **బావుంది శ్రీనివాసరెడ్డి గారు. మీరు కాలేజీ నిర్వహిస్తున్నారు.. రిజల్ట్స్ చూపిస్తున్నారు. స్టూడెంట్స్ హేపీ. తల్లిదండ్రులు హేపీ.. వృత్తి పరంగా సరే. మరి మీకు సాహిత్యం పై మక్కువ ఎలా కలిగింది?**

**లక్ష్మీరెడ్డి :** నేను డిగ్రీ ఒంగోలు శర్మ కాలేజీలో చదువుతున్నప్పుడు మాకు సీనియర్లుగా ఒకపక్క వందేమాతరం శ్రీనివాస్ గారుండేవారు.. మరోపక్క పోకూరి బాబురావు గారు, టి.కృష్ణ, ముత్యాల సుబ్బయ్య గారు ఇక్కడి నుండే సినీ ఫీల్డ్‌కు వెళ్ళారు. అన్న నల్లూరి వెంకటేశ్వర్లు గారు అందరికీ ఆదర్శంగా ఉండేవారు. అలా వీరంతా ఒకే ప్రవాహమై చుట్టేస్తుండేవారు. నిజం చెప్పాలంటే దర్శకుడు టి.కృష్ణగారికి నేనో గొప్ప భక్తుడు లాంటి వాడిని. (నవ్వు). నాకు కొంచెం కమ్యూనిస్టు భావాలు ఇష్టం. వేజళ్ళ సత్యనారాయణ గారి సినిమాలన్నా, ఆ తర్వాత వచ్చిన మాదాల రంగారావు, ఆర్.నారాయణమూర్తిల సినిమాల ప్రభావం నాపై ఉండేది. స్వతహాగా మేము ఇందిరా కాంగ్రెస్‌కు చెందినవారమే కానీ, మానసికంగా అభిమానం అటుండేది.అణిచివేత ఎక్కడున్నా స్పందిస్తుంటాను.చిన్నతనం నుంచి నాకు తోలుబొమ్మలాట,పిచ్చుకుంట్ల వారి కథలు.. ఇలాంటి జానపద కళలంటే ఆసక్తి. ప్రజానాట్యమండలి వారు ప్రదర్శించే బుర్రకథలు, జానపద గీతాలు అంటే చాలా ఇష్టంగా ఉండేది.

**మిసిమి :** **మీరేమైనా నాటకాలు వేస్తుండేవారా?**

**లక్ష్మీరెడ్డి :** లేదు.. ఏదో ఒకటో, రెండో వేసుంటాను అంతే.. నా స్కూల్ రోజుల్లో, నాతో పాటు చదివే ఇసాక్ అని, అబ్రహాం లింకన్ అని ఇద్దరు కుర్రోళ్ళు ఉండేవారు. ఐదో తరగతి దాకా మిషనరీ బళ్ళో చదివి ఆరో తరగతిలో మాతో చేరారు. చక్కగా పాడతారు. నాకిష్టమొచ్చిన పాటలు అడిగి పాడించుకునేవాడిని. వారిద్దరూ నాకు ఆస్థాన కళాకారులు (నవ్వు). ఓ పదిపైసలిచ్చో, నువ్వుండలో, జీడీలో, శనగపప్పు ముద్దలో ఇచ్చి పాడించుకునేవాడిని. దాని తర్వాత 2004లో ఇందిరాదత్ గారు ప్రపంచ తెలుగు సమాఖ్య సంస్థ పక్షాన సభలు నిర్వహించారు బెంగుళూరులో. పదివేల రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యుడనై,

మూడు రోజులు సభలకు వెళ్ళాను. దాంతో కొంచెం పూనకం వచ్చింది. ఏదో ఒకటి చేయాలన్న పూనకం అన్నమాట (నవ్వు). ఆ సభలకు ఒంగోలు హనమారెడ్డి గారు (ఆయన ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా ఉండేవాడు) బాలకృష్ణ రెడ్డి గారు (రిటైర్డ్ జడ్జి), రచయిత బీరం సుందర్రావు గారు, జ్యోతి చంద్రమౌళి గారు వచ్చారు. వాళ్ళతోటి సాన్నిహిత్యం పెరిగి, సాహిత్యం బాగా అంటింది. అప్పుడే ప్రముఖ కవి, విమర్శకులు నాగభైరవ కోటేశ్వరరావు గారితో పరిచయం ఏర్పడింది. ఈ పెద్దల పరిచయాలు నాకు రిలాక్సేషన్ ఇచ్చాయి. అంటే వేరేలా అనుకోకండి. సాహిత్యానికేమైనా చేయాలని కోరిక పుట్టింది. కుప్పంలో మా ధార్మిక సంస్థ ద్వారా నాలుగు కార్యక్రమాలు నిర్వహించాను. అనేకమంది పెద్దవారు ఈ సభల్లో పాల్గొన్నారు..

***మిసిమి* : ఇలా చేసేందుకు ఏమైనా ట్రస్ట్ పెట్టారా! సొంతంగా ఖర్చు పెట్టడమేనా?**

**లక్ష్మీరెడ్డి :** 2011వరకూ సొంతంగా ఏవో కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చాను. 2011లో సి.పి.బ్రౌన్ సేవా సమితిని స్థాపించాను. ఎవరి నుంచి నిధులు సేకరించకుండా, కేవలం నా డబ్బు ఖర్చుపెడుతూ కార్యక్రమాలు చేశాను. దానితోపాటుగా స్వాతంత్ర్య సమర యోధులు ఇడుమగంటి బ్రహ్మ రెడ్డి పేరుతో ఒక ధార్మిక సంస్థ కూడా ఉంది. ఈ రెండు సంస్థలు కలిపి సంయుక్తంగా జరిపేవాడిని. 2006లో "నువ్వే" అని ఓ సినిమా తీశాను. షఫీ కథానాయకుడు ఆ సినిమాలో.. ఆ వాసనలతో మరో ప్రయత్నం చేయబోతున్నానిప్పుడు..

***మిసిమి* : మీకు ఆల్ ది బెస్ట్ ఆవిషయంలో.. కాని సినిమాలు తీయటం సాహిత్య సేవ కాదు కదా. బెంగుళూరులో తెలుగు అసోసియేషన్‌లు ఎన్నున్నాయి?**

**లక్ష్మీరెడ్డి :** ఇక్కడ ఓ పది, పన్నెండు సంఘాలున్నాయి సార్. *తెలుగు విజ్ఞాన సమితి* అని ఒక సంస్థ ఉంది. ఆ సంస్థ చాలా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ సంస్థ ఏర్పడి డెబ్భై ఐదుసంవత్సరాలైంది. ప్రభుత్వం వారు ఈ సంస్థకు నిధులు మంజూరు చేశారు. ఆసంస్థ ఇక్కడే మల్లేశ్వరంలో ఉంది. ఆ సంస్థ మందిరం పేరు శ్రీకృష్ణ దేవరాయ మందిరం.. వేదిక పేరు టి.సుబ్బిరామిరెడ్డి వేదిక. ఆయన పేరు పెట్టడానికి కారణం, వారు యాభై ఐదు లక్షల రూపాయలు వితరణ చేశారు. వెంకయ్యనాయుడు గారు పాతిక లక్షల రూపాయలు, ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేశారు. సుబ్బిరామిరెడ్డి గారిచ్చింది వారి సొంత ధనం. అప్పటి ప్రభుత్వాధినేత సిద్ధరామయ్య గారు నలభై లక్షలిచ్చారు. సినీనటి, ఎమ్మెల్సీ జయమాల గారు కొంత ధనసహాయం చేశారు. ఇంకా ఇచ్చిన వారిలో ఎమ్మెస్. రామయ్యగారు (రామయ్య ఇంజనీరింగ్ కాలేజీల పక్షాన), పి.ఎస్.దొరస్వామి నాయుడు గారు తదితరులు ఉన్నారు.

ఈ సంస్థకు అధ్యక్షుడిగా డాక్టర్ ఏ. రాధాకృష్ణరాజు గారున్నారు. వారు కళారత్న. నేను ప్రధాన కార్యదర్శిగా ఉన్నాను. ఈ సంస్థ సంవత్సరానికి మూడు కార్యక్రమాలు చేస్తుంది. వాటిలో ఉగాది పండుగనాడు ఉగాది పురస్కారాలు, సంక్రాంతికి సాహిత్య పురస్కారాలు ప్రదానం చేస్తారు. మూడవ కార్యక్రమం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చేస్తారు. ఈ సంస్థకు కోటీ పాతిక లక్షల రూపాయలు ఫిక్స్డ్ డిపాజిట్ రూపంలో ఉన్నాయి.

***మిసిమి* : మిగిలిన సంస్థ లేమున్నాయో చెప్పండి.?**

**లక్ష్మీరెడ్డి :** *తెలుగు మిత్రులు ఐటిఐ* అనే మరో సంస్థ ఉంది. *బిఈఎల్ ఆంధ్రమహాసభ,* మేలుకలయిక, కర్నాటక తెలుగు అకాడమీ (ఈ సంస్థ ఎన్టీఆర్ జయంతి, వర్ధంతులు మాత్రమే నిర్వహిస్తుంది).. ఇవే కాకుండా కర్నాటక తెలుగు రచయితల సంఘం వంటి సంస్థలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ యాక్టివ్‌గా పనిచేసే సంస్థలు..

***మిసిమి* :** ప్రతినెలా సాహిత్య సభలేమన్నా జరుగుతుంటాయా?

**లక్ష్మీరెడ్డి :** ప్రతినెలా ఏదో ఒక సంస్థ ఒక కార్యక్రమం జరుపుతుంటుంది. ఎవరి వీలును బట్టి వారు పాల్గొంటూ ఉంటారు.

***మిసిమి* : నాటకాల్లాంటివి వేస్తూ ఉంటారా?**

**లక్ష్మీరెడ్డి :** వేస్తే చూస్తారేమో కానీ నాటక ప్రదర్శనలు తక్కువ. జనం రారన్న అపవాదు ఉంది.

***మిసిమి* : మీరేమైనా పత్రికలు నడిపారా!**

**లక్ష్మీరెడ్డి :** కొంత కాలం ఒక పత్రిక నడిపాను.ఆ పత్రిక పేరు "సంశోధన".. ఆర్వీ ఎస్ సుందరం గారు సంపాదకులు. రెండుసంవత్సరాల పాటు గట్టిగానే నడిపాను. నాకెందుకో ఉపయోగం లేదనిపించింది. ఆ నమ్మకం కలిగాక, వారికి చెప్పాను ఇంకా ఆపేద్దామని.

***మిసిమి :*** **పోనీ ఏదైనా పత్రికకు స్పాన్సర్ చేశారా?**

**లక్ష్మీరెడ్డి :** ఎవరైనా అడిగితే పుస్తకాల ప్రచురణకు ఆర్థిక సాయం చేశాను. ఆమధ్యన చెన్నైలో తూమాటి సంజీవరావు గారి ఆరు పుస్తకాలకు కొంత ఆర్థిక సహాయం చేశాను.

***మిసిమి :*** అమధ్య ఒక ప్రవచనకర్త సన్మానం కోసం మీరు చాలా ఖర్చు పెట్టారని విన్నాను. ఎందుకు అలా చేయాల్సి వచ్చింది?

**లక్ష్మీరెడ్డి :** నాకు ఆయన నచ్చాడు. ఆయన ప్రవచనాలు కావొచ్చు. వ్యాఖ్యానాలు కావొచ్చు. నాకాయన పూర్తిగా నచ్చితేనే చేశాను. వారిని నాకు హనుమారెడ్డి గారు పరిచయం చేశారు. 2011లో ఇక్కడ వారితో అష్టావధానం చేయించాను. వారికి గండపెండేర సత్కారం భారీయైనదే. ఎందుకు చేశానంటే ఆరోజున భక్తి టీవీలో ఆయన నేనింక నా ప్రవచనాలు ఉపసంహరించుకుంటున్నాను అని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకున్నారు. అది నన్ను కదిలించింది. ఆయన్ని అభిమానించే వాడిగా ఆయనకు ఏదైనా చేయాలనుకున్నాను. అదీ కారణం!

***మిసిమి :*** **మీ భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి?**

**లక్ష్మీరెడ్డి :** ఈ సాహిత్యానికి సంబంధించి ప్రస్తుతానికి వద్దు అనుకుంటున్నాను. నేనిప్పటివరకు చేసిన కార్యక్రమాలు చెప్పాను. తెలుగు బళ్ళకు కూడా సహాయం చేశాను. కొంతకాలం వరకు నా కార్యక్రమాలకు కామా పెడదామనుకుంటున్నాను.

***మిసిమి :*** **ఓహ్.. అలాగా..ఒక విషయం చెప్పండి.. తెలుగు-కన్నడ రచయితల సంబంధాలెలా ఉన్నాయిక్కడ?**

**లక్ష్మీరెడ్డి :** తెలుగు -కన్నడ రచయితల ఇరవై ఏళ్ల క్రితం బాగుండేవి ఇప్పుడా పరిస్థితి లేదు. తంగిరాల వెంకట సుబ్బారావు గారు వెళ్ళి పోయిన తరువాత ఆమాత్రం రచయితలు ఇక్కడ లేరు.

***మిసిమి :*** **తెలంగాణ-ఆంధ్రరచయితలను సంవత్సరానికోసారి ఆహ్వానించి, రెండు ప్రాంతాల వారిని కలపొచ్చేమో మీరు.**

**లక్ష్మీరెడ్డి :** మీ సూచన బావుంది.. గుర్రం జాషువా గారి 123వ జయంతికి కన్నడ రచయిత పద్మశ్రీ రంగయ్య గౌడ్ గారిని పిలవటం జరిగింది. తెలుగు రచయితగా తెలుగు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్ గారిని పిలవటం జరిగింది. ఆచార్య కొలకలూరి ఆశా జ్యోతి గారు కూడా పాల్గొన్నారు. ఆవిధంగా కొన్ని కార్యక్రమాలు చేశాను. మరోసారి చంద్రశేఖర కంబార గారిని పిలవటం జరిగింది. ఆ సభకు గరికిపాటి వారిని కూడా ఆహ్వానించాం. ఇట్లా కొన్ని కార్యక్రమాలు చేశాం. అట్లా మూడు, నాలుగు సభలు చేశాను.

***మిసిమి :*** **నేను మీలాంటి ఉత్సాహవంతులను చూశాను. పెద్దపెద్ద వారిని తీసుకొస్తారు. దానివలన ఫోకస్ అంతా వారి మీదుంటుంది. అలా కాకుండా మామూలు రచయితలు పదిమందిని అటు తెలుగు, ఇటు కన్నడ భాషల వారిని తీసుకొచ్చి కార్యక్రమం చేయండి. దానివలన చాలా ఉపయోగం ఉంటుంది.**

**లక్ష్మీరెడ్డి :** ఇప్పుడు భాషాభిమానాలు మారిపోయాయి సర్.

***మిసిమి :*** **కన్నడ భాషలో ఎన్నో జ్ఞానపీఠ్ పురస్కారాలొచ్చాయి. తెలుగులో ముగ్గురు మాత్రమే పొందారు.. సాహిత్యానికి సంబంధించి కొంత పరస్పర అవగాహన ఏర్పడుతుంది కదా..**

**లక్ష్మీరెడ్డి :** మీరన్నది నిజమే కానీ కొన్ని ప్రాక్టికల్ సమస్యలున్నాయి. ఆ దిశగా ఆలోచించాలి. కన్నడంలో అర్హత కలిగిన వారికే అవార్డులు లభిస్తాయి. తెలుగులో తక్కువగా జ్ఞానపీఠ్ పురస్కారం లభించడానికి రాజకీయ కారణాలున్నాయేమో.

***మిసిమి :*** **అర్హతలేనివారే ఎక్కువ ప్రయత్నాలు చేస్తుంటారు.**

**లక్ష్మీరెడ్డి :** అర్హత ఉన్నవారికి పురస్కారం గురించి తెలియకపోవచ్చు.

***మిసిమి :*** **మీ దగ్గర ఎంతమంది విద్యార్థులు ఉంటారు. వీరందరికీ తెలుగొచ్చా?**

**లక్ష్మీరెడ్డి :** మూడున్నర వేలమంది ఉంటారు. తెలుగొచ్చినవారు ముప్పై మందికి మించరు. తమిళం వచ్చినవారు మూడొందలమంది ఉంటారు. 2011లో నేను కొన్ని అపార్ట్‌మెంట్‌లలో తెలుగు పిల్లలకు పంతుళ్లను

పెట్టి తెలుగు నేర్పే ప్రయత్నం చేశాను. ముందు తల్లిదండ్రులకే ఆసక్తి లేదు. పిల్లలను పంపలేదు.. ఖర్చు మిగిలింది తప్ప పని జరగలేదు.. దాదాపు రెండు సంవత్సరాల పాటు ప్రయత్నం చేసి నిరాశతో వదిలేశాను.

**మిసిమి :** **మీరు నిరాశ చెందినా మీ ప్రయత్నం మానకండి. నాలాంటివాడు ఏ ఒక్కడో తెలుగు నేర్చుకున్నా పదిమందికి ఉపయోగమే కదా! (నవ్వులు).**

**లక్ష్మీరెడ్డి :** నా ఉద్దేశంలో వ్యక్తిగా, సంస్థగా చేసే ప్రయత్నాలు కన్నా, ప్రభుత్వం పూనుకుంటే అవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు బోధన కాకుండా, ప్రైవేటు బడులలో కూడా తెలుగు బోధన జరిగేలా జీవోలు రావాలి.

**మిసిమి :** **మనకన్నా అమెరికాలో తెలుగు పట్ల శ్రద్ధ ఎక్కువగా ఉంది. మాబడి వారు వేలమందికి తెలుగు రాయడం, చదవటం నేర్పుతున్నారు.**

**లక్ష్మీరెడ్డి :** మైనారిటీలుగా ఉన్నప్పుడు ఆ కోరిక ఉంటుంది కదా. ఇక్కడ బళ్ళారిలో తెలుగు ఉంది. బెంగుళూరులో కూడా ఓ పది తెలుగు పాఠశాలలున్నాయి. కానీ తెలుగు పంతులు రిటైర్ అయితే ఇంకో పంతులుని నియమించటం లేదు. ఈ తెగులు తెలుగుకే ఉంది. అదే తమిళం, ఉర్దూ పంతుళ్లు రిటైర్ అయినా గవర్నమెంట్ వారిని మళ్ళీ నియమిస్తోంది. దీని గురించి తెలుగు సంఘాలు పోరాడుతున్నాయి కానీ ప్రయోజనం లేదు.

**మిసిమి :** చాలా విషయాలు చెప్పారు.మా ***మిసిమి*** గురించి నాలుగు మాటలు చెప్పండి.

**లక్ష్మీరెడ్డి :** ***మిసిమి*** పత్రిక సమాజానికి చాలా ఉపయోగకరంగా ఉందని నా నమ్మకం. చక్కటి విలువలతో నడిచే పత్రిక.

**మిసిమి :** **ఏదో యాదృచ్ఛికంగా కలిసినా అనేక విషయాలు *మిసిమి* తో పంచుకున్నందుకు ధన్యవాదాలు నమస్కారం**

**లక్ష్మీరెడ్డి :** నమస్కారం.

*"ట్యాంక్ బండ్ పై ఎన్టీఆర్ విగ్రహం లేకపోవటం బాధాకరం"*

***మిసిమి :*** ***మీరు ఎన్టీఆర్ శతజయంతి ఘనంగా చేశారు కదా..కారణం..?***

**లక్ష్మీరెడ్డి :** *ఎన్టీఆర్ పై అభిమానం పుట్టుకతో ఏర్పడిందే. రామారావు గారిపై విపరీతమైన అభిమానం చిన్నప్పటి నుండి. ఎక్కడ ఎవరు అణిచివేతకు గురైనా నేను స్పందిస్తాను. రామారావుగారు కూడా అణిచివేతకు గురయ్యారని నాకనిపిస్తుంది. ట్యాంకుబండ్ మీద అందరి మహనీయుల విగ్రహాలను ఆయన నెలకొల్పాడే.. ఏ ప్రభుత్వమైనా ఆయన విగ్రహం పెట్టిందా.. ఆయన ఎన్నో సంస్కరణలు తెచ్చాడు కదా. అల్లూరి సీతారామరాజు అంటే అభిమానమే.. నందమూరి తారక రామారావు అంటే అభిమానమే.. పొట్టి శ్రీరాములు అంటే అందరికంటే అభిమానం.. తల్లిదండ్రులు కంటే అభిమానం. తెలుగుజాతి కోసం అంత పెద్ద త్యాగం చేశాడాయన. బాధల్లో, కష్టాల్లో, దుఖాల్లో ఉండేవారిని నేను ప్రేమిస్తాను. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా స్కూళ్ళ కోసం సొంత ధనం వ్యయం చేసిన బండి ఆదినారాయణ రెడ్డి గారికి, ఈనాడు పత్రికలో రిటైర్ అయిన ఆదినారాయణ గారికి, తృణధాన్యాల శాస్త్రవేత్త ఖాదర్ వలీ గారికి సన్మానం చేశాం. వీరంతా ఇక్కడి వారే. రాధాకృష్ణ రాజు గారు.. ఇంకా సుభాషిణి గారు.. మూడొందల మంది పిల్లలను దత్తత తీసుకుని పిల్లలకు అన్నపానీయాలు ఏర్పాటు చేశారు ఆవిడ. సినీరంగంనుంచి రమాప్రభ గారిని పిలిచాను. ఆమెకూడా బాధితురాలేకదా. దానితోపాటు ఎన్టీఆర్ మీద శతక పోటీలు పెట్టాను. రెండొందలమంది పైగా పాల్గొన్నారు. వాటికోసం న్యాయనిర్ణేతలు పెట్టాం. ఆ ప్రక్రియ పూర్తి చేయటానికి ఆరునెలలు పట్టింది.. ఈ ప్రక్రియ నేను శతజయంతి పూర్తయ్యే పదకొండు నెలల ముందరే ప్రకటించాను. తరవాత వారందరినీ ఇక్కడికి ఆహ్వానించి, ఎవరైతే పోటీలో గెలిచారో వారి పుస్తకాల ఆవిష్కరణ చేశాను. ఇదంతా ఒక్కడినే చేశాను. జాషువా జయంతి సందర్భంగా మీసాల లక్ష్మణ్ అనే అతన్ని సన్మానించాము. అప్పుడు భాష్ప సందేశం అని యూట్యూబ్‌లో పెట్టిస్తే నాలుగు లక్షల వీక్షణలొచ్చాయి. దాని రచన పాటిబండ్ల ఆనందరావుగారే ..నేను ఏది చేసినా ఒంటరి పోరాటమే.. ఒంటరి ప్రయాణమే..*

**సంభాషణ : అశ్వినీకుమార్**

**ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు *(అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

# నిరసన కళ

– టి.వి. ప్రసాద్

నిరసన అంటే తిరస్కారం, ధిక్కారం, తిరుగుబాటు, ప్రతిఘటన. లేదు, కాదు, వద్దు అని చెప్పడానికి సులభమైన మార్గం నిరసన. నిరసన ప్రకటించే మార్గాలు అనేకం. మౌనం, సహాయ నిరాకరణ, హెచ్చు స్వరంతో జవాబు యివ్వడం, కోపం ప్రదర్శించడం, ఉన్నచోటు నుండి వెళ్ళిపోవడం, ఉన్నచోటనే ఉండి పనికి ఆటంకం కలిగించడం లాంటి పద్ధతులు ఎన్నో! ఐనా ఇవేవీ కళారూపాలు కావు. సాధారణంగా నిరసన అహింసాత్మకం. దీని ముఖ్యోద్దేశం చైతన్యం కలిగించడం. నిరసనను కళాత్మకంగా ప్రదర్శించడమే నిరసన కళ.

మహాత్మాగాంధీ చేతిలో నిరసన (నిరాహారం, ఉపవాసం) ఆయుధానికి మారు పేరుగా మారిపోయింది. నిరసనే ఆంగ్లేయులను గడగడలాడించి, భారతదేశ స్వాతంత్ర్య సిద్ధికి దోహదం చేసింది. గాంధీ అహింసా సిద్ధాంతానికి ఆయుధంగా మారింది. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరసన దీక్షతోనే ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. నిరసన అనాదిగా పాటించబడుతున్న అహింసా మార్గం. సత్యభామ పారిజాత పుష్పం కోసం చేసిన నిరసన ప్రసిద్ధమైంది. స్త్రీలకు ఆదర్శంగా మారిపోయింది. ఆమె కోపం కూడా 'సత్యాగ్రహం'గా రూపాంతరం చెందింది. మన ఇండ్లలో తరచుగా తండ్రులు కోపాన్ని ప్రదర్శించడం, తల్లులు, పిల్లలు నిరసనను తెల్పడం సర్వసామాన్యం. ఎక్కడ ఒత్తిడి, అణచివేత, సమస్య, అన్యాయం, అసమానతలుంటాయో అక్కడ నిరసన వుంటుంది. నిరసన ప్రజాస్వామ్య ముఖ్య లక్షణం. నిరసనకు తావులేని ప్రభుత్వాలు, అధికారం, వ్యవస్థలు నిరంకుశ ధోరణిననుసరిస్తాయి.

ప్రాణనష్టం జరగకుండా, ప్రశాంతంగా సమస్యను ఎత్తి చూపుతూ నిరసనను తెలపడం నిరసన కళ ముఖ్యోద్దేశం. దీన్ని చిత్ర, శిల్ప రూపంలోగానీ, ఆటపాటల రూపంలో గానీ ప్రదర్శించవచ్చు. ఇది సమస్యను ఎత్తి చూపడంతో పాటు ఉత్తేజం కలిగిస్తూ మార్పుకు దోహదం చేస్తుంది. బహిరంగ ప్రదర్శన ద్వారా ప్రజాభిప్రాయాన్ని, ప్రభుత్వ విధానాన్ని ప్రభావితం చేయగలుగుతుంది. పైన చెప్పుకున్నవన్నీ తాత్కాలిక జోక్యాలు. వీటికితోడు ప్రజా సమూహాలను, ప్రజా సంఘాలను నిరసనలో పాల్గొనే చేస్తే ఆశించిన మార్పును త్వరగా సాధించడానికి వీలవుతుంది.

తిరుగుబాటు తొలిరూపం నిరసన. అణచివేత, అసహనం, వివక్ష, వేధింపు, చిన్నచూపు మొదలగు అంశాలు నిరసనకు కారణాలు. చైతన్యం కలిగించడం, అలజడి సృష్టించడం నిరసన కళ లక్ష్యం. ఉత్తరాలు, అప్లికేషన్లు, అర్జీలు, పోస్టర్లు, బేనర్లు, కరపత్రాలు, గోడమీది రాతలు, ప్రదర్శనలు వగైరాలు మౌనంగా, అహింసాత్మకంగా నిరసన తెలిపే మార్గాలు.

**నిరసన కళ స్వభావం – లక్షణాలు :** ఇది వ్యవస్థకు వ్యతిరేకం. ప్రధాన స్రవంతి కళా లక్షణాలను పట్టించుకోదు. నియమాలను, కట్టుబాట్లను ఉల్లంఘిస్తుంది. దీనిలో వాణిజ్య ప్రకటనలకు తావుండదు. నిరసన కళ తాత్కాలికం, కళాకృతుల్ని నిర్మించడం, నిర్మూలించడం, తొలగించడం, ఒకచోటు నుండి మరొక చోటుకు తరలించడం సులభం.

ఈ కళ వెనక ప్రత్యేకంగా ఒక వ్యక్తి అంటూ వుండదు. ఇది సమష్టి కృషి ఫలితం. దీన్ని బహు రూపాల్లో ప్రదర్శించవచ్చు. ప్రాంతానికి, సమయానికి, అవసరానికి తగ్గట్టుగా మార్చుకోవచ్చు. వీధి కళ, ఎగ్జిబిషన్లు, ఆటపాటల ప్రదర్శనలు, కరపత్రాలు మొదలైనవి నిరసన కళ ప్రచారాస్త్రాలు. ఇది రాజకీయ విమర్శనాత్మకం, అధికార ప్రశార్థకం, యుద్ధం, హింస, అణచివేత, జాతుల అసమానత, వాతావరణ కాలుష్యం, మానవ హక్కుల పరిరక్షణ మున్నగు అంశాలను చేపడ్తుంది. ప్రజలను ఉత్తేజపరచి, చైతన్యవంతుల్ని చేసి ఉద్యమబాట పట్టించడం ద్వారా సమస్య పరిష్కారానికి దారి చూపుతుంది.

వ్యవస్థలోని లొసుగుల్ని ఎత్తి చూపిస్తుంది, సవాలు చేస్తుంది. మాటలతో చెప్పలేని భావాలకు కళారూపాన్నిస్తుంది. సాంప్రదాయ కళా రంగ అశ్రద్ధకు, అనాదరణకు గురైన

ద్రాఫిటీ మ్యూరల్సు లాంటి కళా మాధ్యమాలకు అవకాశం కల్పిస్తుంది. వివిధ దృశ్య కళా మాధ్యమాల మధ్య హద్దుల్ని చెరిపేస్తుంది. ఇది దేశ కాల పరిమితుల్ని అధిగమించే విశ్వజనీన కళ (). నిరసన కళాకారులు కళా కోవిదులు కానవసరం లేదు. వృత్తిపరమైన ప్రత్యేక శిక్షణ, జ్ఞానం, ప్రజ్ఞ కూడా అవసరం లేదు.

సామాజికాంశాల్లోని అసంతృప్తి నిరసన కళకు దారి చూపుతుంది. సమాజకాంశాలు దేశ కాల పరిస్థితుల్ని బట్టి మారుతుంటాయి. సతీసహగమనం, వితంతు వివాహాలు, బాల్య వివాహాలు, వరకట్నాలు, మన సమస్యలైతే, అధిక జనాభా, కుటుంబ నియంత్రణ, వలసలు, పర్యావరణ కాలుష్యం, అంటు వ్యాధులు, అవినీతి, లంచగొండితనం, ద్రవ్యోల్బణం, ఆహార కొరత, అధిక ధరలు, జాతుల అణచివేత, ఎన్నికలు, మహిళా వేధింపులు, సరిహద్దు వివాదాలు లాంటివి ఎన్నెన్నో సర్వకాల, సార్వజనీన సమస్యలు. సమస్యలననుసరించి నిరసన కళారూపాలు కూడా మారుతుంటాయి. నిరసన తర్వాతి రూపం ప్రతిఘటన. అధికార దుర్వినియోగం ప్రతిఘటనకు దారి తీస్తుంది. ప్రతిఘటనను కూడా కళారూపంలో ప్రదర్శించవచ్చు. బలమైన సందేశాలతో కుడ్య చిత్రాలు, పోస్టర్లు, శిల్పాలు, టీషర్టుల మీది రాతలతో వాస్తవ పరిస్థితి పైన దాడి చేస్తాయి. నిరసన కళా రూపంలో ఫలానా కాలంలో మొదలైందని చెప్పడం కష్టం. ఆయా దేశాల్లోని సమస్యలను ప్రజల దృష్టి నాకర్షించేలా చేయడానికి వివిధ దేశాల్లో, వివిధ కాలాల్లో నిరసన కళ విస్తరించింది. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ దేశాలన్నిటా నిరసన ఉద్యమాలు చోటు చేసుకున్నా పందొమ్మిదవ శతాబ్దపు మలిదశలోనూ, ఇరవయ్యవ శతాబ్దపు తొలి దశలోనూ నిరసన రూపాలు బహుళంగా కనిపిస్తాయి. ఇంగ్లండులో స్త్రీలు ఓటు హక్కు కోసం 1918 నుండి చేసిన పోరాటం, పికాసో యుద్ధ వ్యతిరేక చిత్రం గెర్నికా, 1937 తర్వాత అనేక మంది కళాకారులు వివిధ శైలుల్లో సందేశాన్ని యివ్వడం కన్పిస్తుంది. అసమానతలు, సామాజిక అన్యాయం పట్ల విశ్వవ్యాప్తంగా అవగాహన పెరిగిపోవడం దీనికి కారణం కావచ్చు.

మొదటి ప్రపంచ యుద్ధ పరిమాణాల ఫలితంగా దాడాయిజం పుట్టుకొచ్చింది. వ్యంగ్యం, అర్థరహితం, వ్యవస్థ మీది ద్వేషం దాడాయిజం (ఆర్ట్) ముఖ్య లక్షణాలు. స్పెయిన్ అంతర్యుద్ధం పికాసో గెర్నికా పుట్టుకకు కారణం. రెండూ కూడా యుద్ధ వ్యతిరేక కళారూపాలే. ఆ తర్వాత 1950ల్లో ఇంగ్లండ్, అమెరికాల్లో పాప్ ఆర్ట్ ఉద్యమం సాంప్రదాయక కళారూపాలపై తిరుగుబాటుగా ప్రచార రూపంలోనూ, కామిక్ పుస్తకాల రూపంలోనూ అభివృద్ధి చెందింది. వ్యక్తిగత రాగ ద్వేషాల కతీతంగా సామాజికాంశాల్లోని లోపాలను సున్నితంగా విమర్శించడం పాప్ ఆర్ట్ లక్ష్యం. ఒలైన్ బర్గ్ వస్తువుల్ని జారవిడవడం, వార్‌హోల్ వేసిన చిత్రాలనే మళ్ళీ మళ్ళీ వేసి విసుగు పుట్టించడం, అలజడి సృష్టించడం వారి కళా లక్ష్యం. సైకిల్ చక్రం ఫౌంటేన్ (యూరిన్ టబ్) లాంటి రడీమేడ్ వస్తువుల్ని దూషాంప్ ఎంచుకున్న వైవిధ్య కళామార్గం.

1930ల్లో అమెరికా నిత్య జీవితంలోని దృశ్యాలు – రోడ్డు నిర్మాణంలోని శ్రమ, పద్ధతిని చూపే ఫొటోగ్రాఫ్‌లు, ప్రాంతీయతను ప్రతిబింబిస్తూ జీవితంలోని చేదు నిజాలను చూపే పెయింటింగులు, సామాజిక వాస్తవికతకు అద్దం పట్టే ఫొటోగ్రాఫర్లు జాన్‌స్లూన్, రాబర్ట్ హెన్రీ, జార్జి బెలోస్, జార్జి లూక్‌లు, పబ్లిక్ భవనాల మీద అమెరికా జీవన దృశ్యాలను మ్యూరల్స్ రూపంలో చిత్రించడానికి అనేకమంది కళాకారులకు పని దొరికింది.

అమెరికా ఆర్థికమాంద్య (డిప్రెషన్) కాలంలో పెరిగిపోయిన నిరుద్యోగ సమస్య. బీదరికం ఇతివృత్తాలుగా వేసిన బొమ్మలు సామాజిక స్పృహను కలిగించడంలో బాగా తోడ్పడ్డాయి. అమెరికాలోనే నల్ల జాతి వివక్షతకు వ్యతిరేకంగా, నల్లవారి జీవితాలకూ విలువ ఉందని చెప్పడానికి చైతన్య కళగా రూపుదిద్దుకుంది. అసమానత పట్ల చిత్రకారులు తమ కోపాన్ని ప్రదర్శించడానికీ, నిరసన తెలిపడానికీ ఎన్నడూ వెనకాడలేదు. నల్లజాతివారిని సంఘటిత పరచడం, వ్యక్తులకు, సమూహాలకు అధికారాన్ని కట్టబెట్టడం, రాజకీయ, సామాజిక స్పృహ కలిగించడం, ప్రత్యక్ష చర్యల్లో పాల్గొనడం కోసం చేసిన చిత్రకారుల కృషి అపారం. స్టీవ్ బికో, జాకబ్ లారెన్, ఎలిజబత్ కాట్‌లెట్, డిగోరివేరా, ఫెయిత్ రింగ్ గోల్డ్, ఫ్రిదాకాలో డోరాథియా లాంజ్ మొదలైన చిత్రకారులు చురుగ్గా పాల్గొన్న కళాకారుల్లో కొందరు.

1928 వరకు ఇంగ్లండ్‌లో స్త్రీలకు ఓటు హక్కులేదు. ఎన్నెన్నో ప్రదర్శనలు, పోరాటాల తర్వాతనే వారికి 1918లో ఓటువేసే అర్హత, అదీ ముప్పై సంవత్సరాలపై బడినవారికి మాత్రమే లభించింది. ఆ తర్వాత మరో పదేండ్లకు (1928) ఇరవై ఒక్క సంవత్సరాలు దాటిన స్త్రీలందరికీ పురుషులతో సమానంగా ఓటుహక్కు సాధ్యమైంది. అలాగే రష్యా, అమెరికా, ఇండియా మొదలైన దేశాల్లో స్వాతంత్ర్య సముపార్జనకు జరిగిన నిరసన పోరాటాలు జగత్ప్రసిద్ధాలు.

**నిరసన ప్రదర్శనకు ఉపయోగపడే గుర్తులు (Symbols of Pnotest): పైకెత్తిన పిడికిలి :** కార్మికవర్గ సమైక్యతకు, ఫ్రెంచి తిరుగుబాటుకు ఇది గుర్తు. మూతికి గుడ్డ కట్టుకోవడం, మౌన ప్రదర్శనకు, అసమ్మతిగి గుర్తు.

**మూడువేళ్ళ సెల్యూట్ :** మయన్మార్, థాయిలాండ్, హాంగ్ కాంగ్ దేశాల్లో 2014 నాటి తిరుగుబాటు అణచివేతకు వ్యతిరేక నిరసన సందేశం, సమైక్యతా చిహ్నం.

**పూలు :** సున్నిత సుకుమార పుష్పాలు శాంతియుత ప్రతిఘటనకు సంకేతాలు. మిలిటరీ దళాల కాల్పుల్లో మరణించిన అమర వీరుల గౌరవార్థం బహిరంగ ప్రదేశాల్లో చేసే పుష్ప గుచ్ఛాల ప్రదర్శన ఇందుకు ఉదాహరణ.

**కండ్లు :** పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా గోడల మీద, పోస్టర్ల మీద, టాపెస్ట్రీల మీద వెలసిన కళ. చిలీ, హంగ్‌కాంగ్ దేశాల్లో తరచుగా జరిగిన దౌర్జన్యాలకు సంకేతాలు. 23 అడుగుల పొడవైన చిత్ర యవనిక (టాపెస్ట్రీ). దీని రూపకర్తలు లిలియన్ ఉర్జువా, మరియా ఇగ్నేషియా జరేజ్‌లు, మరో 359 మంది కళాకారుల సమష్టి కృషి ఫలితం ఈ భారీ పరదాగుడ్డ చిలీ నిరసనలలో గాయపడ్డ, రక్తమోడుతున్న కండ్లకు ప్రతిరూపం.

**బిగించి పైకెత్తిన నల్ల పిడికిలి :** నల్లజాతి వారి సామూహిక శక్తికి సంకేతం.

**మూడు వివిధ రంగుల పిడికళ్ళు :** స్త్రీవాదుల ఐకమత్యానికి చిహ్నం.

**రెండు జండాలు :** శాంతిచిహ్నం (Anti Pascist Symbol) జాతి వ్యతిరేక, నిరంకుశ, కర్కశపాలనకు వ్యతిరేక చిహ్నం.

**ఎర్రరంగు :** విశ్వ వ్యాప్తంగా విప్లవానికి గుర్తుగా ఆమోదం పొందిన రంగు.


అహింసా శిల్పం

గేస్ మాస్కులు ఇస్తాంబుల్, టర్కీల్లో పోలీసులు ప్రయోగించిన టియర్ గేస్ నుండి రక్షణగా మూతికి ధరించిన ముసుగులు. ఇస్తాంబుల్ నగరం మధ్యలో వున్న పచ్చిని బహిరంగ ప్రదేశాన్ని ధ్వంసం చేయడానికి నిరసనగా తలెత్తిన ఉద్యమం. LGTBT లోగో పింక్ ట్రయాంగిల్, యూకే NHS లోగో, A వృత్తంలో ఉన్న A అరాచకానికి, దాని చుట్టూ వున్న వృత్తం క్రమపద్ధతికి చిహ్నాలు. ఇవేకాక నిరసన కళా రూపాలు మరెన్నో. బిగించిన పిడికిలి స్త్రీలపై జరుగుతున్న హింసకు గుర్తు. పిడికిట్లో కలం, మైక్ ప్రచార చిహ్నాలు.

**అహింసా శిల్పం (The Knotted Gun) :** కార్ల్ ఫ్రెడరిక్ రూటర్స్ వార్డ్ సృజించిన కంచు శిల్పం. ఈ శిల్ప పరిమాణం. దాన్ని స్థాపించిన ప్రదేశం రెండూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. శిల్పం పేరు 'అహింస'. దీని మరో పేరు 'పేలని తుపాకీ'. 45 కేలిబర్ రివాల్వర్ – బేరల్ ముడి వేయబడి ఉంటుంది అంటే అది ఎన్నటికీ పేలదు అని అర్థమవుతుంది.

స్వీడిష్ కళాధికారుడు రూటర్స్‌వార్డ్ దీన్ని 1980లో తన స్నేహితుడు జాన్ లెన్నన్ హత్యగావించబడిన తర్వాత, అతడి మరణం నాకు చాలా కోపం కల్గించింది. అకారణమైన హింసను సహించలేకపోయాను. అది తట్టుకోలేక సరాసరి నా స్టూడియోకు వెళ్ళి పని మొదలు పెట్టాను. నిరసన తెలిపే పద్ధతుల్ని అనేకం ఆలోచించి చివరకు ఈ శిల్పాన్ని నిర్మించాను. మొదట దీన్ని స్ట్రాబెరీ ఫీల్డ్స్ మెమోరియల్, న్యూయార్క్ సిటీ సెంట్రల్ బాంక్ అతడు నివసించిన ఇంటికి సమీపంలో స్థాపించాలనుకున్నాను అని చెప్పుకున్నాడు. ఆ తర్వాత ఈ శిల్పాన్ని లక్సెంబర్గ్ ప్రభుత్వం ఐక్యరాజ్యసమితికి దానం చేసింది. ఇప్పుడది యుఎన్ భవనం వద్ద (న్యూయార్క్) ప్రతిష్ఠించబడింది. ఈ శిల్పాన్ని స్థాపించినప్పటికీ ఇంకా అమెరికా ఆయుధాలను విచ్చలవిడిగా ఉపయోగించే దేశంగా కొనసాగడం విచిత్రం. ఐక్యరాజ్యసమితి భవనాల వద్ద ఈ శిల్పం నిశ్శబ్దంగా, బలంగా ఆయుధ హింసను, యుద్ధాన్ని వ్యతిరేకిస్తుంది. ప్రస్తుతం ఈ శిల్పం నకళ్ళు స్వీడన్, జర్మనీ,

ఫ్రాన్స్, దక్షిణ అమెరికా, మెక్సికో, ఇండియా లాంటి ముప్పై దేశాల్లో ఉన్నాయి. ఇవి స్మారక చిహ్నాలుగా, శాంతి, అహింసలకు ప్రతినిధులుగా నిలిచాయి.

జాన్ లెన్నన్ శాంతి, అహింసల కోసం పోరాడి విశ్వశాంతి కోరుకున్న వ్యక్తి. (ఇతణ్ణి కాల్చి చంపింది మార్క్‌డేవిడ్ ఛాప్‌మన్). నిరసన కళను గురించి చెప్పుకున్నప్పుడు ఇతర రూపాలైన చైతన్య కళ, ప్రతిఘటన కళలను గురించి చెప్పుకోక తప్పదు. ప్రతిఘటన కళ తర్వాత యుద్ధ వ్యతిరేక ఉద్యమాలు మొదలౌతాయి. సాధారణంగా ఉద్యమాలు విజయం సాధిస్తాయి అరుదుగా ఉద్యమం విఫలమైనప్పుడు యుద్ధం అనివార్యం అవుతుంది. నిరసనతో మొదలైన వ్యతిరేకత వివిధ దశలు దాటి అంతిమంగా యుద్ధంతో ముగుస్తుంది.

**చైతన్యకళ :** నిరసన కళ కన్నా మరింత శక్తివంతమైనది. కార్యాచరణ దీని ముఖ్య లక్షణం. సాంస్కృతిక కేంద్రాలు చైతన్య కళకు మూలాధారాలు. కోలాటాలు, భజనలు, ఆటపాటలు, డాన్సుల్లాంటి వివిధ కార్యకలాపాలకు వేదికలు. విద్యా సంబంధిత సందర్శనలు, ప్రదర్శనలు, అలంకరణలు, ముగ్గుల, వంటల పోటీలు విచిత్ర వేషధారణ లాంటివి ఇవి చేపట్టే అంశాలు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడానికి చైతన్య కళ దోహదం చేసింది.

పట్టణాలు, నగరాల్లో వివిధ కమ్యూనిటీలకు చెందిన సాంస్కృతిక సంస్థలు సంస్కృతీ పరిరక్షణలో చురుకుగా పని చేస్తాయి. వారి వారి నూతన సంవత్సర వేడుకలు, పండుగలు నిర్వహిస్తాయి. ఇతర రాష్ట్రాల్లో విదేశాల్లో వున్న మన తెలుగువారు, ప్రవాస భారతీయులు నడిపే సంస్థలు సాంస్కృతీ పరిరక్షణలో మన సాంప్రదాయాన్ని ముందు తరాలకు అందించడంలో కృషి చేస్తున్నాయి. చైతన్య కళారూపాలు సాంఘిక ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర వహిస్తాయి. చైతన్య శీలురైన మహిళలు 'గొరిల్లా గరల్స్' పేరుతో వివిధ ప్రక్రియల ద్వారా జాతిలింగ వర్ణ వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాలు సల్పి తమకు తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం సాధించడంలో కృషి చేశారు.

వ్యక్తులను, సమూహాలను బలోపేతం చేయడం, సామాజిక స్పృహను కల్గించడం, వ్యవస్థల్లోని లొసుగుల్ని వైఫల్యాలను ఎత్తి చూపడం చైతన్య కళా లక్ష్యం, వాంఘో – ద బెడ్ రూం, పికాసో – గెర్నికా, జార్జి సూరత్ – 'ఆదివారం నదీ తీరాన', డిగోరివేరా – వీవింగ్ పెయింటింగులు మొదలైనవి ఉదాహరణలు.

**ప్రతిఘటన కళ :** ఈ కళా లక్షణం తీవ్రత. ఇది రాజకీయ, సామాజిక సమస్యల్ని శక్తివంతంగా ప్రతిఘటిస్తుంది. 1970లో దక్షిణాఫ్రికాలోని 'సోవెటో' తిరుగుబాటు అల్లర్లు దీని పుట్టుకకు కారణం. వర్ణ వివక్షతకు వ్యతిరేకంగా నల్లజాతి విద్యార్థుల నేతృత్వంలో ప్రదర్శనలు, నిరసనలు వెల్లువెత్తాయి. పోలీసుల కాల్పుల్లో మరణించిన హెక్టర్ పీటర్స్ విద్యార్థుల చైతన్యానికి కారకుడు. వారికి తమ జాతి పట్ల స్పృహ వ్యాప్తి కొరకు పోరాటం చేయవలసి వచ్చింది. గోడల మీద బొమ్మలు, రాతలు, బేనర్లు, పోస్టర్లు, టీషర్టుల మీద నినాదాలతో వారిలో చైతన్యం పెల్లుబికింది. ఆఫ్రికన్లు సంఘీభావంతో వర్ణ వివక్షను వ్యతిరేకించగలిగారు.

ప్రతిఘటన కళ ప్రశ్నించే గళాలకు కొత్త శక్తినిచ్చి, సమస్యలపై దృష్టి సారించేలా చేసింది. స్వీయ నిర్ణయాలతో వ్యతిరేకించడానికి, విమర్శించడానికి తోవ చూపింది. సృజనాత్మక అభివ్యక్తితో అణగారిన వర్గాలకు ఊరడింపు కలిగించి. వారి ఆశలకు ఊపిరిలూదింది. అధికార పీఠంపై తిష్ట వేసిన వారి అన్యాయాలను ప్రతిఘటించింది. జర్మన్ నాజీ పార్టీ దక్షిణాఫ్రికా నల్లజాతివారి పట్ల చూపిన వివక్షత, సోవెటో అలర్లు అన్నీ బహిరంగ కళారూపాల్లో, నినాదాలతో వెల్లువెత్తడానికి కారణమయింది.

**మానవత్వపు వ్యంగ్య కళ :** మార్పు దీని ముఖ్య లక్ష్యం. లక్సా బైనర్ ఈ పద సృష్టికర్త. వీధికళాకారుడు బాంక్సీ తన గోడల మీద రాతలు, చిత్రాల ద్వారా ఈ కళకు విశేష ప్రచారం కల్పించాడు, వివాదాస్పద దృశ్యాలు, చిత్రాలు, రాతలను గంభీర, వ్యంగ్య హాస్యాలతో చిత్రించడం ఇతని ప్రత్యేకత. ఈ కళ సమాజాన్ని వెక్కిరిస్తూ, వీక్షకుని రకరకాలుగా ఆలోచింపజేస్తుంది. సమాజంలో అంతర్గత మార్పును కోరుకుంటుంది. రాజకీయ వ్యాఖ్యలు, సమకాలీన సాంఘిక సమస్యలు ఈ కళకు ముడిసరుకు.

### చరిత్రకెక్కిన కొన్ని నిరసన ప్రదర్శనలు

**బోస్టన్ టీ పార్టీ :** అమెరికాలో తిరుగుబాటుకు తొలి అడుగు. ఆ దేశంలో స్థిరపడిన వలసవాదులు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన చర్య. సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా చేసిన ప్రభుత్వ చట్టం (1773) దీనికి ప్రేరణ. ఈస్టిండియా కంపెనీకి వ్యాపారంలో

సార్వభౌమాధికారాన్ని కట్టబెట్టినందుకు నిరసనగా సాగిన ఉద్యమం. అరవై మంది నిరసనకారులు రెడ్ ఇండియన్ల వేషంలో బోస్టన్ హార్బర్లోకి ప్రవేశించి 16 డిసెంబర్ 1773న టీ పొడి పార్సెళ్ళను సముద్రంలో కలిపేస్తారు. ఇక్కడి నుండి వ్యవహారం ముదిరి 1975లో ఉద్యమరూపం దాల్చి 1783లో అమెరికాకు స్వతంత్రం సాధించేవరకు కొనసాగింది.

**వర్ణవివక్షకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమం :** ఇదీ అమెరికాలోనే జరిగిన 1963 నాటి భారీ నిరసన, బానిసత్వ నిర్మూలన తర్వాత కొనసాగిన వర్ణ వివక్ష, సమాన ఉద్యోగాల లేమి దీనికి కారణాలు. 1963 మార్చిలో జరిగిన ఈ భారీ ప్రదర్శనలో రెండున్నర లక్షల మంది లింకన్ స్మృతి కేంద్రం వద్ద గుమిగూడిన ఉద్యమకారుల నుద్దేశించి మార్టిన్ లూథర్ కింగ్ చేసిన ప్రసంగం 'ఐహేవ్ ఎడ్రీమ్' చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది.

**అవర్ లైవ్స్ మేటర్ :** 'మా ప్రాణాలూ విలువైనవే' అనే నినాదంతో మార్చి 24, 2018న అమెరికాలో జరిగిన తుపాకీ కాల్పులకు నిరసనగా తలెత్తిన ఉద్యమం. క్రమక్రమంగా ప్రపంచ దేశాలన్నిటా వ్యాపించింది. కుగ్లస్ హైస్కూలు పూర్వ విద్యార్థి ఒకడు సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌తో జరిపిన కాల్పుల్లో పదిహేడు మంది అమాయక విద్యార్థులు మరణించారు. (ఈ విషాద సంఘటన చరిత్రనే మలుపు తిప్పి తర్వాతి కాలంలో తుపాకీ లైసెన్స్ నియంత్రణ చట్టానికి వీలు కల్పించింది). అమెరికాలో 80 వేలమంది, ప్రపంచ దేశాల్లో లక్షలాది మంది మద్దతు తెల్పడానికి (నిరసన) ప్రదర్శనలు చేశారు.

**నల్లవారి జీవితాలూ విలువైనవే :** 2020 మేలో ఒక పోలీస్ చేతిలో మరణించిన జార్జి ఫ్లాయిడ్ ఉదంతం ప్రపంచాన్ని ఉలికిపడేలా చేసింది. ఉద్యమకారులు వీధుల్లోకి వచ్చి నల్లజాతి వారి ప్రాణాలకూ, వారి హక్కులకూ మద్దతు తెలపగా రాజకీయ నాయకులు కూడా తమ దృక్పథాన్ని మార్చుకోవలసిన అవసరాన్ని గుర్తించారు. బెల్జియం, ఇంగ్లండు దేశాలు చట్టాల మార్పుకు నడుంకట్టగా, మొదటిసారిగా అమెరికా పోలీస్ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.

**1930 – గాంధీ దండియాత్ర :** 80 మందితో మొదలైన ఈ యాత్ర వేలాది ప్రదర్శకులతో ముగిసింది. చట్ట ఉల్లంఘన, విదేశీ వస్తు బహిష్కరణ, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైన అహింసా పద్ధతుల్లో భారతదేశ స్వాతంత్ర్యానికి బీజం వేసిన ఈ ఉప్పు సత్యాగ్రహయాత్ర చరిత్ర గతినే మార్చి వేసింది.

**వ్యవసాయదారుల నిరసన (2021) :** ఇది మన దేశ రాజధానినే గడగడలాడించింది. రైతుల వ్యతిరేక అన్యాయపు చట్టాలకు నిరసనగా ఉవ్వెత్తున లేచిన ఉద్యమం. రెండు కోట్ల ఏబది లక్షల మంది రైతులు పాల్గొన్నట్లు మానవ హక్కుల వనరుల కేంద్రం లెక్క తేల్చింది. వ్యవసాయదారులు, రైతులు తమ ఉత్పత్తుల్ని అమ్ముకోవడానికి, నిల్వ చేసుకోవడానికి ధరను వ్యవసాయ దారులందరిపై భారత రైతు ఉద్యమం ప్రభావం చూపింది.

**ఇరాక్‌పై అమెరికా యుద్ధం (2003–2011) :** ఉగ్రవాదాన్ని అణచడానికి అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పోలెండ్ సైన్యాలు ఇరాక్ మిలిటరీ దళాలను ఓడించి బాగ్దాద్‌కు విముక్తి కలిగించాయి – ఆక్రమిత ఇరాక్‌లో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దశల వారీగా అమెరికా తన సైన్యాలను ఉపసంహరించుకుంది. ఈ యుద్ధంలో 45 వేల మంది అమెరికా సైనికుల ప్రాణాలు పోగా 32 వేల మంది గాయపడ్డారు. లక్షలాది ప్రజలు నిరాశ్రయులు కావడంతోపాటు, అరాచకం, వ్యవస్థల పతనం, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. ఇరాక్, ఇరాన్, ఉత్తర కొరియా దేశాల కూటమిని దుర్మార్గపు కూటమిగా గుర్తించి అమెరికా దాడి చేసింది. 2001 సెప్టెంబర్ 11న జరిగిన ప్రపంచ వాణిజ్య భవనాల జంటపై జరిగిన ఉగ్రవాదులు దాడి కూడా ఒక కారణం.

ఈ యుద్ధం ఉగ్రవాదంపై ప్రపంచయుద్ధంగా పేరు గాంచింది (Global war on Terror) ఇరాక్ యుద్ధానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ శాంతియుత నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. లక్షలాదిగా పాల్గొన్న గొప్ప నిరసన ప్రదర్శనగా చరిత్రలో నిలిచి పోయింది.

**నిరసన కళపైన వచ్చిన పుస్తకాలు – సినిమాలు :** ప్రొటెస్ట్ ఆర్ట్ – రచయిత్రి జెస్సికా లేక్ (Jessica Lack )

**ఆర్ట్ ఆఫ్ ప్రొటెస్ట్ – డిని కోల్స్ :** The Art of protest - Political art & activism. Pub by Die Gestalten Verleg.

ఇవేకాక ఇంకా దజన్ల కొద్ది పుస్తకాలు 'నరసన కళ మీద' దొరుకుతాయి – పైన పేర్కొన్న మూడు పుస్తకాలూ దానికదే ప్రత్యేకత కలిగినవి.

ప్రొటెస్ట్ ఆర్ట్ మీద జెస్సికా లేక్ పుస్తకం నిరసన కళాకారులకు మార్గదర్శిగా పని చేస్తుంది. కళాకారులు ఉద్యమాల్లో కీలక పాత్ర నిర్వహిస్తే వచ్చే ఫలితాలు; యుద్ధం, వలసవాదం, స్వతంత్రం ప్రభుత్వాల్లో మార్పులను చర్చించి, కళలు రాజకీయాలకు గల సంబంధాల్ని వివరిస్తుంది. అంతర్జాతీయ పాఠకుల ఆదరణ పొందిన పుస్తకం.

ఆర్ట్ ఆఫ్ ప్రొటెస్ట్ – రచయిత డి.నికోల్స్ – చైతన్యవాదులకు కరదీపికలాంటిది. ఎందరెందరో యువ కళాకారుల సహకారంతో, శక్తివంతమైన వివరణ, అందమైన చిత్రాలతో తిరుగుబాటు నమూనాలు, సూచనలు, ఉపయోగకరమైన చిట్కాలతో నిరసన కళపైన సమగ్రమైన పుస్తకం.

మూడవది ద ఆర్ట్ ఆఫ్ ప్రొటెస్ట్ – పొలిటికల్ ఆర్ట్ అండ్ ఏక్టివిజం (2021). కళ, రాజకీయాలు, చైతన్య ఉద్యమాల మధ్య గల సంబంధాల్ని, గత కొన్ని దశాబ్దాల్లో కళాకారులు రాజకీయ సాంఘిక సమస్యలపై ఎలా స్పందించింది, రాజకీయ నాయకులకు అంతు చిక్కని ప్రజా నాడిని ఒడిసి పట్టుకున్న వైనాన్ని వివరిస్తుంది.

**నిరసన తెలపడానికి రాసిన పుస్తకాలు :** ములక్ రాజ్ ఆనంద్ ఇండో – ఆంగ్లియన్ నవలా రచయిత. సమాజ రుగ్మత – పాకీ పనిని ఎండగట్టే 'అన్ టచ్‌బుల్స్' నవల.

జార్జి ఆర్వెల్ పుస్తకాలు ఏనిమల్ ఫామ్ (Animal Form) కమ్యూనిజంపై ఘాటు విమర్శ. రాజకీయ వ్యంగ్య వైభవంతో పాఠకులను అలరిస్తుంది. దీన్ని కమ్యూనిస్ట్ దేశాలు నిషేధించాయి. 1984 నవల 'డిస్టోపియా' పీడ కలగా అభివర్ణించబడింది. ద జంగిల్ (The Jungle) అదుపులేని ఉత్పత్తి, బాలకార్మికులు, కఠోర శ్రమ మొదలైన అంశాలు ఇతివృత్తంగా సిన్‌క్లెయిర్ (Upton Sinclair) రాసిన పుస్తకం.


**నిరసన ఇతి వృత్తంగా వచ్చిన సినిమాలు కొన్ని :** ద గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్ – అరుంధతీరాయ్ (2017), బేటిల్ షిప్ పొటెమ్‌కిన్ (Potem kin) (1925), ద బేటిల్ ఆఫ్ అల్జీర్స్ (1966), మేన్ ఆఫ్ ఐరన్, మాల్కమ్, సెల్మా, మీడియమ్ కూల్ మొదలైనవి.

*నిరసన పోరాట సాధురూపం. యుద్ధం నిరసన ఉగ్రరూపం.*

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

## కమ్మతెమ్మెరలు

ఏప్రిల్ **మిసిమి** అందమైన చిత్రాల సొగసుతో నా ఒడిలో వాలింది. లలిత సంగీత పరిమళం సుతారంగా మా హృదయాల్ని పట్టుకుంటున్నది. దాశరధి – బాపిరాజు గారు పాటల గురించి రసవత్తరమైన వ్యాఖ్యానం రమ్యంగా వున్నది. శ్రీ పురుషోత్తమాచార్య గారు సంగీతం గురించి బాగా వ్రాస్తారు. నిజంగా ఆయన సంగీత కళానిధి. వారికి ధన్యవాదములు. జీవన మకరంద మాధుర్య మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. శ్రీ విశ్వేశ్వర రావు గారితో యింటర్వ్యూ – వారి విశిష్టవంతమైన వ్యక్తిత్వాన్ని దర్శింప చేస్తున్నది.




డా. జొన్నలగడ్డ వారు 'పప్పన్నం' తినిపించారు. చక్కని రచన. తాత్విక కవయిత్రి బుఱ్ఱా సూరమాంబ గారి గురించిన రచన – పరిశోధనా పూర్వక రచన. ఆ మాతృమూర్తి పేరు ఈ రచన ద్వారా విన్నాను. శ్రీమతి నాగ రాజ్యలక్ష్మి గారి వ్యాసాలు బాగుంటున్నాయి. **మిసిమి** చింతనాత్మక సాహిత్యం నా వంటి వారికి జ్ఞానదీపం సుమా! రచనలన్నీ చదివి నా మనస్సును రాగరంజితం చేసుకుంటున్నాను.

*- చెరుకువాడ వెంకట రామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184*






*– వి. నాగరత్న*

స్వతహాగా ఆర్టిస్టు అయిన శ్రీమతి నిర్మలా దత్ గోయంకా విపశ్యనలో సాధన చేశారు. హైదరాబాద్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆఫీసులో రిటైరయ్యాక మెడిటేషన్ టీచర్‌గా బాధ్యత చేపట్టారు. ధ్యానం అంటే తానూ, తానంటే ధ్యానం అనిపించేంతగా మమేకం అయ్యారు. బంధు మిత్రుల్లో ఎవరికిఏ సమస్య వచ్చినా ఆసరాగా నిలబడటమే కాదు.. ధ్యానం చేయమని హితవు పలికేవారు. అప్పటి దాకా ముక్కూ మొహం తెలియకపోయినా ఐదు నిమిషాల పరిచయం ఉంటే చాలు... వారితో మెడిటేషన్ సాధన చేయించగల నేర్పు ఆమె సొంతం. అలా వయసుతో, ప్రాంతంతో సంబంధం లేకుండా ఎందరెందరికో మార్గదర్శకురాలయ్యారు. కాన్వాస్ మీద పెయింటింగ్స్ ఎంత బాగా చిత్రిస్తారో, ధ్యాన పద్ధతిని మన మనసుల మీద అంత చక్కగా ముద్రించగల ప్రతిభామూర్తి ఆమె. ఆ మహనీయురాలు కాలం చేసిన దుర్వార్త ఎందరికో శరాఘాతమైంది. శ్రీమతి నిర్మలా దత్ ని స్మరించుకుంటూ విపశ్యన గురించి గతంలో ఆమె చెప్పిన అమూల్యమైన సంగతులు మీ కోసం..

**విపశ్యన అంటే...** విశేష దృష్టితో చూడటం. మనల్ని మనం ప్రేక్షక దృష్టితో గమనించటం.

**గోయంకా మెడిటేషన్ గురించి మీకు ఎప్పుడు తెలిసింది?**

1993లో గోయంకా ప్రవచనం ఏర్పాటు చేస్తున్నారని పేపర్లో చదివి వెళ్లాను. అప్పటి వరకు ఇలాంటి ఒక మెడిటేషన్ ఉందని కూడా నాకు తెలీదు. ఆయన ఉపన్యాసాలు విన్నాక ఎంతో ప్రేరణ చెందాను.

**ఇతర ధ్యానాలకు విపశ్యనకూ ఉన్న తేడా ఏమిటి?**

ఇతర ధ్యానాల్లో కండిషనింగ్ ఉంటుంది. ఇందులో యంత్రాలు, తంత్రాలు, దేవుళ్ళ బొమ్మలు ఏమీ ఉండవు. ఈ ధ్యానం శ్వాసను, సంవేదనను గమనించమంటుంది. ఇవి హిందూ, ముస్లిం, క్రిస్టియన్, జైన్... అనే తేడా లేకుండా అందరిలోనూ ఒకేలా ఉంటాయి. యూనివర్సల్ అన్నమాట.

**విపశ్యన సైంటిఫిక్‌గా ఎలా పనిచేస్తుంది?**

విపశ్యన మనసుని శుద్ధి చేస్తుంది. మనం కళ్ళు, చెవులు, ముక్కు ద్వారా గ్రహించిన విషయాలు సంస్కారాలుగా రూపొందుతాయి. అంటే కండిషనింగ్ లేని ఇంప్రెషన్స్. ఇవన్నీ లోపలికి వెళ్లి నిక్షిప్తమై దుఃఖం, సంతోషం లాంటి భావాలు ఏర్పడతాయి. అలాంటి కండిషన్ ఏర్పడకుండా చేస్తుంది ధ్యానం. విపశ్యన తర్వాత ఇంప్రెషన్స్ నుంచి బయటపడతాం. సృష్టిలో ఏదీ శాశ్వతం కాదు, ప్రతిదీ అనిత్యం అని అర్థమౌతుంది.

ప్రతీ క్షణం కొన్ని వేల కణాలు పుడతాయి, చనిపోతాయి. కష్టం, సుఖం కూడా అంతే. అలల్లా వస్తాయి, వెళ్తాయి. కనుక ఏం జరిగినా ఆనందించకూడదు, ఆందోళన చెందకూడదు. దేనికీ రియాక్ట్ అవ్వకుండా ఆబ్జెక్టివ్‌గా చూడటమే విపశ్యన. వీళ్ళు నా వాళ్ళు, వాళ్లు పరాయివాళ్ళు లాంటి భేదాల్లేకుండా అందరికీ ప్రేమ పంచే గుణం అలవడుతుంది. ఒక వ్యక్తి తిట్టాడు లేదా కొట్టాడు అనుకుందాం.. ఈ పరిణామం శాశ్వతం కాదని అర్థం చేసుకుని స్పందించకుండా ఊరుకుంటే– అవతలి వ్యక్తిలో తప్పకుండా మార్పు వస్తుంది.

**విపశ్యన చేయడానికి ముందు, తర్వాత మీలో వచ్చిన మార్పు ఏమిటి?**

పూర్తిగా మారానని చెప్పను. కానీ చాలా మార్పు వచ్చింది. కోపం లెవెల్స్‌లో, డ్యురేషన్‌లో మార్పు వచ్చింది. ఇప్పుడు కోపం వచ్చినా.. అది వ్యక్తిగతం కాదు. ఇతరులకు హాని జరుగుతుంది–అనుకున్నప్పుడు, సంస్థాగత నష్టాలు జరుగుతున్నాయి అనుకున్నప్పుడు మాత్రమే కోపం వస్తుంది.

**గోయంకా గారికి కోపం వచ్చేదా?**

ఆయనకే కాదు ఆయన గురువు యుబాకీన్‌కి కూడా కోపం వచ్చేదట. ఒకసారి యుబాకిన్ స్టూడెంట్స్‌తో మాట్లాడుతుండగా ఒక వ్యక్తి పగోడా నుంచి మాటిమాటికి బయటకు వెళ్లి రావటం చూశారట. నాలుగడుగులు వేసి అతని మీద టాప్ లేచేలాగా అరిచి మళ్లీ నవ్వుకుంటూ తిరిగొచ్చి– 'బాగా కోటింగ్ ఇచ్చానులే.. ఇక వెళ్ళడు' అన్నారట. కనుక ఇలాంటివి పర్పస్‌ఫుల్ కోపాలు. వీటిల్లో వ్యక్తిగత రాగద్వేషాల్లాంటివి ఏమీ ఉండవు.

**విపశ్యన టెన్ డే కోర్స్ గురించి కొంచెం చెప్పండి..**

విపశ్యన కోర్సుకి వెళ్ళిన రోజు, వచ్చేసే రోజు కాకుండా పూర్తిగా పది రోజుల పాటు అక్కడే ఉండాలి. భోజన వసతులు అక్కడే. ఆ పది రోజులూ బయటి ప్రపంచంతో సంబంధం ఉండకూడదు. రక్తపోటు, గుండె జబ్బులు లాంటి క్రానిక్ సమస్యలు ఉంటే మెడిసిన్స్ తెచ్చుకోవచ్చు. తలనొప్పి, జ్వరం లాంటి వాటికి మందులు అక్కర్లేదు, అవే తగ్గిపోతాయి. ప్రాణిక్ హీలింగ్ లాంటివి నమ్మేవారు అయితే వాటినో లేదా దీన్నో ఏదో ఒకటే ప్రాక్టీస్ చేయాలి. అలాగే ఏ రూపాన్నీ ఆరాధించ కూడదు. మంత్రాలూ, స్తోత్రాలూ చదవకూడదు. ఇంటికెళ్లాక పూజలే చేస్తారో, విపశ్యన ఎంచుకుంటారో వాళ్లిష్టం.

ఉదయం నాలుగు గంటల నుంచి రాత్రి 9 వరకు చిన్న విరామాలతో ధ్యానం ఉంటుంది. పూర్తి మౌనం పాటించాలి. మొదటి మూడున్నర రోజులూ శ్వాస రాకపోకలు గమనించాలి. దీన్నే ఆనాపానా అంటారు. తర్వాత శరీరంలో సంవేదనలను గమనించాలి. తల నుంచి పాదాల దాకా, పాదాల నుంచి తల దాకా–ఒక పద్ధతి ప్రకారం శరీరంలో అణువణువునా స్థూల, సూక్ష్మ, మధ్య సంబేధనలను గుర్తించాలి. స్థూల అంటే నొప్పి, మంట– ఇలా బాధ కలిగించేవి. సూక్ష్మ అంటే పులకింత లాంటివి. ఇక మధ్య అంటే ఏదో జరుగుతుంది అనిపిస్తుంది. కానీ స్పష్టంగా తెలియదు. మొత్తానికి ఏ రకమైన సంవేదన కలిగినా ఎంత మాత్రం ప్రతిస్పందించకుండా ఆబ్జెక్టివ్‌గా గమనిస్తూ సాగిపోవాలి. రోజూ రాత్రిపూట గోయంకా ప్రవచనాలు ఉంటాయి. పదో రోజు మంగళ మైత్రి అభ్యాసం తర్వాత మౌనం విడిచి పెట్టొచ్చు. మంగళమైత్రి అంటే ప్రపంచంలోని సర్వజీవులకు మైత్రి పంచటం. పుణ్య వితరణ అని కూడా అంటారు.

**ఈ లెక్కన చాలా ఖర్చవుతుంది కదా విపశ్యన కేంద్రాలు ఎలా నడుస్తున్నాయి?**

డొనేషన్స్ మీద నడుస్తున్నాయి. కొందరు పగోడాల కోసం స్థలం ఇస్తే, ఇంకొందరు ఆర్థిక సాయం చేస్తారు. మరి కొందరు బియ్యం, సరుకులు లాంటి సరంజామా ఇస్తారు. ఇంకొందరు సర్వీస్ చేస్తారు. ట్రస్ట్ అన్ని చూసుకుంటుంది. కొత్త టీచర్లను సెలెక్ట్ చేసేటప్పుడు–పాత టీచర్ల అభిప్రాయం తీసుకుంటారు.

**పది రోజుల కోర్స్ అంటే ప్రైవేటు ఉద్యోగులకు చేయాలని ఉన్నా కష్టమవుతుంది కదా?**

అయినా తప్పదు. ఎందరో చేస్తున్నారు. మూడున్నర రోజులు శ్వాస రాకపోకలు గమనించిన తర్వాత శరీరంలో సంవేదనలను గమనించే స్థితికి మైండ్ ఎదుగుతుంది. విపశ్యన పరిచయం లేనివారు మొదటే సంవేదనలు అంటే– గుర్తించలేరు. ఆనాపానా తర్వాత సంవేదనలను గుర్తించడం సాధ్యమవుతుంది. ఇది ఒక ప్రాసెస్ కాబట్టి ఇలాగే చేయాలి. సంకల్పం గనుక ఉంటే సాధ్యం కాకపోవటం అనేది ఉండదు. కొందరికి అప్సెట్ కూడా అవుతుంది. అలాంటప్పుడు టీచర్ పర్యవేక్షణలో ఉండాలి.

**విపశ్యన పరిచయం లేని వాళ్ళు వన్డే కోర్స్ చేయకూడదా?**

కొత్తవారికి వన్డే కోర్స్ చేయడం సాధ్యం కాదు. పది రోజులు తప్పనిసరి. ఇది ఆత్మ జ్ఞానం. సెల్ఫ్ రియలైజేషన్. జీవితాంతం ఉపయోగించుకోవచ్చు. శ్వాస గమనించటానికి తర్వాత సంవేదనలు తెలుసుకోవడానికి ఆమాత్రం టైం కావాలి.

**విపశ్యన కోర్సులు చేసేవారు నోబుల్ సైలెన్స్ పాటించాలి కదా.. ఎందుకని?**

పూర్తి మౌనం ఎందుకంటే సాధన ఏ రకంగానూ బ్రేక్ కాకూడదని. కళ్ళు కూడా కిందికి వాల్చేసి నడవమంటారు. ఒక ఇమేజ్ కంట్లో పడినా, ఒక్క మాట మాట్లాడినా.. ఆలోచనలు వస్తాయి. అదొక చైన్‌లాగా సాగుతుంది. అందుకే దీక్ష భగ్నం అవ్వకుండా మౌనం పాటించాలి.

**అలా మౌనంగా ఉండలేని వాళ్లు ఈ కోర్సుకి అర్హులు కారా?**

అవును, అది తప్పనిసరి. ఒక కొత్త వ్యక్తిని విపశ్యనకి పంపేటప్పుడు మౌనం ఎందుకు పాటించాలో, దాని వల్ల ఎంత మేలు జరుగుతుందో ప్రిపేర్ చేసి పంపాలి. అంతే తప్ప భయపెట్టకూడదు.

**సాధారణ వ్యక్తులకైతే మెడిటేషన్ వల్ల ప్రశాంతత వస్తుంది సరే.. రకరకాల బలహీనతలూ, అవలక్షణాలూ ఉన్నవారిలో కూడా విపశ్యన మార్పు తెచ్చే అవకాశం ఉందా?**

విపశ్యన సెంటర్లో నేర్చుకున్న ధ్యానాన్ని ఇంటికి వెళ్ళిన తర్వాత కూడా ప్రాక్టీస్ చేస్తే తప్పనిసరిగా మార్పు వస్తుంది. అవన్నీ కూడా మానసిక రుగ్మతలే. డిటర్మినేషన్ ఉంటే ఎలాంటి వారైనా తప్పకుండా మారతారు.

**ఒకరు పదే పదే విసిగిస్తే కోపం రాకుండా పనిచేసుకోవడం ఎలా సాధ్యం?**
విపశ్యన కోపం లేదా దుఃఖాన్ని అణిచేసుకోమని చెప్పదు. సప్రెస్ చేయడం వల్ల తర్వాత మరింత ఉధృతం అవుతుంది. లావాలా పొంగుతుంది. ఒకరి ప్రవర్తన కోపం తెప్పిస్తే.. అప్పుడు శరీరంలో జరిగే మార్పుల్ని గుర్తిస్తూ మౌనంగా ఉండాలి. శ్వాస దీర్ఘంగా తీసుకోవటం, ఒళ్ళు నిక్కబొడుచుకోవడం లాంటి మార్పుల్ని గమనిస్తూ పోతే.. కాసేపటికి కోపం దానంతట అదే తగ్గుతుంది. రెండోసారి, మూడోసారి కోపం తీవ్రత తగ్గుతుంది. ఇలా సాధన చేస్తుంటే.. కోపగించుకునే సందర్భాలు బాగా తగ్గిపోతాయి. ఒకనాటికి వ్యక్తిగత కోపాలు రానే రావు. అలాగే ఏడుపొస్తే ఏడ్చేయాలి. అప్పుడు కూడా శరీరంలో జరిగే మార్పుల్ని గమనించాలి. కొంతసేపటికి దుఃఖం సమసిపోతుంది.

**ఈ విపశ్యన పద్ధతికి రావాల్సినంత ప్రచారం రాలేదేమో కదా?!**
గంధపు చెక్క తన గురించి తాను చాటుకోదు. దాని గొప్పతనం తెలుసుకున్న వారు తమంతట తావే వెతుక్కుంటూ వస్తారు. భజనలు చేసే వాళ్ళు అలాంటి చోటుకు వెళ్తారు. ఇక్కడ అలాంటివేం ఉండవు. ఈ ధ్యాన మార్గం గొప్పతనాన్ని తెలుసుకుని వస్తున్నవాళ్ళు చాలా మందే ఉన్నారు.

**ధర్మంగా ఉండాలి అంటారు కదా.. మనం ధర్మంగా ఉన్నా అవతలి వాళ్ళు లేకపోతే?**
ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుంది అనే మాట అక్షరాలా నిజం. అవతలివాళ్ళు అపసవ్యంగా ప్రవర్తించినా గానీ మనం గనుక స్పందించకపోతే– వారిలో మార్పు వస్తుంది. మరో సంగతి ఏమంటే మనం ఒకరికి మేలు చేస్తే ఆ వ్యక్తి తిరిగి మేలు చేయకపోవచ్చు. కానీ మరో వ్యక్తి రూపంలో అయినా తప్పకుండా మంచి జరుగుతుంది.

**ప్రతిస్పందన లేకుండా ఎలా ఉండగలం? ఒక పాము ఎదురైతే?**
మన రక్షణ మనం చూసుకుంటూ దానికి ఏమీ హాని తలపెట్టకుండా ముందుకు సాగాలి. ఇది చెప్పినంత తేలికేం కాదు, కానీ అభ్యాసంతో సాధ్యమవుతుంది.

**విపశ్యనతోనే తన మైగ్రేన్ తగ్గిందని గోయంకా చెప్పారు కదా.. మరెవరికైనా అలాంటి అనుభవాలు ఉన్నాయా?**
ప్రతి సమస్య మెంటల్ ఇంప్యూరిటీ వల్లే వస్తుంది. ఎందరెందరో ఎన్నో సమస్యల నుంచి బయటపడిన దాఖలాలున్నాయి.

**సైకలాజికల్ డిసార్డర్లు కూడా నయమయ్యే అవకాశం ఉందా?**
వాటికి విపశ్యన కంటే మంచి మార్గం ఇంకొకటి లేదు. అయితే వాళ్ళంతట వాళ్ళు విల్లింగ్ తో రావాలి. దీన్ని చేయాల్సిన పద్ధతిలో సాధన చేస్తే..తప్పకుండా తగ్గుతుంది. ఆశించిన మార్పు వస్తుంది. కానీ జబ్బులు తగ్గించుకోవడం కోసం రావద్దు, మైండ్‌ని శుద్ధి చేసుకోవడం కోసం రండి..శారీరక, మానసిక రుగ్మతలు వాటంతటవే తగ్గుతాయి – అన్నారు గోయంకా. మరీ ఇబ్బంది కలిగించే వారిని చేర్చుకోవద్దని, ఇది మైండ్ హాస్పిటల్ కాదని కూడా అన్నారాయన.

**మొదటిసారి కోర్సు చేయాలంటే పాత స్టూడెంట్ రిఫర్ చేయాలనే కండిషన్ ఎందుకు?**
ఓల్డ్ స్టూడెంట్ రిఫర్ చేయడం వల్ల కొత్తగా వచ్చేవాళ్ళకి విపశ్యన గురించి పూర్తిగా అవగాహన ఏర్పడుతుంది. అలా కాకుండా ఏదో చూద్దామని వస్తే.. ఆనక పనిష్మెంట్‌లా ఫీలయ్యే అవకాశం ఉంది. పైగా కొత్త స్టూడెంట్ ఏదైనా ఇబ్బంది కలిగిస్తే.. రిఫర్ చేసిన వ్యక్తిని కన్సల్ట్ చేయటానికి వీలవుతుంది. ఒకసారి పది రోజుల కోర్సు చేస్తే.. ఇక తర్వాత ఎవరి రిఫరెన్సూ అక్కర్లేదు, గతంలో ఏ బ్యాచ్‌లో చేరిందీ రాస్తే సరిపోతుంది.

**సాధారణంగా ఎలాంటి వారు ఈ కోర్సు చేయటానికి వస్తుంటారు?**
నిరక్షరాశ్యుల దగ్గర నుంచి పెద్ద ఉద్యోగస్తుల వరకూ ఎందరో వస్తుంటారు. ప్రతిభాపాటిల్, కిరణ్ బేడీ, అరుణ్ శౌరి, అక్కినేని అమల, ప్రియాంకాగాంధీ–ఇలా ఎందరో ప్రముఖులు విపశ్యన కోర్సులు చేశారు.

**అరుదైన స్టూడెంట్స్ అనిపించుకున్న వాళ్ళు ఎవరైనా ఉన్నారా?**
అలాంటిదేమీ ఉండదు, అందరినీ సమానంగానే చూస్తారు. పనిమనిషి అయినా, మినిస్టర్ అయినా ఒకటే. బాగా సాధన చేస్తే బెనిఫిట్ పొందుతారు. సర్వీస్ మైండ్ ఉన్న వాళ్ళు తాము లబ్ధి పొందటంతో వదిలేయకుండా మెడిటేషన్ సెంటర్లలో ఏదో రూపంలో సేవ చేస్తుంటారు.

**దేవుళ్ళని నమ్మని బుద్ధిజం పునర్జన్మని ఎలా నమ్ముతుంది?**
ఒకరు ధనవంతుడు, ఒకరు నిరుపేద. ఒకరికి సంస్కారం ఉంటుంది, ఇంకొకరికి ఉండదు. ఒకరికి మంచి హోదా ఉంటే, ఇంకొకరు నిరాధారంగా నిస్సహాయంగా ఉండటం..ఇవన్నీ ఎందుకంటే కర్మఫలం అని తేల్చింది బౌద్ధం. జన్మలు ఉన్నాయి కనుకనే కర్మఫలాన్ని అనుభవిస్తున్నారని చెప్తుంది. ప్రేమ, శాంతి, మోసం, ద్వేషం– ఈ తేడాలన్నీ పూర్వజన్మ సంస్కారాలను బట్టి వస్తాయని బుద్ధుడు దార్శనికతతో.. అంటే ఇన్ సైట్‌తో

చెప్పాడు. మన కర్మ ఫలితం వల్లే అవతలివారు ఇబ్బంది కలిగిస్తున్నారని గ్రహిస్తే.. వాళ్ల మీద మనకి కోపమే రాదు.. వచ్చినా నిలవదు.

**విపశ్యన వల్ల లాభం పొందామని మీతో చెబుతుంటారా?**

ఒకరిద్దరు కాదు ఎందరెందరో చెబుతుంటారు. చేయాల్సిన విధంగా సాధన చేస్తే లబ్ధి పొందకపోవటం అనేది ఉండనే ఉండదు. ఒకామెని 30 ఏళ్ళ క్రితం భర్త వదిలేసి వెళ్లాడు. పిల్లల్ని తనే పెంచి పెద్ద చేసింది. ఈ కోర్సు గురించి తెలుసుకొని వచ్చింది. టెన్ డే కోర్స్ చేసి ఇంటికెళ్లిన కొన్ని రోజులకి భర్త తిరిగొచ్చాడు. తిట్లు, తిరగబడటాలూ లేకుండా స్వీకరించింది. పిల్లలు వ్యతిరేకత చూపితే కన్విన్స్ చేసింది. అతను రావటం యాదృచ్ఛికమూ కావచ్చు, చిత్తం శుద్ధి కావడం వల్ల కర్మఫలం నశించి.. ఆ రకంగా శాంతత చేకూరి ఉండొచ్చు. శారీరక, మానసిక రుగ్మతలు ఉన్నవారు ఎందరో ఈ కోర్సు చేశాక తమ జీవితంలో.. గొప్ప మార్పు వచ్చిందని చెప్పారు. అయితే కోర్సు చేసినంతలో లాభం లేదు. నిత్యం సాధన చేయాలి. అప్పుడు ఎలాంటి కష్టాలానైనా అధిగమించగలుగుతారు. సాధనతో లబ్ధి పొందుతున్నవారు ఎందరో ఉన్నారు. శారీరక ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు విపశ్యనను మించిన దివ్య ఔషధం ఇంకోటి లేదంటే అతిశయం కాదు.

వి. నాగరత్న, హైదరాబాద్
ఫోన్ : 94903 15051

## దిగుమర్తి బుచ్చికృష్ణమ్మ

తెలుగు వారికి చిత్రకళ అనగానే చిత్రకళాతపస్వి శ్రీ దామెర్ల రామారావు గుర్తుకు రాకమానరు. ఆ రామారావు గారి సోదరియే బుచ్చికృష్ణమ్మ గారు. ఈమె రాజమండ్రిలో జన్మించారు. లక్ష్మీదేవి, వెంకట రమణారావు ఈవిడ తల్లిదండ్రులు. రమణారావు రాజమండ్రిలో ఆయుర్వేద వైద్యులు. కందుకూరి వీరేశలింగం గారి అనుచరులు. ఈమెకు అన్నగారి లాగే బాల్యం నుంచీ చిత్రకళపై ఆసక్తి. అన్నా చెల్లెళ్లిద్దరూ బొమ్మూరు వెళ్లి గోదావరి నేపథ్యంగా ప్రకృతి దృశ్యాలు చిత్రించేవారు. బుచ్చికృష్ణమ్మకు, చిత్రకళలో అన్న రామారావే గురువు. 1922లో రామారావు రాజమండ్రిలో 'ఆంధ్ర సొసైటి ఆఫ్ ఇండియన్ ఆర్ట్' స్థాపించినపుడు ఈమె అండగా నిలిచారు. బొబ్బిలి, పెద్దాపురం జమీందార్ల కుమార్తెలకు చిత్రకళ, హిందీ నేర్పారు. బుచ్చికృష్ణమ్మ పాఠశాల విద్య ఎనిమిదవ తరగతితోనే ముగిసినా, హిందీ విశారదలో ఉత్తీర్ణులయ్యారు. బుచ్చికృష్ణమ్మ వివిధ అంశాలపై చిత్రాలు చిత్రించారు. ఇవన్నీ పెన్సిల్ స్కెచస్, వాటర్ కలర్ చిత్రాలే. 'లక్ష్మి విష్ణు' వాటర్ కలర్స్‌తో వేసిన చక్కని చిత్రం. శివాజీ తల్లి జిజియాబాయి నుంచి సెలవు తీసుకుంటున్న దృశ్యం చక్కని చిత్రీకరణ. 'బుద్ధ భిక్ష' జీవం ఉట్టిపడే చిత్రరాజం. ఇందులో అజంతా,



ఎల్లోరాల శైలి ద్యోతకమౌతుంది. వెలుగు నీడల సంగమం చిత్రించబడిన గోదావరి గట్టు చక్కని ప్రకృతి దృశ్యం. ఆవిడ పెన్సిల్ స్కెచ్‌వేసి తర్వాత రంగులతో వేద్దామని వదిలి పెట్టగా, విధి వక్రించి అవి స్కెచస్‌గానే మిగిలిపోయాయి. బుచ్చికృష్ణమ్మ భర్త శ్రీ దిగుమర్తి హనుమంతరావు. ఆయన జాతీయోద్యమ కార్యకర్త. బుచ్చి కృష్ణమ్మ భర్తతో మద్రాసు వెళ్లి హరిజనోద్ధరణ కార్యక్రమంలో పాల్గొంది. 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ'లో పనిచేసింది. మద్రాసు సేవాసదన్‌లో చిత్రకళ, హిందీ బోధిస్తూ ఉపాధ్యాయినిగా కూడా పనిచేసారు. సబర్మతి ఆశ్రమంలోనూ కొన్నాళ్ళు ఉన్నారు. 1930లో నెల్లూరు జిల్లా పల్లెపాడులో గాంధీజీ ప్రారంభించిన 'పినాకిని సత్యాగ్రహాశ్రమం'ను నిర్వహించడానికి అక్కడకు తరలి వెళ్లారు. ఆమె సోదరుడు రామారావు 28 ఏళ్ల చిన్న వయసులోనే తనువు చాలించారు. ఈమె కన్నా రామారావు మూడేళ్ళు పెద్దవారు. ఆ మరుసటి సంవత్సరమే 1926లో ఈమె భర్త హనుమంతరావు కన్నుమూశారు. ఈ విషాదాలు ఆమెను కలవరపరచాయి. చిత్రకళను వదిలి పెట్టారు. రాజమండ్రి వచ్చి సీతానగరంలోని 'కస్తూరిబా మెమోరియల్ ట్రస్టు' ఆశ్రమంలో సేవలందిస్తూ 80వ ఏడు వరకు అక్కడే గడిపారు. ఈవిడ కేంద్ర సాంఘిక సంక్షేమ మండలి సభ్యురాలుగాను, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ మండలి సభ్యురాలుగాను పనిచేశారు. ఆమె వేసిన చిత్రాలు 100 వరకు లభిస్తున్నాయి. అవి కూడా ఆర్ట్ గ్యాలరీలలోనూ, మ్యూజియంలలోనూ గాక అక్కడక్కడా కుటుంబ సభ్యుల వద్ద, మిత్రుల వద్ద ఉన్నాయి. గొప్ప కళావారసత్వం గల ఈమెకు తగిన గుర్తింపు రాకపోవడం దురదృష్టకరం. ఈమె చిత్రాలను సేకరించి ఆర్ట్ గ్యాలరీలో భద్రపరచడం కళాసంస్థలు ప్రభుత్వం తమ కర్తవ్యంగా భావించాలి. అదే 1991 జనవరి 2న పరమపదించిన ఆవిడకు మనము అర్పించే ఘన నివాళి.

*- తెలుగు దివ్వెలు - వి.ఎస్. రాఘవాచారి*

# తిరుక్కురళ్

**– ఆచార్య యస్. లక్ష్మీ అయ్యర్**

**11వ** అధ్యాయము సెయ్‌నంద్రిఅరిదల్ అంటే చేసిన ఉపకారాన్ని గుర్తు చేసుకోవడము లేదా ఎప్పుడూ జ్ఞాపకం చేసుకోడం. ఇందులో వళ్లువర్ తన పది కురళ్లలో "మనిషి తనకు సహాయపడిన వాడికి ఎలా తిరిగి సహాయం చేయాలి"? ఆ సహాయం చేసేవాడు కూడా ప్రతిఫలం ఆశించకుండా చేయాలి. తనకు సహాయ పడిన వారిని జీవితాంతం మరవకూడదు అనే విషయాల గురించి కూలంకుశంగా చర్చిస్తున్నారు.

మొదటి కురుళ్‌లో

**సెయ్యామల్సెయ్ ద ఉదవిక్కువైయగముం**
**వానగముమ్‌ఆట్రల్‌అరిదు(101) యనిఅంటున్నారు.**

అంటే ఏ ఒక్కసాయము చేయని వాళ్ళకు కూడా తనకు తానుగా వచ్చి ఇతరులకు సహాయపడే వ్యక్తికి ఇహలోకము పరలోక వైభవాలను కలిపి రెండింటిని కానుకగా ఇచ్చినా అతని మనసుకు అది సరితూగ లేదు అని భావము. ఇక రెండవ కురళ్ అతి ప్రసిద్ధమైనది. తమిళ నాట ప్రతీ వ్యక్తి నాలుకలోనూ ఇది ప్రతిధ్వనిస్తుంది.

**కాలెత్తి నాల్సెయ్దన ణ్రి సిరి దెనిలుమ్**
**జ్ఞాలత్తిల్మాణపెరిదు (102)**

"అంటే సమయానికి చేసినసహాయము అతి చిన్నదైనా కూడా అది అఖిల బ్రహ్మాండాన్ని కంటే చాలా పెద్దది. మనిషికి సరైన సమయంలో చేసే సహాయము చిన్నదైనా అదే విశ్వమంత పెద్దదిఅని వ్యాఖ్యానిస్తున్నారు కవి వళ్ళువర్. ఇదేలాగా103.104,105,106కురళ్లలోఇతరులకు చేసే సహాయాన్ని గురించి వాటి విలువలను గురించి. తనకు సహాయ పడేవాళ్లతో ఎల్లప్పుడూ కృతజ్ఞత చూపాలని పదే పదే చెబుతున్నారు.

ఇక 106 కురళ్‌లో వళ్ళువర్

**మఱవఱ్క మాసట్రార్కేణ్మై తుఱవ దురవఱ్కఱి**
**తుఙ్బత్తుళ్ తుప్పాయర్ నట్బు అంటున్నారు.**

అంటే ఏ దోషం లేని వారి వ్యక్తి యొక్క బంధము ఎప్పుడు మర్చిపోని బంధము వీడని బంధం. మంచి మనసుతో ఉన్న వ్యక్తి యొక్క స్నేహం వీడని బంధంలా ఆపద సమయంలో పక్కనే ఉండి ఇతరులకు సహాయ పడుతుంది.అలా సహాయపడే స్నేహితుడు ఎల్లప్పుడూ మంచివారు. వారు ప్రేమ తప్ప దేన్నీఆశించరు, అలాంటి వారిని ఎప్పుడూ మనము వదులుకోకూడదు అని భావము

అదేలాగా కురళ్107లో ఆపద సమయంలో ఆదుకునే మిత్రుని యొక్క సహాయము ఎన్ని జన్మలెత్తినా మంచివారు మరచిపోరు అంటున్నారు. అదేలాగా 108 వ కురళ్లో "ఒకరు తనకు చేసిన సహాయాన్ని మరిచిపోవడం ధర్మం కాదు. ఆ వ్యక్తి చేసిన చెడు కార్యాలను మాత్రం అప్పుడే మరిచిపోవాలి. ఇతరులు చేసే మంచి కార్యాలు చిన్నదైనా అంటే చిన్న సాయమైనా మనం జీవితాంతం గుర్తుపెట్టుకుని ఉండాలి అని అంటున్నారు.

**ఇక 109 వ కురళ్‌లో**

**కొంద్రణ్ణఇణ్ణాసేయినుం అవర్సేయ్ ద**
**ఒంద్రునణ్ణుళ్ళకెడుం**

ఎవరన్నా మనకు ఎన్నో హాని చేసినప్పటికీ అంటే ఎంతో శత్రుత్వంతో చంపడానికి ప్రయత్నించి వున్నా కూడా వారెప్పుడన్నా చేసిన ఒక చిన్న సహాయాన్ని ఎప్పుడూ మనసులో పెట్టుకొని వారిని మనం గుర్తు చేసుకుంటే మనకు దుఃఖమే కలుగదు అని వళ్ళువర్ చక్కగా వివరిస్తున్నారు. ఇక 110 అంతిమ కురళ్తో ఈ అధ్యాయం ముగిస్తుంది. ఆ కురళ్ అతి ప్రసిద్ధమైనది.

**ఎన్నంద్రికొంద్రార్కుమ్‌ఉయ్యుండామ్‌ఉయ్ విల్లై**
**సెయ్నంద్రికొంద్రమగర్కు**

ఎవరైనా చేసిన సహాయాన్ని మరిచిపోతే ఆ పాపానికి ప్రాయశ్చిత్తమే లేదు. ఎన్ని ధర్మాలు చేసినా ఎంత మంచి కార్యం చేసినా ఎవరైతే ఇతరులు చేసిన సహాయాన్ని మరిచిపోయి కృతఘ్నుడిగావ్యవహరిస్తే అలాంటి వాళ్ళు ఎంత పూజ చేసినా ఎంత పుణ్య కార్యాలు చేసినా దేనికి పనికిరారు. ఏ ధర్మ కార్యాన్ని మరచి పోయినా పర్వాలేదు కానీ చేసిన సహాయాన్ని మరచిపోయే వాడు చాలా నీచుడు. ఇక్కడ చక్కగా ఈ 10 కురళ్ళలోవళ్ళువర్ గారు మన వేమన చెప్పినట్లు సుమతి పద్యాలలో వివరించినట్లు ఉపకారికి ఉపకారం చేసే దానికంటే అపకారికి ఉపకారం చేసేవాడే శ్రేష్ఠుడు అని చక్కగా వివరిస్తున్నారు.

ఇక 12వ అధ్యాయములో తిరువళ్లవర్ గారు మద్యస్థితినిఅంటే తటస్థ స్థితి గురించి విన్నవిస్తున్నారు. మనిషి ఎప్పుడూ తటస్థంగా ఉండాలి భావాలకు అతీతంగా

ఉండాలి అని గీతలో శ్రీ కృష్ణ పరమాత్ముడు చెప్పినట్లు సమదర్శనం గురించి మాట్లాడుతున్నారు. ఇందులో వళ్ళువర్ గారు "ఎవరినీ ద్వేషించకుండా, "పగవారు తనవారు" అన్న భేదం లేకుండా అందరినీ సరి సమానంగా చూసేవారు మధ్య స్థితిని పొందుతారు. గీతలో కృష్ణ పరమాత్ముడు ఎలా చెప్పాడో అదేలా ఇక్కడ వళ్ళువర్ గారు చెబుతున్నారు. లోకాతీతుడు అయిన వ్యక్తే సమదర్శి. అతనికి స్వార్థం ఉండదు. తమపర బేధాలు ఉండవు. అందరినీ తనవారిగా తనలో అందరినీ చూసే మహోన్నతుడు. ఇక కురళ్ ఇలా వున్నది

**తగుది ఎ ణ వొ్రణు న న్రేపగుదియాల్**
**పార్ పట్టు వో జహు (zhu) గ పేరి ణ్ 111**

ఇక 112వ కురళ్లో వళ్ళువర్ గారు సమదర్శి దగ్గర ఉండే సంపద గురించి వ్యాఖ్యానిస్తున్నారు. సమదర్శనం కలవాడి వద్ద ఉన్న సంపద ఎప్పుడూ శాశ్వతంగా ఉండి పదిమందికి మేలు చేస్తుంది. అంటే తను ఇతరులను సమానంగా చూసేవాడు కాబట్టి స్వార్థ రహితంగా ఇతరులకు తన డబ్బులను ఖర్చు పెడతాడని భావము. అతని దగ్గర ఉన్న సంపద ఎప్పుడూ పది మందికి ఉపయోగపడే పరోపకార నిధి అని అర్థం.

113, 114 కురళ్లలో కవి చక్కగా సమదర్శి గురించి అభివర్ణించారు. ఈ అధ్యాయంలో "సమదర్శిగా ఉండే వాడికి ఎలాంటి బాధలు కలగవు. అతనికి ఎవ్వరూ శత్రువులుండరు. అతని దగ్గర ఉండి సంపద ఎప్పుడూ పెరుగుతుంది కానీ తరగదు ఎందుకంటే అతనికి తమ పర భేదాలు ఉండవని "కవి చెబుతున్నారు. ఇక 114లో

**తక్కార్తగవిలర్ ఎ ణ్బదుఅవరవర్**
**ఎచ్చత్తార్ కా ణ పడుం**

వళ్ళువర్గారు "ఒకరు సమదర్శిగా పక్షపాతం లేకుండా ఉంటే వారి ప్రతిభ పెరిగి పెరిగి వారిని కీర్తిమంతులుగా ఎదుగనిస్తుంది. తమ వారు గొప్ప, ఇతరులు తక్కువ అన్న భేదభావం లేని మనిషి నిజంగా సమదర్శి. ఇక 115 వ కురళ్లో వేదాంత ధోరణిలో కవి ఇలా చెబుతున్నారు "చెడు, మంచివి అనేవి, ఏది జరగబోతుందో ఏది జరగబోదో అవి ముందే దేవునికి తెలుసు. అవి దైవసంకల్పితములు అందుకని మనస్సులో చంచలత్వం లేక తటస్థంగా ఉండే వ్యక్తికి ఎటువంటి ప్రభావము దానివల్ల పడదు" అని చెబుతున్నారు **ఇక 116వ కురళ్**

**కెడు వెల్ యాణ్ ఎ ణ్బదు అ తిగతణ్నెంజం**
**నడువోరిఇ అల్ల సేయిణ్**

ఇందులో కవి మానసిక తటస్థత గురించి చెబుతున్నారు "ఎవరైతే సత్యాన్ని నీతిని వదిలి అపకారం చేస్తుంటారో వారు సమదర్శికాలేరు. ఎందుకంటే తప్పు చేసేముందు ప్రతి ఒక్కరి మనసు వారు చేయబోయే తప్పును గురించి అంతరాత్మలో వారిని హెచ్చరిస్తుంది. సమదర్శిగా ఉండే వారికి అందరూ సమమే కాబట్టి వారు నీతిమంతులుగా ఉంటారు.

ఇక 117 కురళ్లో కవి చక్కగా సమదర్శి యొక్క గొప్పదనాన్ని వేన్నోళ్ల కొనియాడుతున్నారు. ఎవరైతే సమదర్శిగా ఉంటారో వారు పేదవారైనా పెక్కు నిధి కలవారు, వారి పేదరికము వారి గుణం వల్ల పెద్దగా కనబడదు. లోకులు సమదర్శిగా మెలిగే వారి యొక్క పేదరికాన్ని లెక్కచేయరు. లోకుల దృష్టిలో వాళ్ళు మంచి వారు. ఎందుకంటే వారు గుణములో చాలా గొప్పవారు. న్యాయ ప్రకారం నడుచుకునేవారు, అందుకని అందరిని సమానంగా చూసే వారు పేదవారైనా కూడా కీర్తిమంతులుగా జనుల చేత కొని యాడబడతారు వారు న్యాయ ప్రియులు న్యాయం తప్పక నడుచుకుంటారు

**119వ కురళ్ చాలా అత్యద్భుతమైనది.**
**సొత్కోట్టంఇల్లదుసెప్పంఒరుతలైయా**
**ఉట్కోట్టం ఇ న్మై పె తిణ్**

మనసు స్థిమితంగా ఉన్నవారు అంటే నిశ్చలమైన మనసు కలిగిన వారు ఎప్పుడూ తప్పు చేయరు. మనసు తప్పు చేస్తేనే మాటలు తప్పు చేస్తాయి అని వళ్ళువర్ గారు అంటున్నారు. మనస్థిమితం లేని వారే అధర్మాన్ని ఆచరిస్తారు ఎవరైతే సమ దర్శిగా ఉండి మనస్థిమితంతో నిశ్చలమైన మనసుతో చంచలత్వం లేకుండా తిరిగేవారు ఎల్లప్పుడూ తప్పు చేయరు. ఈ అధ్యాయపు అంతిమ కురళ్ 120లో వళ్ళువర్గారు వ్యాపారంలో కూడా సమదర్శిగా ఉండాలని చెబుతున్నారు అంటే ఒక వ్యాపారి వ్యాపారం చేసేటప్పుడు కూడా నాణ్యత, వ్యాపార ధర్మంతో చేయాలి ఇతరుల కడుపు కొట్టేందుకై చేసే వ్యాపారం ఎప్పుడు పనికిరాదు. సమదృష్టి ఉన్నవారు వ్యాపారం చేస్తే దానివల్ల బాగా వర్తకం పెరిగి ధర్మము నీతి న్యాయము సమాజములో వర్ధిల్లుతాయి ఎందుకంటే వారు ఎవరి సొమ్ముకు ఆశించరు.

ఇక 13 వ అధ్యాయం అఅత్తు పాల్ అంటే ధార్మికం. ఇందులో క్రమ శిక్షణ, అణకువ ఓర్పుగల స్వభావాన్ని,

ఒక వ్యక్తి నమ్రతతో ఎలా ఇతరులతో మెలగాలి ఇలాంటి విషయాలు గురించి కవి గారు కూలంకుశంగా చర్చిస్తున్నారు. నమ్రత లేదా అణకువ మనకు అనే గుణం యొక్క గొప్పతనాన్ని ఇస్తుందని చెబుతున్నారు. ఈ లోకంలో నమ్రతతో తిరిగేవారు దేవలోకంలో ఉండి దేవతల వలె ప్రకాశిస్తారు. అణకువ లేక గర్వంతో విర్రవీగుతూ తిరిగేవారు పాతాళ లోకానికి పోతారు అంటే తన నాశనానికి తానే హేతువు అవుతారని అర్థము .

**అడక్కంఅమరరుళ్ఉయ్క్కుంఅడన్గామై**
**ఆరిరుళ్ఉయ్త్తువిడుం**

అణకువ తనకు లభించిన గొప్ప సంపదని భావించి దాన్ని అతి జాగ్రత్తగా ప్రయోగించాలి వ్యవహార కుశలతతో ఓర్పుతో వుండాలి. అణకువకున్న స్థానం అతి గొప్పదైనది. సంపదలలో అది శ్రేష్ఠ సంపద అందుకే నమ్రతతో అణకువను వీడకుండా ఒక గొప్ప సంపదలాగా కాపాడు కోవాలి.

కురళ్ 123లో నీవు తెలుసుకోవలసిన విషయాలు చక్కగా ఓర్పుతో నమ్రతతో నేర్చుకో అలా నేర్చుకొని నీతిమంతుడిగా ఎవడైతే వర్ధిల్లుతాడో అలాంటి వారిని పండితులు శ్రేష్టులుగా భావిస్తారు, అలాంటి అణుకువ గల వాడు ఈ లోకములో కీర్తిమంతుడిగా మిగిలిపోతాడు యని అంటున్నారు. ఇక కురళ్ 124లో కవి అణకువ యొక్క శ్రేష్టతను గురించి ఇలా చెబుతున్నారు "ఎవరైతే అణకువతో నీతిమంతులుగా వ్యవహరించి న్యాయం తప్పకుండా ధర్మంగా అందరి ముందు తన నడవడికలో అణకువ ను ప్రదర్శిస్తే మిగతా వారి ముందు అతను ఒక గొప్ప పర్వతం లాగా నిలబడి ఖ్యాతి పొందుతాడు.

**కురళ్ 124**
**నిలయిణ్తిరియాదుఅడంగియాణ్తోట్టమ్**
**మలైయిణుంమాణపెరిదు**
**కురళ్125 లో**
**ఎల్లోర్కుంనంరాంపణిదళ్అవరుళ్ళుమ్**
**సేల్వర్కేసెల్వంతగైత్తు** అంటున్నారు .

నమ్రత అణకువతో ఉన్న వ్యక్తి అందరి ముందు ఆదరణలు పొందుతాడు. అతను సంపద కలవాడైన కూడా అతనిలోని నమ్రత అతనికి వున్న అన్నీ సంపదల కన్నా గొప్ప సంపదగా కీర్తి పొందుతుంది. ఒక వ్యక్తిలోని నమ్రత అతనికున్న శ్రేష్ఠ సంపద అని అంటున్నారు.

126వ కురళ్‌లో వళ్ళువర్ అత్యద్భుతంగా నమ్రత గల వారిని గురించి తాబేలుతో పోలుస్తున్నారు. ఇది చాలా ప్రశస్తి పొందినది. తాబేలు ఆపద వచ్చినప్పుడు తన నాలుగు కాళ్లను తలను చిప్పలోకి దూర్చి ఎలా లోపలి ఈడ్చుకొని లోపలికి వెళ్లిపోతుందో అదేలాగా అన్యాయము అక్రమం లేదా పరిస్థితిని బట్టి నమ్రత గలవారు ఓర్పుతో నేర్పుతో వ్యవహరిస్తారు ఇంద్రియాలను వశపరచుకొని తాబేలులాగా అంటే పంచేంద్రియాలను వశపరుచుకుని ఉన్నవాడు ఈ జన్మకే కాక రాబోయే జన్మలకు కూడా పుణ్యాన్ని కూడా మూట కట్టుకుంటాడు అంటే నమ్రతతో అణకువతో తన ఇంద్రియాలను నిగ్రహించుకొని ఉండేవాడు ముల్లోకాల్లో గొప్పవాడని భావము. ఆ కురళ్ ఇలా వున్నది.

**ఒరుమైయుళ్ ఆమై పోల్ ఇందడక్కల్ఆట్రిన్**
**ఎజ్మా మై యుంఏమాపుడైన్దు**

127వ కురళ్ ఇంకో అద్భుతమైనది. ఇందులో "మనము ఇంద్రియాలను నిగ్రహించుకునే ముందు మన నాలుకను తప్పకుండా అదుపులో పెట్టు కోవాలి ఎటువంటి వారైనా కూడా తమ నాలుకను అదుపులో ఉంచుకోవాలి. అలా ఉంచుకోకపోతే శత్రుత్వం పెరిగి చాలామందికి వారు పగవారు అవుతారు. అందుకని దేన్ని అదుపులో ఉంచుకున్నా ఉంచుకోకపోయినా నాలుకను మాత్రం ఖచ్చితంగా అదుపులో అణచి ఉంచుకోవాలి అని పదేపదే చెబుతున్నారు .

**యాగావారాయిణుంనాకాక్కకావాక్కాల్**
**సోగప్పర్సోల్లిజ్జుక్కు పట్టు**

*ఎవరైనను ఉంచుకోండి నాలుకను అదుపులో*
*అవమాన పడి రోదిస్తారు జనంలో.*

ఇక 128 కురళ్‌లో కవి నాలుకనదుపులో ఉంచు కోవడానికి చెబుతున్నారు. పది మాటలు పలికే నాలుక ఒక చెడు మాట పలికితే ఆ పది మంచి తీపి మాటలకు అది చేదు అవుతుంది అని అంటున్నారు. అంటే ఒక చెడ్డ శబ్దము ఉచ్చరించడం వల్ల ఆ వ్యక్తి తాను చేసుకున్న ఎన్నో పుణ్యకార్యాలను వ్యర్థ పరుస్తున్నాడు అని అంటున్నారు. దీని గురించి వ్యాఖ్యాన్నిస్తూ కరుణానిధి గారు అద్భుతంగా చెబుతున్నారు.

"నాలుక చెప్పే ఒక చిన్న చెడు శబ్దం వల్ల ఆ వ్యక్తి తను చేసిన చెప్పిన అనేక మంచి శబ్దాలు చెడు మాటలుగా కనబడతాయి. ఉదాహరణకు ఒక కుండ నిండా ఉండే పాలులో ఒక చుక్క విషం కలిపితే దాని వల్ల ఆ కుండ నిండా ఉండే పాలు విష పూరితమవుతుంది. దీన్నే కవిగారు చక్కగా మలచారు అని కరుణానిధి గారు చెబుతున్నారు.

ఇక **కురళ్ 129** చాలా ప్రసిద్ధమైన భావింప బడుతుంది.

**తీయిణాత్ సొట్ట పుణ్ఉళ్ళారుంఆఱాదే**
**నావి ణాఱ్ఱుట్టవడు**

ఈ కురళ్‌ను మధుర భాషణం అనే తన వేరే అధ్యయములో కవి పెట్టి ఉండవచ్చు, కానీ ఈ అధ్యాయంలో ఎందుకు ఉంచారని తెలుసుకోవాలి. ఇంద్రియ నిగ్రహాలతో పాటు జ్ఞానేంద్రియ నిగ్రహం అంటే ముఖ్యంగా నాలుక చేసే పాపాన్ని గురించి ఇందులో చెప్పబడినది. నిప్పుతో కాల్చబడిన గాయాలు మానవచ్చు కానీ నోటి దురుసు వల్ల ఇతరుల మీద ప్రయోగించే చెడ్డ మాటలు వల్ల నాలుకతో వాతలు పెట్టిన మాటల కొరివి మనసులో శాశ్వతంగా చేదుగా ఓ గాయంగా మాయని మచ్చగా ఉండిపోతుంది. ఎవరు దాన్ని తాళలేరు. అందుకే నిప్పు కణిక లేదా నిప్పు కట్టెకంటే, నిప్పు రవ్వ కంటే నాలుక ద్వారా రాలే ఇతరులను దూషించే మాటలు కోమలమైన మనసును కాల్చి వేస్తాయి. దయచేసి ఇతరులతో మంచి మాటలనే మాట్లాడండి అని ప్రేమతో వళ్ళువర్ శాసిస్తున్నారు. అంటే కాల్చిన గాయం కొట్టిన దెబ్బ వల్ల కలిగే గాయాలకంటే నాలుక వల్ల మనసుకు మాటల వల్ల కలిగే గాయాలు చాలా నొప్పిని కలిగిస్తాయి.

**131 వ కురళ్ లో ఇలా చెబుతున్నారు.**

**ఒఱ్ఱుక్కంవిఱ్ఱుప్పంతరలాణ్ఒఱ్ఱుక్కం**
**ఉయిరినుంఓంగపడుం**

"చక్కగా చదువును అభ్యసించి అణకువతో నేర్పరితనంతో నమ్రతగా ఉండేవాడి వెంట ధర్మం ఎప్పుడూ రక్షగా కూడా ఉంటుంది అని అద్భుతంగా అంటున్నారు. అలా క్రమ శిక్షణతో అణకువతో కూడిన గుణం ప్రాణం కంటే మిన్న అని చెబుతున్నారు. ఆ నమ్రతతో కూడిన క్రమ శిక్షణ ధర్మాన్ని చేకూరుస్తుంది అని చెప్పి ఈ అధ్యాయాన్ని పూర్తి చేస్తున్నారు.

మి

ఆచార్య యన్. లక్ష్మి అయ్యర్
అతిథి ఆచార్యులు (భారతం ) సబరగుమూవ యూనివర్సిటీ,
శ్రీ లంక, ఫోన్ : +91 96 80 276 038

## స్థానం నరసింహారావు

1956 జనవరి 26న రాష్ట్రపతి దర్బారు హాలులో మారుమోగిన కరతాళధ్వనులు ప్రతిధ్వనిస్తుంటే అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ గారి చేతులమీదుగా 'పద్మశ్రీ' బిరుదును అందుకొన్న తొలి రంగస్థల నటుడు స్థానం నరసింహారావు. స్థానం వారు గుంటూరుజిల్లా బాపట్లలో 1902 సెప్టెంబరు 23న జన్మించారు. 18 సంవత్సరాల ప్రాయంలో బాపట్లలోనే తొలిసారిగా ముఖానికి రంగు పూసుకొని 'చంద్రమతి' పాత్రను ధరించే అవకాశం వచ్చింది. పైగా ఆ ప్రదర్శన తిరుపతి వేంకటకవుల సన్మానసభ కార్యక్రమంలో వేంకట కవుల సమక్షంలో ప్రదర్శించే అదృష్టం కలగడం, వారి అభిమానాన్ని, ఆశీస్సులను పొందడంతో స్థానం వారి నటజీవితం ఆనాటి నుండి పున్నమినాటి చంద్రునిలా కళకళలాడింది. ఆరోజుల్లో ఒక్క సురభి కంపెనీలో తప్ప మిగిలిన నాటక సమాజాల్లో స్త్రీ పాత్రలను పురుషులే ధరించేవారు. స్త్రీ పాత్రలను ధరించి మెప్పించడం కత్తిమీద సాములాంటిదే అయినా, స్థానం వారు – సహజంగా, స్త్రీలు కూడా పోషించలేని రీతిలో సత్యభామ, చిత్రాంగి, మల్లమాంబ, మధురవాణి, ముర, రోషనార, దేవదేవి, చింతామణి, చంద్రమతి మొదలగు పాత్రలను అపురూపంగా, అద్వితీయంగా, అసమానంగా అభినయించేవారు.



ఆంధ్ర నాటకరంగంలోని సుప్రసిద్ధ నటులు సరసన దాదాపు మూడువేలసార్లు స్త్రీ పాత్రలు ధరించి మహిళా ప్రేక్షకులు సైతం ముక్కున వ్రేలిడినుకొనునట్లు చేసారు. పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల్లో భిన్న స్త్రీ పాత్రలను పోషించి నటకావతంస, నటశేఖర, ఆధ్రగంధర్వ, కళాప్రపూర్ణ బిరుదులచే సత్కరింపబడినారు. బర్మాలో కూడా ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకుని, రంగూన్ ప్రజలచే బంగారు కిరీటాన్ని బహుమానంగా పొందారు. 1960 డిసెంబరులో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ వారినుండి 'నాటక కళాప్రపూర్ణ' బిరుదును అందుకొన్నారు. *"నా స్త్రీ వేషం నన్ను ఏనాడో వరించింది. కొన్నాళ్ళుగా ఆమే నేనుగా నేనే ఆమెగా మానసికంగా కలిసిపోయాము. రంగస్థలంపైకి వెళ్లేముందు ఆమె చక్కగా సింగారించుకొని నన్ను ఆవహించేది" అని తన అనుభూతిని పలుమార్లు వ్యక్తం చేసిన స్థానం వారు... "నాటకం ప్రకృతికి ప్రతిబింబం. నాటక హృదయమే అభినయం. ఈ అభినయానికి జీవం నటన. అటువంటి నటనలో ఉత్తేజం కలిగించేది భావోద్రేకం. ఈ భావోద్రేకంలో తగిన స్థానాన్ని అందుకోవాలి. అదే నా సాధన. అందుకే నా జీవితం అంకితం కావాలి" అని అభిలషించిన స్థానంవారు... రంగస్థలానికి చెందిన వివిధ విషయాలను వివరిస్తూ "నటస్థానం" అనే గ్రంథాన్ని రచించిన స్థానం వారు.... 1971 ఫిబ్రవరి 21న కీర్తిశేషులైనారు.*

*- తెలుగు దివ్వెలు - వి.ఎస్. రాఘవాచారి*


# ప్రతిజీవి సృష్టిలో – వలస జీవే

– మద్దిలేటి సోమశేఖర్

ప్రకృతిలో ప్రతిజీవి సృష్టిలో వలస జీవే. ప్రతి జీవికి మొదట వలస ప్రాంతము అమ్మ కడుపే, వలస జీవిత కాలంలో పాఠాలు చాలా నేర్పుతాయి. బాధకి, దుఃఖానికి, వలస కారణంగా ఉంటుంది. వలసలు వెళ్లే ముందు, వలసకి కారణమైన బాధలు ఏ కారణం వల్ల వెళ్తున్నమో. తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రాయలసీమలో వలస వెళ్లే జీవితాల్ని ఆలోచింపజేసే నవల వలస. వలస వెళ్లిన వాడినైనా, వెళ్ళని వాడినైనా, ఏ మనోవైజ్ఞానిక విశ్లేషకుడైన, తన నచ్చిన అభిప్రాయాన్ని చెప్పొచ్చు. కానీ ఈ నవలను బహుజనుల కంటే అందంగా మనోరంజకంగా చెప్పలేరు. పైగా ఈ నవల ఆలోచింప చేయడమే కాక గాయపరిచిన వారి గురించి, ప్రత్యర్థుల గురించి, అన్యాయం చేసిన వారి గురించి, ప్రశ్నించే తత్వాన్ని ఇస్తుంది. మనశ్శాంతితో జీవించగలిగే మనిషికి ఇంత లోతైన వలస ప్రయాణాన్ని అలవోకగా అక్షరబద్ధం చేసిన మంచి నవల రాసాని "వలస"..

చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతా వాస్తవికత నేపథ్యంలో దళిత బహుజనుల జీవన వ్యవసాయ వ్యవసాయ సంక్షోభాన్ని కరువులోని కఠోర వాస్తవాలని ఈ నవలలో చిత్రించడం సభబే.. సగటు రైతు అనుభవిస్తున్న నరకయాతన, వ్యవసాయాన్ని వదులుకోలేక తమ జీవితాన్ని సాంస్కృతిక నేపథ్యాన్ని తమదైన వ్యవసాయక సంక్షోభాలతో కునరిల్లిపోతూ వలసలకు ఆలవాలమై పోతూ వలసెల్లిపోయిన మనిషి రాసాని వలసలో జీవం పోసుకోవడం పరిపాటి..

వెనుకబడిన కులాల వాళ్లను లెక్కచేయని వాళ్లకు వారి సంప్రదాయాలను రికార్డు చేసి ఇదిగో ఈ కులాల ప్రత్యేకత అని చూపించేటువంటి సత్తా కలిగిన రచయిత రాసాని. యామారే కులాలేవి, యామారుస్తున్న కులాలేవి అనేది ఆయన రచనల్లో స్పష్టంగా చూపిస్తారు. ఈ ధన, కుల ప్రపంచంలో కులం లేని వాళ్లు బ్రతకడం ఎంత కష్టమో ఆయన తన రచనల్లో చూపిస్తారు. పూటకు గడవని సంచార, గిరిజన, యాచకుల గురించి పరిశోధనాత్మకంగా రచనలు చేస్తున్న రచయిత రాసాని. ఆ




వరుసలో వచ్చిందే ఈ వలస. 1993లో ప్రారంభించి 2016లో ఈ నవలను పూర్తి చేశాడంటేనే ఆ కృషి, విషయంలోని గాఢత మనకు అర్థమయిపోతుంది. నవలను రాసిన తరువాత కూడా ఏ పత్రికల్లోను ప్రచురించకుండా చాలామంది పెద్దమనుషుల రూపంలోవున్న ముసుగు వీరులు ఆపగలిగారని రచయిత ముందుమాటలో చెప్పుకున్నారు. విశాలాంధ్ర పి. హరినాథ్ రెడ్డి గారు ఈ పుస్తకాన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకుని దీనిని ప్రచురించడం కొసమెరుపు. ముప్పయిదేండ్ల వ్యవధిలో జరిగిన యదార్థ గాథను వలస నవలగా మరల్చడం అంటే మామూలు విషయం కాదు. తాను జీవిస్తున్న కాలాన్ని, తన ముందు కాలాన్ని, రాబోయే కాలంలోని మార్పును పసిగట్టి రాయగలుగుతున్న రచయిత రాసాని. భద్రావతాయన యదార్థ జీవన చిత్రమే ఈ వలస నవల. ఏ పాత్రధారుడైతే ఈ నవలలో ఇతివృత్తంగా ఉన్నాడో అదే వ్యక్తికి ఈ నవలను అంకితం చేయడం కూడా కాసింత ఆశ్చర్యంగా అనిపిస్తుంది. భద్రావతి ఆయన అసలు పేరు మంగిరి నాగయ్య కురుమపల్లె, పులిచెర్ల మండలం, చిత్తూరు జిల్లా. చెప్పాలనుకున్న కథ పుష్టిగా ఉన్నప్పుడు కల్పనలు అవసరం లేదు. అయితే కథాపుష్టిని పరిపుష్టిని చేయడంలోనే రచయిత గొప్పతనం దాగి ఉంటుంది. అందరి దగ్గర అన్నిటికీ సరిపోయే కథలు ఉంటాయి. అయితే ఆ మలిచేతీరు ఎత్తుగడ ఇవన్నీ సమంగా సరిపోతేనే అది రచన అనిపిస్తుంది. మంచి రచనగా పది కాలాలు నిలబడుతుంది. రాసాని వలస నవల చదువుతుంటే జాతరకు బయలుదేరినట్లుంది. అయితే ఆ జాతరకు వెళ్లే ముందు సంసిద్ధతకు పడేపాట్లు ఎన్ని ఉంటాయో, అవన్నీ మనకు ఈ నవలలో కనపడతాయి. పల్లె జీవితం

బహుముఖీన జీవితం కావడంతో వృత్తుల సమాహారాన్ని తనమెడలో వేసుకున్నాడు. ఆ మెడలోని హారంలోని ఒక్కో పుష్పాన్ని అప్పుడప్పుడు నేలకు విదిలిస్తుంటాడు. ఆ పుష్పాలను మనం ఏరుకొని దండగా పేర్చి పరిమళాలను ఆస్వాదిస్తే అప్పుడు తెలుస్తుంది రచయితలోని లోతు. కథ ప్రారంభమయ్యేది గొడవతో ప్రారంభమవుతుంది. నువ్వు ఒక మామేనారా నీ కూతుర్నిచ్చి నా గొంతుకోస్తివి అనేది ప్రారంభం మాట. భద్రావతిలో రాజు మాదిరిగా వుండే నన్ను ఈడికి రమ్మని అవమానిస్తావా అంటాడు క్రిష్టప్ప. క్రిష్టప్ప భద్రావతాయనకు స్వయానా అల్లుడు. భద్రావతాయన భార్య పేరు రాజమ్మ. నువ్వే కదా సాక్ష్యం నాకు అన్ని ఇస్తాను, ఇప్పిస్తాను అని కుచ్చుల కులాయి పెడతానని అంటే నిక్కడికి వస్తిని. అని గొడవకు దిగాడు క్రిష్ణప్ప. భద్రావతాయన కూతుళ్ళు జయమ్మ, యశోద. నీతి జాతి లేని వాళ్లకు పుట్టిందానా అని మొగుడు జయమ్మని తిట్టడంతో అప్పుడు జయమ్మ గతాన్ని వెతుక్కుంటూ వెళుతుంది. అదే ఈ నవల సారాంశం.

జయమ్మకు బంగారుపాలెం సంబంధం రావడం, అది నిశ్చితార్థం వరకు వెళ్లడం, చీర జాకెట్ ఇవ్వడం, అప్పుడే సరిగ్గా భద్రావతి నుంచి క్రిష్ణప్ప రావడం రాజమ్మ సంతోష పడటం జరుగుతుంది. రాజమ్మ నాయనకు ఇద్దరు పెళ్ళాలు. పెద్ద భార్య కూతురు రాజమ్మ. తల్లి చిన్నప్పుడే చనిపోవడంతో వాళ్ల నాన్న రెండో పెళ్లి చేసుకుంటాడు. రెండో పెళ్ళాంకు పుట్టిన వాడే క్రిష్టప్ప. పేరుకు కృష్ణా అనే పేరు ఉంది కానీ ఒక్క సద్గుణమూ లేదు. లేవగానే మందు తాగడం, పేకాట, వూరంతా షికార్లు కొట్టడం ఇవే ఇతని దిన నిత్య కృత్యం. ఏమీ లేకపోయినా ఏది సంపాదించుకోకపోయినా ముప్పయ్యేళ్లు దాటిన ముదురు బెండకాయ అనే పేరు మాత్రం సంపాదించుకుంటాడు. జయమ్మ నిశ్చితార్థం అయిపోయిన మరుసటిరోజే వస్తాడు. నాకు జయమ్మనిచ్చి పెళ్లిచేయాలని పట్టుబడతాడు. అప్పుడే మేము మాటిచ్చాం అని చెప్పినా కూడా మాటే కదా ఏముందిలే మార్చేస్తే సరిపోతుందంటాడు. మేనరికమని చెప్పండి వాళ్ళు ఏమి అనరు అంటాడు. కుదిరిన పెళ్లి చెడగొట్టి జయమ్మతో నిచ్చితార్థం జరిగి పెళ్లిదాకా పోవాల్సిన కార్యాన్ని మధ్యంతరంగా ఆపించి చెడగొట్టి కృష్ణప్పతో పెళ్లి జరిపిస్తారు. అది గతం, ఆగతం నుండి బయటకు వస్తుంది జయమ్మ. మామ అల్లుళ్లు రోడ్డు మీద కొట్లాడుతుంటారు. పంచాయితీ తెంపడానికి సిద్ధారెడ్డి మధ్యస్తికం వస్తాడు. వాళ్లతో పొట్లాకెందుకుపోతావు కాని ఉన్న ఇల్లు నీ అల్లుడికిచ్చి మొగుడు పెళ్ళాం ఇద్దరు మా ఇంటి దగ్గర కొట్టంలో చేరిపోండి అని సిద్ధారెడ్డి తీర్పిస్తాడు. భద్రావతాయన అనేది ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు కాదు బలబద్రి ఆయన అసలు పేరు. భద్రావతి నుండి రావడంతో ఆయనకా పేరు వచ్చింది. తన సొంత ఊరైన అనుమం పల్లెకు పోతాడు బలబద్రి. ఒకప్పుడు వ్యవసాయం చేసిన బావి, ఆ బావి పక్కన భూమి వాటన్నిటిని చూసి ఆవేదన చెందుతాడు. ఐలప్పకు సుందరయ్య, వరాలయ్య అనే ఇద్దరు కొడుకులు. సుందరయ్యకు బలబద్రి కొడుకు. వరాలయ్యకు కన్నయ్య, తిమ్మాజి, రత్నమ్మ అనే పిల్లలు. రత్నమ్మ కూతురే రాజమ్మ. రాజమ్మ చిన్నతనంలోనే చనిపోవడంతో మొగుడు ఇంకో పెళ్లి చేసుకున్నాడు. ఆమె కొడుకే కిష్టప్ప. బలబద్రి పుట్టిన పదేళ్లకు తల్లిదండ్రులు పోతే వరాలయ్య ఇతన్ని పెంచి పెద్ద చేస్తాడు. రత్నమ్మ కూతురు రాజమ్మనిచ్చే పెళ్లి చేస్తాడు. బలపద్రికి ఇద్దరుకు కొడుకులు వీళ్ళందర్నీ వరాలయ్యే చూసుకుంటున్నాడు. వీళ్లకు నాయకురాలు చెరువు కింద మూడు ఎకరాల పొలం ఉంది. బావి కింద మూడు ఎకరాల పొలం ఉంది. పదెకరాల మెట్ట కూడా ఉంది. బలబద్రి పొద్దున లేసి తన బావిలో కపిల తోలడం చేస్తుంటాడు. అనేక జానపద గేయాలు పాడుకుంటూ ఉంటాడు. కపిలితోలి పంటలు పండించాలంటే కష్టంగా ఉంటుంది. అందుకోసం బావిలో రిగ్గు పెట్టించడానికి బలబద్రి ప్రయత్నం చేస్తుంటాడు. ఆ ప్రయత్నంలో భాగంగా మద్ది నాయుడు అనే రైతు దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకువస్తాడు. బావిలో రిగ్గు పట్టించడానికి. తాననుకున్నట్లు నీల్లుపడితే ఇంకా బాగా బతుక్కోవచ్చనే ఆశతో ప్రయత్నిస్తాడు. అనుకున్నట్టుగానే బావిలో రిగ్గు పెట్టిస్తాడు.

అయితే బావిలో బండ పడుతుంది. ఎంత తొలిచినా బండ వస్తూనే ఉంటుంది. నీళ్లుపడక చేసిన అప్పుకు వడ్డీ పెరుగుతుంది. బావిలో నీళ్ల పడవు దీంతో అన్నదమ్ముల మధ్య మనస్పర్ధలు మొదలవుతాయి. నువ్వు చేసిన పని వల్ల అప్పు మనకు పెరిగిందని తోటి అన్నదమ్ములు గొడవకు దిగుతారు. మీరు అనవసరంగా మాటలు మాట్లాడకండి నేను తెచ్చిన అప్పులు నేనే తీరుస్తానని అంటాడు బలభద్రుడు. చేసిన అప్పును తీర్చడానికి

మడ్డినాయుడు మాలకదిరప్పను రోజు ఇంటికి పంపిస్తుంటాడు. అది చూసి అందరూ నానా రకాలుగా మాట్లాడుతుంటారు. ఇది అవమానంగా భావిస్తాడు బలబద్రి. రాజమ్మ కూడా బేజారు చేసుకుంటుంది ఈ విషయంలో. అయ్యా నీ డబ్బులు ఎక్కడికి పోవు నేను పంపిస్తాను కాస్త నాకు సమయం ఇవ్వండి అని చెప్పుకుంటాడు. అప్పులు పెరిగిపోతున్నాయి అప్పుతోపాటు వడ్డీ కూడా పెరిగిపోతుంది. చేసేదిలేక తన పాలికి వచ్చిన భూమిని అమ్మేస్తాడు. అది తనకే కావాలని వరాలయ్య పట్టుబడతాడు. వేరే కులస్తులను తెచ్చి మామధ్యపెట్టి వాడు మేము తన్నుకోవల్లా అని ప్రశ్నిస్తాడు. మేము నిత్యం కాట్లాడుకోవాల్సి వస్తుందని అంటాడు వరాలయ్య. అయితే సరైన రేటు ఇచ్చేదాని కోసం మాత్రం ముందుకు రాడు. ఉన్న పొలాన్ని అమ్మేసి అప్పులన్నీ తీర్చేసి వలస పోతాడు బలబద్రి. జగన్నాథం అనే ఒక చదువుకున్న వాడు ఉంటాడు. జగన్నాథానికి మిత్రుడు నంజుండ. ఇతని చెల్లెల్ని జగన్నాథంకు ఇచ్చి పెళ్లి చేస్తాడు. భద్రావతి రాజ్యం ఎలా ఉందో చూసుకురమ్మని ఆగస్త్యులు చెంగన్నతో కలిసి భద్రావతికి పయనమవుతారు.

భద్రావతి అంటే కర్ణాటకలో ఉన్న ప్రదేశం. అక్కడ నీళ్లు సమృద్ధిగా ఉంటాయి అందువల్ల కరువు ఉండదని వీళ్ళ నమ్మకం. గుడ్లదనీర్లేకెరే అనే ఊరిలో దాసేగౌడ అనే అతను అడవిని నరికి చదును చేసుకుని పంట పెడుతుంటాడు. కాసేగౌడ తన వెంట ఒక మేక పిల్లను పెంచుకొని ఉంటుంటాడు. మేక పిల్ల మెడలో చిన్న గంట కూడా కట్టింటాడు. ఆ గంటను కట్టడం వెనుకవున్న ఉద్దేశం ఏనుగులకు ఆ శబ్దం వినపడి దూరంగా వెళ్లిపోయేలాగా ఆ గంటను కట్టించాడు. దాసేగౌడ బావమరిది నాగప్ప. మద్ది చెట్టు కింద కాపురం ఉండే గంగజ్జు. ఇవన్నీ వలలో పాత్రలు. చిత్తూరు ప్రాంతం నుండి ఎవరు వలస వచ్చినా మొదట దాసేగౌడ ఇంట్లో ఉండి కొన్నాళ్ళు కుదుటపడ్డాక మళ్ళీ వాళ్ళ పనులకు పోయేవరకు వాళ్ల ఇంట్లోనే ఉంటుంటారు. భూతల గుడి, దేవరహల్లి కాకలి సిద్దేశ్వర గుట్ట ఈ భూములను నంజుండప్ప కౌలుకు ఇచ్చింటాడు. ఈ భూములన్నీ తుంగభద్ర కాల్వ కింద సాగులో ఉన్నవే. గుడ్లదకెరెలో కొరిచి, గొల్ల, కురుబ, ముస్లిం, బేడరు, కొంగిర్లు ఇలా అనేక కులాలు జీవిస్తుంటారు. గుద్దాయప్ప అనే ఆయన చెరువు తవ్వించుంటాడు అందుకే ఆ ఊరికి గుడ్లదకెరె అనే పేరు వచ్చింది. ఆ ఊర్లో పొద్దున లేస్తేనే కెంపన్న, బాలయ్య, కిట్టప్ప ముగ్గురు కూడా బేకారుగా తిరుగుతుంటారు. బాలప్ప అనే వాడు అనంతపురం జిల్లా మడకశిర నుండి వలస పోయినవాడు. బాలప్పను కదిలిస్తే చాలు నాగిరెడ్డి, సుబ్బారెడ్డి వర్గాల మధ్య జరిగిన ఫ్యాక్షన్ గొడవల గురించి, కాంగ్రెస్ ఇతర పార్టీల గుంపులు గురించి కథలు కథలుగా చెబుతుంటాడు. ఇద్దరి మధ్య, రెండు పార్టీల మధ్య సామాన్యులు బలైపోయినా విషయాలు, కోర్టు కేసులు వాటి ఖర్చులు, ఆ ఖర్చులకు రెడ్డ దగ్గర తీసుకున్న అప్పులు, అవి తీర్చడానికి శక్తి లేక వాళ్లకే భూములు అమ్మేయడాలు ఇవన్నీ కూడా బాలప్ప కళ్ళకు కట్టినట్టు చెబుతుంటాడు. చిత్తూరు నుండి వలసపోయిన వారిలో ఆగస్త్యులు బాగా తెలివైనవాడు. లోకం తీరు తెలిసినవాడు. తానే ఆ ఊరిని పరిపాలించు కోడానికి సిద్ధంగా ఉన్నాడు. బసవన రాయలు అనే పెద్దమనిషితో ఆగస్త్య డు స్నేహంగా ఉండడం. అగస్త్యులు సామ్రాజ్యాన్ని మెల్లమెల్లగా విస్తరిస్తున్నాడు. ఈ క్రమంలో వలస వచ్చిన రైతులకు, అక్కడే స్థానికంగా నివసిస్తున్న వాళ్లకు మధ్య ఘర్షణలు జరుగుతాయి. ఇదిలా ఉండగా దాసే గౌడ అడవిని నరుకుతుండగా అడవి పంది అనుకోకుండా వచ్చి మీద పడుతుంది. అది అతన్ని తీవ్రంగా గాయపరిచి వెళ్ళిపోతుంది. అప్పటినుండి దాసేగౌడ మంచానికే పరిమితం అయిపోతాడు. ఆ క్రమంలో దాసేగౌడను ఆదుకున్నది బలభద్రి. ఆ కృతజ్ఞతా భావంతో బలబద్రి కొడుకు అయినా రఘుకు దాసేగౌడ కూతురైన అలివేలు నిచ్చి పెళ్లిచేస్తాడు. ఇక్కడ కులాల పట్టింపు లేకుండా పెళ్లి చేయడం ఒక సుదూర ఆలోచనగా మనం చెప్పుకోవచ్చు.

వీళ్ళిద్దరూ పెళ్లి కాకముందే ఒకరంటే ఒకరికి ఇష్టం కూడా ఉంటుంది. ఆగస్త్యుడు వ్యాపారంలో దినదినాభివృద్ధిగా ఎదగడంతో బసవన రాయుడు దొడ్డన గౌడులకు కాసింత ఈర్ష పట్టుకుంటుంది. ఆంధ్ర నుంచి వచ్చి మన భూములు తీసుకుని మన నీళ్లు తీసుకొని మన నుంచి బాగుపడి మనల్ని తన గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్న ఆగస్త్యులకు తగిన బుద్ధి చెప్పాలని ప్రయత్నం చేస్తుంటారు. దీనికంతటికి ఒకటే విరుగుడు భూములు ఇచ్చి, నీళ్లు ఇవ్వకుండా చేస్తే అనే ఆలోచనలో భాగంగా కాలువలో

నీళ్లు రాకుండా చేస్తారు. ఆగస్త్యులకు, తిమ్మారెడ్డికి కిష్టప్పకు మధ్య గొడవ జరుగుతుంది. ఒకరకంగా ఆ గొడవ కర్ణాటక, ఆంధ్ర వాళ్ల మధ్య జరిగినట్లు ఉంటుంది. ఇరు వర్గాల వారికి తలకాయలు పగిలిపోతాయి, రక్తం కార్తుంటుంది, తిమ్మారెడ్డి బలానికి తట్టుకోలేకపోయారు మిగతావారు. తిమ్మారెడ్డిది చిత్తూరు మొరట మనిషి, బలమైన వ్యక్తి, ఊరు ఊరంతా ఒకటయినా తిమ్మారెడ్డిని ఏమి చేయలేరు అంతటి బలాఢ్యుడు. రఘు పెళ్లి చేసుకున్న అలివేలి దాసేగౌడ పొలంలో పనిచేసుకుంటూ ఉంటుంది. అదే సమయంలో ఏనుగు వచ్చి అలివేలుని తొక్కి నుజ్జునుజు చేస్తుంది. రఘు కాపాడడానికి ఎంత ప్రయత్నం చేసినా భార్యను కాపాడుకోలేక పోతాడు. భార్య పోయినప్పటి నుంచి రఘు పిచ్చివాడిలా తిరుగుతాడు. అంతకుముందు కెంపన్న అనే వాడిని రఘునే ఏనుగులు దాటి నుండి కాపాడుతాడు. ఎవరెవరినో కాపాడిన రఘు తన ప్రాణానికి ప్రాణమైన అలివేలును కాపాడుకోలేక పోయాడు. ఈ ఆలోచనతోనే రఘు ఒక రకంగా పిచ్చివాడై పోతాడు. ఇదే ఊర్లో తమ పంతాన్ని నెగ్గించుకోవడానికి రామేగౌడ, బసవరాయలు హిందూ ముస్లిం గొడలను కూడా లేపుతారు. గంగజ్జు కొడుకును బసవరాయులు చంపించి ఉంటాడు. ఆ కోపంలో గంగజ్జు బసవరాయలను చంపడానికనిపోయి చేతకాక, ధైర్యం చాలక ఏనుగును చంపుతాడు. ఆంధ్రావాళ్లు కూలీ నాలిచేసి కష్టపడి సంపాదించుకుని పోగేసుకున్న డబ్బులతో అడవిలో సొంతంగా ఇండ్లను కట్టుకుంటారు. ఏనుగుల దాడిలో ఇండ్లన్నీ నీలమట్టం అయిపోతాయి. ఏనుగులు దాడుల్లో బలబద్రి చిన్న కొడుకు శేషాద్రి చనిపోతాడు. పెద్ద కొడుకు పిచ్చివాడిగా మారిపోతాడు. తన చిన్న కూతురు అయిన యశోదను ఆగస్త్య కొడుక్కి ఇచ్చి వివాహం జరిపించాలని అనుకుంటాడు. సరిగ్గా అదే సమయంలో క్రిష్టప్ప యశోదని బలవంతంగా రేప్ చేస్తాడు. ఈ అవమాన భారాన్ని తట్టుకోలేక యశోద బావిలోకి దూకి చనిపోతుంది. ఉండూరులో ఉండలేక వేరూరులో సంపాదించుకోలేక తన కుటుంబాన్ని, సమస్తాన్ని కోల్పోయి వట్టిచేతులతో తన ఊరికి చేరుకునే బలబద్రి జీవితపు ఆర్తిని వలస నవలగా చిత్రీకరించారు.

**ముగింపు :** రాసాని రాసిన వలస నవల్లో కరువు జీవితాన్ని ఎంత ఛిన్నాభిన్నం చేస్తుందనేది కళ్లకు దృశ్యమానం చేసిచూపించారు. బ్రతుక్కోవదానికిపోయితమ సమస్తాన్ని కోల్పోయి ఒట్టిచేతులతో తిరిగి సన సొంతూరికి రావడమనేది ఎంత దయనీయంగా వుంటుందో వూహించడానికే కష్టంగా వుంటుంది. అలాంటి బలభద్రి పాత్రను రచయిత మలచడంలో ఎంత ఆర్ధ్రతను కనపరచారో చదివితే తెలుస్తుంది. రాసాని నవలలన్నీ పరిశోధనాత్మకంగా వుంటాయి. లోతులను తడిమితే తెలుస్తుంది.

మద్దిలేటి సోమశేఖర్
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం
బెంగళూరు విశ్వవిద్యాలయం, చరవాణి: 9848529891

## కమ్మతెమ్మెరలు

ఎడిటర్ గారికి,

ఏప్రిల్ **మిసిమి** ఆసాంతం చదివాను. మే సంచిక ఇప్పుడే అందింది. మనసులో మాట చెబుతున్నాను. మా చిన్నప్పుడు 'భారతి' మాస పత్రిక చదువుతుండేవాడిని. అందులో మహామహుల రచనలు వస్తుండేవి. అయినా వ్యాపారం కోసం ప్రకటనలు ప్రచురించేవారు. ఆ తరం వెళ్లిపోయింది. తరువాత నాకు తెలిసి **మిసిమి** లాంటి మాసపత్రిక తెలుగులో మరేదీ లేదు. మీరు ప్రకటనలు వేయరు, సినిమాలు వేయరు, రాజకీయాలు వేయరు, కథలు వేయరు, కవితలూ వేయరు. చూడండి! ఇవన్నీ లేకుండా కూడా పత్రికను ఎంతో పవిత్రంగా నడుపుతున్నారు. మాలాంటివారు చదివి పునీతులవుతున్నారు. **మిసిమి** లో వచ్చే వ్యాసాలన్నీ మణిపూసలే. ఎంతో నిబద్ధతతో పరిశోధించి రాసినవే. అవి వ్యాసాలే అయినా విసుగుపుట్టించకుండా మీరు పత్రికను బ్యాలెన్స్ చేసే విధానం అనుపమానం. మాలాంటి వారి ఆశీస్సులు మీకు ఎప్పుడూ ఉంటాయి. ధన్యవాదాలు.



*- దుగ్గిరాల రాధాకృష్ణమూర్తి, గుడివాడ, ఫోన్ : 94403 91150*

# పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య లేఖలు

– ఘట్టమరాజు అశ్వద్ధనారాయణ

ఆయన ఏండ్లు పూండ్లు బతకలేదు. జీవించింది కేవలం 44 ఏళ్లే. ఆయన అర్ధాయుష్షులోనే అస్తమించినా తెలుగు సాహిత్య ప్రియుల తలల కెత్తింది బండ్ల కొద్దీ పెన్నిధినే మద్రాసు, రాజమహేంద్రవరం, కాకినాడ. పిఠాపురం, విజయనగరం, మచిలీపట్నం, అనంతపురం, కడవలు కొమ్ములు తిరిగిన కవి, పండితులకు పుట్టినిళ్లయినట్లే నెల్లూరును పండిత కాశిగా మలిచిన కీర్తి ఈ పూండ్ల రామకృష్ణయ్యకే (1860–1904) సిద్ధించింది.

పంతొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధంలో వెలువడ్డ రామచంద్రరావుగారి విద్యార్థి కల్పభూజము, కందుకూరి వారి వివేకవర్ధిని, కొక్కొండ వారి ఆంధ్రభాషా సంజీవని పత్రికలచే ప్రభావితులైన పూండ్ల వారు 1885 జూన్ 1వ తేదీన 'అముద్రిత గ్రంథ చింతామణి' అనే మాస పత్రికను నెల్లూరి నుంచి ప్రారంభించారు. ఈ సాహిత్య మాసపత్రిక 1904 సెప్టెంబరు దాకా–పూండ్ల వారి చివరి శ్వాస వరకు 19 ఏళ్లపాటు వెలువడింది. మొదటి రెండేళ్ల పాటు ఒడయరు వీరనాగయ్య, తర్వాత కొంత కాలానికి రెండేళ్ల దాకా కొప్పిసెట్టి రామానుజరావు నాయుడు అముద్రిత గ్రంథ చింతామణికి సహసంపాదకులుగా తోడ్పడ్డారు. మొత్తం మీద ఈ విశిష్ట సాహిత్య మాసపత్రిక సంపాదక బాధ్యత పూండ్ల రామకృష్ణయ్య భుజస్కంధాలపైనే పడింది అని చెప్పొచ్చు.

19వ శతాబ్దం ఉత్తరార్ధంలో తెలుగులో వైజయంతి, సత్యసాధని, కలావతి, రాజహంస. శశిలేఖ, ఆంధ్రభాషా సంజీవని, వాగ్వల్లి, సూర్యాలోకము ఇత్యాది సాహిత్య పత్రికలు ఉద్దండ విద్వాంసుల సారథ్యంలో వెలువడుచుండేవి. పూండ్లవారి 'అముద్ర గ్రంథ చింతామణి'ఈ పత్రికల మధ్య మధ్యందిన మార్తాండునిలా విరాజిల్లింది, ప్రజ్వరిల్లింది కూడాను. 'అముద్రిత గ్రంథ చింతామణి' మాటికి నూరుపాళ్లు సాహిత్య పత్రిక, ప్రాచీన తెలుగు కావ్యాల తాటాకు ప్రతుల్ని చీకటి కొట్ల లోనుంచి బయటికి తీసి. పరిష్కరించి ధారావాహికంగా ప్రచురించడం, ప్రకాండ పండితులచే తెలుగు కావ్యాల శబ్దార్థాలపై, కవుల కాలనిర్ణయాల గురించి చర్చలు జరిపించడం, కొత్తగా వెలువడ్డ కావ్యాలు, నాటకాలు, నవలలు, విమర్శ గ్రంథాల సమీక్షలు చేయించడం ఈ పత్రిక ప్రధానాశయంగా వుండేది. సంపాదకులు పూండ్ల రామకృష్ణయ్య కవిపండితులతో రచనలు పంపమని కోరడం, ఇతర పత్రికల సంపాదకులతో సంవాదించడం, భేదాభిప్రాయాలు పరస్పరం పత్రికల ద్వారా తెలియచేయడం, వాదోపవాదాలు తీవ్రంగా పత్రిక ద్వారా కొనసాగించడం, చందాదారుల్ని, పోషక మహా ప్రభువుల్ని సమకూర్చుకోవడం వగైరా విషయాలు 'పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య లేఖలు' (2019) తెలుసుకోవచ్చు.

ఈ పుస్తకానికి 'సాహిత్యంలో శిలాజాల పరిశోధకులు' అన్న పీఠిక వాక్యాలు రాసిన ప్రఖ్యాత విద్వాంసులు డా. కాళిదాసు పురుషోత్తం గారు ఈ గ్రంథ విషయ వైశిష్ట్యాన్ని ఈ విధంగా చాటారు–"లేఖల్లో రామకృష్ణయ్య వాడిన సంక్షిప్త రూపాలు, వ్యాజస్తుతి రూపంలో వాడిన పదాలు, తిట్లు, ఎత్తి పొడుపులు అన్ని వివరించి లేఖలు పూర్వాపరాలు పాఠకులు బోధపరుచుకోడానికి మార్గం సుగమం చేశారు డా. శివరామ ప్రసాద్. సాహిత్య జీవులూ సగటు మనుషులే కనక వారి ఈర్ష్యాసూతులు, స్పర్థలు, పక్షపాత దృష్టి, కక్షలు, కక్షకట్టడాలు, సాహిత్య సిద్ధాంతాలు, అన్నిటి కన్నా మించి ఆర్థిక లాభనష్టాలు ప్రతి అంశం ఈ లేఖల్లో చోటు చేసుకొంది. ఇవి వ్యక్తిగత జాబులు– నిర్భయంగా మనస్సు విప్పి రాసినవి గనక కొన్ని సార్లు మూడవ వ్యక్తిని చులకనగా. పరిహాసంగా పేర్కొనడం, దూషణ, అప్రియ సత్యాలు, వ్యంగ్యం వీటిలో కనిపిస్తుంది. ఒకటి, రెండు జాబుల్లో రామకృష్ణయ్య వ్యక్తిగత విషాదం, అనారోగ్యం గురించి చదివినపుడు పాఠకుల కళ్లు చెమరుస్తాయి. (పేజి:4) పూండ్ల రామకృష్ణయ్యగారి పాండిత్య పూర్ణమైన, గుణగ్రహణ పారీణత సంతరిచు కొన్న, నిర్భీకమైన సంపాదకత్వం వల్ల 'అముద్రిత గ్రంథ చింతామణి' ఆనాటి తెలుగు సాహిత్య పత్రికల్లో శిరోమణిగా 19 ఏళ్లపాటు విరాజిల్లిందిబీతర్వాత తరాల సాహిత్య పత్రికలకూ నాయక మణిగా ప్రభవిల్లింది.

'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రిక నెలనెలా ఠంచన్‌గా వెలువడి, పోషకులకు చందాదారులకు సక్రమంగా అందేది. మహాపోషకులకు, పోషకులకు, చందా దారులకు గాను ప్రతినెలా 250 ప్రతులు, అమ్మకానికిగాను మరో 250 ప్రతులు ముద్రింపబడేవి. సంపాదకులు పూండ్ల రామకృష్ణయ్య తరుచుగా కవి, పండితులకు లేఖలు రాస్తూ వాళ్ల నుంచి రచనలు, అముద్రిత కావ్యాలు, చందాలు కోరేవారు. ఆయన అకుంఠిత దీక్ష, అనవసరత శ్రమవల్ల ఆనాటి ప్రముఖ విద్వాంసుల్లో చాలా మంది 'అముద్రిత చింతామణి' పత్రికకు చందాదారులయ్యారు. తమ సొంత వ్యాసాలు పంపుతూ, వాదావివాదాల్లో భాగస్వాములయ్యేవారు. "అల చెళ్లపిళ్ల వెంకన గురువంచు చెప్పికొనగా నది గొప్ప తెలుంగు నాడునన్" అని విశ్వనాథ వారన్నట్లుగా ఆ రోజుల్లో 'అముద్రిత గ్రంథ చింతామణి' చదవడం ఆ పత్రిక రచనల్ని విమర్శించడం, ఆ పత్రికకు రాయడం గౌరవాస్పదంగా భావించే వాళ్ళ ఆనాటి పండిత, కవి, పాఠకులు.

పూండ్ల రామకృష్ణయ్యకు వేదం వేంకటరాయశాస్త్రి గారంటే కొండంత గౌరవ ప్రపత్తులు. ఆయన రచించిన 'ప్రతిపరుద్రీయము' నాటకం చేతికందిన వెంటనే చదివి, పరమానందభరియలై తనయింట్లోనే సాహిత్య ప్రియుల్ని సమావేశపరిచి ఆనాటకం తాను చదువుతు సభికుల్ని బ్రహ్మానంద భరితుల్ని చేశారాయన. ఆ ఆనందాతిశయాన్ని వ్యక్తం చేస్తూ, వేదం వారికిలా ఓ లేఖ వ్రాశారు (6-11-1997) "ప్రతాపరుద్రీయ నాటక మందలి (ప్రతిని చూచి) బ్రహ్మానందముంజెందితిని. నిన్నటి రాత్రి మా యిల్లంతయు దీని పఠనము వలన మన మిత్ర బృందముచే నిండిపోయినది. ఈ గ్రంథమునకు మిగుల ఖ్యాతి వచ్చుననుటకు సందియము లేదు." వేదం వారి రచనలన్నా, వారి వ్యక్తిత్వ గరిమ అన్నా పూండ్ల వారికి ఎనలేని ప్రేమ. చెప్పరాని ఆదరం. వారం రోజులు తిరక్కముందే రామకృష్ణయ్య గారికి మరొక ఉత్తరం (11-11-97) రాస్తూ, ఇలా తమ వేడికోళ్లు తెలియ చేస్తున్నారు. "మీరు సాత్వికులు. అందు వలన నందఱు దమ మీద గడుసుందన ముపయోగింతురు. దానిని మీరు మార్చిన గాని యికను వలను పడదు. మీ గ్రంథమునకు బ్రాశస్త్యము త్వరలో వచ్చుననుటకు సందియము లేదు. నేను నిచ్చట దానికి వ్యాప్తి గలుగునట్లుగ జదువుచున్నాను." (పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య లేఖలు. పేజి : 27)

పూండ్ల రామకృష్ణయ్య గారు "అముద్రిత గ్రంథ చింతామణి' ముంద్రించడంలో తలమునకలయ్యేవారు అంతే కాకుండా సాహితీ మిత్రుల పుస్తకాల ప్రూపులు దిద్దటంలో తదేకమగ్నులయి పొయ్యేవారు 12-7-1898 తేదీన తన రెండవ కుమారుడు మరణించిన దినం కూడా సారస్వత సేవలో మునిగి వుండినాడా మహానుభావుడు. పూండ్ల వారు వేంకటరాయశాస్త్రి గారికి17-7-98లో రాసిన లేఖలోని కొన్ని అంశాలిలా వున్నాయి- "నేను అదివరలో వ్రాసిన కార్డులో మా రెండవ పిల్లవాడు నామవశిష్టుడయ్యెనని వ్రాసియుంటిని. మీరు మా కిట్టి యిక్కట్టు వచ్చి యుండెనని నమ్మలేక యింకను పిల్లవాడు జీవించి యుండెనని యెంచి పిల్లవాని క్షేమోదంతమును వ్రాయమని వ్రాసితిరి. అయ్యో! అంతటి భాగ్యము నాకు లేకపోయెను. తేదీ 12నాడే కుఱ్ఱవాడు పగలు 9 ఘంట లకు చనిపోయినాడు అంతకు ముందు రెండు రోజులు విషజ్వరము వచ్చెను. నాటి రాత్రి.....చనిపోయినాడు. ఆ దుఃఖమును మఱునాడే చాల వఱకు నిలిపి పని చేసినను దినమున కొక పర్యాయ మది జ్ఞప్తికి వచ్చుచునే యున్నది. చాలా వఱకు మోహలతను జ్ఞానలవిత్రముచే ద్రెంపు చున్నాను. ఎంత తుంచినను (......) చు చున్నది. కొంత కాలమునకు గాని బొత్తుగా క్షీణించుచున్నట్లు లేదు. చచ్చిన నాటి మధ్యాహ్నమే యిపుడు మీకు పంపియుండే విక్రమార్క ప్రూఫ్ చూచి ముద్రాక్షరశాల వారికి బంపినాను. అందువలన నేను దుఃఖములో మునిగి యుండ లేదని తమకు విదితమయ్యే కొఱకై యింత దూరమ వ్రాసినాను. ఇక నీ గొడవ నింతటితో ముగించెదను." (పేజి: 34)

ముద్దుల కొడుకు శవం కళ్లెదుట వుండగానే, ఆ అపారమైన దుఃఖాన్ని దిగమింగుతూ ప్రూఫులు దిద్దడంలో మునిగిన పూండ్లవారి సారస్వత సేవను ఏమనాలి!

రామకృష్ణయ్య గారు వేదం వారి తీవ్ర అభిమాని. ఆయన మీద ఈగ వాలినా సహించ లేనంతటి స్వభావం వారిది. ఆయన వేంకటరాయశాస్త్రులవారికి 17-7-98లో రాసిన దీర్ఘ లేఖలోని ఈ అంశాన్ని గమనించండి వాళ్ల కోపతాపాలు, ప్రతీకార వాంఛలు ఎంత తీవ్రంగా ఉంటాయో మనకు తెలుస్తాయి. "కోవూరులో మనకు జరిగిన మర్యాదకు నవేకులు ముద మందు చుండుట నిక్కము. తమ మర్యాద విషయమై యందఱు సంత సించుచున్నారు. ర. వెం. గారు మాత్రము తప్ప. అయినను అయినను లోపము లేదు వారు మనకు విముఖులు గదా. మనము రణరంగములో నుండుట నిక్కమే. మోమాటము

పనికి రాదు. ర. వెం. గారిని చావగొట్ట వలయును. ఇట్లే వాసు గారిని, కోలాచలమును ముందుగా నలుప వలయును. ఆపనులెపుడు పూర్తి యగునో గదా? (పేజి: 36) ఈ లేఖలో పేర్కొనబడ్డ ర. వెం. గారు అంటే రఘునాథపురం వెంకట సుబ్బయ్య. ఈయన నెల్లూరి వకీలు. కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి వర్గానికి చెందినవారు. వాసుగారంటే వాల్మీకి రామాయణాన్ని ఆంధ్రీకరించిన వావిలికొలను సుబ్బారావు. కోలాచలము అంటే బళ్లారి వకీలైన, చారిత్రక నవలా పితామహులని పేరు కాంచిన కోలాచలము శ్రీనివాసరావు గారు వీళ్లందరు వేదం వారి శత్రువర్గానికి చెందిన వాళ్లు. ఆ కాలంలో కవి పండిత ప్రపంచంలో మిత్ర, శత్రు వర్గాలు ఘోరంగా పోరాడేవారు. ఒక్కొక్క వర్గానికి తమదే అయిన సాహిత్య పత్రికలు వుండేవి. అతిరథమహారథులు రెండు వైపులా యుద్ధ భూమిలో మోహరించి వుండేవారు. వ్యాకరణ, అలంకారంది శాస్త్రాలతో పాటు కావ్య నాటక విమర్శాది చర్చలు హోరాహోరిగా సాగేవి.

విద్వన్మత్తేభాల మధ్య ఎంతటి భీషణ సంగ్రామాలు జరిగినా, సింహగర్జనలు, భీకర శంఖనాదాలు రణ రంగంలో మారుమోగినా, వాళ్లు కూడా సంకట పరిస్థితులో విచలిమవుతుంటారు కదా? పూండ్లకల వారిని పుత్ర శోకము చాలానాళ్లు పీడించింది, పీల్చి పిప్పిచేసిదే. ఆ మర్మాంతక వేదనను ఆయన శ్రేయోభిలాషులైన వేదంవారికి ఇలా నివేదించుకొన్నారు. "మాయింటి విషయమై జరిగిన దుఃఖమును నివారించుటకు నెన్ని దినములో జూచుచున్నాను. ఏకాంతమున ననగా రాత్రి పరున్నపుడు పిల్లవాని వ్యాపారము లన్నియు నన్ను వేధించుచున్నవి. వాని నెల్ల నణచుచున్నాను. ఎప్పుడో యొకపుడు కంట దడి పెట్టవలసి నట్లేర్పడుచున్నది. అట్లే కాలము జరుపుచున్నాను. మఱచిపోద మన్నను మఱవు రాకున్నది. ఇట్టి నన్ను ధైర్యశాలి యని తమరు వ్రాయుట వింతగ నున్నది. కాలక్రమముగ గాని తగిపోదు గాబోలు లోకరీతి యింతే గదా!" (25-7-98, పేజి: : 40)

పూండ్ల రామకృష్ణయ్య కొండంత దుఃఖాన్ని సాహిత్య ధర్మక్షేత్రంలో మునుముందుకు సాగిన మహారథి. 'అముద్రిత గ్రంథ చింతామణి' కేవలం ఏదో ఒక వర్గానికి మాత్రమే పరిమితమైన పత్రిక కాదు. మద్రాసు క్రిష్టియన్ కాలేజిలో తెలుగు పండితులైన రాయదుర్గం నరసయ్య శాస్త్రి జక్కన రచించిన విక్రమార్క చరిత్రను కొమాండూరి అనంతాచార్యుల వారితో కలిసి పరిష్కరిస్తే, అది ఆనంద ప్రెస్‌లో ముద్రింపబడి విద్యార్థులకు పాఠ్య గ్రంథమైంది. అదే కళాశాల లోని సంస్కృత ఉపన్యాసకులైన వేదం వారు ఆ గ్రంథ పరిష్కరణలోని తప్పుల్ని విద్యార్థులకు చెప్పితే, ఇద్దరి మధ్య వైమనస్యం పెరిగి వైరం కింద మారింది. వేంకటరాయశాస్త్రిగారు 'విక్రమార్కచరిత్ర' పాఠపరిష్కరణ దోషాల గురించి విస్తారంగా 'అముద్రిత గ్రంథ చింతమణి'లో చర్చించారు. దీనికి సమాధానంగా రాయదుర్గం నరసయ్య శాస్త్రి గారు కూడా అదేపత్రికలో వేదం వారికి బదులిచ్చారు ఈ వాదోపవాదాలు కొంత కాలం దాకా చెలరేగి, పిమ్మట శాంతించాయి. వేదం వారి నరసయ్యశాస్త్రి గారల మధ్య సాగిన జటాపటీలు కాలక్రమంలో చల్లపడ్డా యేమోకాని పూండ్ల రామకృష్ణయ్య గారికి మాత్రం రాయదుర్గం వారిపట్ల కోపం తగ్గనే లేదు. పూండ్ల వారు వేదం వారికి రాసిన ఓ ఉత్తరంలో ఇలా అంటారు–"శత్రువులను బ్రతుక నీయగూడదు. గాన నరసయ్యను నిర్మూలనము చేయ వలయునని నా యిష్టము." (పేజి: 53) ప్రకాండ పండితులైన పూండ్ల రామకృష్ణయ్యా గారు సాటి విద్వాంసులైన రాయదుర్గం నరసయ్య శాస్త్రి గారిపట్ల ఇంత ఆవేశ కావేషాలు ప్రదర్శించాలా? ఇంతగా బ్రహ్మాస్త్రాలు ప్రయోగించాలా? ఆనాటి పండిత ప్రపంచం సాహిత్య సంగ్రామాల్లో ఎంత వీరావేశాలు కనపరచాయో? ఇరు పక్షాల అభిమానులు ఎంత భీకరంగా వీరణాలు వాయించారో! ఈ సింహశార్దూలాల పోరాటాల్ని చూసి వినోదం పొందిన వారెంత మందో! విషాదం ప్రకటించిన వారింకెంత మందో!

పూండ్ల రామకృష్ణయ్య వేదం వారి సృజనాత్మక, విమర్శనాత్మక రచనల ప్రచారాన్ని తలకెత్తుకున్న స్వామిభక్తి పరాయణుడు. ఆయన ప్రసన్న రాఘవం ప్రచురణకు విరాళాలు, చందాలు వసూలు చేసి వేదం వారి కందించిన గంధవహుడు పూండ్ల వారు వేంకటరాయ శాస్త్రిగారికి 20-11-98లో రాసిన లేఖల్లోని కొంత భాగం– "ప్రసన్నము 24వ సారము దనుక చేరినది. మన ప్రయత్నము కొనసాగినట్లే. ప్రసన్నమునకు ధనము నిచ్చిన వారిపేరులను వెనుక వ్రాయుచున్నారు. తే 25 దీ వాటికి గొంత పైకము వచ్చును. ఉడుతాభక్తి యని తమరు సంతసింప వలసినదే గాని యావత్తు సహాయము చేయ మైతిమి గదా యని మన మిత్రులందఱు జింతించుచున్నారు.

కాంగ్రెస్సు జరుగవలెనని నేను కోరుచున్నాను. అప్పుడుం గాని విశ్వరూపముం జూపుటకు వలను పడదు. తక్కిన దంతయు నరణ్యరోదనముగా నుండును. కానింద్రు మనకు శ్రీకృష్ణ బలమున్నది గదా. వారికి నా నమస్కారము లంద జేయవలెను. వారి దర్శన మెప్పుడు గలుగునో? నా కోరిక లన్నియు ఫలించినవి గాని ప్రసన్నము గ్రంథ

రూపముగా ప్రసన్నమౌట యొక్కటియే కొఱత. అదియు ఫలించు ననుటకు సంశయము లేదు."(పేజి: 74-75)

రామకృష్ణయ్య గారు వేదం వారికి రాసిన వుత్తరాల ద్వారా మనకు తెలిసే విషయ మేమిటంటే ఆయన 'అముద్రిత గ్రంథ చింతామణి' సాహిత్య మాసపత్రిక సంపాదకులుగా నిష్పక్షపాతంగా వ్యవహరించడం కంటే వేదం వారి గ్రూపు లీడరుగా వ్యవహరిస్తున్నారేమో అనే అనుమానం కలుగుతుంది. కొక్కొండ, కోలాచలం, వాసుదాసు గార్ల పక్షానికి పరమ శత్రువుగా నిలిచారేమో అనిపిస్తుంది. పూండ్లవారు వేదంవారికి రణభూమిలో ప్రధాన అంగరక్షకుడిగా, రక్షాకవచంగా నిలిచారని అవగతమవుతుంది.

పూండ్ల వారు సదా వేదం వారి నామస్మరణం చేస్తుంటారని తోస్తుంది. వేంకటరాయ శాస్త్రి గారి 'ప్రసన్న రాఘవం' ముద్రణ గురించి, ప్రచారం గురించి ఆయన అహర్నిశాలు ఆలోచించేవారని పిస్తుంది. ఈ లేఖాంశాన్ని చదవండి-"ప్రసన్నము రెండు రుపాయల వెలకు దగ్గింప వలదు. గ్రంథము దొడ్డది. కాగితము మంచిది. మంగు రామానుజరావు గారును ఆవెలకు దగ్గింప గూడదనియే వారి అభిప్రాయము. వారితోలాడు చున్నాడను. ప్రతిదినమును వారే చదువుచుందురు. గర్భమును దాపలేనటులనే దీనిని దాపలేక ప్రకటించు చున్నాను విన్నవారు సంత సపడుచున్నారు గాన మీరు వచ్చునప్పుడు కొన్ని ప్రతులను దెచ్చుటయే మంచిదని నాకు దోచు చున్నది. దీని విషయమై సభ జరిగినను జరుగవచ్చు. గాన నన్నియు మీరాకకు ముందే ముగియ వలసినది. పేరు శారదాసంచిక యనియే యుండ వలసినది. శుద్ధ పత్రము దీనితో జేరియే యుండవలయును. ఇందు వలన దమకాచంద్రార్కమైన పేరు నిలువ గలదు. ఇప్పటికి నా ఇష్టా పూర్తి సిద్ధించినదని యనుకొను చున్నాను. గ్రంథము చేతికి వచ్చినప్పుడు సఫలమైనదని తలంతును." (పేజి: 79, 8-12-98) గురుశిష్య సత్సంప్రదాయానికి ఇంతకంటే మంచి ఉదాహరణ లభిస్తుందా? దొరకునా ఇటువంటి సేవ ! పూండ్ల వారు 'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రిక నిర్వహణలో మునుగానాం తేలానాం అయి వుంటారు. రాజహంస, శశిలేఖ, సూర్యాలోకము, కలావతి మొదలైన పత్రికలకు వాద వివాదాత్మక వ్యాసాలు రాయడంలో, నిమగ్నులై వుంటారు. వేదం వారి నాటకాల, విమర్శనల ఖండనాలు చూసి ఆగ్రహోదగ్రులై పరశు రాముని అవతార మెత్తుతుంటారు. ఇక వేదం వారి నాటక ప్రదర్శనలు నెల్లూరులో జరపాలని శతప్రయత్నాలు చేస్తూ తలవేడి చేసుకొంటారు. వివిధ పత్రికల్లో తీవ్రమైన విమర్శలు చేస్తూ శ్రేయోభిలాషులకు లేఖల ద్వారా తమ క్రోధా వేశాల్ని తెలియ చేస్తుంటారు. రామకృష్ణయ్యగారు వేదం వారికి 23-4-1901లో ఇలా రాస్తారు- "ఆర్యా! వందనములు. తాము వ్రాసిన జాబు చేరినది. దొరసామికి, వెంకటాచలము నకును నెమ్మదిగా నున్నది. కోపల్లి కొక జాబు వ్రాసి దేశోపకారికి వెంకటాచలము పంపినాడు. దేశోపకారిలో "యథార్థవాది' అని నేను వ్రాసినది వచ్చినది. సూర్యరామయ్యయు వ్రాసియున్నాడు. గుండ్ల పూడియు వ్రాయనున్నాడు. కోపల్లిని చంపివేయ దలచినారము. ఇంక దల మెత్త లేదు. సూర్యాలోకము 41 సంచికలో రామానుజరావు సంస్కృత శాకుంతలములో బునరుక్తి యున్నదని యొక వ్యాసము వ్రాసినాడు దానికి బదులు వ్రాసి పంపినారము. ఒక్కదాని యందైన బునరుక్తి లేదు. మనము దేశము మీద దాడి వెడల వలసినది నిజము. మీతో మాట్లాడే గాని పోము." మొత్తం మీద పూండ్ల వారు సదా సాహిత్యరణ రంగంలో సకల శస్త్రధరులై శత్రువుల మీదికి దూకేందుకు సిద్ధంగా వుంటారు. ఈయనకు తోడుగా మరి కొందరు పండితులు అండ దండగా వుంటారు.

పూండ్ల రామకృష్ణ గారు సరస్వతీ సమారాధనలో తమ ఆరోగ్య భాగ్యాల్ని కోల్పోయినారు. ఆ మహాను భావుడు వేదం వారితో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినప్పుడు సాహిత్య చర్చలే ఎక్కువగా చేశారే కాని తమ శారీరక, ఆర్థిక బాధల్ని చాలా తక్కువగా ప్రస్తావించారు. ఆయన వేదం వారికి 22-3-1902లో రాసిన లేఖలోని కొన్ని పంక్తులందుకు ఉదాహరణ "నేను రోగి నైనాడను. దూరము నడువలేను. ఎండ సోకకూడదు. ఎట్లు జీవించగలనో దిగులుగా నున్నది. రాజైశ్వర్యములు వలసి యున్నవి. అర్జన సున్న. ఇంకను గ్రహవేధను బట్టి మనువు తీర్మానముగా గుదురలేదు. కుదురుపాటు చిక్కలేదు. చిత్త చాంచల్యము మెండుగా నున్నది. ఇందుచే బక్షవాయువ వచ్చునట్లు తోచుచున్నది. ఏది వచ్చినను ననుభవింపక తీరదు గద." (పేజి: 160) తెలుగు సాహిత్య జగత్తుకు 'అముద్రిత గ్రంథ చింతామణి' సాహిత్య మాసపత్రిక ద్వారా 21 కావ్యాల్ని వెలికి తీసి సూర్యాలోకనం కలిగించిన సుశ్లోకులు పూండ్ల సాహిత్యానికి భాగ్యసౌభాగ్యాలు ప్రసాదించారే కాని ఆయన జీవిత కథ మాత్రం అభాగ్యో పాఖ్యానమే. శాంతమ్ పాపమ్.

ఘట్టమరాజు అశ్వర్థనారాయణ
ఫోన్ : 9964082076

# తెగి పోతున్న తల్లి వేరు

**– జూకంటి జగన్నాథం**

నేను సిరిసిల్ల పట్టణంలో స్థిర నివాసం ఏర్పరచుకొని మూడు దశాబ్దాల కాలం అప్పుడే అయిపోయింది. మా ఊరు తంగళ్ళపల్లి మానేరు అవతలి ఒడ్డుకు మా ఊరు తంగళ్ళపల్లి ఉంటే అవతలి తీరం ఒడ్డుకు సిరిసిల్ల పట్టణం ఉంది. మా ఊరుకి రోడ్డు మార్గంలో పోవాలంటే అంతా తిప్పి తిప్పి కొడితే రెండు కిలోమీటర్ల దూరం ఉండదు. అదే వాగులో నుంచి పిల్ల బాటన వెళ్తే కిలోమీటర్ దూరం వస్తుంది. బండ్ల బాటలో పోతే కిలోమీటర్ పావు వస్తుంది. కానీ రాను రానూ మా ఊరికి నా రాకపోకలు బాగా తగ్గిపోయాయి అనే బదులు ఒక విధంగా పోవడం లేదనే చెప్పాలి. అందుకు అనేక నెపాలు చెప్పవచ్చు కానీ నిజంగా అవి అసలు కారణం కానేకాదు. మరి ఏమై ఉంటుందని నాకు నేను ప్రశ్నించుకుంటే అనేక విషయాలు మననంలోకి వస్తున్నాయి. మేము నలుగురు అన్నదమ్ములు ఇద్దరు చెల్లెండ్రు. మా బాపు 1981లో చనిపోయాడు. అందరి పెళ్లిళ్లు అయిపోయాయి. నేను సిరిసిల్లలో ఉంటే మా అన్న మరియు పెద్ద తమ్ముడు హైదరాబాద్లో ఇల్లు కట్టుకున్నారు. మా చిన్న తమ్ముడు హనుమకొండలో ఉంటున్నాడు. 1998 సంవత్సరంలో మా అమ్మ తన 87వ ఏట గతించినది. మా అమ్మ ఉన్నప్పుడు ఆ ఊరిలో మా ఇల్లు గోడలు కూలి మూలవాసాలు విరిగి దూలాలకు చెదలు పట్టి శిలావస్థకు చేరింది. ఇంటి చుట్టూ పిచ్చి మొక్కలు సర్కారు తుమ్మలు మొలిచాయని బాధపడేది. మా అమ్మ చివరి రోజుల్లో ఇల్లు ఏం చేద్దామని అనేకసార్లు అడిగింది. మా అన్నని తమ్ముళ్ళను ఈ విషయమై సంప్రదిస్తే ఎవరి ఇండ్లు వారికి అయినాయి ఎక్కడి వాళ్ళు అక్కడ ఇల్లు కట్టుకొని ఉంటున్నప్పుడు ఇప్పుడు ఆ ఇంటితో పని ఏమి ఉంది. అమ్మ అట్లానే అంటది. నువ్వు మరమ్మతులు చేస్తే మాత్రం మేము డబ్బులు ఇయ్యము అని కుండలు బద్దలు కొట్టినట్టు కరాకండిగా చెప్పారు. అటువంటి పరిస్థితులలో వేరే గత్యంతరం లేక మా అమ్మ మా ఊరిలోని ఇల్లును అమ్మివేసింది. అప్పుడు మా అమ్మ ఆ ఇంటితో ముడిపడి ఉన్న అనుభూతులను, బంధాలను తీపి చేదు జ్ఞాపకాలను నెమరు చేసుకుంటూ ముఖంమీద కొంగు కప్పుకొని గొంతెత్తి ఏడ్చిన ఎత ఇప్పటికీ నన్ను అతలాకుతలం చేసి వేస్తుంది. అప్పుడు మా ఊరి మట్టితో ఇంటితో ఉన్న పేగు బంధం తల్లి వేరు తెగిన వృక్షంలా విలవిల్లాడిపోయాను. ఒక్క నిమిషం నేను అదే ధరకు తీసుకుందామా అని ఆలోచించాను. కానీ అప్పటికే నాకు ఉన్న అప్పు నెత్తి మీద ఉండడం వల్ల అటువైపు ముందుకు అడుగు వేయ సాహసించలేదు. నాటి ఆర్థిక పరిస్థితులు అందుకోసం అనుమతించలేక పోయాయి.

ఇల్లు పోయిన తర్వాత ఊరి మీది నుంచి అనేక సార్లు హైదరాబాద్ పోయినప్పటికీ మా ఊరు దగ్గర ఆగబుద్ధి కాలేదు. అనేక గాయాల సలపరింతలు నన్ను చుట్టుముడుతుండేది. మా ఊరిలో ఒకప్పుడు బాగా బతికిన కుటుంబం మాది. నువ్వులతో ఒక దశలో రోజూ నాలుగు గానుగలు కట్టి నూనె అమ్ముకొని జీవనం సాగించే కుల వృత్తి మాది. ఆధునికత లోహ చక్రాల కింద అన్ని కుల వృత్తులు విధ్వంసమైనట్టుగానే ఆయిల్ మిల్లుల రాకతో మా వృత్తి క్రమక్రమంగా కనుమరుగైపోయింది. దానితో ఒకప్పుడు పాడి, పశువులు, రెండు ఎకరాల పొలం అన్నీ పోయి కడుపులో చల్ల కదలకుండా బతికిన మా తల్లీ ఆరుగురి పిల్లల జీవితాలు ఒక్కసారిగా తలకిందులైపోయి బజార్లో పడ్డాయి. ఏం చేయాలో ఇలా బతకాలో తెలియక మా బాపు అమ్మ పరి పరి విధాల మధనపడుతుండేవారు.

అటువంటి పరిస్థితులలో మమ్మల్ని చూడడానికి మా అమ్మమ్మ ఊరు నుంచి మేనమామ వచ్చాడు. పిల్లల భవిష్యత్తు ఎట్లా అనుకుంటుంటే నేను ఒకరిని తీసుకుపోతాను అన్నాడు. సరే అని నన్ను పంపించారు.

అప్పుడు నేను పుట్టిన ఊరు సిరిసిల్ల తంగళ్ళపల్లి నుండి మా అమ్మమ్మ ఊరు అయిన కోహెడ తంగళ్ళపల్లికి మారినారు. మళ్లీ అక్కడి నుంచి తిరిగి నేను మా ఊరికి ఎలా రావలసి వచ్చిన విషయమూ అక్కడి నా బాల్యం, వీడని స్నేహాలు, చదువు సంధ్యల గురించి ఈ క్రమంలో మరొకసారి వివరిస్తాను. ప్రస్తుతం మా ఊరికి పోవడం పూర్తిగా తగ్గిపోయింది అని చెప్పవచ్చును. ఎందుకంటే ల్యాండ్ ఫోన్లు, సెల్ ఫోన్లు, టీవీలు వచ్చిన తర్వాత పక్కింటి వాళ్లతో కూడా ఫోన్లో ఎక్కువగా మాట్లాడుతున్నారు తప్ప నాలుగడుగులు వేసి వారితో నేరుగా మాట్లాడటం లేదు. అత్యాధునికత తీసుకు వచ్చిన సాంకేతిక పురోభివృద్ధి అంతా సైబర్ మయం అయిపోయింది. మనుషుల మధ్యనే కాదు ఊర్ల మధ్య కూడా విపరీతమైన దూరం పెరిగిపోయింది. పుట్టిన ఊరు కుదురు మట్టి బంధం మెల్ల మెల్లగా తెగిపోతుంది. ఇంతెందుకు చిన్నప్పటి బాల్య మిత్రులను కూడా కలవడం లేదు. కలిసి మంచి చెడ్డలు మాట్లాడు కోవడం లేదు. ఊరు క్రమక్రమంగా రోడ్డు వైపుకు వచ్చింది. రోడ్డు పక్కన ఉన్న పంట పొలాలు మెట్ట పంటలు పండే చెలకల భూములు ఇప్పుడు ప్లాట్లు కొట్టి అమ్మకానికి పెట్టబడ్డాయి. కొత్తగా రియల్ ఎస్టేట్ అనే మాట వ్యాపార ధనాత్మక సంభాషణ ఒకటి సమాజంలో చలామణిలోకి వచ్చింది. దళారీ వ్యవస్థ మరింత బలపడింది.

ప్రైవేటు బడిల ముందు ప్రభుత్వ పాఠశాలలు తగినంతమంది విద్యార్థులు లేక వెలవెల పోతున్నాయి. ఉపాధ్యాయులు పక్క పట్టణం నుంచి లేక జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధాని నుంచో రాకపోకలు సాగిస్తున్నారు ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. దీన్ని ఎవరు తప్పు పట్టడం లేదు, కానీ తిరిగి ప్రభుత్వాలు ఒకవైపు ప్రైవేటు రంగా రంగాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విభాగాలైన విద్య వైద్యాలను నామమాత్రం చేస్తున్నారు. పైగా హాస్యాస్పదంగా బడిబాట కార్యక్రమం పెడుతున్నారు.

భూస్వామ్య వ్యవస్థ కొత్త వలస వాద విధానాలను అనుసరిస్తున్నది. ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఉన్న సంబంధం తల్లిదండ్రులకు పిల్లలకు ఉన్న బంధం రైతుకు భూమికి ఉన్న అనుబంధాలను తెంచి వేస్తున్న అకాలం ఒకటి దాపురించింది . అక్కడక్కడ రెడ్ ఆక్సైడ్ పెచ్చులుగా ఊడిపోయిన అద్దంలో చూసుకున్న ముఖంలా ఊరు ఇప్పుడు ఉసురు పోతున్నట్టుగా దర్శనమిస్తున్నది. ప్రశ్నించే వ్యక్తులు లేరు . ప్రజా పోరాటాలు అనేకానేక కారణాల వలన మైదాన ప్రాంతాలను విడిచి లోతట్టు అటవీ ప్రాంతాలకు విస్తరించింది. ఊరు తేజాన్ని ఎవరో ఎత్తుకుపోయాక పల్లె వెలుగు బస్సు వస్తూపోతూ అవ్వ ఏడవంగా బిడ్డ ఏడ్చినట్టు పలుకరిస్తున్నది. మనిషి ఇప్పుడు ఎవరితో అంటూ సొంటూ లేని కేవలం ఆన్లైన్లో షాపింగ్ చేసే ఒంటరి ద్వీపకల్పం అయిపోయాడు. ఈ విష వలయానికి నేనేమి అతీతున్ని కాదు కదా! నాకు ప్రత్యేకమైన మినహాయింపులు ఎవరూ ఇవ్వలేరు. కల్పించలేరు. ఒక జంఝూటంలో పడి రొద్ద కొట్టుడుగా బతికేస్తున్నాను. కాకుంటే అప్పుడప్పుడు గుండె కలుక్కుమన్నప్పుడు ఏవో నాకు తెలిసిన రాతపూతలు రాస్తుంటాను. అనేక జ్ఞాపకాలను బలవంతంగా నాలోంచి మెడలు పట్టి గెంటి వేస్తుంటాను. తప్ప మా ఊరి వైపు కన్నెత్తి చూడ ధైర్యం చేయలేకపోతున్నాను. ఇంత దగ్గర ఉన్నా మా ఊరుకు పోలేకపోతున్నాను. గాక ఏర్పడిన అననుకూల వాతావరణంతో పోరాడ లేకపోతున్న నిస్సహాయుణ్ణి. ఎవరో రెక్కలను కత్తిరించిన కొంత దూరం మాత్రమే ఎగిరి కింద పడే లక్క పావురాన్నై ఎగురలేక పట్టణంలో విలవిల్లాడి పోతున్నాను.

జూకంటి జగన్నాథం
ఫోన్ : 9441078095

## చదవండి...



**మనిషే చెట్టైతే...? - డా. ఫణికుమార్ చకిలం :** దినపత్రికల్లో అన్నీ దుర్వార్తలే – చావు వార్తలే – వారికి సమాజంలో మంచి – కనపడదు – ఈ నెగెటివ్ ధోరణి ప్రభుత్వ వ్యతిరేకత నుంచి పుట్టింది. జన జీవితాన్ని జీవం లేకుండా కన్పింప చేస్తుంది. ఆ దినపత్రికల వార్తలు ఈనాటి కథలకు, కవితలకు వస్తువు – అందుకు ఈ యువకవి మినహాయింపు కాదు.

పేజీలు : 62, వెల : 120, ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును.



# బోడినాయకనూరు సంస్థానం

– డా. సగిలి సుధారాణి


'దక్షిణ కశ్మీరం'గా పేరుగాంచిన బోడినాయకనూరు కాశ్మీరంను పోలిన ప్రాంతం తమిళనాడు – కేరళ సరిహద్దులలో తేని జిల్లాలో వున్న అతి సుందర ప్రదేశమైన బోడినాయకనూరు పట్టణానికి వెళదాం రండి! ప్రకృతి అందాలకు, ప్రశాంత వాతావరణానికీ నెలవైన ఈ చిన్న పట్టణానికి మూడువైపులా పడమటి కనుమలు పెట్టని కోటలా ఉంటాయి. ఆ కనుమలకు బోడిమిట్టకు ఎగువ మున్నారు (కేరళ) అందాలు! దోబూచులాడుతున్న నీలిమేఘాలు వెండివెలుగులతో పరుగులు పెడుతున్న మంచుమబ్బులు, ఆ అందాలను చూచి ఆదమరచి ఆలస్యమవుతున్న సూర్యోదయం.... ఇవి కేరళ సరిహద్దు ప్రాంతంలో కనిపించే అద్భుత దృశ్యాలు. అందుకే భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రకృతిసౌందర్యానికి ముగ్ధులై దీనిని 'దక్షిణ కాశ్మీరం'గా అభివర్ణించారు.

బోడినాయకనూరు అనే ఈ చిన్న పట్టణం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సుగంధ ద్రవ్యాలకు ప్రసిద్ధిగాంచింది. ముఖ్యంగా నాణ్యమైన యాలకుల పంటకి పేరుమోసింది. అవి స్థానికులకు ఉపాధిని చూపుతూ వ్యాపారంలో లాభాల పంటలు పండిస్తున్నాయి. పట్టణమంతా పెద్ద పల్లెటూరులా మనకు కనిపిస్తుంది. ఈ ప్రశాంతమైన పట్టణంలో కోమటి చెట్టియార్లు, మణి చెట్టియార్లు, వాణిచెట్టియార్లు, తెలుంగు దేవాంగ చెట్టియార్లు, గాజుల చెట్టియార్లు, నాట్టుకోట్టై చెట్టియార్లు, ఆచారులు, రెడ్డియార్లు, చర్మకారులు మొదలైన వివిధ సామాజిక వర్గాలకు చెందిన తెలుగువాళ్ళు పెద్దసంఖ్యలో ఉన్నారు. వారంతా కొన్నివందల సంవత్సరాల క్రిందటే అక్కడ వెళ్ళి స్థిరపడినా, తమ తల్లి భాషనూ, సంస్కృతినీ నేటికీపదిలంగా కాపాడుకుంటూ వస్తున్నారు. తరతరాల తెలుగు చరిత్ర అక్కడ వెలుగులీనుతుంది.

**బోడినాయకనూరు సంస్థానం :** ఒకప్పుడు 'వరసునాడు' జమీన్‌గా బోడినాయకనూరు తెలుగు సంస్థానం ప్రశిద్ధి పొందింది. దీని పాలకులు తెలుగు మాట్లాడే రాజ కంబళ నాయకర్లు. వీరు బళ్ళారి ప్రాంతం నుంచి వచ్చి, కొంగునాడు ప్రాంతంలో స్థిరపడ్డారు.ప్రధానంగా కంబళత్తర్, కంబళట్టు నాయకర్లు, కోడంగి నాయికులు అనే వేర్వేరు పేర్లతో వీరు పిలువబడ్డారు. పరాయిపాలకుల దండయాత్ర కారణంగా తుంగభద్ర తీరంలోని కొత్త బళ్లారి ప్రాంతం నుండి ఏయే ప్రాంతాలు దాటుకొని కావేరి తీర ప్రాంతానికి వలస వచ్చారో మౌఖికంగా పాటరూపంలో పాడుకొంటారు. వీరు మధుర దక్షిణ ప్రాంతానికి మొదట చేరుకుని జక్కంపట్టిలో (ప్రస్తుతం తేని జిల్లా ఆండిపట్టి సమీపంలో వుంది) స్థిరపడ్డారు. మరికొందరు తేని జిల్లా జంబులిపుత్తూరు నమీపానికి చేరుకొని, బోడి నాయకనూరు ప్రాంతంలో కుదురుకొన్నారు.

ఈ పట్టణానికి ప్రాచీననామం 'తెన్ కాశియన్ పట్టి'. తరువాత కాలంలో 'బోడి నాయకనూరు' అనే పేరు ఎలా వచ్చిందనే దానికి ఆసక్తికరమైన కథనాలు ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతమంతా ట్రావెన్‌కోర్ సంస్థానంలో ఒక భాగంగా ఉండేది. అప్పట్లో ఒక అడవి పంది తెన్ కాశియన్ పట్టి చుట్టుపక్కల ప్రాంతాలలో తిరుగుతూ, అక్కడి ప్రజల ప్రాణాలకు, పంటలకు పెద్ద బెడదగా తయారయిందట! అప్పుడు ట్రావెన్‌కోర్ మహారాజు ఎవరైతే ఆ అడవి పందిని చంపి, దానినుంచి ప్రజలకు విముక్తి కలిగిస్తారో అతని పేరు ఆ ఊరికి పెడ్తానని, అతని పేరుతోనే ఒక సంస్థానాన్ని ఏర్పరచి, దానికి అతడినే పాలకుడిగా చేస్తానని ప్రకటించాడు. అప్పుడు 'బోడి నాయకుడు' అనే రాజ కంబళ నాయక యోధుడు ముందుకువచ్చి ఆ అడవి పందిని మట్టుపెట్టడంతో, ఈ పట్టణానికి 'బోడినాయకనూరు' అని పేరు పెట్టి ఆయన్నే ఈ సంస్థానానికి అధిపతిని చేశారని స్థానికులు చెబుతారు.

**బోడినాయకర ప్రస్థానం :** రామ నాయకుడు (1376–1413); జగ్గ నాయకుడు (1413– 1454); బంగారు ముత్తు నాయకుడు (1454–1483); బోడి ముత్తు



అష్టలక్ష్మి చిత్రం

నాయకుడు (1502 -1520); జగ్గు ముత్తు నాయకుడు (1520-1531); సిలా బోడి నాయకుడు (1540-1554); వారిలో ప్రసిద్ధులు. మధురను పాలించిన తిరుమల నాయకుని పాలనా కాలంలో శత్రువు ముత్తు ముల్లకాన్ నుండి తిరుమల నాయకుడిని సిల బోడి నాయకుడు రక్షించాడు. అతని ధైర్యసాహసాలకు తిరుమల నాయకుడు సంతోషించి, కృతజ్ఞతపూర్వకంగా సిలబోడి నాయకునికి 'తిరుమల' అనే బిరుదునిచ్చి సత్కరించాడు. అప్పటి నుండి ఆయన వారసులు కూడా తమ పేర్లకు ముందు 'తిరుమల' అనే బిరుదును చేర్చుకున్నారు. తిరుమల నాయకుని ఆదేశానుసారం మంత్రి అరియనాథ మొదలియారు మధుర నాయక రాజ్యాన్ని 72 పాళయాలుగా విభజించి నప్పుడు 'బోడి నాయకనూరు' మొదటి పాళయంగా ఏర్పడింది. తిరుమల సిల బోడి నాయకరు బోడి నాయకనూరు మొదటి పాళయగార్ అయ్యాడు. తన రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చాడు.

తిరుమల సిల బోడినాయకరు తరువాత తిరుమల బోదయ్య నాయకుడు (1554-1576); తిరుమల బంగారు ముత్తునాయకుల (1576-1602) పాలనా కాలంలో పెరియకుళంలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ వార్షిక ఉత్సవం, రథోత్సవాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించాడు. చిన్నమనూరు సమీపంలో 'పూలనంధర్' ఆలయాన్ని నిర్మించడమే గాక సింగరతోపు నందవనం కూడా నిర్మించారు. తిరుమల బోదయ్య నాయకుడు (1602-1632); ముక్కన్న నాయకుడు(1632-1684); రాసు నాయకుడు (1684-1701); సక్కరప్ప నాయకుని (1701-1737) తర్వాత వారసుడు లేకపోవడంతో అతని భార్య తోప్పమ్మాళ్ (1737- 1747) అధికారంలోకి వచ్చింది. ఈమె తరువాత సిల జక్కన్న నాయకుడు (1747-1775) సక్కరప్ప నాయకుని సోదరుడు అధికారంలోనికి వచ్చాడు. ఇతని పాలనకాలంలో ఆర్కాటు నవాబు మీరా సాహెబ్‌కు 1000 పణాలకు కప్పం కట్టేవాడు. ఆంగ్లేయాధికారుల పాలనలో ఈ శిస్తును 2500 పణాలకు పెంచారు. తరువాత బోడి నాయకుడు (1775-1778) పాలించాడు. ఇతనికి కూడా సంతానం లేకపోవడం కారణంగా బోడి నాయకుని సోదరుడు తిరుమల బోడి నాయకుడు (1778- 1800) అధికారం లోనికి వచ్చాడు. టిప్పు సుల్తాన్ సుల్తాన్ దాడులు తట్టుకొనేందుకు వీలుగా ప్రస్తుత కోట నిర్మాణం చేపట్టాడు. ఈయనకు ఆరుగురు భార్యలు. ఆరవ భార్యకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. తరువాత బంగారు తిరుమల బోడి నాయకుడు (1849-1862) వారసుడిగా వచ్చాడు. బోడి నాయకనూరులోని అంతఃపురాన్ని పూర్తి చేశాడు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని కూడా ఆయన నిర్మించాడు. ఆయన వేటను ఇష్టపడేవాడు! నాటి కలెక్టర్ రోజ్ పీటర్‌తో సత్సంబంధాలు కలిగి ఉండేవాడు. ఆయన పాలనా కాలంలో నేరాల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. అందుకుగాను బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం తగిన విధంగా ప్రశంసించి బంగారు పతకాన్ని తిరుమల బోడినాయకునికి ఇచ్చింది. 1862సం.లో బంగారు తిరుమల నాయకుడు మరణించాడు. ఆయన వారసుడు తిరుమల బోదయ్య కామరాజ నాయకుడు బాలుడైన కారణంగా, బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం బోడి జమీన్ వ్యవహారాలను నిర్వహించింది. కొంతకాలం తర్వాత యువరాజు అధికారంలోకి వచ్చాడు. తరువాత బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం జమీన్‌ను స్వాధీనం చేసుకుంది. చట్టబద్ధమైన వారసులు జమీన్ కుటుంబం పేరుతోనే నేటికీ బోడినాయకనూరు కోటలో నివసిస్తున్నారు.

**కోటవాస్తు సరిగ్గా లేదట! :** ఈ రాజ భవంతికి వాస్తు సరిగ్గాలేదని ఎవరైతే ఇక్కడ రాజ్యాపాలన చేస్తారో వారికి

బిడ్డలు కలిగే యోగ్యత లేదని వాస్తు నిపుణుడు చెప్పాడంట. ఆయన చెప్పిన విధంగానే జరగడంతో రాజ్య పాండ్య నాయకరును దత్తతకు తీసుకొన్నారని ఆ పరంపర వాళ్ళమైన మేము వారసులుగా కొనసాగుతున్నామని బోడినాయకనూరు కోటలోని వారసులు తెలియజేశారు.

**నేలమాళిగలో అద్భుత చిత్రాలు! :** బోడినాయకనూరు కేంద్రంగా పాలన సాగించిన అలనాటి సంస్థానాధీశులు చాలా సంపన్నులు. కళాభిరుచిలో వారికివారే సాటి! కోటలోని నేలమాళిగను 'లక్ష్మీ విలాసం' అని అంటారు. ఇందులోముఖ్యంగా బోడి నాయకనూరు పాళయపట్టు జమీందార్ల 'కుల దైవం' 'వడమలై నాచియమ్మ'గా పిలవబడుతున్న ఎనిమిది చేతులతో కూడిన అష్టలక్ష్మి అరుదైన కుడ్యచిత్రం చిత్రింపబడి ఉంది. ప్రతీయేటా ఈ దేవతను వైభవంగా పూజిస్తారు.

ఇంకా నేలమాళిగలోని గోడలమీద కంబ రామాయణ ఇతివృత్త గాథలలోని అపురూప దృశ్యాలనూ అరుదైన తంజావూరు చిత్రకళా శైలిలో ఎంతో ముచ్చట గొలిపేలా కుడ్య చిత్రాలనూ సజీవంగా చిత్రించారు. ఇతిహాసాల దృశ్యాలను గోడపై చిత్రించే సంప్రదాయం పల్లవ రాజుల చిత్రకళ నుండి ఉద్భవించింది. ఈ చిత్రాలు కొన్ని రాజకంబళనాయకర్ల వివాహంలో అనుసరించే ఆచారాలను ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత తమిళనాడులోని రాజకంబళ నాయకర్ల లలిత కళా సంప్రదాయాల గురించి అవి మాట్లాడుతాయి. ఆ అద్భుత కుడ్య చిత్రాలు మనకు కనువిందు చేస్తాయి. అయితే కాలంతో కలిసిపోతున్న చరిత్ర శిథిల భవంతుల్లో కనుమరుగై పోతున్న ఆ అద్భుత కళారూపాలు నానాటికీ మసకబారి పోతున్నాయి. సరైన నిర్వహణకు నోచుకోక మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా పెచ్చులూడి రాలి పోతున్నాయి.

**ఓడలు బండ్లు అవుతాయి! :** సంస్థానాధీశులుగా అతి విలాసవంతమైన జీవితాలుగడిపిన ఆ రాజ కంబళ నాయకర్ల వారసులు నేడు దీనంగా సాధారణమైన జీవితం గడుపుతున్నారు. కోటలో సామాన్య జీవితం గడుపుతున్న జయలక్ష్మిగారిని పలకరించాను. ''మీ పూర్వీకులు తెలుగువాళ్ళే కదా! మీకు తెలుగు మాట్లడటం రాదా!"అని అడిగినపుడు, "తెలుగు మాటలు అర్థం చేసుకొంటాం కానీ, తిరిగి మాట్లాడలేం'' అని తమిళంలో సమాధానం చెప్పింది. "కాసుపట్టి, సితారుట్టి, మణికురు, కుట్టిమట్టి తదితర ప్రాంతాలలో తెలుగంగువాండ్లు తెలుగుదా మాట్లాడుతురు" అని చెప్పింది. వాళ్ళ అమ్మాయి రాహల్య (రాకుమారి)ను పలకరించగానే "చాలా ఏళ్ళనుండి ఇక్కడే ఉంటున్నాం. నేను, అమ్మ, అయ్య, పాటి (నాయనమ్మ తెలుంగు మాట్లాడుతుంది.) చిత్తప్ప (చిన్నాన్న), పిన్ని, ఎల్లారం (అందరం కలసి) కూట్టు (ఉమ్మడి) కుటుంబ మాదిరి వుండాం. ఈ మాళిగై చూసేదానికి చాలామంది జనాలు, విదేశీ జనాలు వస్తారని" గలగలా తమిళం కలగలిసిన తెలుగులో సమాధానం చెప్పింది.


రాకుమారి రాహల్యతో పరిశోధకురాలు

నేడు ఆ భవనంలో అతి నిరాడంబరంగా జీవిస్తున్న రాజ కంబళ నాయకర్ల వారసులను చూస్తుంటే, తేని జిల్లా చిన్న మానూర్‌లో అద్భుతమైన పూలనందీశ్వరాలయం నిర్మించిన తిరుమల బంగారు ముత్తు నాయకర్ వారసులు వీరేనా? అని మనకు అనిపిస్తుంది. మధుర పాలకుడు తిరుమల నాయకుని రాజ్యాన్ని శత్రుదాడుల నుంచి కాపాడిన వీరులు బోడినాయకనూర్ పాలకులు సిలగోరు నాయకడు, జగ్గు నాయకుడు వంటివారు వైభవోపేతంగా జీవించిన వారసులు ఇంత బేలగా ఎలా మారారో మరి! 'కాలమహిమ' అనుకోవాలి.

ప్రస్తుతం కోట పూర్వ వైభవాన్ని కోల్పోయి, కళా విహీనంగా మారింది. ఆనాటి రాజులు లేరు! రాజ్యాలు లేవు! ఆనాటి పాలకుల పాలనకు ఆలవాలమైన ఈ కోటను ఈనాడు వారి వారసులు కాపాడుకొంటూ

వస్తున్నారు. కానీ ఈ రాజభవనం సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకొంది. దీనిని వారసత్వ సంపదగా గుర్తించి, ఆ భవనాన్నీ, అందులోని కుడ్య చిత్రాలనూ పరిరక్షించి దానిని ఒక సాంస్కృతిక (హెరిటేజ్) భవనంగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. కోటను పరిరక్షించి, భవిష్యత్తు తరాలవారికి మన వారసత్వ సంపదను అందించాలి.

**బండ్లు ఓడలవుతాయి! :** తెలుగునాడు నుండి పొట్ట చేతపట్టుకుని బోడినాయకనూరుకు వచ్చి, మరోవీధిలో కుమ్మరి పనిచేస్తూ, చేతి వృత్తిదారులుగా జీవనం కొనసాగి మరో కుటుంబం కుదురుకొంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరు స్వయంకృషితో కష్టపడి యాలకుల వ్యాపారులుగా, సినిమా థియేటర్ యజమానులుగా ఉన్న వీరి పూర్వీకుల కుటుంబం క్రమంగా అంచెలం చెలుగా ఎదుగుతూ సంపన్నులుగా స్థిరపడ్డారు. నేడు బోడినాయకనూర్‌లో వీరి కుటుంబం పట్టణంలో కెల్లా సంపన్నమైనదిగా నిలబడటం విశేషం. ప్రస్తుతం ఈ కుటుంబ వారసులు 'అళగకుమార్ పగడాల' గారిని పలకరించినపుడు "మాతాత–ముత్తాతల పూర్వీకులు మొట్టమొదట కుండలు తయారుచేసి జీవనం కొనసాగించే వారు. మా తాతలు ఆనక (తరువాత) వేరే వ్యాపారాలు చేసి అంచెలంచెలుగా అభివృద్ధి చెందారు. ప్రస్తుతం మేము సినిమా హాలు, కొబ్బరితోట, ఏలగల (యాలకల) వ్యాపారం చేస్తున్నామని" అన్నారు. ఆయన భార్య మేఖలా కుమార్ పగడాల మాట్లాడుతూ "నాను వచ్చి మొదటి కోడాలు ఈ ఇంటికి, మా మామగారు రంగరాజన్. ఆనాటి గవర్నర్ మామాగారి దుస్తుల చూసి ముచ్చటపడి అదేవిధంగా ఆయన బట్టలు కూడా రూపొందించు కొన్నారట!" అనిచెప్పింది. ఎంతఎదిగినా ఒదిగి ఉండే స్వభావం వీరి సొంతం! అభివృద్ధిలోవీరు ముందుంటారు! అందుకే స్థానికులు వీరిని గౌరవిస్తారు.

**పురాతన భవంతిలో అరుదైన కళారూపాలు :** సుబ్బయ్య, రంగరాజ్, రావు సాహెబ్ అళగర్ చెట్టియార్ వంటి పగడాల వారి పూర్వులు కొందరు బ్రిటిష్ పాలకుల నుంచి పదవులు పొందడమే కాక ఆ పట్టణ పురపాలక సంఘ అధ్యక్షులుగా కూడా పనిచేయడం విశేషం. వీరి ఇంటిలో అపురూపమైన కళాఖండాలు కొలువుదీరినాయి. ఏనుగు దంతాలతో అద్దాల అల్మారా, ఏనుగు కాళ్ళతో టీపాయ్ వంటివే కాక, అప్పటికాలంలో వీరి ముత్తాత గారు 30పైగా పులులను వేటాడారంట! వాటి ఆనవాళ్ళు కూడా మనకు చిత్ర రూపంలో కనిపిస్తాయి. పులిచర్మం కూడా గోడకు కొలువు తీరి ఉంది.

**సాధారణ జనజీవితంలో కూడా మనవాళ్ళు ఉంటారు :** బోడినాయకనూరులో నోబుల్ చెల్లాదురై నిర్వహణలో నడుస్తున్న ఒక ప్రైవేటు పాఠశాలకు వెళ్ళి, ఓ పంతులమ్మ అప్పోజు రాజారమణి గారిని తెలుగులో పలకరిస్తే పులకించిపోయారు. ప్రీకేజీ నుంచి, రెండవ తరగతి వరకు బోధించే ఆ పాఠశాలలో పిల్లలు, టీచర్లు ఎక్కువమంది తెలుగువారే కావడం విశేషం. ఎన్నో వందల ఏళ్ళ క్రితం ఇక్కడకు వచ్చి స్థిరపడిన వారి మాట, పాట నేటికీ తెలుగే కావడం ఆశ్చర్యకరం! అందుకు ఉదాహరణ ఆ పంతులమ్మ నోట

**"లాలమ్మ లాలి ! ఎందుకమ్మా నీళ్ళు నీకంట్లో నీళ్ళు! చెప్పమ్మా చెప్పు!**

**ఏమింట చెప్పు! బంగారు కిండ్ల పాలన్నం నీకు! చందమామా చూడు! నీ మూతి అవును!**

**లాలమ్మ లాలి చిన్నమ్మ లాలి! ఎందుకమ్మ నీళ్ళు వద్దమ్మ నీళ్ళు"**

అచ్చ తెలుగు లాలిపాట పాడివిన్పించింది. తాను బంగారు పని చేసే ఆసారి (ఆచారి) కుటుంబానికి చెందిన వాళ్ళమని, తమ పెద్దలు అందరూ తమ కులవృత్తి చేసుకుంటుంటే, తాను ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నట్లు తెలిపింది. తమ బడిలో చదివేందుకు తమిళ పిల్లలతో పాటు తల్లిభాష తెలుగుగా గల పిల్లలు కూడా వస్తారు. తరగతి ముగిశాక, వారు పంతులమ్మతో తెలుగులో గలగలా మాట్లాడతారు.

**స్వయంకృషికి చిరునామ! :** ఆ పట్టణంలోని ఒక తెలుగు చర్మకారుడిని పలకరిస్తే, అక్కడి తెలుగు కుటుంబాలవారు ఇంట్లో తమలో తాము నేటికీ తెలుగులోనే మాట్లాడు కుంటారనీ, బయటికొస్తే తమిళం మాట్లాడుతారనీ తెలిపాడాయన. కుల వృత్తిని చేసుకుంటూనే తన పిల్లల్ని ఉన్నత స్థాయి వరకూ చదివించడం విశేషం. తమ తల్లి భాషను అమితమైన ప్రేమతో కాపాడుకొంటూ వస్తున్నారు. వాళ్ళు ఉపయోగించే తెలుగుపదాలు మచ్చుకు కొన్ని : వడసట్టి=మట్టికుండ, అట్టక = పెంకు, సల్ల= మజ్జిగ, పూక్కడ =పూల అంగడి, చారు=రసం, బావ= భర్తను

పిలిచే పిలుపు, తక్కాళి= టమోటా, నాయన, బియ్యాలు = బియ్యం, వేకువ= తెల్లవారి, కూరాకు= ఆకుకూర మొ.

తెలుగువారి మధుర జ్ఞాపకాలను మదిలో నిలుపుకొంటూ బయలుదేరాము. తమిళనాట తెలుగువాళ్ళు లేని పల్లెగాని, ప్రాంతంగాని ఉండదు. మధుర చుట్టుపక్కల ప్రాంతాలలో వ్యాపారంలోను, ఆతిథ్యం అందించే హొటళ్ళులోను మనవాళ్ళే ఉంటారు. దిండిగల్లు–మధుర మధ్యలో ఉన్న జాతీయ రహదారిలో అయ్యన్న కోట వద్దఉన్న 'టెంపుల్ సిటీ' హొటల్లో పూటకూళ్లమ్మ మొదలు ఆధునిక కాలంలో వెలిసిన హొటళ్ళు కాలానుగుణంగా ఏవిధంగా మార్పులు చెందుతూ వచ్చాయో చాలా చక్కగా గోడలపై చిత్రించారు. భవిష్యత్తుతరంలో భోజనశాలలు ఏవిధంగా ఉంటాయో కూడా కళ్ళకు కట్టారు. ఈ హొటల్ యజమాని కంద స్వామి రెడ్డియార్ తెలుగువాడే! వాళ్ళ తండ్రి సుబ్బరాయ రెడ్డియార్ వారి తాత పళని రెడ్డియార్. వీరిది ఆసక్తికరమైన వలస జీవితం.


**రాజమండ్రి నుండి కన్యాకుమారి! :** తూర్పు చాళుక్యుల చివరిదశలో రాజమహేంద్రమహేంద్రవరం నుంచి మధురకు చేరి, అక్కడినుండి తిరునెల్వేలి చేరుకొని – శ్రీలంకకు చేరిన సుదీర్ఘ బ్రతుకుపోరాటం వారిది. "తిరుమల నాయకుడి కాలాన 300, 400 కుటుంబం వాళ్ళం వచ్చినాము! తిన్నవెల్లి (తిరునెల్వేలి)లో చాలాకాలం వ్యవసాయం చేశాం. కానీ, వ్యవసాయం లాభసాటి కాకపోవడంతో వ్యాపారం చేద్దామన్న ఉద్దేశ్యంతో ఇక్కడ పెద్ద పట్టణం లేకపోవడంతో సముద్రం దాటి కొలంబో చేరుకొన్నాం. అక్కడ హొటళ్ళు నడిపి జీవిస్తుండంగా భారతదేశానికి, శ్రీలంకకు స్వాతంత్ర్యం వచ్చింది. శ్రీలంకలో సింహళులకు మనకు ప్రచ్ఛన్న (విభేదాలు) ఏర్పడ్డాయి. ఇక అక్కడ ఉండే అవకాశంలేక తిరిగి భారతదేశానికి వచ్చేశాం. ఉన్నంతలో పెద్ద పట్టణమైన మధురలో స్థిరపడ్డాం. మావాళ్ళు కొందరు కేరళలోని కొల్లం, ఎర్నాకుళం పోయికూడా స్థిరపడ్డారని చెప్పుకొచ్చారు.

**మాతృభాషపై తరగని అభిమానం! :** తెలుగు చదవాలని నిండా ఆశ! తెలుగులో రాసి చెప్పాలని నిండానిండా ఆశ! దీనిని ప్రభుత్వాల దృష్టిలో తీసుకొని పోవాలని వారి మా కోరిక! అని అన్నారు. మధురలో మనచరిత్రకు సజీవ సాక్ష్యాలు వీరు.

డా. సగిలి సుధారాణి
ఫోన్ : 9490428825

## కమ్మతెమ్మెరలు

ఏప్రిల్ **మిసిమి**లో రాంబాబు గారు అందించిన లంకా సూర్యనారాయణ గారి గురించిన విశేషాలు చదువుతుంటే రెండేళ్ళ క్రితం నేను దర్శించిన ఆ గ్రంథాలయం జ్ఞాపకాలు, లంకా సూర్యనారాయణ గారి ఆత్మీయ ఆహ్వానం గుర్తు వచ్చాయి. వీరు నిర్వహిస్తోన్న గ్రంథాలయం అపురూపమైనది. పసిపిల్లలు తమ దగ్గర వున్న ఆటో సామానులు ఎంత అబ్బురంగా చూపిస్తారో సూర్యనారాయణ గారు గ్రంథాలయంలోని వివిధ కేటగిరిలోని పుస్తకాలను ప్రతీ బీరువానూ చూపి వివరించారు.



రాజ్యాంగ తొలి ప్రతిని చూసి మా మనవరాలు సంబరపడిపోయింది. నేనే కాకుండా మా అమ్మాయీ, మనవరాలూ ఉత్సాహంతో, ఒకింత ఉద్వేగంతో ప్రతీ పుస్తకాలన్నీ తడిమి కళ్ళనిండా నింపుకున్న ఆ అనుభూతిని అక్షరాల్లో పెట్టటం కూడా అసాధ్యమే. ఆ సమయంలో లంకా సూర్యనారాయణ గారు దేవర్షిలా గోచరించారు. పుస్తక ప్రేమికులైన అటువంటి వ్యక్తులు నభూతో నభవిష్యతి. గ్రంథాలయాన్ని వీడి మేము తిరిగి వెళ్ళిపోతున్నప్పుడు మా ముగ్గురికి వారి చేతులమీదుగా ఆత్మీయ సత్కారం అందుకోవటం మా అదృష్టం. నేను కూడా అనేక సార్లు నాకు కావలసిన పుస్తకప్రతుల పీడీఎఫ్ లను ఫోనులో అందుకున్నాను. అంతా గొప్ప సరస్వతీ భాండాగారాన్ని సాహిత్య ప్రపంచానికి అందుబాటులో ఉంచిన లంకా సూర్యనారాయణగారికి హృదయపూర్వక నమస్సులతో

*– శీలా సుభద్రాదేవి, హైదరాబాద్*

# జాతీయ కవి పాల్కురికి సోమనాథుడు

**– డా. రావి ప్రేమలత**



పాల్కురికి సోమనాథుడు

తెలుగు సాహిత్య చరిత్రలో అనేక నూతన సాహితీ ప్రక్రియలకు శ్రీకారంచుట్టి నవశకానికి నాంది పలికిన తొలి జాతీయకవి పాల్కురికి సోమనాథకవి. సాహిత్యంలో, మత విషయాల్లో విప్లవ భావాలను ప్రదర్శించిన విప్లవకవి. ఇతివృత్తంలో, శిల్పం, జీవన చిత్రణలో, శిల్పంలో, శైలీ విన్యాసంలో, ఛందస్సులో, వర్ణనల్లో, భాషా ప్రయోగాల్లో, కవి సమయాల్లో దేశీయతనూ, నవ్యతనూ ప్రవేశపెట్టిన నవీనగుణ సంపన్నుడు సోమన. బహుభాషా కోవిదుడైన పాల్కురికి సోమన కర్ణాటకంలోని వీరశైవ మతప్రవక్త బసవన చరిత్రనూ, తమిళదేశంలోని నయన్మారుల కథలనూ, మహారాష్ట్రలోని శైవభక్తుల మహత్తులను తెలుగులో వర్ణించి, ఆయా ప్రాంతాల భాషల్లోనే కొన్ని పద్యాలను రచించి, దక్షిణదేశ చరిత్రలో జాతీయ సమైక్యతను సాధించిన తొలి తెలుగు కవి. ఇతని రచనలే వీరశైవ మతసిద్ధాంత ప్రచారాలకూ, ఉద్యమసాహిత్యానికి కూడ ఆలంబనాలైనాయి. మతాభిమానం, దేశీ కవితాభిమానం, జాత్యభిమానం కలగలసిన ప్రజ్ఞాశాలి సోమనాథకవి.

తెలంగాణలోని ఓరుగల్లు సమీపంలోని పాలకురికి ఇతని జన్మస్థలం. శ్రియాదేవి, విష్ణురామిదేవులు సోమన తల్లితండ్రులు. సోమన జన్మతః ఆరాధ్య బ్రాహ్మణుడని కొందరు, జంగముడని మరికొందరి అభిప్రాయం. కరస్థలి విశ్వనాథయ్య కవితా గురువు. గురులింగార్య అనే మరొక గురువు ప్రబోధంతో వీరశైవమతాన్ని స్వీకరించి, కులగోత్రాల ప్రసక్తిలేని వీరశైవ మహేశ్వరాచారాన్ని అవలంబించాడు. నాటినుండి సోమన వీరశైవ మత సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ, వీరశైవ మతప్రవక్తల జీవితాలనూ, వీరశైవమత భక్తుల కథలను తన రచనల ద్వారా ప్రచారం చేస్తూ, వీరశైవమత వ్యాప్తికీ తన జీవితాన్ని ధారపోసాడు. కర్ణాటకంలోని కల్యాణపురంలోని బిజ్జలుని ఆస్థానంలోని మంత్రి బసవన్న వీరశైవధర్మాన్ని భూమికగా చేసుకొని కులనిర్మూలనం, సర్వసమానత్వం, మూఢాచార నిర్మూలనం, శ్రామికగౌరవం వంటి విలువలకోసం, ఆదర్శాలకోసం ఉద్యమించాడు. అతని ఉద్యమ ప్రభావం, వీరశైవమత సిద్ధాంతాలు సోమనాథుణ్ణి ఆకట్టుకున్నాయి. ఆ మహాపురుషుణ్ణి ఆరాధ్యదైవంగా భావించి అతని జీవిత చరిత్రను 'బసవ పురాణం'గా రచించాడు. తెలుగు సాహిత్యంలో బసవపురాణం తొలి సామాజిక కావ్యం. తొలి ద్విపద కావ్యం.

తెలుగులో ఏ కావ్యానికి దక్కని గౌరవాభిమానాలు, కీర్తి ప్రతిష్ఠలు ఇతర భాషల్లో బసవపురాణానికి లభించాయి. దేశీ కవిత్వంలో రచింపబడ్డ బసవపురాణం కన్నడం, తమిళం, సంస్కృతం, ఆంగ్లంలోకి కూడా అనువదింప బడ్డాయి. భీమకవి 1369 సంవత్సరంలో బసవపురాణాన్ని కన్నడంలో మూలానుసారంగా అనువదించాడు. ఈ గ్రంథం కన్నడ దేశంలో పవిత్ర గ్రంథంగా నిత్యపారాయణ గ్రంథమయ్యింది. సింగరాజుకవి 1500 సం॥లో బసవపురాణం లేదా సింగరాజపురాణమనే పేరుతో కన్నడంలో రచించాడు. వృషాంకకవి 1655 సం॥లో బసవరాజు విజయం, లేదా వృషభేంద్ర విజయం అని చంపూకావ్యంగా వ్రాసాడు. సోమన బసవపురాణాన్నే కాకుండా, అతని జీవితచరిత్రను కన్నడ భాషలో "పాల్కురికి సోమేశ్వర చరిత్ర"గా తోంటదార్య కవి కావ్యంగా రచించాడు. ఈ కన్నడకవి సోమనను భృంగి అవతారంగా,

పురాణ పురుషునిగా ప్రశంసించాడు. తెలుగులో పిడపర్తి కూడ సోమనను భృంగి అవతారంగా వర్ణించాడు. మల్లికార్జున కవి యక్షగానంగా రచించాడు. తమిళంలోని బసవపురాణానికి నాగిచెట్టి కవి 1931 సం॥లో వ్యాఖ్యానాన్ని వ్రాసాడు. ఇది తెలుగు, కన్నడ బసవ పురాణాల ఆధారంగా రచింపబడింది. ఇందులో కవి బసవన పేరు ప్రఖ్యాతులను ప్రచారం చేసిన సోమనాథుని పాదపద్మాలను ఆరాధిస్తున్నానని పేర్కొనినాడు. కందుకూరి రెడ్డి ప్రభువుల ఆశ్రితుడైన శంకరాచార్యుడు బసవ పురాణాన్ని సంస్కృతంలోకి అనువదించాడు. ఈ సంస్కృత బసవపురాణానికి గురుపాదుడు కన్నడ టీకను 15వ శతాబ్దంలో రచించాడు. ఆధునిక కాలంలో సి.పి. బ్రౌన్ బసవపురాణం ప్రతులను సేకరించి సంక్షిప్తంగా 140 పుటల్లో ఆంగ్లంలోకి అనువదించాడు. ఆచార్య వెల్చేరు నారాయణరావు పీఠికతో 1993లో ప్రిన్స్‌టన్ యూనివర్శిటీ బసవపురాణాన్ని ఆంగ్లంలో ప్రచురించింది.

తెలుగులో కూడా 15వ శతాబ్దంలో పిడపర్తి సోమన బసవపురాణాన్ని పద్యరూపంలో రచించాడు. శ్రీనాథుడు, ధూర్జటి కూడ బసవపురాణ కథలను తమ కావ్యాల్లో వర్ణించారు. బసవన్న చారిత్రక పురుషుడైననూ, మతప్రవక్తలను అవతార పురుషులుగా వర్ణించడం సర్వ సాధారణవే కాబట్టి బసవన్నను నందీశ్వరుని అపరావతారంగా సోమన కీర్తించాడు. హిందూమతంలో అష్టాదశ పురాణాలున్నాయి. జైనమతంలో చతుర్వింశతి పురాణాలు, కన్నడంలో ఆది, శాంతి, అజిత పురాణాలున్నాయి. ఈ సంప్రదాయాల ప్రకారమే సోమన చారిత్రక పురుషుడైన బసవన చరిత్రను బసవపురాణంగా రచించి, బసవన్నని పురాణ పురుషునిగా చిత్రించాడు. బసవ పురాణంలో బసవన చరిత్రయే కాకుండ తమిళ, కన్నడ, ఆంధ్ర, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన 75 మంది శివభక్తుల కథలున్నాయి. ఈ కావ్యంలో 6288 ద్విపదలున్నాయి. నన్నయనాటి నుండి సంప్రదాయపరంగా వస్తున్న మార్గ కవితా రచనను తిరస్కరించి దేశీ కవితారచనలో, దిపదచ్ఛందస్సులో, జానుతెలుగులో బసవపురాణాన్ని రచించి తెలుగు సాహిత్యాన్ని నూతన మార్గంలో ప్రవేశపెట్టిన స్వతంత్ర కావ్య రచనా నిర్మాత సోమనాథకవి.

**ఉరుతర గద్య పద్యోక్తులకంటె**
**సరసమై పరగిన జానుతెనుంగు**
**చర్చింపగా సర్వసామాన్యమగుట**
**గుర్చెద ద్విపదలు గోర్కి దైవాఱ**
**తెలుగుమాట లనంగవలదు వేదముల**
**కొలదియగాజుడుడిలనెట్టులనిన**

సోమనకు ముందు నన్నయ రచించిన మహాభారతం గద్యపద్యాలలో ఉరుతరంగా ఉందనీ, సర్వజనుల కర్థమయ్యే విధంగా సరసమైన జానుతెనుగులో ద్విపదలో కావ్యాన్ని రచిస్తానని పరోక్షంగా మార్గకవితారీతిని విమర్శించాడు. 'ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ భూయిష్ఠ రచన మానుగా సర్వసామాన్యంబుగామి, జానుతెనుగు విశేషము ప్రసన్నతకు' అని మరొక్కచోట సోమన తన జానుతెనుగులోని రచనను సమర్థించుకున్నాడు. గద్య పద్యాత్మకంగా చంపూకావ్యంగా తిక్కన 15 పర్వాల మహాభారతాన్ని రచించాడు. దాన్ని తిక్కనయే స్వయంగా ప్రబంధ మండలి అని అన్నాడు. తిక్కన భారత రచన ఆరూఢంగా సర్వ సామాన్యంగా లేదనీ, అందుకు జానుతెనుగును వాడుతున్నానీ, మహాభారత రచనకంటె ఉన్నతమైన రచన చేస్తానని సూచించడమే కాకుండ, స్వతంత్ర కావ్యాన్ని రచిస్తాననే ప్రతిపాదన కూడా చేసాడు. సోమన ద్విపదచ్ఛందస్సును వాడటాన్ని, జానుతెనుగులో రచించడాన్ని అతని సమకాలికులే విమర్శించారు. అందుకే సోమన ద్విపదలోని శ్లేషను ఆధారంగా చేసుకొని "ఐహికాముష్మిక ద్విపద హేతువగుట ద్విపద నాగ బరగు, ద్విపదాంబురుహముల ధృతి బసవేశు ద్విపదాంబురుహము లతి ప్రీతి బూన్తు" అని చమత్కారంగా తన రచనను సమర్థించుకున్నాడు. అంతేకాక తెలుగు మాటలు వేదముల వంటివి అని తన తెలుగు భాషాభిమానాన్ని చాటుకున్నాడు. ద్విపదలో ప్రాసయతిని వాడిన మొదటి కవి కూడా పాల్కురికి సోమనయే. కానీ అతని సమకాలికులు ప్రాసయతిని చులకన చేసినారు. వారికి సమాధానంగా "అనియతి గణైర్వా, ప్రాసోవా, యతిర్వా" అనే మూడు సూత్రాలాధారంగా ద్విపదప్రాసయతిని సమర్థించాడు. సోమనవల్లనే ద్విపదకు కావ్యగౌరవం చేకూరింది. తర్వాతి కాలంలో అనేక తెలుగు కవులు ద్విపదలోనే కావ్యాలను రచించారు.

సోమన బసవ పురాణంలో బసవన్న చరిత్రనే కాకుండా, "పురాతనులు" అని పేర్కొనబడిన తమిళ శైవ భక్తులైన నయనారుల జీవితాలను కూడా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో నయనారుల జీవిత విశేషాలను వివరించిన తొలి తెలుగుకవి సోమనాథుడే. శైవభక్తుల కథలకు తన మిత్రులను, ఆత్మీయులను శ్రోతలను చేసి నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టినాడు. నయనారుల కథలనే కాకుండ, సోమన చారిత్రక వ్యక్తుల, సమకాలికుల, పూర్వీకులైన శివభక్తుల చరిత్రలను "అతత సకల పురాతన భక్తగీతార్థ సమితియే మాతృక"గా బసవ పురాణాన్ని రచించి కథావస్తువులో నవ్యతను ప్రదర్శించాడు. కుల, వర్ణ, వర్గ భేదాలు లేకుండా భక్తుల చరిత్రలను వర్ణించి ప్రజల ఉద్యమానికి శ్రీకారం చుట్టినాడని చెప్పవచ్చును.

సంస్కృత మూలాలు కాని, స్వకపోలకల్పితాలైన దేశి వర్ణనలను సోమన బసవపురాణంలో కొల్లలుగా ప్రయోగించాడు. సంస్కృత ప్రభావం ప్రసరించని కవి సమయాలనూ, ఉపమానాలను కూడ వాడినాడు. అనేక దేశాచారాలనూ, అనేక రకాల వేష భూషణాలనూ సందర్భానుసారంగా చిత్రించి తన సర్వజ్ఞత్వాన్ని ప్రదర్శించాడు. సంగీతశాస్త్రం, చతుర్వేదం, అష్టాదశ పురాణసారాలు, చతుఃషష్టి విద్యలు, కావ్యనాటకాలంకార శాస్త్రాలు, వివిధ వేదాంత శాఖల్లో తనకున్న పరిజ్ఞానాన్ని ప్రదర్శించి, తన బహుముఖ ప్రజ్ఞను, వైదుష్యాన్ని ప్రకటించాడు.

సోమన ద్విపదలో రచించిన మరొక ప్రౌఢ పురాణ కావ్యం పండితారాధ్య–చరిత్ర. దీన్ని తెలుగుజాతి తొలి విజ్ఞాన సర్వస్వమని తిమ్మావజ్ఝల కోదండ రామయ్యగారు పేర్కొన్నారు. సోమన కవితావేశం, ఔద్ధత్యం, పాండిత్యప్రకర్ష, లోకజ్ఞానం బసవపురాణంలో కంటే పండితారాధ్య–చరిత్రలోనే ప్రస్ఫుటమవుతుంది. బసవ పురాణంలో బసవన్నకు, శివునకభేదం కల్పించగా పండితారాధ్యచరిత్రలో పండితారాధ్యుని పరమేశ్వరుని కంటే అధికునిగా వర్ణించాడు. దీనిలో వీరశైవధర్మం సంపూర్ణంగా వివరింపబడింది. ఈ కావ్యాన్ని సోమన అఖిలషితార్థ చింతామణి వలె, చతుర్వర్ణదీపికవలె, శివయోగ సర్వస్వంవలె రూపొందించాడు. దీనిలో 34 వేల ద్విపదలున్నాయి. సంస్కృత, కన్నడ, తమిళం, మహారాష్ట్ర భాషల్లో కూడ ద్విపదులను రచించి తన బహుభాషా పాండిత్యాన్ని చాటుకున్నాడు.

సోమన తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా మౌఖిక సాహిత్యాన్ని ప్రస్తావించాడు. తుమ్మెదపదాలు, నివాళి, వాలేశు, గొబ్బి, వెన్నెల పదాలను, ఆనందగీతాలు, శంకరగీతాలను, దేశీనాటక ప్రదర్శనలను తెలిపాడు. జానపదుల కథాగేయలక్షణాలు కూడా కన్పిస్తాయి. జానపద కథాగేయాల్లో కన్పించే పునరుక్తులు పరిచితమైన వాటినే ఉపమానాలుగా గ్రహించడం, పండితారాధ్య చరిత్రలో కూడ కన్పిస్తాయి. జనసామాన్యంలోని శివభక్తుల కథలనే తీసుకొని పాడుకోవడానికి వీలైన ద్విపద ఛందస్సులోనే వారి కథాగేయాల నడకలననుసరిస్తూనే వీరశైవమత ప్రబోధంతో ద్విపద కావ్యాలను రచించాడు కాబట్టే, తెలుగు దేశంలో నిమ్నకులాల్లో వీరశైవ భక్తుల కథలు, వీరశైవమతం వ్యాపించిందని భావింపవచ్చు, రజకుల, గౌడుల, కుమ్మరి కుల పురాణాల్లోని ప్రధాన పాత్రలు సోమన ద్విపద కావ్యాల్లోనివే. సోమన కావ్యాలు సమకాలీన పండితుల ఆదరణను పొందకపోయినను, సామాన్య ప్రజల అభిమానాన్ని చూరగొన్నాయి. ప్రజల్లో ప్రచారంలో ఉన్న సామెతలను, లోకోక్తుల ననేకం వాడి రచనకు సహజత్వాన్ని చేకూర్చాడు. దేశీ నుడికారంతో, తెలుగు తీయదనాన్ని రచనలో ప్రదర్శించి తెలుగువారి ఆచార వ్యవహారాలను, వేషభాషలను వర్ణించి, తెలుగు జాతీయతను, తెలుగు దేశీతనాన్ని చాటినాడు. కేవల దేశీపదాలనే కాకుండ సందర్భానుగుణంగా దీర్ఘ సంస్కృత సమాసాలను కూడ ప్రయోగించి కావ్యాన్ని రసవంతంగా రూపొందించాడు.

సోమన బహుశాస్త్ర పాండిత్యం పండితారాధ్య చరిత్రలో ప్రస్ఫుటమవుతుంది. సోమనంతటి పాండిత్యాన్ని కావ్యాల్లో ప్రదర్శించిన తెలుగుకవి మరొకడు లేడు. ఆయన సంగీతశాస్త్ర పరిజ్ఞానం అమోఘం, అద్వితీయం. భరతనాట్య శాస్త్రాన్ని కూడ వ్యాఖ్యానించాడు. అంతేకాకుండ సర్పశాస్త్రం, వైద్యశాస్త్రం, కామశాస్త్రం, మొదలైన వాటిని కూడ పేర్కొన్నాడు. శాస్త్రాలే కాకుండ వేదాలు, శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాలు, ఉపనిషత్తులు, ఆగమాలు, లలితకళలు, ఆరాధన సంప్రదాయాలు, తంత్ర విజ్ఞానం, మొదలైన వాటన్నింటిలో అతనికి గల వైదుష్యం, ప్రతిభ పండితారాధ్య చరిత్రలో ప్రతిబింబిస్తుంది. సకల శాస్త్రాంశాలతో కూడిన పండితారాధ్య–చరిత్ర తెలుగువారికి ఒక విజ్ఞాన సర్వస్వం వంటిది అని అనవచ్చు.

వీరశైవమత సిద్ధాంతాల ప్రతిపాదన కొరకూ, ప్రచారం కొరకే రచనలు చేసిన సోమన పండితారాధ్య చరిత్రలో వాద ప్రకరణంలో పరమతాలను ఖండించడంలో నైయాయిక పద్ధతిని అవలంబించాడు. ఈ ప్రకరణంలో సోమన మహాతార్కికునిగా, విద్వాంసునిగా కన్పిస్తాడు. అతడు ఒక్కొక్కవాద స్వరూపాన్ని తెలిపి వేదవాక్యాల నుదాహరించి, వేదాలకు ఆ వాదమెట్లు భిన్నంగా ఉందో వివరించి, పురాణాలనుండి ఉదాహరణలను ఉదాహరించి పరమత సిద్ధాంతాలను ఖండిస్తాడు. అతని వాద పటిమతో పరమత వాదనలన్నీ పరాజితముచేసి శివమతమే పరమోత్తమమయ్యిందని నిరూపిస్తాడు. అంతేకాక "శివుని మీద నొకడు గలడన్న నా యఱకాలెత్తి వాని నడుదల దన్నుదు"ను అని ఔద్ధత్యాన్ని ప్రదర్శించేవాడు. పరమత ఖండనమే కాకుండా విశ్వమంతా శివమయమే అని ప్రబోధించి, శివసాయుజ్యాన్ని పొందిన భక్తుల చరిత్రను సామాన్య జనులు పాడుకునే ద్విపద ఛందస్సులో వర్ణించి వీరశైవమతాన్ని ప్రచారం చేసాడు.

సంప్రదాయపరంగా వస్తున్న ప్రాచీన సంస్కృత అలంకారికుల కొన్ని సిద్ధాంతాలతో విభేదిస్తూ పరిపూర్ణమైన సాహిత్య సిద్ధాంతాన్ని తన కావ్యాల్లో పేర్కొన్న మొదటి తెలుగుకవి సోమన. తన సాహిత్య సిద్ధాంత ప్రవచనాలలో 9 రసాలు, 18 వర్ణనలు, 36 అలంకారాలు, 72 అర్థభావాలను పేర్కొని 49 కావ్యగుణాలను, 29 కావ్య దోషాలను తెలిపినాడు. సోమన కావ్యలక్షణాలను ప్రాచీన సూత్రాల ప్రకారం అనుసరించిన, తననుసరించిన కావ్యలక్షణాలను లాక్షణికులే గుర్తింపవలసినట్లు స్వతంత్రతను ప్రదర్శించాడు. సాహితీరంగంలో స్వతంత్రతను, నవ్యతను ప్రదర్శించినట్లుగా, మతంలో విప్లవభావాలను సోమన ప్రవేశపెట్టాడు. మతప్రచారంలో శివుడు తప్ప వేరే దైవం లేదని వేదవాదాన్ని, కర్మవాదాన్ని, కాలవాదాన్ని, వేదాంత మతాన్ని, సాంఖ్యవాదాన్ని, యోగవాదాన్ని, చార్వాకవాదాన్ని, పాంచరాత్రవాదాన్ని, బౌద్ధ, జైనవాదాలను పరాజితం కావించి ప్రజలను ఒక్క మతంలోనికి తీసుకొని రావడానికి ప్రయత్నించి, కొంతవరకు ప్రజల్లో ఐకమత్యం ఏర్పడడానికి తోడ్పడ్డాడని చెప్పవచ్చు. వీరశైవమతంలో జంగమములో లింగభావాన్ని ఆరోపణ చేసి జంగాన్నే ఆరాధించమంటారు. అంటే "బ్రతికి ఉన్న మనుష్యున్ని ఆరాధించండి" అని సోమన చేసిన ఉపదేశం మహోన్నతమయ్యింది. మతబోధనలలో మహత్తరమయ్యింది. విప్లవాత్మకమయ్యింది. బసవ పురాణం, పండితారాధ్యచరిత్ర కావ్యాల్లోని కథల ద్వారా "కాయకమే కైలాసమ"ని బోధించిన అభ్యుదయవాది.

సోమన తెలుగు సాహిత్య చరిత్రలో ద్విపద కావ్యరచనకు పితామహుడే కాకుండా శతక రచనకూ, ఉదాహరణ కవితా ప్రక్రియకు కూడా ఆద్యుడయ్యాడు. ద్విపద కావ్యానికే కాకుండా అనుభవసారం, చతుర్వేదసారం, చెన్నమల్లు సీసములు, వృషాధిపశతకం, బసవోదాహరణం మొదలైన వాటిని తెలుగులో రచించాడు. సంస్కృతంలో సోమనాథభాష్యం, రుద్రభాష్యం, త్రివిధలింగాష్టకం వ్రాశాడు. కన్నడంలో సద్గురురగడ, చెన్నబసవరగడ, అక్షరాంక పద్యాలు, శరణుబసవరగడ, బసవలింగ నామావళి, శీలసంపాదనం, శివగణ సహస్రమాల అనే లఘు కృతులనూ రచించాడు. ఇవి కన్నడ దేశంలో బహు ప్రచారంలో ఉన్నాయి. సోమన రచనల్లో అనుభవసారం మొదటిది. దీనిలో వీరశైవ మతధర్మాలు 243 పద్యాల్లో విశదీకరింపబడ్డాయి. దీనిలో త్రిభంగి ఛందస్సును ప్రయోగించిన తొలికవి సోమనయే అయ్యాడు. త్రిభంగియే కాకుండా వనమయూరం, మాలిని, మానిని, క్రౌంచపదం, తరువోజ వృత్తాలు కూడ ఉన్నాయి. సోమన వృషాధిప శతకం సంపూర్ణమైన శతకలక్షణ నియమముల ననుసరించి రచించిన మొదటి శతకం. "నోరికొలంది నిను ప్రస్తుతింతు"నని తమిళం, మహారాష్ట్రం, మణిప్రవాళంలో ఇతడు బసవని స్తుతించుచు వృషాధిపా మకుటంతో 108 పద్యాలను రచించాడు. తెలుగులో 'మణిప్రవాళ'మును ప్రవేశపెట్టిన తొలికవి సోమనయే. చెన్నమల్లుసీసంలో దేశీ ఛ్ఛందస్సులో సీసపద్యాలను వ్రాసినాడు. ఇతని సీసపద్యాల్లోని పాదాలు వేటికవే విడిగా ఉండి స్వతంత్రంగా కన్పిస్తాయి. సోమన సీసపద్యాలను అనుకరిస్తూ ఆంధ్రనాయకశతకం, నరసింహ శతకం సీసపద్యాల్లోనే రచింపబడ్డాయి. శ్రీనాథ, పోతనల సీసపద్యాల్లో కూడ సోమన సీసపద్యపు పోకడలు కన్పిస్తాయి.

ఈ విధంగా సోమన సాహితీ రంగంలో నవీనతను ప్రవేశపెట్టి, నూతన ప్రక్రియలకు నాంది పలికి అనేక విజయాలను సాధించాడు. తొలిసారిగా స్వతంత్ర సామాజిక కావ్యాన్ని రచించాడు, దేశీకవితకు సాహిత్యంలో గౌరవాన్ని సంపాదించి పెట్టాడు. కవిత్వాన్ని రాజాస్థానానికి

కాకుండా, ప్రజలదగ్గరకు తీసుకొని వెళ్ళాడు. సంస్కృతాంధ్ర భాషల్లో ఉదాహరణ వాఙ్మయాలకు ఆద్యుడయ్యాడు. అంతేకాకుండా తెలుగులో రగడ ఛందస్సును మొట్టమొదట ప్రచారంలోకి తెచ్చిన సోమన అక్షరాంక గద్య పద్యాలకు (తెలుగులో అంతాది రచనల శాఖకు చెందినవి) కూడ ఆద్యుడయ్యాడు. ప్రప్రథమంలో సాహిత్యంలో భక్తిపరంగా వివిధ వృత్తుల వారికీ, దళితులకు, స్త్రీలకు గౌరవ స్థానాన్ని కల్గించాడు. తెలుగులోనే కాకుండా సంస్కృత, కన్నడ భాషల్లో కూడ కావ్యాలను రచించాడు. మత, భక్తి భావాలతో పాటు భాషాభిమానాన్ని జాతీయ భావాన్ని రేకెత్తించాడు. తన రచనలతో వీరశైవ మతానికి వైదిక ప్రాముఖ్యాన్ని కల్గించాడు. ఈ విజయాలన్నింటినీ మతపరంగా, సాహితీపరంగా సోమనాథుడ- *సి.ఎస్.ఆర్* సాధించినా, అతని సమకాలికులు గానీ, తర్వాతి తరానికి చెందిన శైవేతర కవులుగానీ అతణ్ణి తమ కావ్యాల్లో ప్రస్తావించలేదు. ప్రస్తుతించలేదు. పోతన శైవ సంప్రదాయానికి చెందినవాడు. తన కావ్యంలోని కొన్నిపద్యాలను సోమన పద్యాలను అనుకరించే రచించాడు. అతడు వర్ణించిన సరస్వతీదేవి వర్ణన, సోమన వర్ణించిన శివవర్ణనను పోలి ఉంది. అయినా అతను సోమనను తన కావ్యంలో స్మరించలేదు. పాండిత్య ప్రకర్షలో శ్రీనాథుని అంతటివాడు సోమన. శ్రీనాథుని కావ్యాలు కూడ శివభక్తి ప్రబోధకాలే, అతను కూడ ద్విపద కావ్యకర్త. పండితారాధ్య చరిత్రను రచించినట్లు చెప్పుకున్నను ఆయన కావ్యాల్లో సోమన ప్రశంసలేదు. దీనికి కారణం సోమన మతావేశంతో అన్యమతాలను దూషించినందువల్ల అతని కవిత్వం శైవేతరులకు అంగీకారం కాకపోవచ్చు.


సామాన్య ప్రజల కొరకు, ప్రజల్లోని వీరశైవభక్తుల కథలను, ప్రజల జాను తెనుగులో కావ్యాలను రచించిన తొలి ప్రజాకవి సోమన. సంప్రదాయ మార్గ కవిత్వాన్ని కాదని దేశీయతను ప్రతిబింబించే దేశీచ్ఛందస్సులో రచనలు చేసిన విప్లవకవి. మతాన్ని తన రచనలను సమానత్వ సాధకాలుగా, ప్రగతి పథాలుగా రచించిన అభ్యుదయ కవి. వివిధ శాస్త్రాంశాల్లో, వివిధ భాషల్లో అసమాన ప్రజ్ఞా పాండిత్యాలను ప్రదర్శించిన మహా ప్రతిభావంతుడైన పాల్కురికి సోమన వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రలో మేరునగం వంటివాడు.

---

## చదువులమ్మ సేవలో - తంగిరాల వెంకట సుబ్బారావు

**- పెద్ది సత్యనారాయణ**

తంగిరాల వెంకట సుబ్బారావు పది, పన్నెండు డాక్టరేట్లకు సరిపడా విషయసేకరణ చేశారు. కాళ్లు బలపాలు కట్టేలా దేశమంతా తిరిగారు. చేతివేళ్లు అరిగేదాకా కలానికి పనిపెట్టారు. వివరణాత్మకమైన రచనలోనూ సాఫల్యం పొందారు అని అంటారు ప్రొఫెసర్ కె.వి. రమణారెడ్డి గారు.



తంగిరాల

తెలుగుల వీరగాథలను నీవు ఒక్కడివే ప్రసంగించగలవు. గురుదేవులు శ్రీ దిగుమర్తి సీతారామస్వామి గారు జానపద వాఙ్మయం బోధి సలిల మెల్ల పుడిసెలించు అగస్త్యుడద్భుత వచస్వి, జ్ఞానభారతికిన్ చతురాననుండు కన్నడము తెల్గుసంధాన కారకుండు! అంటారు **డా. మల్లెల గురువయ్య గారు.**

**ఏదో ఒక ఆదర్శము,**
**నేదోయొక పని సఖష్టి హితమునకై, తా**
**నౌదల దాల్చిన త్యాగికి**
**నైదపడిచేసి లోక మారాధించున్ (డా. నండూరి కృష్ణమాచార్యులు)**

ఇలాంటి మాన్యుల ప్రసంశలు పొందిన తంగిరాల, చదువులమ్మ సేవకుడు, 25 జనవరి 2025 స్వర్గస్తులయ్యారు. వారికి అశ్రుపూరిత నేత్రాలతో ప్రణామములు ఆచరిస్తున్నాను.

- పెద్ది

# శబ్ద సందేశం

**– మధురాంతకం రాజారాం**

ప్రాంతీయత, ఆ భాష, అతి సామాన్య జీవనశైలి మధురాంతకం రాజారాం గారి రచనకి ప్రాణ వాయువు. రాయలసీమలోని దామల చెరువు అన్న చిన్న ఊళ్ళో ఉండేవారు. ఆయన అప్పటి ఉపన్యాసాలు విన్నాను. మాది దామల చెరువు అన్న చిన్న పల్లె అని ఆరంభించేవారు. తొలినాళ్ళలో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఆయన కథ ప్రచురణకి స్వీకరించినట్టు కార్డు వచ్చింది. వెంటనే రాజారాం గారు 'నేను పేద బడిపంతుల్ని, పత్రికలో చిన్న చిన్న ప్రకటనలకే ఎక్కువ వెల చెల్లించాలి కదా, అందులో నా కథ పెద్దది. నేనెంత చెల్లించాలో దయచేసి ముందుగా తెలియచెయ్యండి' అని ఉత్తరం రాశారు, అంతటి అమాయకత్వం. దానికి బదులుగా పత్రిక వారు, కథకి మేమే పారితోషికం ఇస్తాం అని, ఆయన నెత్తిన పాలు పోశారు. ఆ తర్వాత ఆయన సాహితీప్రయాణం అమెరికా దాకా సాగింది. ఆయన ఎన్నో రాజకీయాలు, లౌక్యాలు చూశారు. కానీ ఆయన రచనలన్నింటిలో ఆ తొలినాటి మౌలిక అమాయకత్వం, నిస్సహాయత ఏదో పాత్రగా రూపు దిద్దుకున్నాయి. ఆ తరహా రచనల్లో తలమానికం అనదగ్గ కథ, ఈ 'శబ్ద సందేశం'.

మంచితనం, అమాయకత్వం, నిస్సహాయతల రూపం నాగమణి. తన కుటుంబం బాగుకోసం, అధిక సంపాదన కోసం గల్ఫ్‌కి ప్రయాణం అయింది. రాయలసీమ కల్లూరు నుంచి ధైర్యం చేసి బైలుదేరిన నాగమణికి రేణిగుంటలో రైలు కదిలిన దగ్గర్నుంచే దిగులు మొదలైంది. తనలాగే కొత్తపేట నుంచి వచ్చిన తులసమ్మ తోడుంది. అయినా కుటుంబం నుంచి వేరుపడిన దిగులు. బొంబాయి చేరారు. అక్కడ కొన్నాళ్ళు ట్రైనింగ్. వేషం మార్చారు. చీర, జాకెట్టు బదులు పరాయి, జుబ్బా కట్టబెట్టారు. గల్ఫ్ వాళ్ళకి కావల్సిన వంటలు నేర్పారు. అంతా సిద్ధం అయ్యాక జెద్దా విమానం ఎక్కించారు. అక్కడ నుంచి మరో విమానంలో వేరొక ఊరు. చివరికి ఒంటరిగా నాగమణి, బైట ప్రపంచంతో సంబంధం లేని కోటలాంటి ఓ షేక్ ఇంట్లో ఉద్యోగానికి చేరింది. ఇంక అక్కడ నుంచి ఆమె శారీరక, మానసిక నరకం ఆరంభమైంది. ఆ ఇంట్లో జనాభా ఎక్కువే, వాళ్ళ ఆకలీ ఎక్కువే. పొద్దున్న నాలిగింటికి మొదలైన చాకిరీ రాత్రి పన్నిండింటి వరకు. ఇదంతా డబ్బుకోసం తరతరాల పేదరికం నుంచి బైట పడటానికి కొత్తదారి.

చాకిరి, శ్రమ సరే. ఎవరికోసం, ఏ కుటుంబం కోసం అంతదూరం వచ్చిందో, వాళ్ళెలా ఉన్నారో తెలిసే దారి లేదు. ఆ ఇంటివాళ్ళు వచ్చిన ఉత్తరాలు ఇవ్వరు. తన పరిస్థితి, గోడు ఇంటి వాళ్ళకి తెలిపేలా ఉత్తరం రాయటానికి, నాగమణికి చదువు రాదు. అలాంటి నికృష్టమైన దిగులులో, హింసలో ఏడాదిపైగా మగ్గి పోయింది నాగమణి. తన ఊరికి, తనవాళ్ళకి, తనకి రుణం తీరిపోయిందని, తన జీవితం ఆ చెరలోనే అంతమైపోతుందని కుళ్ళి, కుళ్ళి ఏడ్చింది. కానీ తమ ప్రాంతంవాడే. వులిచర్ల రంగన్న నాగమణి ఉన్న దేశంలోనే ఉన్నాడు. అతనికి విషయమంతా తెలిసి ఓ ఉపాయం ఫోన్ ద్వారా చెప్పాడు. అది టేప్‌రికార్డర్ కేసెట్‌లో నాగమణి తన గోడంతా రికార్డ్ చేసి ఇంటి వాళ్ళకి పంపటం. నాగమణి అలా చేసిన కేసెట్టే ఈ కథ 'శబ్ద సందేశం'.

నాగమణి, ఆమె కుటుంబం పరస్పరం సంభాషించుకో గలగటం, మనకి ఎంతో బరువు దిగినట్టు, ఈ కథను మలిచారు రాజారాం గారు. ఒకనాటి కాలానికి, పరిణామానికి, కొన్నివేల జీవితాల ఆశ, నిరాశాలకి ప్రతీక ఈ కథ. తన కథలో ఆధునిక సాంకేతికతని, రాజారాం గారు వాడింది బహుశా, ఈ ఒక్క కథలోనేనేమో.

'శబ్దసందేశం' గొప్ప శీర్షిక. అనేక అర్థాలని స్ఫురింప చేస్తూ, ఎన్నో ఊహల ప్రేరేపణకి నిలయం. కథేకాదు, శిల్పరీత్యా కూడా మధురాంతకం రాజారాం గారి కథల్లో విశిష్టమైంది 'శబ్ద సందేశం'.

వి. రాజారామమోహనరావు
ఫోన్ : 9394738805

## స్వర్గ పులిహోరా - కాళిదాసు

**- డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల**

*(ఎడిటర్ తపస్సులో వుండగా మేనకలా ప్రవేశించింది మధురవాణి)*

**మధురవాణి :** నమస్కారం గురువుగారూ

**సిరిమల్లె :** ఓ మధురవాణి..ఎంతకాలానికివచ్చావు, రమ్ము. కూర్చొనుము.. ఏదో పొట్లము తెచ్చినట్లున్నావు?

**మధుర :** అదేమిటో ఊహించండి సర్.. ఆ పొట్లాము వాసనను బట్టి.

**సిరిమల్లె :** ఏమిటిది మధురవాణీ.. కొంపతీసి నువ్వుకూడా బిర్యానీ తేలేదు కదా..

**మధుర :** భలేవారే సర్,. హిమాలయాలకు మంచుగడ్డలనో, గోదావరినదికి బిందెలో నీళ్ళను, తీసికెళ్లినట్లు, హైదరాబాదుకు బిర్యానీని ఎవరైనా తెస్తారా?. ఇది స్వర్గపులిహోర.

**సిరిమల్లె :** స్వర్గ పులిహోరా,.. అదేంపేరు మధురవాణీ? ఎప్పుడూ వినలేదు.

**మధుర :** భలే వారే గురువుగారూ, మీకు పారడైజు బిర్యానీ ఉన్నప్పుడు మాకు స్వర్గ పులిహోర ఉండకూడదా? మా ఊళ్లో స్వర్గ పులిహోర రెస్టారెంటు చాలా ప్రసిద్ధి సార్.

**సిరిమల్లె :** అదిసరే మధురవాణీ, ఈ పులిహోరేనా ఇంకేమైనా విషయముందా?

**మధుర :** పులిహోరంత గొప్ప విషయమే ఉంది గురువుగారు. మొన్న మా మాస్టారు మహాకవి కాళిదాసు రచించిన "మేఘసందేశం" గురించి చెప్పారు. కాళిదాసు క్రీ.శ. నాలుగు-అయిదు శతాబ్దాలనాటి వాడని అన్నారు.

**సిరిమల్లె :** అవును. ఎవరు ఆ మాస్టారు, శుక్రవారాలు వచ్చే ఆ శుక్రాచార్యులు గారేనా?

**మధుర :** ఆయనే సర్. ఈసారి గురువారం వచ్చారు. వారు చెప్పే పాఠాలు మా అమ్మాయిలకు సరదా. వాళ్ళు సందేశం పంపగానే, వెంటనే వచ్చేశారు సంచిలో డబుల్ బుడ్డివేసుకొని.

**సిరిమల్లె :** ఏమని చెప్పారు మీ ఆచార్యుల వారు?

**మధుర :** మేఘసందేశం కథలో యక్షరాజు కుబేరుడు తన దగ్గర పనిచేసే ఒక యక్షుడిపై కోపం వహించి హిమాలయాల్లో ఉండే తన రాజ్యం నుండి ఒక సంవత్సరం పాటు అతన్ని బహిష్కరిస్తాడు గదా. అప్పుడా యక్షుడు రామగిరి అనే ప్రదేశంలో నివసిస్తుంటాడు. ఆ రామగిరి ఇప్పటి మహారాష్ట్రలో నాగపూర్‌కి ఏబది కిలోమీటర్ల ఉత్తరంగా, మధ్యప్రదేశ్ సరిహద్దులో ఉన్నదని చరిత్రకారులు నిర్ణయించారని మాస్టారు చెప్పారు. యక్షుని భార్య కైలాసంలో అలకాపురిలో ఉన్నది. ఆ ఎడబాటుని భరించలేక యక్షుడు మేఘం ద్వారా తన భార్యకు ప్రేమ సందేశం పంపుతాడు.

**సిరిమల్లె :** అదే కదా ఆ కావ్యం సందర్భం, సన్నివేశం.

**మధుర :** అవును సార్. మాస్టారు చెప్పారూ-ఆ కావ్యంలో మొదటి సగంలో రామగిరి ప్రాంతం నుండి అలకాపురికి ఆకాశమార్గంలో ఎలా వెళ్ళాలో యక్షుడు మేఘానికి చెప్పుతాడట. ఆ మార్గనిర్దేశం నైరుతీ ఋతుపవనాలు వీచేమార్గమేనట. మాస్టారు ఇంకా ఎన్నో ఆసక్తికర విషయాలు చెప్పారు సార్.

**సిరిమల్లె :** చెప్పుము చెప్పుము, మాకు కూడా ఉత్కంఠగా ఉన్నది.

**మధుర :** ఇది ఆషాఢమాసంలో జరిగిందని కాళిదాసు వ్రాసాడు. శ్రావణమాసం కూడా ప్రస్తావించాడు. అంటే ఇప్పటి జూన్-జులై-ఆగస్టు మాసాలన్నమాట. నైరుతీ ఋతుపవనాలు ఇప్పటికీ అరేబియాసముద్రం నుండి మహారాష్ట్రలోకి ప్రవేశించి ఉత్తరంగా వెళ్లి హిమాలయాలకు చేరటం ఆ మాసాలలోనే జరుగుతుందని

మాస్టారు చెప్పారు. దీన్నిబట్టి కాళిదాసుకి వాతావరణాలపై ఎంత అవగాహన ఉన్నదో మనకు విదితం అవుతున్నది కదా. అంతియే కాదు, నీతోబాటు పక్షులు కూడా తోడుగా వస్తాయని యక్షుడు మేఘునితో అంటాడు. మాస్టారు చెప్పారూ– పక్షుల సముదాయాలు ఋతు కాలాలను బట్టి హిమాలయాల నుండి దక్షిణ భారత దేశానికి, మళ్ళీ దక్షిణం నుండి ఉత్తరదేశానికి పయనిస్తాయట. నైరుతీ ఋతుపవనాల కాలంలో పక్షులు దక్షిణ ప్రదేశాల నుండి ఋతుపవనాల గాలివాటంతో హిమాలయాలకు వెళ్తాయట. కాళిదాసుకి పక్షుల సంచరణ క్రమాలు కూడా తెలుసని అర్థం అవుతున్నది.

**మిసిమి** : బాగుబాగు. కాళిదాసుకి అవన్నీ క్షుణ్ణంగా తెలుసునన్నది మనం తెలుసుకోవటం కూడా అవసరం.

**మధుర** : అవును సార్. మా మాస్టారు కూడా అదే చెప్పారు మళ్ళీమళ్ళీ, కొంచెం కైపెక్కాక. యక్షుడు మేఘునికి రామగిరి నుండి వింధ్యపర్వతాలు దాటి, నర్మదానది దాటి, ఉత్తరంగా వెళ్ళాలని చెప్పుతాడు. కొంచెం దూరం అయినా ఉజ్జయని మీదుగా వెళ్ళమని చెప్పుతాడు.

**మిసిమి** : అదేమి?

**మధుర** : మాస్టారు అన్నారూ–కాళిదాసు ఉజ్జయనిలో చాలాకాలం ఉన్నాడనీ, ఆ పట్టణంలోని స్త్రీలు అంటే కాళిదాసుకి ఎంతో వ్యామోహమనీ. యక్షుడు మేఘునితో ఆ పట్టణంలోని వారకాంతలను చూడమని చెప్పుతాడు. మీకు మాలాంటి వారంటే చిన్నచూపు. కాని కాళిదాసు మా కోసం మేఘుని రూటు మార్చాడు.

**మిసిమి** : మధురవాణీ, నీవంటే మాకెన్నడూ పెద్ద చూపే. నీవు వారకాంతవు కావు, దినకాంతవు.

**మధుర** : చాల్లెండి, ఆ ఎకసక్కెం మాత్రం మీరు మానరు. కురుక్షేత్రంపై పయనించమని మేఘునికి చెప్పుతాడు యక్షుడు. అక్కడ కౌరవుల కుటుంబాల మధ్య జరిగిన యుద్ధం గురించి చెప్పుతాడు. సరస్వతీ నది దగ్గర ఆగి ఆ పవిత్ర నదిలోని నీటిని త్రాగమని చెప్పుతాడు. ఆ తరువాత గంగాయమునానదీ సంగమం పైగా వెళ్లి హిమాలయాలకు చేరుకొమ్మని యక్షుడు చెప్పుతాడు. అలకాపురిలో తన భార్యకు సందేశం ఇవ్వమని మేఘుని కోరుతాడు.

**మిసిమి** : మీ మాస్టారు బాగా విశ్లేషించారు.

**మధుర** : అవును సార్. కాళిదాసు వ్రాసిన మిగతా కావ్యాలకంటే మేఘ సందేశానికి ఒక ప్రత్యేకత ఉన్నదని మాష్టారు అన్నారు. ఇందులో కథాబలం లేదు, కవి పాత్రల వెనుక దాక్కోవటానికి వీలు లేదు. కేవలం కవి కల్పనాశక్తి పైనా, వర్ణనాశైలి పైనా, అలంకార ప్రయోగ ప్రతిజ్ఞ పైనా ఆధారపడి ఉన్నది. మరి కాళిదాసు పుట్టింది అందుకేగదా. ఇంకొక విషయం చెప్పారు మాస్టారు. మనం హిమాలయాల నుండి నీటిని ఆశిస్తాము, నదుల ద్వారా ఎప్పుడూ నీరు ఇవ్వు, నీరు ఇవ్వు అని సతాయిస్తాము, పీడిస్తాము. కాని ఆ పర్వతశ్రేణికి నీరు ఎవరిస్తారు అని ఆలోచించము. ఋతుపవనాలతో వచ్చే వర్షాల ద్వారా నీటిని సేకరించి, తన ఒడిలో దాచుకొని, నదుల ద్వారా తిరిగి ఆ నీటిని దేశానికి అర్పిస్తుంది ఆ హిమాలయ మాత. ఇది వేల సంవత్సరాలనుండి జరుగుతున్న ప్రకృతి కాలచక్రం. ఆ ప్రకృతిని మనం ఆరాధించాలి, కాపాడుకోవాలి. అదీ కాళిదాసు మనకు పదిహేను శతాబ్దాల క్రితం ఇచ్చిన అసలు మేఘసందేశం.

**మిసిమి** : అవును, ఆ సందేశం బాగున్నది. అవునూ మధురవాణీ, నీవు ఇన్ని కబుర్లు చెప్పుతావు, మాకు ఒక వ్యాసం వ్రాసి పెట్టరాదూ.

**మధుర** : నేనెక్కడవ్రాయగలను సార్, ఏవో పిచ్చి కబుర్లు చెప్పుతాను గాని. నాకు చదువు లేదు, ఏదో ఎండాకాలం చదువులు తప్ప.

**మిసిమి** : ఎండాకాలం చదువులేంటి, వానాకాలం చదువులు అనేది సరైన పద ప్రయోగం.

**మధుర** : అది మీలాంటి వారికి కుదురుతుంది. మేము వానాకాలం చాలా బిజీ సార్. మళ్ళీ వస్తాను, సెలవు.

*- డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల, మానసాస్, వర్జీనియా*

## కమ్మతెమ్మెరలు

**మిసిమి** అభిమాన పాఠకులకోసం "నా ప్రయాణం నూరేళ్ళ పండుగ" శీర్షికన అశ్విని కుమార్ గారు 96 ఏళ్ళ పెద్ది సత్యనారాయణ గారితో మే 2025 మాసపత్రికలో అందించిన సంభాషణ వ్యాసం చాలా బావుంది. సత్యనారాయణ గారు రాజకీయాలలోకి రావటం ప్రమాదంతో పోల్చారు. నిజమే నాడు, నేడు అదేపరిస్థితి. వారి జీవితంలో జరిగిన విశేషాలు, విశ్లేషణలు పాఠకులను అలరించాయి. అనుభవజ్ఞులతో పరిచయాలు ఆదర్శవంతాలు.




అశ్విని కుమార్ గారు సత్యనారాయణ గారినుండి విషయాలను సుతారంగా రాబట్టారు. See their cheeks అంటే అఘాయిత్యం ఎలా అవుతుందో phrase అర్థం కాలేదు. తెలిసినవారు తెలియజెప్పండి. వయసుతోపాటు మతిమరుపుకూడా రెండూ రైలు పట్టాల్లా చాలా సమాంతరంగా నడుస్తుంటాయి అనటం వయోవృద్ధులకందరకూ వర్తిస్తుంది. తుమ్మల సీతారామమూర్తి గారు రాసిన పుస్తకాలు సత్యనారాయణగారిని ఎలా ప్రభావితం చేశాయో సవివరంగా చెప్పారు – 'కడివెడు పాలు పిండెదవుగాని, నీ కంచములోకి గంజి నీళ్ళే' – ఆహా! ఎంతబాగా చెప్పారు. ఆయన చెప్పింది చదువుతున్నంతసేపూ కళ్ళముందు కదలాడే సినిమాలా అనిపించింది. వారిరువుమధ్య 'విరిసిన నవ్వు–సంభాషణ చివరివరకు వెలుగుతూనే ఉంది' అనటం అనితర సాధ్యం. సంప్రదాయవాదులు ఛాందసులని నిర్మొహమాటంగా చెప్పారు. జీవితం వెంట మనం పోవాలిగానీ, మనవెంట అది రాదు అనే జీవిత సత్యాన్ని అందరికీ అందించారు. 'మంచినీళ్లు తాగటానికి ఇచ్చారు' అని చెప్పటానికి వారు 'దాహం ఇచ్చారు' అనటం కొంత వింతగా తోచింది. కవుల కలం ఎప్పుడూ కవిత్వాన్నే కోరుకుంటుందని సీతారామ మూర్తి గారు రాసిన పోస్ట్ కార్డు నిరూపించింది. భోజనం కన్నా బుక్ చదవటం ముఖ్యమైందని తన రసజ్ఞతను కసిగా చెప్పారు సత్యనారాయణ గారు. శతాబ్దానికి దగ్గరవుతున్నా సత్యనారాయణగారి గొంతులో శబ్ద సౌందర్యం తగ్గలేదని అశ్విని కుమార్ గారు **మిసిమి** భాషలో చెప్పకనే చెప్పారు. ఆచార్య ఎన్. జి. రంగా, మహాకవి జాషువా, తెలుగు లెంక తుమ్మల సీతారామ మూర్తి, కొండవీటి వెంకట కవి, కన్నెగంటి పాపారావు లాంటి గొప్ప వ్యక్తులతో సత్యనారాయణగారికున్న మధురస్మృతులను వెలికి తెచ్చి, మూటకట్టుకొచ్చిన జ్ఞాపకాలను అక్షర రాసులుగా **మిసిమి** పాఠకులకు అందజేసిన అశ్విని కుమార్ గారికి ధన్యవాదాలు.

*- డా. షేక్ మహమ్మద్, పి.హెచ్.డి. ఫోన్ : 9849334621*

## కమ్మతెమ్మెరలు

ఎడిటర్ గారికి నమస్కారం,

**మిసిమి** మే సంచికలో అధ్యాపకులకు భీష్మాచార్యులు, వ్యవసాయానికి బలరాములు అయిన శ్రీ పెద్ది సత్యనారాయణ గారితో మీ పరిచయం చెబుతూ, వారితో మీ సంభాషణ ప్రచురించినందుకు మీకు పాదాభివందనం. వారు నాకు గురుతుల్యులు, అన్నీ తానై నడిపించిన తండ్రికి మించిన తండ్రి. వారి గురించి ఎంత చెప్పినా తక్కువే. మీ సంభాషణ సమగ్రంగా ఉన్నా, పూర్తిగా లేదనే చెప్పాలి. వారి జీవితం ఒక సామాజిక చిత్రం. వారిని కలవటానికి రెండురోజుల్లో వెళుతున్నాను. మరొక్కమారు మీకు మనస్ఫూర్తిగా అభివాదం చేస్తున్నాను.



పెద్ది సత్యనారాయణ

*- బీరం సుందర రావు, ఫోన్ : 6303443302*

# పరిపక్వ జీవన రవళి – జీవాళి

**– సుమనస్పతి రెడ్డి**

**ద్వా**రం వంశం నుండి వచ్చిన మేటి వయొలిన్ కళాకారుల్లో ఒకరిగా ద్వారం దుర్గాప్రసాదరావు గారికి దాదాపు ఆరు దశాబ్దాల నుండి కర్ణాటక శాస్త్రీయ సంగీత ప్రపంచంలో విశిష్టమైన పేరు ఉంది. ఆదిభట్ల నారాయణదాసు, ఫిడేలు చక్రవర్తి ద్వారం వెంకటస్వామి నాయుడు వంటి గొప్ప కళాకారులు–విద్వాంసులు అలంకరించిన విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల అధ్యక్ష (ప్రిన్సిపాల్) పదవీ బాధ్యతలను 18 సంవత్సరాలు నిర్వర్తించిన ఘనత ఆయనది. ఐతే అన్ని రకాల సంగీతాలతో సహా సాహిత్యం, చిత్రకళ, సినిమా, చరిత్ర మొదలైన పలు విషయాల్లో, స్థానిక–ప్రాచ్య–పాశ్చాత్య విస్తృతితో, వివిధ కోణాల నుండి అయనకున్న ఆసక్తీ, నిరంతరమైన శోధనా దృష్టితో అనేక అంశాల మీద ఆయన సాధించుకున్న నిశితమైన అభిప్రాయాలూ విజయనగరంలో ఆయనను కలుసుకుని సంభాషించే అవకాశం లభించిన వారికి మాత్రమే తెలుసు. ఆ విలువైన అనుభవాలు, అభిప్రాయాలు రాత రూపంలో ఉండాల్సిన అవసరం ఉందని ఆయనకు చాలా మంది చెప్తూ ఉన్నారు, ఆయన సవినయంగా దాటేస్తూ ఉన్నారు కూడా. (2017లో 'రంగులు–రచనలు' పేరుతో ఆయన మక్కువతో వేసుకున్న స్వీయ కవితలు, చిత్రాల సంపుటి కొద్ది మంది పాఠకులకే చేరింది). ఆ ఆకాంక్ష నిజమయ్యే తరుణం మాత్రం ఆయన 83 ఏళ్ల వయసులో సహస్రచంద్రదర్శన సంబరం సమయానికి, పోయిన ఏప్రిల్ నెలలో, గాని సాధ్యం కాలేదు, ప్రచురణకర్త ఎన్.కె. బాబు పట్టింపు కారణంగా. ఏదేమైనా, అపారమైన విజ్ఞత, తీవ్ర పరిశీలనా దృష్టి, సొగసైన సుకుమారమైన వ్యక్తీకరణ కలిసిన రచనల సంపుటి తెలుగు లోకానికి ఇప్పుడు దక్కింది. అందువల్ల ఇదొక విశేష సందర్భం!!!




ఎక్కువగా కొత్తగా రాసినవి, కొన్ని ఇంతకు ముందే అక్కడక్కడా ప్రచురితమైనవి, 80పై చిలుకు వ్యాసాలు, కొన్ని ఇతర రచనలు ఉన్న ఈ సంపుటి గురించి ఇది అని రెండు ముక్కల్లో చెప్పడం కుదరదు. ద్వారం కుటుంబంలో వయొలిన్ వాయిద్యం, శాస్త్రీయ సంగీతం వేళ్ళూనుకొని ఇప్పటికి నాలుగు తరాలు గొప్పగా నిలబడిన చరిత్రను ఎన్నో తెలియని వివరాలతో సరికొత్తగా ఆవిష్కరించిన తీరు–ముఖ్యంగా తన తాతగారు, వెంకటస్వామి గారి అన్న అయిన ద్వారం వెంకటకృష్ణయ్య నాయుడు గారి గురించి ఈ సంపుటిలో అన్నింటికన్నా విలువైన అంశంగా నాకు అనిపిస్తున్నది. తెలుగు జాతికి ఆధునిక కాలంలో గొప్ప సాంస్కృతిక చైతన్యాన్ని, ఎందరో గొప్ప కళాకారులను, రచయితలను అందించిన విజయనగరం సంస్థానం చరిత్రను స్పృశిస్తూ, ఆ పాలకుల పోషణ, ప్రోత్సాహం కారణంగా సంప్రదాయం–ఆధునికత కలగలసిన నవ్య సృజనాత్మక చేతన అక్కడ వెల్లివిరిసిన తీరు గురించి పలు వ్యాసాల ద్వారా మనకు కొత్త రకంగా తెలిసి వస్తుంది..

ఈ సంపుటిలో కొన్ని కూనలమ్మ పదాలున్నాయి. కొన్ని అనువాదాలు ఉన్నాయి. సృజనాత్మక రచనా శైలుల్లో కొన్ని పోకడలు పోవడం ఉంది. చిత్రాలు, ఫొటో చిత్రాలు, వర్ణ చిత్రాలూ ఉన్నాయి. కుటుంబం, సమాజాల మధ్య తన సుదీర్ఘ జీవనానుభవాన్ని, వేదనల మధ్య అది మిగిల్చి ఇచ్చిన సంతృప్తిని, నిగ్రహంతో కూడిన సోయగంతో వింగడించుకోవడం ఉంది. ఒక సాంస్కృతిక చరిత్ర, ఒక జీవనానుభవ చరిత్ర, ఒక ఆత్మ విమర్శనా చరిత్ర, ఇవన్నీ ఒక కళాత్మక హృదయాన్ని రంగరిస్తూ వచ్చిన తీరు–అన్నీ కలిస్తే ఈ 'జీవాళి' సంపుటి.

వ్యాసాల్లో ఎక్కువ భాగం వ్యక్తుల గురించే : తాను బాగా ఎరిగిన, అభిమానించిన సంగీత కళాకారులు, రచయితలు, ఇంకా తన కుటుంబంలోని వారూ. అయితే జ్ఞాపకాలను చెప్పే వడిలో ఒక సరికొత్త కోణం చూపే/ వ్యాఖ్య చేసే అవకాశాన్ని ఎక్కడా వదులుకోరు. ద్వారం వెంకటస్వామి నాయుడు 1964లో విశాఖపట్నంలో చేసిన కచేరీని గుర్తు చేసుకుంటూ మూసల్లో, చాదస్తాల్లో చిక్కుబడిపోకుండా ఒక ప్రత్యామ్నాయంగా కళాకారులు నవనవోన్మేషమైన చైతన్యంతో ఎలా సాగవచ్చునో అని వివరించిన తీరు అద్భుతం. "నలుగురు నడిచే మార్గాలను చూశారు వీళ్లు విహంగ వీక్షణంతో–చూస్తూనే ఉంటారు. ఆ మార్గాలలో నడిచేరు, పరుగు పరుగున వెళ్లేరు, ఆ నడకలు నేర్చుకుని తమకుండే అణిమ, గరిమా, లఘిమా శక్తులతో కొత్తకళలూ, మార్గాలూ, ఏకాగ్రతలూ, వ్యక్తీకరణలూ సంపాదించుకున్నారు.. వారికి ఇది కచేరీ, ఇది ఇంట్లో సాధన, ఇది బోధన, ఇది క్రీడ అని భేదమే లేదు.. కేవలం నాదాత్మ అనుభవాన్నీ, అలౌకికమనే భ్రాంతినీ కలిగించి మనస్సులను శుభ్రపరుస్తారు." అందుకేనేమో శీర్షికలో 'ప్రత్యామ్నాయాలు' అనే ముందుమాట పెట్టి ఐదు వ్యాసాలు రాశారు. అందులో నాలుగు కళాకారుల గురించి అయితే ఒకటి 'ఇజినారం' (విజయనగరం) అనే ప్రత్యామ్నాయాల గొప్ప వెలుగు వెలిగిన స్థావరం గురించి. 'ప్రత్యామ్నాయ సంస్కృతులు' అంటూ కళావర్ రింగ్ (విజయనగరం కళావంతురాలు సరిదె లక్ష్మీనరసమ్మ గారు) గురించి కూడా ఒక వ్యాసం ఉంది. నిజానికి శాస్త్ర బలాన్ని, కళా నైపుణ్యాలను, సంప్రదాయపు నైపుణ్యాలను అందిపుచ్చుకున్న తరువాత కళాకారులు సాధించదగిన మౌలిక ప్రత్యామ్నాయ సృజన దృక్పథం గురించిన స్పృహ లేని వ్యాసమే లేదు ఈ సంపుటిలో. గతంలో ఉన్న గొప్ప కళాకారుల్లో ఈ దృక్పథం, నైశిత్యం ఇప్పటికన్నా ఎక్కువ ఉండేది అనే సూచన కూడా ఉంది.

రొలాన్ బార్త్స్ సిద్ధాంతాన్ని అవగాహన చేసుకొని, చాసో 'మాతృధర్మం' కథను దుర్గాప్రసాదరావు గారు విశ్లేషించిన తీరుకు సాటిరాగల విమర్శ తెలుగులో లేదేమో. "మాతృ ధర్మం కథలో ఉన్న ప్రతీ పదం, ప్రతి వాక్యం, పేరా అన్నీ ప్రాముఖ్యం (సిగ్నిఫికేషన్) ఉన్నవే" అని చెప్తూ కథలో వాడిన ఒక 130 మాటల పట్టికను ఇచ్చి, కథలో చాసో కూర్చిన అనేక వర్ణనా పద్ధతులను వివరంగా ఉటంకిస్తూ, చివరికి అది ఎలా ఒక గొప్ప ఎపిక్ శైలి డాక్యుమెంటరీ చిత్ర కథగా రూపొందిందో నిరూపిస్తారు. "ఇన్ని పద చిత్రాలు మాంటేజ్‌గా వాడినా గేయాల లిరికల్ రిథమ్‌ను ఎక్కడా వాడలేదు. దాన్ని ఎక్కడికక్కడ నడ్డి విరగ్గొడుతూనే సాగారు. ఆఖరికి కత్తెరపిట్టలు ఆనందంగా పాటలు పాడుతున్నాయి అన్నప్పుడు కూడా ఇలా పోల్చేరు:' వాళ్ల పాట కొండ కాలవ పాట. ఎత్తు పల్లాల్లో, రాళ్ళ ఎగుడు దిగుడుల్లో కొండ కాలవ పాట'. కథ కూడా కొండ కాలవ పాటలాగే ఉంది కదా! "ఒక శాస్త్రీయ సంగీత కళాకారుడు ఆధునిక సాహితీ విమర్శనా రంగంలో ఇంతటి పరిణతి సాధించడం గొప్ప విశేషం కదా!


తంబుర వాయిద్యం అందించే నిండైన జీవశృతికి కారకాలైన సన్నని దారపు తోడు తీగలను జీవాళి అంటారని, పుస్తకానికి ఆ పేరు ఎందుకు ఎంచుకున్నారో రాసిన చిన్న వ్యాసంలో మనోహరంగా వివరిస్తారు: "కచేరీల్లో పాట ఆగినప్పుడు కూడా తంబురా మ్రోగుతూనే ఉంటుంది. సజీవ నాదం నిర్విరామంగా వినబడుతూనే ఉంటుంది. అన్ని జీవకోట్ల బ్రతుకులో ఒక సన్నటి సూత్రమేదో నిరంతరం జీవశక్తిని నింపుతూ భవిష్యత్తును కూడా సుఖప్రదం చేస్తూనే ఉంటుంది. ..... ఈ పుస్తకంలో విషయానికీ నా ప్రయత్నానికీ తగిన పేరుగా ఆశపడి 'జీవాళి' అనే పేరు పెట్టేము." మనసులో మననం చేసుకునే లాగా నిలిచిపోయే ఇలాంటి వాక్యాలు అడుగడుగునా తారసిస్తాయి ఈ వ్యాసాల్లో. "ఎవరి హృదయం వాళ్లది, ఎవరి మనోధర్మం వాళ్లదే. మెదడు మాత్రం సమాజం యొక్క సామూహిక చైతన్యం – ఇవి రెండు ఒకేసారి మాట్లాడవు కానీ–ఒకదానినింకోటి మేల్కొలుపుతూ ఉంటే శ్యాం కథల్లాంటివి పుడతాయి" అని మెడికో శ్యాం కథల గురించి అంటారు. సాహిత్యం ప్రయోజనం గురించి ఇంతకన్నా బాగా చెప్పడం కష్టం కదా! ఒక పరిపక్వత ఇది!

పుస్తకాన్ని ఈ రూపంలో వచ్చేలా కూర్చిన దుర్గాప్రసాద రావు గారి అభిమానులు నిడగంటి కృష్ణ బాబు, మోదుగుల రవికృష్ణ ప్రశంసాపాత్రులు.

***పేజీలు : 354, వెల : 600/-, ప్రతులకు : ఎన్.కె. పబ్లికేషన్స్, ఫోన్ : 9440343479***

# మధుర మహారాణి మంగమ్మ

మీరెప్పుడైనా మధుర సుందరేశ్వర్లు, మీనాక్షీ దేవేరుల ఆలయాల దర్శనార్థం వెళ్లినప్పుడు... అక్కడొక క్షణం నిలబడి శాంతంగా చూడండి ఆ ప్రాంతపు వీధులు, మండపాలు, సత్రాలూ, రాచబాటలూ.... ఇవన్నీ ఈనాటికీ... మంగమ్మ పేరిట ఉండటం చూస్తారు. ఎవరీ మంగమ్మ? ఈమె ఏ ప్రాంతానికి రాణి? ఎవరెవరితో ఏ ఏ యుద్ధాలు చేసిందో అని ఆరాతీస్తారు. కచ్చితంగా ఆమె రాజ్య పాలనా వివరాలను తెలుసుకునేందుకు ఆరాట పడతారు. చారిత్రకంగా ఆ మహారాణి వైభవం ఎందుకు మసకబారిపోయిందో... ఒక విస్మృత నాయకురాలిగా ఎందుకు మిగిలిపోయిందో... తెలియజేస్తూ సుధారాణి సంపాదకత్వంలో వచ్చిన ఈ నవల నాయకరాజుల కాలపు చారిత్రక అవశేషాలను కళ్లముందుకు తెస్తుంది. మధుర నాయక రాజ్యాన్ని పాలించడంలో మంగమ్మ చూపిన చొరవ, ఆనాటి పాలనా వ్యవహారాల్లో ఆమె చూపిన తెగువ, విదేశీ దండయాత్రల సమయంలో ఆమె నెరపిన దౌత్యం, విపత్కర పరిస్థితుల్లో...రాజ్యం సంక్షోభంలో పడినప్పుడు...చూపిన సమయ స్ఫూర్తి, చురుకైన యుద్ధ వ్యూహాలూ... ఆనాటి రాజ్య అభివృద్ధి శ్రేణుల్లో ఈ రాణి ప్రదర్శించిన సాహసోపేత విజయాలు.... ఈ నవల్లో చదువుతున్నప్పుడు ఆశ్చర్యం కలిగిస్తాయి. మధుర నాయకరాజుల్లో తిరుమల నాయకుడు యోధుడే కాదు గొప్ప కవిపోషకుడు. తరువాత వచ్చిన చిన ముద్దు వీరప్ప ఆర్నెళ్లే పాలించాడు. తర్వాత చొక్కనాథుడు... పాతికేళ్ల పాలనలో మధురది మహోజ్వల ఘట్టం. అతని కాలం నుంచి... మధురను ముగ్గురు నాయకరాజులు, ఇద్దరు రాణులు పాలించారు. వీళ్లలో చివరి రాణి తప్ప మిగతావాళ్లందరూ నాటి రాజ్య వ్యవహారాల్లో... సమకాలీన సాహితీ మూర్తులతో సంబంధం ఉన్నవాళ్లే. చొక్కనాథుడు పాలించిన ఇరవై నాలుగు ఏళ్లలో అంకితం పుచ్చుకున్న ఏకైక రచన లింగనమఖి తిరుకామయ్య రాసిన ధేను మహాత్మ్యం. తరువాత రాజ్యానికి వచ్చిన రంగ కృష్ణ ముద్దు వీరప్ప ఎందుకో అకాలమరణం చెందాడు. చనిపోయే సమయంలో భార్య ముద్దమ్మ గర్భవతి. సహగమనం చెయ్యడానికి వీల్లేదంది అత్తగారు మంగమ్మ. మగబిడ్డకు జన్మనిచ్చి ఆత్మహత్య చేసుకున్న ముద్దమ్మ బిడ్డకు విజయరంగ చొక్కనాథుడు అని పేరు పెట్టుకుని మంగమ్మ రాజ్యం చేసింది. ఐతే ఈ మంగమ్మ మీద ఆనాటి సాహిత్య లోకంలో చాలా అపోహలు కల్పించారు కొందరు కవులు. అసభ్య శృంగార, బూతుల బుంగ పదాలనేకం రాసి అపఖ్యాతి అంటగట్టే ప్రయత్నం చేశారు. నిజం నిలకడమీద తేలుతుంది. బలమైన రాజులు లేక, సమర్థవంతమైన పాలన దక్షిత కొరవడిన సమయంలో....శత్రు పన్నాగాల నుంచి, రహస్య మంత్రంగాలను ధీటుగా ఎదుర్కొని రాజ్య ప్రతిష్టను కాపాడిన మంగమ్మకు చారిత్రకంగా గుర్తింపు రాలేదు. దేశచరిత్రలో ఎంతోమంది వీరనారీమణుల అమర త్యాగాలు చరిత్ర పుటలకెక్కినప్పుడు.. మంగమ్మకు మాత్రం ఆ శ్రేణులలో చోటు కల్పించకపోవడం ఒక చారిత్రక తప్పిదమే.



మధుర నాయక రాజ్యానికి పూర్వ వైభవ గీతికను, ప్రాబవాన్ని కాపాడిన... మధుర మహారాణి మంగమ్మ జీవన ప్రస్థానానికి ఒక స్థిరమైన రూపాన్ని ఏర్పరచి, ఆమె జీవన రేఖాచిత్రాన్ని నవలగా తీసుకురావాలనే ఆలోచన రూపాబాయి మోతీలాల్ కి కలగడం ఒక చారిత్రక అవసరంగానే భావించాలి. వీరు అప్పటికే 'వీరపాండ్య కట్టబొమ్మన'అనే చారిత్రక నవల తీసుకొచ్చారు. నాయకరాజుల కాలంలో రాజులూ, వారి పాలనా వైభవాలపై కొన్ని ఆకారాలు సేకరించి పెట్టుకొని వాటి నేపథ్యంగా మధుర మహారాణి మంగమ్మ కథకు నవలా రూపమిద్దామనుకున్నారు. రచన పూర్తయ్యాక ముద్రణ కోసం ప్రముఖులను కలిసారు. కాని ఆ నవలను ముద్రించడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. ఈ నవల రచనలో బెజవాడ గోపాలరెడ్డి చేసిన సహాయం మరువలేనిదనేవారు రుపాబాయి మోతీలాల్. ఒక సమగ్ర నవలగా పాఠకుల ముందుకు తీసుకురాకుండానే రుపాబాయి మరణించారు. ఆమె వదలి వెళ్లిన రాతప్రతిని నల్లదీగ శ్రీనివాసాచార్య ద్వారా అందుకున్న డా. సుధారాణి.. మహారాణి మంగమ్మ జీవితానికి సంబంధించి మరిన్ని చారిత్రక ఆకారాలను జోడించి, విస్తత పరిశోధన చేసి, సంపాదక బాధ్యతలు తీసుకుని, నవలకి సమగ్రరూపమిచ్చారు. ఆ సమయంలో రూపాబాయి గారి వారసుల కోసం తీవ్రంగా అన్వేషించారు. తమిళనాట వాళ్ల వారసులెవరైనా ఉన్నారేమో అని పరిసర ప్రాంతాలు గాలించారు. అనేకులను సంప్రదించారు. కాని, వారి ఆచూకీ తెలియరాకపోవడంతో ప్రయత్నం విరమించుకున్నారు. భవిష్యత్తులో వారి వివరాలు తెలిస్తే తగినరీతిన సత్కరించుకోగలనని చెబుతున్న సుధారాణి గారు గొప్ప జానపద పరిశోధకులు. 'తమిళనాట తెలుగు స్త్రీల జానపద కథనాలు' అనే అంశంపై పరిశోధన చేసి ద్రావిడ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. తమిళ ప్రాంతంలో జీవిస్తున్న తెలుగువారి జీవన సంస్కృతి, సాంప్రదాయిక వారసత్వం ఎలా పదిలపరచబడిందో 'మనకు తెలియని మన చరిత్ర' అనే టివి ప్రోగ్రామ్ ద్వారా ముప్పై ఎపిసోడ్స్‌కి సమగ్ర సమాచారమందించారు.

ఈ విధంగా....మధుర మహారాణి మంగమ్మకు అక్షర నీరాజనం పట్టిన డా. సగిలి సుధారాణి ఒక చారిత్రక అవశేషానికి కావ్య సొబగు అద్ది ఎంతో ధన్యత పొందారు. ఇతిహాస చీకటి కోణం అట్టుడుగున పడి కాన్పించని కథలెన్నో... ఈనాటికీ చీకట్లోనే ఉన్నాయి. మధుర మహారాణి మంగమ్మను ఆ చీకటి అంతరువుల నుంచి బయటకు లాగి, మనం మరచిన మన చరిత్ర ఇదేనంటూ....మధుర మహారాణి చరిత్రని ఈ తరం పాఠకుల చేతుల్లో పెట్టిన సుధారాణి ఎంత చారిత్రక కృషికి తన తీరికనూ, శక్తినీ ధారబోసిందో వివేచిందేందుకు ఈ నవలే నిదర్శనం.


***పేజీలు : 304, వెల : 250/-, ప్రతులకు : సాహితీ ప్రచురణలు, విజయవాడ, ఫోన్ : 9849992890***

***- సాహితీసుధ, ఫోన్ : 94940 44429***


# చదవండి...

**– మిసిమి**

**ప్రవాస సాహిత్యం - రచయిత : రమేష్ ప్రసాద్ రావెళ్ల :** ప్రవాస భారతీయ సాహిత్యం అనేది ఒక ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియ. ఓ విభిన్నమైన భావజాలానికి ప్రతీక అంటారు రమేశ్ ప్రసాద్. ఇది భౌగోళిక పరిమితులను అధిగమించి, భావోద్వేగాల మేళవింపుతో, కొత్త జీవిత అనుభవాలతో నిండి ఉంటుంది. ఇది భారతీయ మూలాల నుంచి, విదేశీ భూమిలోని అనుభవాల నడుమ మలచబడిన భావజాలాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రవాస జీవితం అనేక మానసిక సంఘర్షణలు, భావోద్వేగాలు, భిన్న సంస్కృతుల అనుసంధానం, సమీకరణం, అంతర్మథనం, పరిణతి వంటి అంశాలతో నిండి ఉంటుంది. ప్రవాస భారతీయ రచయితలు ఈ జీవితానుభవా లను ఆధారంగా చేసుకుని, సమకాలీన ప్రపంచానికి అనుగుణంగా తమ రచనలను మలచడం విశేషం. ప్రవాసాంధ్ర సాహిత్యం అనేది–ప్రవాస జీవితం–ఓ వ్యథ, ఓ పోరాటం, ఓ ప్రయాణంలను వివరిస్తుంది. ఆ ప్రయాణాన్ని మన ముందుంచే రచయితల శైలి, వారు సృష్టించిన సాహిత్యం అద్భుతమైన స్ఫూర్తిని ఇస్తుంది. ప్రతి రచయిత తమ అనుభవాలను, సంస్కృతుల మార్పులను, ఆవిష్కృత భావాలను వర్ణిస్తూ, భారతీయ ప్రవాస జీవితంలో నూతన దృక్కోణాలు, ఆవిష్కరణలను చూపిస్తారు. అదే స్ఫూర్తిని తన రచనలో కొనసాగించారు రమేశ్ ప్రసాద్. పుస్తక రచనలో రచయిత ప్రత్యేకంగా కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొన్నారు. ఈ పుస్తకం భారతీయ ప్రవాస సాహత్యం, అనేక సాహిత్యశిల్పులు, వాద వేదికలు మరియు సంస్కృతి మార్పులపై విశ్లేషణను సమగ్రంగా అందిస్తుంది. పుస్తకంలో వివిధ రచయితలు–భారతి ముఖర్జీ, గీతా మెహతా, అనితా దేశ్యాయ్, కమల మార్కండేయ, శశి థరూర్, జుంపాలహరి, అమితావ్ ఘోష్, చిత్ర బెనర్జీ దివాకరణి, అరుంధతీ రాయ్, విక్రమ్ శేథ్, వేల్చేరు నారాయణ రావు, సల్మాన్ రష్డి, చేతన్ భగత్–తమ తమ ప్రత్యేక దృక్కోణాలతో ప్రవాస జీవితంలోని సవాళ్లను, భావోద్వేగాలను, సంస్కృతి కలయికలను మనముందు ఉంచారు రచయిత. అలాగే పుస్తకంలో తెలుగు ప్రపంచ కథలు, విలియం షేక్స్పియర్, తెలుగు భావకవిత్వం, షెల్లీ, బైరన్ వంటి విదేశీ సాహిత్య ప్రభావాలు, వైశిష్ట్యములు, విద్య, ఆలోచనల మార్పు, వైఖరి ఇంకా ప్రముఖ సాహిత్య ప్రభావాలు, వైశిష్ట్యములు, విద్య, ఆలోచనల మార్పు, వైఖరి ఇంకా ప్రముఖ సాహిత్య నిర్దేశకులు–వ్యాసుడు–హోమర్, కాళిదాసు–పాణిని వంటి వారి సాహిత్యములలోని మార్గదర్శకాలను చక్కగా పుక్కిట పట్టి మనకు సరైన రీతిలో అందించారు. వీరి రచన ద్వారా పాత, నూతన మార్గాల మధ్య తేడాలను, మార్గదర్శక దృక్కోణాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ఈ పుస్తకం సాహిత్య అభివృద్ధికి కీలక భాగలను అందిస్తోంది. - *డా. కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణ మూర్తి, ప్రతులకు : ఫోన్ : 9949516567*




**బహుముఖ బనారస్ - రమా సత్యనారాయణ :** "మహారాజా! విశ్వవిద్యాలయ నిర్మాణానికి స్థలం కోసం వచ్చాను" అని ఒక మహానుభావుడు అడిగారు. తలపాగా టోపీలా గుండ్రంగా చుట్టుకున్నారు. తెల్లని తువ్వాలు మెడచుట్టూ తిప్పుకున్నారు. తెల్ల షేర్వాణి ధరించారు. నిర్మలమైన కళ్ళు. నుదుటి మీద బొట్టు. తెల్లని మీసాలు. అతనిలో అణువణువునా ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. కాశీరాజు ప్రభునారాయణ్ సింగ్ ఫలహారం తీసుకుంటున్నారు. "రండి. ముందు మా ఆతిథ్యం స్వీకరించండి. తర్వాత వ్యవహారం మాట్లాడుకుందాం" అంటూ రాజుగారే స్వయంగా ఫలహారం ప్లేటును ఆయనకు అందించారు. రాజుగారికి ఆయనంటే చాలా గౌరవం. ఇద్దరూ ఫలహారం ముగించారు. కుశలక్షేమాలు అయ్యాయి. "చెప్పండి పంతులుగారూ! మీరు ఏదో అడుగుతున్నారు." అన్నారు రాజుగారు. "విశ్వవిద్యాలయం కట్టాలంటే చాలా భూమి కావాలి మహారాజా. మీ ఆశీర్వాదం లభిస్తేనే నా సంకల్పం నెరవేరుతుంది" అన్నారు ఆ మహానుభావుడు."అరె. మీరు చాలా గొప్పపని చేస్తున్నారు. విద్యాజ్యోతిని ప్రతీ ఇంట్లో వెలిగించబోతున్నారు. ఆ మహాకార్యానికి మీరు అడిగినంత భూమి ఇస్తాను" అన్నారు కాశీరాజు. మాలవ్యగారు సంకోచంలో పడ్డారు. ఎంత అడగాలి? ఎక్కువగా అడిగితే ఏమనుకుంటారో? తక్కువ అడిగితే, మిగతాది ఎలా సమకూర్చాలి? "తమరు ఇవ్వగలిగినంతా ఇవ్వండి మహారాజా" అన్నారు ఆ మహానుభావుడు సంకోచంతో. రాజుగారు కొంతసేపు ఆలోచించారు. "కాశీలో విశ్వవిద్యాలయ స్థాపన అందరికీ గర్వకారణం. ఈ విశ్వవిద్యాలయం దేశంలోనే పెద్దది కావాలి. చరిత్రలో నిలిచిపోవాలి" అంటూ... "సూర్యోదయం నుండి సూర్యాస్తమయం దాకా మీరు ఎంతదూరం నడిస్తే అదంతా మీ విశ్వవిద్యాలయానిదే" అన్నారు రాజుగారు. దృఢసంకల్పంతో ఉన్న ఆ మహానుభావుడు ఈ పోటీకి అంగీకరించారు. తర్వాత ఏమి జరిగింది? చదవండి : నవరసాల బనారస్. ***ప్రతులకు : మిసిమి***



# మిసిమి
మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి     బహుమతిగా పంపండి

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : మిసిమి మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణగా వారికి పత్రికను పంపడం ఆపుతున్నాము. విజ్ఞులైన పాఠకులు మిసిమి ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.
మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా మిసిమి పత్రికను పంపిస్తాం.


**A/C Name : Misimi A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు



షెల్లీ జీవిత కథ | దోసిట చినుకులు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి | ప్రవాస సాహిత్యం

ప్రతులకు: మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.